# బహుళపంచమి జ్యోత్స్న

నవల

– గొల్లపూడి మారుతీరావు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 80

ముందుమాట

'బహుళ పంచమి జ్యోత్స్న' రాసి తేలిగ్గా 45 సంవత్సరాలకిందటి మాటే. సరిగ్గా తేదీ గుర్తులేదు. ఆంధ్రప్రభ నుంచి రేడియోకి వచ్చిన రోజులనుకుంటాను. నేను రాసిన నవలల్లో నా మనస్సుకి దగ్గరగా ఉన్న రచన ఇదే కారణం - ఇందులో ప్రధాన పాత్రకి స్ఫూర్తి మా నాన్నగారు. అలాగే మా అమ్మ. మా నాయనమ్మనీ నాకు గుర్తుంది. ఆ రోజుల్లో నా అనుభవంలోకి వచ్చిన విషయాలన్నీ బహుశా ఈ ఇతివృత్తానికి దోహదమయాయి. మా నాన్నగారు నా రచనల గురించి విన్నారు. కొన్ని నాటికలు చూశారేమో. నాతో నా మొదటి సినిమా చూశారు. అయితే నాకు తెలిసి - ఈ నవలని చదివారనుకుంటాను. ఆయన స్పందన ఏమిటి? నేను అడగలేదు. అడిగే సాహసం చెయ్యలేదు. నాలో రచయిత - ఆనాటికి ఇంకా వ్యర్థమైన వ్యావృత్తికి లోనయినట్టుగా భావించే రోజులవి. కారణం - రచన, నటన, ప్రసంగం, ఏంకరింగు వంటి ప్రక్రియలు వృత్తులు కాగలిగిన రోజులుకావు. అలాగే ఈ నవల ఏ పత్రికలోనూ సీరియల్‌గానూ రాలేదు. ఆ విధంగా 'బహుళ పంచమి జ్యోత్స్న' ఎక్కువ ప్రచారానికి నోచుకోని నా ముద్దుబిడ్డ. కథలో ఓ చక్కని ప్రణాళికని ఏర్పరుచుకున్న గుర్తుంది. నా జీవితకాలంలోనే మాధ్యమాలు విశ్వరూపం దాల్చిన నేపథ్యంలో తను రాసిన నవలని గురించి ఒక రచయిత - ఇలా దూరంగా నిలబడి పర్యావలోచన చేయడం వింతగా ఉండవచ్చు.

కొత్తగా పాఠకులు నవలను చదివి అభిమానిస్తే - తప్పిపోయిన బిడ్డ దొరికిన తృప్తి కలుగుతుందేమో! కిరణ్‌ప్రభ దంపతులు నా అభిమానులు. వారు ఈ నవలను మెచ్చుకోవడం - పెరటి చెట్టు పువ్వుని తలలో తురుముకోవడం లాంటిది.

దాదాపు అర్ధ శతాబ్దం కిందటి రచన ఈ తరం మీద ఎలాంటి స్పందనని కలిగిస్తుంది? నాకూ ఆసక్తిగానే ఉంది. మీ ఉత్సుకతను రెచ్చగొట్టడానికే ఈ రెండుమాటలూ.

- గొల్లపూడి మారుతీరావు.

# ప్రారంభం

**ఎర్రటి రక్తపు చార మధ్య ముఖం స్పష్టంగా తెలీడంలేదు.**

ఓ పక్క నుంచి గార్డూ, సిబ్బందీ దీపాలు పట్టుకుని వెదుక్కు వస్తున్నారు.

"ఎవరన్నా మనుషులు కనిపించడంలేదేమో చూసుకోండి" అని గార్డు హెచ్చరిస్తున్నాడు.

ఈ సంఘటన మీది ఆశ్చర్యం చలిని జయించింది. నిద్ర మరిచిపోయిన ముఖాలన్నీ దిగ్భ్రమతో, భయంతో వెలవెలబోయాయి.

గార్డు గొంతు వణుకుతోంది.

కాశీకి అప్పుడే మెలుకువ వస్తోంది. పెట్టిలో ఉన్న ప్రయాణీకులంతా మాట్లాడుకునే మాటలు మెల్లగా అర్థమవుతున్నాయి. బద్ధకంగా కళ్ళిప్పితే అంతా తన వేపే చూస్తూన్నట్టనిపించింది.

''ఈ మూలవున్న మనిషి కనిపించడేం?'' అన్నారెవరో ఉన్నట్టుండి అందరికీ అనుమానం వేసింది.

ఇటు చూస్తే నాన్న ఉన్న స్థలం ఖాళీగా ఉంది. నిజమే అందరూ కుర్రాణ్ణి కదిపారు ఆ మనిషి ఎవరని.

కాశీకి భయం వేసింది. తన పదకొండేళ్ళ జీవితంలో ఆ అనుభవం కొత్త. అందరి కళ్ళూ అతని మీదే ఉన్నాయి. ఏదో తప్పు చేసినట్టూ దుప్పటి మెడవరకూ లాక్కుని ముడుచుకుని పడుకున్నాడు.

వరసగా పెట్టెలన్నీ వెదుక్కుంటూ వస్తున్నారు గార్డు సిబ్బందీ.

''ఎవరన్నా మనుషులు కనిపించడం లేదా ఇక్కడ?'' అంటే

ఓ ముసలాయన అన్నాడు ''ఇక్కడి మనిషి కనిపించటం లేదని''

అంతా ఆగిపోయారు.

కాశీకి ఇక నిద్రపట్టలేదు. పిచ్చిగా చూస్తూ కూర్చున్నాడు.

''ఏడవకు అబ్బాయ్'' అన్నారెవరో.

తనకేం ఏడుపు రావడం లేదు.

గార్డు లోపలికి వచ్చి భుజం తట్టాడు.

''దిగుతావా?'' అన్నాడు చెయ్యి అందించి.

తనకేం అర్థం కాలేదు. ''ఎందుకు?''

టోపీ నీడలో ఒదిగిపోయిన విశాలమయిన ముఖంలో కళ్ళల్లో దిగులు కుర్రాడికి అర్థం కాలేదు.

''చెపుతాను రా'' అన్నాడు ముసలి గార్డు.

వెనకనుంచి ఎవరో అన్నారు ''మీ నాన్న చచ్చిపోయాడు''

స్పష్టంగా తెలిసింది ఆ విషయం.

నాన్న చచ్చిపోయాడు.

అతణ్ణి అక్కడే దింపేశారు.

చినుకులు ఉద్ధృతమయి జల్లు ఎత్తుకుంది.

ఆ రాత్రి చీకటికి గాలి తోడయి ప్రకృతంతా రోదిస్తున్నట్టుంది.

ఇంకా ఆ విషయమే ఆలోచిస్తున్నాడు.

నాన్న చచ్చిపోవడం అంటే ఏమిటి?

అక్కడికి ఇరవై గజాల్లో ఉన్న పల్లెటూరి రైలు స్టేషన్ దగ్గరికి తీసుకొచ్చారు కాశీని.

అంతా తన గురించే ఆలోచిస్తున్నారు. ''ఇక్కడుంటావా?'' అని అడుగుతున్నాడు గార్డు.

చుట్టూ చూశాడు. ఓ చిన్న దీపపు వెలుగులో అదేదో నోరు తిరగని ఊరుపేరు రాసి ఉందక్కడ. ఎక్కడో క్రిందపడి దెబ్బలు తగిలించుకుని ఇంటికి వస్తే నాన్న చూపించే జాలినే చూపిస్తున్నారు చుట్టూ ఉన్న వాళ్ళంతా.

"ఉంటాను. నాన్నేడీ?" అనడిగాడు ముసలి గార్డుని.

అతను అందుకు సమాధానం చెప్పలేదు. చెక్కిళ్ళు తడిమి భుజం తట్టి స్టేషన్ మాస్టర్ వేపు తిరిగాడు "అబ్బాయి ఊరేదో తెలుసుకోండి"

పొడవుగా, నిటారుగా ఉన్న స్టేషన్ మాస్టరు అడిగాడు "మీ ఊరు ఏమిటి అబ్బాయ్?"

ఊరు బాగా గుర్తే అతనికి. డాక్టర్‌గారి ఇంటిముందు ఓ స్థంభానికి ఆ పేరు ఉండేది. ఎప్పుడు అటువేపు వెళ్ళినా దాన్ని చూసేవాడు.

"నంది బెలగాం" అన్నాను.

అంతా ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

"అదెక్కడ?" అన్నారొకరు.

"ఒరిస్సాలో"

"కాదండీ పార్వతీపురం తాలుకాలో" అని స్టేషన్ మాస్టర్ అన్నాడు.

ఇంతలో ఎవరో లావుపాటి ఆయన అందర్నీ తోసుకుంటూ ముందుకు వచ్చాడు. "ఏడండీ ఆ కిడ్?" అంటూ

అంతా పక్కకి తప్పుకుని విచిత్రంగా చూశారు. చిన్న అమ్మాయినీ, రెండు కుక్కల్ని వెంటబెట్టుకు వచ్చారాయన.

"వీళ్ళ నాన్న చచ్చిపోయాడు డాక్టర్" అన్నాడు గార్డు.

ఆ విషయం పట్టించుకోకుండా "ఇదిగోనమ్మా ఇతనే ఆ కుర్రాడు. చూస్తానన్నావుగా. చచ్చిపోయినతని కొడుకు" అన్నారు డాక్టరు గారు అమ్మాయితో.

తండ్రి చచ్చిపోయిన కుర్రాణ్ణి చూడాలని అమ్మాయి పట్టుబడితే తీసుకువచ్చారు డాక్టర్‌గారు. గిరిక విచిత్రంగా నిలబడి చూస్తోంది. కుక్కలు చలికి భయపడి అరుస్తున్నాయి,

కాశీకి ఇదంతా విచిత్రంగా ఉంది. కుక్కలు చాలా అందంగా కనిపించాయి. అమ్మాయి తనపక్క అలాగే చూస్తోంది. ఆమె వేపు చూసాడు. నవ్వాడు.

డాక్టర్‌గారు గార్డుతో ఏదో ఇంగ్లీషులో మాట్లాడుతున్నారు.

అమ్మాయి దగ్గరకు వచ్చింది. "నవ్వుతావేం? మీ నాన్న చచ్చిపోయాడు"

ఆ ప్రశ్నకు సగం అర్థం బోధపడలేదు కాశీకి. ఎంతసేపటినుంచో దాచుకున్న ప్రశ్నని అడిగేశాడు. "చచ్చిపోవడం అంటే"

ఆ అమ్మాయికీ సగం అర్థం కాలేదు. తెల్లబోయి నాన్న మొహం చూసింది. డాక్టర్ గారు నవ్వుకుని టీక చెప్పారు. "చచ్చిపోవడం అంటే మరేం లేదమ్మా. నువ్వు చలివేస్తే భయపడి దుప్పటి కప్పుకొంటావు. మరీ కష్టాలొస్తే పెద్దవాళ్ళు చావులో దాగొంటారు, నీకు దుప్పటి ఎంత వెచ్చదనం ఇస్తుందో, వాళ్ళకి చావు అంత హాయిని ఇస్తుంది" అని చెప్పి గార్డు వేపు తిరిగి బిగ్గరగా నవ్వడం ప్రారంభించారు.

గిరికకీ నవ్వొచ్చింది. "ఏమైనా, అదేం మంచిపని కాదు" అంది కాశీ చెవులో.

డాక్టర్‌గారి మాటల్లో ఒక్క విషయానికి అర్థం కొద్దిగా తెలిసింది. నాన్నకెందుకు కష్టాలొచ్చాయి?

గార్డు, మిగతా సిబ్బందీ అంతలో తేరుకున్నారు. "ఈ రాత్రికి కుర్రవాణ్ణి ఇక్కడ ఉంచండి. ఆ సామాన్లు వెదికి, అడ్రసు చూసి వాళ్ళ కుటుంబానికి ఆ వార్తను తెలియజేయండి. నేను ట్రాఫిక్ కంట్రోల్ ఆఫీసర్‌కి కేబుల్ చేస్తాను" అన్నాడు గార్డు స్టేషన్ మాష్టరుతో.

రైలు ఎక్కమని రైల్వే ఉద్యోగులు అరుస్తున్నారు. వర్షంతో ప్రయాణీకులు సగం తడిసిపోతున్నారు. ఏదో పెద్ద ఆకారాన్ని తీసుకువచ్చి స్టేషన్ నీడలో పడుకోపెడుతున్నట్టు కాశీ చూశాడు.

"రా అమ్మా పోదాం" అన్నారు డాక్టరుగారు. వెళ్ళిపోతూ "బిస్కట్లు తింటావా!" అడిగింది గిరిక.

కాశీ మాట్టాడలేదు. డాక్టర్‌గారు కేకలు వేస్తున్నారు. తొందరగా అతని చేతిలో బిస్కట్ల పొట్లాం ఉంచేసి పారిపోయింది ఆ అమ్మాయి. కుక్కలు అరుస్తూనే నీరసంగా పరిగెత్తుతున్నాయి.

తూర్పు ఆకాశం తెల్లబోవడంతో రైలు చెట్ల మధ్య గీరగీసినట్లు కనిపిస్తోంది.

దూరంగా గిరిక చెయ్యి ఊపడం కనిపిస్తోంది. తనూ చెయ్యి ఊపాడు. 'చాలా మంచిపిల్ల' అనుకున్నాడు.

"లోపలికి రా అబ్బాయి" అంటున్నాడు స్టేషన్ మాష్టరు.

"మా నాన్న ఏడండీ?" అన్నాడూ మళ్ళీ.

ఓసారి చూసి "చచ్చిపోయాడు. ఏడవకులే" ఆ కుర్చీలో కూర్చోమన్నాడు.

తనకింకా అర్థం కావడం లేదు.

చలి ఎక్కువయింది.

మళ్ళీ నిద్దర వస్తున్నట్టుంది. అక్కడో బల్ల కనిపిస్తే దానిమీద పడుకున్నాడు. బాగా నిద్రపట్టేసింది.

మర్నాటి మధ్యాహ్నానికి అమ్మ, మామయ్య ఏడుస్తూ వచ్చేసరికి తెల్లబోయాడు కాశీ. నాన్న వచ్చాక ఇంటికి వెళ్ళాలనుకుంటూ ఎదురు చూస్తున్నాడతను. ఇప్పుడిక అమ్మ వస్తే సంతోషం పట్టలేకపోయాడు. కానీ ఇదేమిటి? అమ్మ ఏడుస్తోంది. తనని చూసి గుండె బాదుకుని ఏడుస్తోంది. తనని కావలించుకుని ఎప్పటి విషయాలో గుర్తుచేసుకుంటోంది. మామయ్య స్థంభాన్ని ఆనుకుని కదలకుండా ఉండిపోయాడు. అంత హఠాత్తుగా జరిగిన సంఘటనని ఊహించలేక నిశ్చేష్టుడయిపోయాడు. మామయ్య ఏడవగా ఎప్పుడూ చూడలేదు కాశీ.

అమ్మ తనని వదిలి నేలమీద కుప్పలా కూలబడగానే మెల్లగా మామయ్య దగ్గరికి వచ్చాడు.

"చచ్చిపోవడం అంటే ఏమిటి మామయ్యా?"

జవాబు చెప్పలేదు మామయ్య. ఒక్కసారి కాశీని ఎత్తుకుని గుండెకు హత్తుకున్నాడు.

"ఎంత కష్టం వచ్చింది. బాబూ మీకు" అన్నాడు. గొంతులో అంత వణుకు ఎప్పుడూ చూడలేదు కాశీ. నిర్ఘాంతపోయాడు.

మళ్ళీ అడిగితే చెప్పాడు. "ఇంకెప్పుడూ కనిపించడు నాన్న"

ఎందుకో బాధనిపించింది. కనిపించని నాన్న మీద ఆ చిన్ని మనస్సు ఆలోచనలు పెంచుకుంటోంది. ఇంకెప్పుడూ నాన్నని చూడకపోవడాన్ని మనస్సు అంగీకరించడం లేదు. అంతవరకూ నాన్నని వదిలి ఉండడమంటే ఏమిటో తెలీదు కాశీకి. ఇవాళ ఒంటరిగానే ఎప్పుడూ నాన్న లేకుండా ఉండటం ఎంత కష్టమో రాత్రి తెలిసింది.

అమ్మని ఊరుకోమని మావయ్య మాటిమాటికీ అంటున్నాడు. ఒకసారి అమ్మవేపు చూసాడు.

"ఊరుకోండి. రైల్వే అధికారులు ఆలోచించి ఎంతో కొంత డబ్బు ఇస్తారులెండి" అంటున్నాడు స్టేషన్ మాష్టర్.

తనకేం అర్థం కావడంలేదు.

మళ్ళీ నాన్నని చుడాలనిపిస్తోంది. డాక్టరుగారు రాత్రి చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి. ఇంకా జేబులో ఆ బిస్కట్లు ఉన్నాయి. అక్కడే ఉండడానికి విసుగేసింది. లేచి స్టేషన్ బయటికి వచ్చాడు. పక్కనే ఉన్న రావిచెట్టు కిందకి వచ్చి కూచున్నాడు.

వర్షానికి చివికి, సగం జారిచెట్టు పగులు లోంచి గుండు చీమల బారు కనిపిస్తోంది. సగం వరకూ మీదకి పాకి కిందకి జారిపోతున్నాయి.

అమ్మ ఏడుపు ఇక్కడికీ తెలుస్తోంది.

రాత్రి నాన్న ఒళ్ళో పడుకోవడం గుర్తుకొచ్చింది. మధ్యలో లేస్తే నాన్న తన మీదకి వంగి తదేకంగా చూస్తున్నాడు. కళ్ళిప్పితే నవ్వాడు. ఆ నవ్వు తనకి ఎప్పటికీ గుర్తే.

తలమీద చెయ్యివేసి కిటికీకి చేరబడి కూచున్నాడు. కానీ లేచి చూస్తే నాన్న కనిపించలేదు. ఇప్పుడిక ఎప్పటికీ కనిపించడని మామయ్య చెప్పాడు. అంతసేపయాక మొదటిసారిగా పెదాలు వణికాయి కాశీకి.

నాన్నని తలుచుకుని మొదటిచారిగా బావురుమని ఏడ్చేసాడు.

నిశ్శబ్ధంగా ఉన్న స్టేషన్లో ఏ మూలో కాలు విరిగిన కుక్క విరామం లేకుండా అరుస్తోంది.

**నాన్న బ్రతికుండే రోజుల్లో ఊరు** చివరి దేవాలయం పక్కన ఇల్లుండేది. ప్రతిరోజూ ఉదయాన్నే లేపి పొలం గట్టు మీదికి తీసుకెళ్ళేవాడు నాన్న. ఒక ఆవు ఉండేది. నాన్నకోసం చాలామంది ఇంటికి వస్తూ పోతూండేవాళ్ళు. అంతా వెళ్ళిపోయాక భుజం మీద చెయ్యేసి "నాలా ఇక్కడే ఉంటావా? పట్నానికి వెళ్ళి చదువుకుంటావా?" అని నాన్న అడగడం గుర్తుంది.

పట్నానికి వెళ్ళడం ఎలాగో తెలీదు తనకి. ఆ రోజు నాన్న చచ్చిపోకపోతే పట్నానికి వెళ్ళేవాడు.

కానీ పట్నాన్ని గురించి ఆలోచించలేని మనస్సు ఆ పల్లెటూరి పొలాల నీడల్లో, ఆ మనుషుల మధ్య విశ్రాంతి పొందేది. అందుకని ఇక్కడే ఉంటాననేవాడు.

"నాకు చదువు చెప్పించేవారెవరూ లేకపోయారు. ఇక మిమ్మల్ని అలా వదిలెయ్యను" అనేవాడు నాన్న. ఆ మాటలు ఎందుకు అంటున్నాడో, ఎవరితో అంటున్నాడో, తెలిసేది కాదు. వాటిని తెలుసుకోవాలంటే తనింకా పెద్దవాడు కావాలి కాబోలుననుకునేవాడు. అప్పుడు నాన్న మొహం చూసి చాలా ఆశ్చర్యపడేవాడు.

ఇద్దరి తమ్ముళ్ళకన్నా తననే ఎప్పుడూ వెంటబెట్టుకుని పొలాల మీదకి వెళ్ళేవాడు. గణపతి అమ్మని వదిలి ఎప్పుడూ బయటకి వెళ్ళేవాడు కాదు. వాడికి మూడేళ్ళు. శంకరం ఇంకా అప్పటికి తల్లి ఒడిలో ఉన్నాడు.

అప్పట్లో రోజూ అమ్మా నాన్నా దెబ్బలాడుకోవడం గుర్తుంది కాశీకి. ఓ రోజు నాన్న అమ్మని కోపంతో చావబాదేస్తే, తనకి ఏం చెయ్యాలో తెలీక స్తంభం చాటున ఏడుస్తూ కూచున్నాడు.

రాత్రి ఎప్పుడూ నాన్న మంచం మీదే పడుకునేవాడు. ఓ సారి రాత్రి లేచి చూస్తే నాన్న ఎందుకో ఏడుస్తున్నాడు. తనకి భయమేసి పలకరిస్తే నవ్వాడు. నాన్న నవ్వినప్పుడల్లా తనకి భయం పొయేది. అంత బాగా ఇంకెవ్వరూ నవ్వలేరనిపించేది. గుండెమీద చెయ్యి వేసి ఆ రాత్రి మళ్ళీ నిద్రపోయాడు.

ఇప్పుడిక తాను ఒంటరిగానే పడుకోవాలి. ఆవు ఇంట్లో లేదు. మావయ్య ఒకరోజు ఎవరినో తీసుకొచ్చి వాళ్ళకి ఇచ్చేశాడు. దేవాలయం పక్క ఇంట్లోంచి వచ్చేశారు.

ఇప్పుడు నాన్న లేడు. ఆ పరిస్థితులన్నీ మారిపోయాయి. హఠాత్తుగా వాళ్ళు బీదవాళ్ళయిపోయారు.

అక్కడినుంచీ నాలుగేళ్ళూ పూర్తిగా మావయ్య ఇంట్లోనే గడిచిపోయాయి. పరిస్థితులు ఇంకా మారిపోయాయి. అమ్మ తమని చూడటం మానివేసింది. తమ్ముళ్ళిద్దరూ మరీ ఎండిపోయి, రివటల్లా తయారయ్యారు. ఎప్పుడూ ఏడుస్తూ ఎవరూ లేనిచోట ఒంటరిగా కూర్చునేవారు. మావయ్యే ఎప్పుడన్నా పిలిచి వాళ్ళకి ఏదన్నా ఇచ్చేవాడు. ఎప్పుడూ మాసిన బట్టలతో తిరిగేవారు.

అమ్మ ఎప్పుడూ ఏడుస్తూ కూర్చునేది. "భర్త పోయాడు ఎలా?" అని ఎప్పుడూ ఏడ్చేది కాదు, ఏమీ మిగల్చకుండా పోయాడని.

కుర్రాళ్ళు ఎప్పుడన్నా అల్లరి చేస్తే 'మీ అందర్నీ పోషించలేకనే పోయారాయన' అని శాపనార్థాలు పెట్టేది. ఒక్కోసారి ఇల్లు వదిలేసి ఊరు చివరి దేవాలయం ముందు కూచునేది. రామనాథం మావయ్య వచ్చి ఇంటికి రమ్మని పిలిచినా వచ్చేది కాదు.

ఒకరోజు కాశీకి బాగా గుర్తు. మామయ్య తనను పొలాల వెంబడే నడిపించుకుపోయాడు. నాన్న గురించి తను మాట్లాడితే దిగులుగా చేతికర్రను ఊపుకుంటూ నడిచాడు. "మీ నాన్న చచ్చిపోయాడు. కానీ మీ అమ్మ బ్రతికుండి కూడా చచ్చిపోయినట్టే లెక్క. దాని మనస్సు పాడయింది" అన్నాడు.

దాని అర్థం పూర్తిగా తెలీలేదు తనకి. కానీ అలా అంటే ఎందుకో పెదాలు వణికి ఏడుపొచ్చింది.

ఆ తర్వాత రెండు మూడుసార్లు మామయ్య అమ్మను ఆసుపత్రికి తీసుకు వెళ్ళడం చూశాడు. తీసుకెళ్ళబోతే మామయ్యని కూడా శాపనార్థాలు పెట్టేది. 'మీరంతా నా బ్రతుకు నన్ను బ్రతకనివ్వకుండా చేశారు' అని తిట్టిపోసేది. ఎన్ని తిట్టినా మామయ్య మాత్రం ఏమీ అనేవాడు కాదు. ఓసారి మాత్రం కోపం వచ్చి చేతికర్రతో అమ్మని కొట్టాడు. అమ్మ ఏడవలేదు. ఇంకా తిట్టింది.

మరి వారం రోజులకే అమ్మకి పిచ్చి ఎత్తిందని చెప్పాడు మామయ్య.

రోజులు గడుస్తున్నకొద్దీ తెలియకుండానే దిగులు ఎక్కువయింది. ఎంతసేపూ తీరికగా, ఏమీ పనిలేకుండా కూర్చుంటే విసుగేసింది. ఇల్లంతా పశువుల కొట్టంలాగా వాసన వేస్తూ, చీకటి గొందిలా ఉండేది. అమ్మ ఎవరితోనూ మాట్లాడేది కాదు. చూస్తేనే భయం వేసేది.

అందుకని ఒంటరిగా పొలాల మధ్యకి పోయి కూచుని నాన్న ఎందుకు పోయాడా అని ఆలోచించేవాడు.

ఆలోచించినప్పుడల్లా ఏవో విచిత్రమయిన భావాలు వచ్చేవి.

దేవాలయం పక్క ఇల్లు బావుండేది. అప్పట్లో అమ్మ (రాజేశ్వరమ్మ ఆవిడ పేరు) ఇంతగా రెచ్చిపోయేది కాదు. ఎప్పుడూ నవ్వుతూ తృప్తిగా కనిపించేవాడు కోదండ రామయ్య. ముఖంలో తప్ప తృప్తినీ, సంతోషాన్నీ గుర్తించలేని కాశీకి అతని హఠాన్మరణం ఆశ్చర్యాన్ని కలిగించేది.

కోదండరామయ్య ఎప్పుడన్నా తప్పు చేస్తే ఆమె నానా గొడవ చెయ్యడం, ఇంటికి రాకుండా రెండు మూడు రోజులు ఎక్కడికో పోయి గడిపిరావడం కాశీకి తెలుసు. అలా వెళ్ళిపోయినప్పుడు ఆమె భోజనం మానేసి భర్తనీ, కుటుంబాన్నీ తిట్టూ కూచునేది. తిట్టినా ఎవరూ అర్థం చేసుకోలేరని గుర్తింపు కలిగాక, మధ్యలో కల్పించుకునే పిల్లల్ని కొట్టేది. అక్కడితో తృప్తి పడేది.

కోదండ రామయ్య ఇలాంటి విషయాల్లో కల్పించుకునేవాడు కాదు. శక్తిలేక కాదు. ఆమెతో గొంతు కలపడం ఎంతటి అనర్థాలకి దారితీస్తుందో గుర్తుంచుకుని మాట్లాడక ఊరుకునేవాడు. వీలయినంతవరకూ పిల్లల్ని తనతో తిప్పేవాడు. ''బాగుపడడం ఎట్లాంటిదో తెలీక నేను చెడిపోయాను. చెడిపోవడం ఎట్లాంటిదో తెలిసి కూడా వీళ్ళని బాగుచెయ్యలేకపోతున్నాను'' అనుకునేవాడు.

అన్నిటికీ కారణం డబ్బు.

ఇవన్నీ గుర్తుకొచ్చినా ఒక్క ప్రశ్నకు ఇంకా అర్థం తెలీలేదు కాశీకి. ''నాన్న ఎందుకు చచ్చిపోయాడు?'' ఇదే ప్రశ్న మామయ్యని అడిగాడు.

రామనాధయ్య మొదట ఆశ్చర్యపోయాడీ ప్రశ్నకి. కుర్రాడి భుజం మీద చెయ్యేసి దూరంగా తీసుకువెళ్ళాడు. ఒకసారి ''ఎవరికీ చెప్పవుకదా!'' అన్నాడు.

కాశీకిదేం అర్థం కాలేదు, ''ఏమిటి?''

''మీ అమ్మ వల్ల చచ్చిపోయాడు నాన్న'' అని మాత్రం చెప్పి వెళ్ళిపోయాడు.

కాశీ దిమ్మెరపోయాడు. చచ్చిపోవడాన్ని కొద్దికాలం క్రిందటే ఎరిగిన మనస్సు, మనిషి మనిషిని ఎట్లా చంపగలడా అన్న ప్రశ్నకు జవాబును ఆలోచించలేకపోతోంది. తనని కొట్టినట్టే నాన్నని కొట్టేదా అమ్మ? స్టేషన్లో అతనిని కావలించుకుని ఏడ్చే అమ్మ గుర్తుకొచ్చింది. అలాంటి విషయాలను అమ్మను గురించి ఆలోచించడానికి మనస్సు అంగీకరించలేదు. మామయ్యకు అమ్మ మీద కోపమేమో అనుకున్నాడు.

ఇట్లాంటి ఆలోచనలతో సతమతమయేది అతని జీవితం. అతనికి తెలియకుండానే అతని భవిష్యత్తుకి కొన్ని సంఘటనలు విడదీయలేని పరిధుల్ని ఏర్పాటు చేశాయి. నాన్న లేకపోవడం అప్పటికి ఎంత కష్టమో ఆలోచించిన మనస్సు భవిష్యత్తు జీవితాన్ని నాన్న చావు తన నుంచి ఎట్లా వేరు చేసిందో ఊహించలేకపోయింది. తండ్రి బ్రతికి ఉంటే తన జీవితం ఎట్లా గడిచేదో తెలీదు.

ఆ విధంగా తండ్రి మరణం ఆ పదకొండేళ్ళ జీవితానికి, సుదీర్ఘ భవిష్యత్తుకు ఒక ముగింపే అయింది. చిన్నతనంలోనే జీవితంలో చాలా జరగకూడని విషయాలు కాశీ జీవితంలో జరిగిపోయాయి. వయస్సుకు మించి మనస్సు ఆలోచన్లని పెంచుకునేది.

అమ్మ ఏ విషయమూ ఆలోచించేదికాదు. అందుకని ఒంటరిగా కూచుని తమ్ముళ్ళు ఎట్లా బ్రతకాలా అని తానే ఆలోచించేవాడు.

మరి మూడేళ్ళ తరువాత రామనాధయ్య మామయ్య కాశీని హఠాత్తుగా పలకరించి ''విశాఖపట్నం వెళ్తావురా?'' అన్నాడు.

మామయ్య ముఖాన్ని చూస్తూ ఏ విషయమూ ఆలోచించలేకపోయాడు కాశీ. ''ఎందుకు?'' అన్నాడు.

''ఉద్యోగం చెయ్యడానికి. డబ్బు సంపాదిస్తే అమ్మ, తమ్ముళ్ళు కులాసాగా ఉంటారు''

''నాకేం తెలీదు.''

''అందుకే పట్నం వెళ్ళు. ఓ మాస్టరుగారికి ఉత్తరం ఇస్తాను. ఆయన చెప్తారు మిగతా విషయాలు.''

ఏం ఆలోచించాలో తెలియలేదు కాశీకి. ఇప్పుడేం చెయ్యాలో చెప్పే వ్యక్తులు లేరు. ''సరే వెళ్తాను'' అన్నాడు. అమ్మ ఇంట్లో లేదు. ''నేను అమ్మతో చెప్తాలే. ఇప్పుడు కదిపితే తిడుతుంది. నువ్వు బయలుదేరు'' అన్నాడు.

రైలు స్టేషనుకి అతనితో వచ్చాడు మామయ్య. ఓ విధంగా తనకు సంతోషంగానే ఉంది. ఇన్నేళ్ళయి ఆ మురికి కూపంలో, ఆ పొలాలూ, ఆ చీకటి ఇవన్నీ దుర్భరంగానే ఉన్నాయి. రైల్లోకి వచ్చి కూచున్నాక తీరికగా విశ్రాంతిగా గాలి పీల్చుకున్నట్టయింది. ఒంటరిగా బయలుదేరుతున్నానన్న పిరికితనం కలగలేదు. రైలు టిక్కెట్టు కొని ఇచ్చి మూడు రూపాయలు చేతిలో ఉంచాడు మామయ్య.

ఒక్కటే చెప్పాడు. "సాధ్యమయినంతవరకూ ఎవరినీ డబ్బు అడక్కూడదు. భోజనానికి మాత్రం నాలుగు ఇళ్ళకు వెళ్ళి వారాలు ఏర్పాటు చేసుకో. ఒక్కొక్క రోజు ఒక్కొక్కరి ఇంట్లో భోజనం చెయ్యి. అది తప్పుకాదు. ఎప్పుడూ నీ బీదతనాన్ని చెప్పుకుని ఎవరినీ ప్రాధేయపడకు. ఎప్పుడన్నా అక్కడ బ్రతకడం కష్టం అనిపిస్తే, ఎక్కడన్నా రెండు రూపాయలు సంపాదించి తిరిగి వచ్చెయ్."

అన్నిటికీ తలూపాడు కాశీ. ఇప్పటికి మామయ్య చెప్పే మాటల్లో చాలా విషయాలు అర్థమవుతున్నాయి. చలివేస్తోందంటే వంటిమీద కప్పుకున్న శాలువ తీసి ఇచ్చాడు మామయ్య. తన బట్టల మూటను పక్కనే ఉంచుకున్నాడు. బండి బయలుదేరుతూంటే పెట్టె దగ్గరకి వచ్చి తల నిమిరాడు.

"మీ తమ్ముళ్ళనీ, అమ్మనీ నువ్వే బాగుచెయ్యాలి. అది మర్చిపోకు. నేను నిన్ను పంపేస్తున్నానని బాధపడకు. నీ అంతట నువ్వు బ్రతకగలగాలి. పదేళ్ళ తరువాత నేనెంత మంచిపని చేశానో నీకు అర్థమవుతుంది" అని మెల్లగా చెప్పాడు.

మామయ్య ఏడుస్తున్నాడా అని ఆశ్చర్యపోయాడు కాశీ.

ఇంకా వెలుగురాని సంజెపొద్దులో రైలు మెల్లిగా కదిలి ముందుకు పోతూంటే, తాను పుట్టి పెరిగిన ఊరును పూర్తిగా వదిలిపోతున్నట్టనిపించింది. రైలు స్టేషన్ దాటుతూంటే ఏడుపొచ్చింది. తనకి తోడుగా ఎవరూ లేరనిపించింది. పెట్టెలో ఉన్న వాళ్ళంతా వినకుండా నిశ్శబ్ధంగా చీకటిలోకి చూస్తూ దిగులుగా కూచున్నాడు.

●●●

***చెట్లు చిగర్చడం.***

విశాఖపట్నమంతా కొత్త.

రైలు దిగుతూనే ఏం చెయ్యాలో తోచలేదు కాశీకి. మామయ్య ఇచ్చిన ఉత్తరాన్ని తీసుకుని ఆయన వెళ్ళమన్న చోటికి వచ్చాడు.

పది కొబ్బరి చెట్ల మధ్య ఎప్పటిదో ఋషి ఆశ్రమంలాగ, మరీ కిందకి ఉన్న మాస్టారి ఇంటిని చూశాక మళ్ళీ ఏదో పల్లెటూరిలోనే ఉన్నట్టనిపించింది. మాస్టరుగారు కుర్రాణ్ణి చూసి మొదట ఆశ్చర్యపోయారు.

కళ్ళల్లో దయ, కంఠంలో ఠీవీ, నిండుగా, బాకీ పడ్డ జీవితానికి ఋణం తీర్చుకుంటున్నట్లుగా ఒదుగుబాటుతో గడిచిపోయే మాస్టరు గారి జీవితం. ఊరుకి కొంత ఇవతలగా ఈ చిన్న ఇల్లు, పాఠాలు నేర్చుకునే పదిమంది శిష్యులూ మొదట విచిత్రంగా చూశాడు కాశీ.

రామనాథయ్య ఇచ్చిన ఉత్తరం చదివి "రామనాథం పంపాడటోయ్ నిన్ను!" అని భుజం తట్టి నవ్వితే ఆయన ముఖం చూస్తూ నిర్ఘాంతపోయాడు కాశీ. ఇంకా ఆ ముఖాన్ని చూడాలనిపించింది. అంత నిండుగా, అంత మనస్ఫూర్తిగా మరొక్కరే నవ్వగలరు – నాన్న!

వెంటనే భార్యని పిలిచాడు ఆయన. కమలమ్మ బయటకి రాగానే "చూశావా మన రామనాథం మేనల్లుణ్ణి పంపాడు. వాడికి సరిగ్గా బ్రతికే చదువు చెప్పలేదని ఓ రోజంతా నన్ను సాధించి వెళ్ళాడు. అప్పుడింకా నేనూ చిన్నవాణ్ణే. ఆ బాకీ తీర్చుకోడానికి ఇవ్వాళ మేనల్లుణ్ణి పంపాడు" అని మాస్టరుగారు పాత విద్యార్థిని తల్చుకుని తృప్తిగా నవ్వుకున్నారు.

పెరిగి తనంతయిన కొడుకుని చూసినప్పటి ఆప్యాయత మాస్టర్‌గారికి పిల్లలమీద.

"పిల్లలు లేని మన మీద దయతలచి, ఇంటినిండా పిల్లల్ని ఇచ్చాడే నీకు లేరనుకోకు. వీళ్ళంతా నీ పిల్లలే" అంటారాయన భార్యతో.

భర్త సౌజన్యాన్ని ఆమె కూడా పంచుకుంది. 30 ఏళ్ళ తర్వాత ఇవాళ ఆమె భర్త భర్తగా కాక, తనకి ఏవో పాఠాలు నేర్పే ఉపాధ్యాయుడిగానే కనిపిస్తాడు. ఆ చిన్న ఇంటిలో వారి 'విశ్రాంతికి' అర్థమే వేరు.

"నీ పేరేమిటమ్మా?" అంది కమలమ్మ గోడకి ఒదిగి నిలబడ్డ కాశీని చూసి ఇంకా భయంగా తను తెచ్చుకున్న మూటను పట్టుకునే నిలబడ్డాడు కాశీ.

"కాశీ"

"నువ్వు ఉద్యోగం చేస్తావంటాడేమిటి ఇందులో" అన్నారు మాష్టారు ఆశ్చర్యపోతూ.

"అవునండి. నేను ఉద్యోగమే చేస్తాను" అన్నాడు కాశీ, ఉద్యోగం అంటే తెలీని వయస్సులో.

35 ఏళ్ళుగా పిల్లల మనస్సును చదివే విద్య నేర్చుకున్న ముసలి మాస్టారికి అతని మనస్సు ఎంత పెరగలేదో అర్థమయింది. అంతలో భార్యని చూసి నవ్వి "నువ్వు ఉద్యోగమే చేస్తావులే. కొన్నాళ్ళు భోజనం చేసే ఉద్యోగం. తరువాత చదువుకునే ఉద్యోగమును" అన్నారు. అని పెళ్ళాం వేపు తిరిగి "వీడు చాలా పెద్దవాడయిపోతాడు. నువ్వు వీణ్ణి చక్కగా పెంచుకుంటే ముందు ముందు చాలా మంచిపని చేశానని గర్వపడతావు" అని చెవిలో రహస్యంగా చెప్పారు.

కమలమ్మ ఆశ్చర్యపోయింది. అక్కడ గోడకి చేరబడి మాసిన బట్టలతో నిలబడిన కుర్రాణ్ణి చూసి, భర్త మాటలలో ఎంత సత్యం ఉన్నదా అని ఆలోచిస్తోంది. కానీ ఒక్కటి మాత్రం నిజం. ఆయన ఎప్పుడూ అబద్ధం చెప్పరు.

"అతన్నింకేం అడక్కు... మంచి పెరుగన్నం పెట్టు" అన్నారు మాస్టరుగారు.

కాశీ అక్కడే నిలబడి ఏదో ఆలోచిస్తున్నాడు. అమ్మకి పిచ్చిరాకపోతే ఇలాగే ఉండేదేమో ననిపిస్తోంది.

కుర్రాణ్ణి చూస్తూన్న కొద్దీ ఆమె మనస్సు ఆర్ద్రతతో నిండిపోయింది. పదిహేడేళ్ళు ప్రపంచమంటే ఎరగకుండా నిర్లిప్తతతో ఉండిపోయిన అతన్ని చూస్తూ కొడుకు మీద ప్రేమ ఎలాంటిదో తెలీని ఆ హృదయంలో ఏ మూలనో నరాలన్నీ జివ్వుమన్నాయి. ఆకలితో కాశీ భోజనం చేస్తూంటే ఆతృతగా చూస్తూ కూచుంది ఆ ఇల్లాలు.

రాత్రి వరకూ మాస్టరుగారు అతని విషయమే ఆలోచించలేదు. ఆ తర్వాత బట్టలు మార్చుకుని పాఠశాలకు వెళ్ళిపోయారు. అలాగే ఒంటరిగా వీధిలో కూచుండిపోయాడు కాశీ. ఇదే పట్నం అయితే, ఇక్కడి మనుషులంతా ఇలాగే ఉంటే తనకేం భయం లేదనిపించింది. ఇక్కడి వాతావరణం మీద క్రమంగా విశ్వాసం ఏర్పడసాగింది. ఆ చెట్ల నీడలో ఆ ఇల్లాలి ఆదరణలో పల్లెటూరిలో లేని ఏదో తృప్తి కనిపించింది. అదే ఆలోచిస్తూ కూచున్నాడు.

సాయంకాలం మాస్టరుగారు ఇంటికి వస్తే దగ్గరకి వచ్చి నిలబడ్డాడు కాశీ.

కట్టుడు పళ్ళు పైకి తీసి మొహం కడుక్కుంటున్నారు మాస్టరుగారు. "వారాలు ఏర్పాటు చేసుకోమన్నాడండి మామయ్య" అన్నాడు కాశీ.

మాస్టరుగారు ఇటు తిరిగితే పళ్ళు లేకపోవడం చూసి ఆశ్చర్యపోయాడు చిరునవ్వు నవ్వినప్పుడల్లా అతనిలో ఇంకా ఎంతో వయస్సు మిగిలినట్టూ, ఆ శక్తినంతా ఒక్క నవ్వులోనే పొదిగినట్టు అనిపిస్తుంది. అతని మనస్సుకు వయస్సును ఇవ్వలేని కాలం, శరీరానికి వృద్ధాప్యాన్ని కలిగించి ఊరుకుంది.

నవ్వేరు మాస్టరుగారు. పళ్ళను ఉంచుకున్నాక ఆశ్చర్యపోతూ అడిగారు, "నీకెవరిస్తారు వారాలు?"

అవేమీ అప్పుడు ఆలోచించలేదు కాశీ. మామయ్య అలా చెపితే సరేనన్నాడు. ఇప్పడదే జవాబు చెప్పాడు.

"ఏమో తెలీదు."

"సరే, నే చూస్తాలే రెండు రోజుల్లో బడిలో చేరుదువుగాని, ఆ తర్వాత ఆలోచిద్దాం అవన్నీను" అన్నారు.

అంతవరకూ తను చదువుకోవాలన్న విషయం ఎప్పుడూ ఆలోచించనే లేదు. చిన్నప్పుడు నాన్నగారు పొలంలో కూర్చోపెట్టి తెలుగు అక్షరాలు నేలమీద రాయించేవారు. రెండు ఇంగ్లీషు అక్షరాలు కూడా అప్పట్లో అతనికి వచ్చేవి. ఎక్కాలూ చెప్పేవారు. నాన్న చచ్చిపోయాక మళ్ళీ వాటిని రాయమని ఎవరూ తనని అడగలేదు. రాయాలని అతని మనస్సు పోలేదు. ఇప్పుడు మళ్ళీ మాస్టరుగారు చదువు విషయం ఎత్తాక పాత విషయాలన్నీ గుర్తుకొచ్చాయి. ఓసారి తను అక్షరాలు రాయకపోతే "చదువుకోవాలి. నువ్వు పెద్దయాక నాలాగా కాకుండా ఉంటే చాలు" అనేవాడు నాన్న. 'తనలాగ' అంటే తెలీలేదు. తనెలాగ ఉన్నాడో అప్పట్లో తనకి అర్థం కాలేదు. అయినా అలా కాకూడదన్నాడు.

అనుకుని, చాపమీద పడుకుని, వీలయినంత వరకూ పాత అక్షరాలని ఒక్కొక్కటే గుర్తుచేసుకోవడానికి ప్రయత్నించాడు.

**స్కూలులో చేరిన మరో రెండు వారాలకి** మాస్టరుగారికి మళ్ళీ వారాల విషయం అడిగితే "వారాల అవసరం నీకేం లేదు కాశీ" అన్నారు.

ఎందుకో అలా ఊరుకోవడం నచ్చలేదు కాశీకి. "మామయ్య చెప్పాడండి" అని మాత్రం గుర్తుచేశాడు.

ఇకనేం చెప్పలేకపోయారు మాస్టరుగారు. చిన్నపిల్లల మనస్సులు ఎలాంటివో ఆయన 35 ఏళ్ళబట్టి చూస్తున్నారు. ప్రమాదం లేనంతవరకూ పిల్లల్ని వారి దారంట వారిని పోనివ్వడంలో తప్పులేదు. పసితనంలో వారి మార్గాలకు కలిగే ఆటంకాలు మనస్సు మీద పనిచేస్తాయి. ఆ త్రోవలో కలిగే ఒడుదుడుకులను దిద్దుకునే ప్రయత్నాలు మంచి అనుభవాలను ఇస్తాయి. అప్పటి ప్రయత్నాల వైఫల్యం కూడా ఒక మేలే చేస్తుంది.

అందుకని ఒక పేరును కాగితం మీద వ్రాసి ఇచ్చారు. "ఈ డాక్టరు ముకుందరావు గారి దగ్గరకి వెళ్ళు. స్వతహాగా ఆయన మంచివారే. కానీ మంచితనానికీ, డబ్బుకీ పొత్తుకీ కుదరదు. చేతల్లో మంచితనాన్ని చూపుతారేమో చూద్దాం. కానీ ఒక్కటి గుర్తుంచుకో. ఎక్కడ వారాలు దొరక్కపోయినా బాధపడకు. స్వేచ్ఛగా బ్రతకడం అంటే 'నిన్ను' నిన్నుగా చంపేసుకోవడం కాదు. నువ్వు నువ్వుగానే బ్రతుకుతూ ఇతరుల సానుభూతిని సంపాదించు. అందుకు ఏ పరిస్థితుల్లోనూ నీ బీదరికాన్ని అవకాశం చేసుకోకూడదు. నీ సమర్థతల్ని ఆధారం చేసుకోవాలి" అని చెప్పారు.

పిల్లలికెలా చెప్పాలో మాస్టరుగారికి తెలుసు ఆయన చెప్పిన మాటల్లో చాలా విషయాలు అర్థమవుతున్నాయి. కాశీకి ఇదివరకు మామయ్య కూడా ఇలాంటి మాటలే చెప్పాడు. బహుశా మాస్టరుగారి దగ్గరే నేర్చుకున్నాడేమో. బీదరికాన్ని ఆధారం చేసుకుని బ్రతకకూడదు. అది ముఖ్య సూత్రం.

డాక్టరుగారింటికి బయలుదేరాడు.

ఇంటి ముందు పెద్ద గేటు. చుట్టూ గుండ్రటి ఆకారాల్లో బంతులు బంతులుగా తీర్చిన ఫెర్న్ మొక్కలూ, రకరకాల క్రోటన్స్ వరసలూ, మధ్య పాలపుంతలా తెల్లటి గచ్చుతో పోర్టికో వరకూ తోవ. పోర్టికోలో నట్టి కాడిలాక్, రెండు కుక్కలూ, తలపాగాలు సవరించుకుంటూ అటూ ఇటూ తిరుగులాడే నలుగురు బంట్రోతులూ - గేటు దగ్గరే విచిత్రంగా నిలబడిపోయాడు కాశీ.

పట్నం ఇదేనేమోననిపించింది. అదేదో మరో ప్రపంచంలాగ, ఆ ప్రపంచంలో బ్రతకడానికి ఇంకేవో అర్హతలు కావాలేమోననిపించింది.

గూర్ఖా మొదట ఆపి, చేతిలో ఉత్తరం చూడగానే లోపలికి వదిలాడు. హిందీలో ఏదో చెప్పినా, కాశీకి అర్థం కాలేదు.

హాలులో డాక్టరుగారు పైన్ ఆపిల్ ముక్కల్ని ఫోర్కుతో ఎత్తి కుక్కలికి తినిపిస్తున్నారు. కుడివేపున ఉన్న పియానోలోనో రెండు మెట్లు విరిగితే బాగుచేయించలేదన్న కోపంతో మిగతావి కూడా తీరికగా విరగకొట్టోంది గిరిక. డాక్టరుగారికి కోపం రావడంలేదు. అమ్మాయిలో కోపం చూసినప్పుడల్లా ఆరేళ్ళ క్రిందటే చనిపోయిన భార్య గుర్తుకొస్తుందతనికి.

''ఇంకా కోపం తెచ్చుకో అమ్మా - రెండు పియానోలను ఖర్చుచేసినా ఆ కోపాన్ని కొనుక్కోలేను నేను'' అన్నారు.

అంతలో కుర్రాడు వరండాలోకి వస్తే కుక్కలికి ఆహారం తినిపించే కార్యక్రమానికి అంతరాయం కలిగించింది. కళ్ళజోడు తీసి టేబులు మీద ఉంచి ''వాట్ రాట్!'' అని ఇంగ్లీషులో విసుక్కున్నారు డాక్టరుగారు.

పియానో పని ఆపింది గిరిక.

నమస్కారం చెయ్యడం మాస్టరుగారే నేర్పారు కాశీకి. కానీ ఈయనకి చెయ్యవచ్చునో లేదోనని అనుమానంతో చెయ్యకుండానే ఉండిపోయాడు కాశీ. డాక్టరుగారికి ఆ విషయం కోపాన్ని తెప్పించింది. డాక్టరుగారిలో ఆశ్చర్యాన్ని చూసి, ఈ నూతన వ్యక్తి పట్ల తమ అవిశ్వాసాన్ని ప్రకటించాలో లేదో తెలీక కుక్కలు ఆపిల్ తినేకార్యక్రమంలోనే ఉండిపోయాయి.

''ఎవరోయ్ నువ్వు!'' అన్నారు డాక్టరుగారు ఇంగ్లీషు లాంటి తెలుగులో.

''కాశీ''

''ఏమిటీ అదేదో ప్రపంచ విఖ్యాతమైన పేరులా చెప్తావ్. అడ్రెసు, అదీ ఏడువు.'

ఆ వాక్యాలన్నీ అర్థం చేసుకోవడానికి ప్రయత్నించలేదు కాశీ. తను చెప్పాలనుకున్న వాక్యాలన్నీ జాగ్రత్త చేసుకునే వచ్చాడు. ''మాస్టరుగారు పంపారండి. ఈ కాగితం మీకు ఇవ్వమన్నారు.''

''గెటిట్ లూసీ'' అని కుక్కకి పురమాయించారు. మరీ ఎత్తుగా ఉన్న నల్లటి బొచ్చుకుక్క లేచి కాశీ చేతిలో కాగితం పుచ్చుకుని ఆయనకు ఇచ్చింది. చదువుకుని పెద్దపెట్టున నవ్వి అవతల పారేశారు కాగితాన్ని.

''ఇతనా! పంతులు రికమెండేషన్లు కూడా చేస్తాడేమిటి?''

ఇంకా కుర్రాణ్ణి ఆశ్చర్యంగా చూస్తోంది గిరిక. అంత చిన్న కుర్రాడిలో తనకు ఐదేళ్ళప్పుడే లేని సిగ్గూ, భయం మాటిమాటికీ జుత్తును మీదకి ఎగదోసుకుని మనిషంతా కనిపించకుండా ఒక స్థంభానికి ఆనుకుని నిలబడ్డ అతణ్ణి ఏదో వింత జంతువుగా చూస్తోంది. చూస్తుండగా, హఠాత్తుగా ఓ ఆలోచన తట్టింది. ఎక్కడో అతన్ని చూసింది తను.

''నువ్వేం పనిచేస్తావ్?'' అని అడిగారు డాక్టరుగారు.

''చదువుకుంటున్నాను''

విరగబడి నవ్వారు ''నువ్వు చదువుకోవడం ప్రపంచాన్ని ఉద్ధరించడానికి కాదోయ్. నువ్వు భోజనం చేస్తే మాకు ఎంతలాభమో, చదువుకున్నా అంతే లాభం? మాకేం చేస్తావో చెప్పు''

మాస్టారి మాటలు మరిచిపోలేదు. 'తానుగా' మరిచిపోయేపని ఏదీ ముట్టకోకూడదు. అందుకని ''ఏం చెయ్యను. మీరు భోజనం పెట్టడం నాచేత నౌకరీ చేయించుకోడానికి కాదు ఏమన్నా సహాయం చేయగలిగితే చేయండి''

డాక్టరుగారి ఎదుట ఇంత సూటిగా మాట్లాడిన పేషెంటుని కూడా ఎప్పుడూ చూడలేదు. దిమ్మరపోయాడు మొదట. బాగా కోపం తెచ్చుకోవాలన్న విషయం మరిచిపోయి, ఆశ్చర్యంతో స్తబ్దుగా ఉండిపోయారు.

తండ్రి మొహాన్ని చూసి పకపకనవ్వుతోంది గిరిక.

''ఏమమ్మా నవ్వుతున్నావ్?''

"ఈ కుర్రాడు ఉంటే నాకు కాలం గడుస్తుంది నాన్నా. స్కూలు నుంచి నన్ను రోజూ ఇంటికి తీసుకొస్తాడేమో అడుగు"

"వీడెందుకమ్మా బడుద్దాయి. గుర్రబ్బండి ఉందిగా? అది బాగులేకపోతే ఫోను చెయ్యి ప్రతిరోజూ కారు పంపుతాను."

"కాదు నాన్నా బండిలోనే వస్తాడు నాతో కాలం గడుస్తుంది"

డాక్టరుగారికిదేం నచ్చలేదు. నౌకరు బండి వెనుక నడవాలి బండి ఎక్కి అమ్మాయి పక్కన కూర్చుని అమ్మాయితో మాట్లాడే నౌఖరు తన మర్యాదకు భంగకరం.

"ఈ పిచ్చిక ఎందుకమ్మా మంచి జబర్దస్తీగా ఉన్న మనిషిని నీ బండి వెనక రోజూ పరిగెత్తేటట్టు ఏర్పాటు చేస్తాను సరా?"

మొహం ముడుచుకుంది గిరిక. ఆమె నవ్వకపోతే డాక్టరుగారికి ఆ రోజు ఇక చీకటి పడదు.

హుందాగా ఇటు తిరిగి "ఒరేయ్? ఇలారా" అన్నాడు.

వచ్చాడు కాశీ.

"నీ పేరేమిటి?"

"కాశీ"

"అమ్మాయిని రోజూ స్కూలు నుంచి ఇంటికి తీసుకు వస్తావా?"

ఆలోచించాడు. ఇదేం చెడ్డపనిగా తోచలేదు. గిరిక ముఖం చూస్తే మెరిసే కళ్ళతో తననే తదేకంగా చూస్తోంది. ఆ కళ్ళు చూస్తే భయమేసింది. అలా తనని మరి కొంతసేపు చూస్తే ఏమీ చెయ్యలేడనిపించింది. తనలో శక్తిని ఆమెకళ్ళతో స్వాధీనం చేసుకుంటున్నట్లుంది.

"నన్నలా చూడకపోతే తప్పకుండా వప్పుకుంటాను."

గిరికకు ఒక్కసారిగా కోపం వచ్చింది.

"ఈ కుర్రాడు నాకు వద్దు" అంది.

కానీ డాక్టరుగారు ఫకాలున నవ్వేశారు. "నీ కళ్ళంటే నాకూ భయమేనమ్మా చెప్పొద్దూ? మంచి చురుకయిన కుర్రాడులే, నువ్వే ఎంచుకున్నావుగా?"

ఇంకేం మాట్లాడలేదు గిరిక.

గుమాస్తాను పిలిచారు డాక్టరుగారు. "ఇవాల్టినుంచీ ఇక్కడ వీడికీ భోజనం పెట్టండి. వారానికి ఒక్కరోజు మాత్రం ఇక్కడ భోజనం చేసి పోరా అబ్బీ" అన్నారు.

గుమస్తా ఇంకా నసుగుతున్నాడు.

"ఏం?"

"భోజనాల ప్లేట్లు విడిగా లేవండి"

నవ్వుకున్నాడు డాక్టరుగారు. "మరేం ఖర్చు అక్కరలేదు, మన లూసీ పాత జపాన్ సిల్వర్ ప్లేటు కడిగించండి. ఆ మూల కూచుని తినేసి పోతాడు" అన్నాడు. ఆ మాటతో తన లూసీకి ఆధిక్యతను ఇస్తున్నట్టు భావించి ఆపిల్ పళ్ళు తింటున్నదాని తలనిమిరారు.

కాశీ గుమ్మం దాటుతూంటే అక్కడ కనిపించింది గిరిక. ఆపి "మీ నాన్న రైలు కిందపడి చచ్చిపోయాడు కదూ?"

నిర్ఘాంతపోయాడు కాశీ "నీకెలా తెలుసు?"

"నాకు జ్ఞాపకం ఉంది. ఆ రోజు గుర్తులేదూ? నేను నీకు బిస్కట్లు ఇచ్చాను"

అవును. ఇప్పుడిప్పుడే గుర్తుకొస్తోంది. ఆ బిస్కెట్లు చాలా రోజులు తిన్నాడు కూడాను.

"అవును గుర్తుంది. నువ్వు చాలా మంచిదానివి"

"మరి రేపట్నుంచీ వస్తావా?"

"అలాగే" అన్నాడు.

●●●

ఓ రోజు మామయ్య దగ్గర్నుంచి ఉత్తరం వచ్చిందని తెచ్చి ఇచ్చారు మాస్టరుగారు. అప్పటికే ఆరునెలలయింది ఇక్కడికి వచ్చి. ఇంతవరకు మామయ్య, అమ్మా, తమ్ముళ్ళ గురించి ఆలోచించనేలేదు కాశీ. ఇవాళ మామయ్య ఉత్తరం చూశాక అంతా గుర్తుకొచ్చారు. అప్పటికీ ఇప్పటికీ తను చాలా మారిపోయినట్టనిపించింది. నిజంగా ఇప్పుడు తనని చూస్తే అమ్మ చాలా సంతోషిస్తుంది. ఒక్కసారి ఇంటికి వెళ్ళి వాళ్ళందర్నీ చూడాలని మొదటిసారిగా అనిపించింది.

మాస్టారుగారు గదిలో కూచుని ఏదో వ్రాసుకుంటున్నారు. మాస్టరుగారు రాసుకుంటూంటే కమలమ్మగారు కూడా మాట్లాడించరు. గది ముందుకు వచ్చి నిలబడ్డాడు.

"మాస్టారూ" అన్నాడు కాసేపాగి.

వ్రాసుకుంటున్న వారల్లా మాస్టరుగారు తల ఎత్తారు. లాల్చీ మడతలు సరిచేసుకుంటూ కాశీ కనిపించాడు.

"ఏం కాశీ"

ఏదో తప్పుచేసినట్టు ఎలా చెప్పాలో తెలియక తికమకపడ్డాడు. "అమ్మనీ, తమ్ముళ్ళనీ చూడాలనిపించింది మాస్టారూ!"

ఒక్కసారిగా తుళ్ళిపడ్డారు మాస్టరుగారు. పరీక్షలు ఇంకెంతో దూరంలేవు. ఆ సమయంలో మామయ్య ఉత్తరం వచ్చి, అతణ్ణి కదిపిందేమో. ఆ ఉత్తరం ఇచ్చి తనే అందుకు కారణమయాడనుకున్నాడు. అయినా ఒక్కసారి వీల్లేదంటే బాధపడతాడు. ఈ వయస్సులో కుర్రాళ్ళ మనస్సు మీద ఒక్కసారిగా పెద్ద దెబ్బపడితే తట్టుకోలేరు. మెల్లగా ఈ సందర్భంలో ఆలోచనల నుంచి మళ్ళించాలి. అందుకని వెంటనే శాలువా, చేతికర్ర తీసుకుని లేచాడు. చేయవలసిన పనంతా అలాగే ఉండిపోయింది. "అలా వెళ్దాం పద కాశీ" అని భుజం మీద చెయ్యి వేసి.

భార్యని పిలిచి "నువు తలుపు వేసుకుని పడుకో" అని చెప్పి వీధిలోకి నడిచారు.

పాఠశాల మైదానానికి అడ్డంగా ఏటి కట్టవేపు నడిచారిద్దరూ. మాస్టారికి కోపం వచ్చిందేమోనన్న భయంతో మాట్లాడకుండా నడిచాడు కాశి.

కొంతసేపటికి మాట్లాడారు మాస్టరుగారు. "నా నలభై ఏళ్ళ జీవితంలో ఎప్పుడూ మంచిపనే చేస్తూ వచ్చాను కాశీ. కానీ విద్యార్థుల దృష్టిలో అదెప్పుడూ చెడ్డపనిగా కనిపిస్తుంది. వాళ్ళ వయసు అలాంటిది. నాకందుకు విచారం లేదు. మొదటిది చెప్పు. నా మీద నీకు పూర్తినమ్మకం ఉందో లేదో"

"అదేమిటి మాస్టారూ" అన్నాడు కాశీ అర్థం బోధపడక.

"నేనొక్కటే చెప్తాను అబ్బాయ్. అమ్మని ప్రేమించడం మంచిదే, తమ్ముళ్ళను ప్రేమించడమూ మంచిదే కానీ వాళ్ళను అలా చూస్తూ కూచుంటే, నీకు తెలీకుండానే వాళ్ళకు కీడు చేస్తున్నావన్నమాట. కొన్నాళ్ళకి నువ్వు ఏమీ చేతకానివాడివి అవుతావు. అప్పుడు నువ్వు పడే బాధకి, నీ చేతకానితనం నీమీద విధించే శిక్షకి ఒక పరిమితి అంటూ, ఉండదు. లక్ష్యాలూ, ప్రేమాభిమానాలూ తప్పకుండా

ఉండాలి. వాటివల్ల వాటి కోసమే మనం బ్రతుకుతాం. అయితే కొన్నింటిని తాత్కాలికంగా మరిచిపోవాలి" మధ్యలో దగ్గు వచ్చింది. భుజం మీద ఉన్న శాలువని నోటికి అడ్డం పెట్టుకుని ఆపుకోవడానికి ప్రయత్నించారు.

దారిలో, ఆ చీకటిలో రాతిని తన్నుకుని మాష్టారి చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు కాశీ. ఇక తనకేమీ భయం లేదనిపించింది.

ఇంకా చెప్పడం ప్రారంభించారు "నువ్వెంత చదువుకుంటున్నావో వాళ్ళకి చెపితే, వాళ్ళకి నువ్వెంత దగ్గరపడుతున్నావో తెలుసుకుని సంతోషిస్తారు. ఇవాళ కాదు కాశీ, నువ్వెప్పుడు ఇంటికి వెళ్ళాలో మరోసారి చెప్తాను సరేనా?"

ఇంత విన్నాక కాశీకి ఓ తృప్తి కలిగింది. మాస్టారికి కోపం రాలేదన్న తృప్తికి ఇప్పుడు అమ్మని చూడకపోయినా ఫరవాలేదనిపించింది. అయినా మాస్టారు చెప్పిందీ నిజమే. చదువు పాడవుతుంది. సరేనన్నాడు.

ఇంటికి వచ్చాక ఒక కార్డు ఇచ్చి "బాగా చదువుకుంటున్నట్టు ఉత్తరం వ్రాయి. చాలు" అన్నారు.

మళ్ళీ కొత్త ఉత్సాహం కలిగింది. కూర్చుని జాగ్రత్తగా రెండు వాక్యాలు రాశాడు అమ్మకి నమస్కారం. పరీక్షలయిపోయాక తమ్ముళ్ళందర్నీ చూడడానికి వస్తాను" అంతకంటే ఎక్కువ రాసేంత చదువుకోలేదు కాశీ. అదీకాక, తమ్ముళ్ళని చూడడమే అతని లక్ష్యం అప్పటికి.

ఉత్తరాన్ని మాస్టరుగారు పోస్టు చేశాక చాలా తృప్తిపడ్డాడు. జవాబు వస్తుందేమోనని మూడు రోజులు ఎదురు చూసాడు. మాష్టార్ని రోజూ 'ఉత్తరం వచ్చిందా' అని అడిగేవాడు. ఈ ధ్యాసలో చదువు పాడవుతుందని తెలుసు మాస్టరు గ్గారికి. వస్తే బావుణ్ణుని ఆయనా అనుకునేవారు.

నాలుగో రోజు సాయంకాలం ఇన్నాళ్ళు ఎదురుచూస్తూన్న ఉత్తరం అందింది. మనస్సంతా కూడదీసుకుని కిటికీ గోడకి ఒత్తిగిలి అక్షరాలను కూడ బలుక్కున్నాడు కాశీ. వచ్చీ రాని చదువుతో అవక తవకగా రెండు వాక్యాల్ని రాసింది. అమ్మ.

"నువ్వు వెధవి. నాకు చెప్పకుండా పోయావు. మేమంటే నీకు ప్రేమ లేదు."

●●●

ఆ ఉత్తరంతో కాశీ మనస్సులో పాడయినా భాగాన్ని బాగుచేయడానికి మాష్టరుగారి దగ్గర సాధనాలు లేవు. చేయని తప్పుకు శిక్ష అనుభవిస్తున్న వాడిలాగ, ఆ ఉత్తరం అమ్మ అలా ఎందుకు రాసిందో తెలీని కాశీ తన గది దగ్గర నిలబడితే ఏం చెప్పాలో తెలీక మాస్టరుగారు తికమక పడ్డారు.

అప్పటికి కాశీ మనస్సులో చెడిపోయిన భాగం అట్లా బాగు అవకుండానే ఉండిపోయింది. ఇప్పటికి కాశీ ఒక్కసారి దెబ్బతిన్నాడని అనుకున్నారు మాస్టరుగారు. కానీ ఒక్కటి మాత్రం రూఢీగా తెలిసింది. "కాశీకి మంచి తల్లి లేదు. ఇక్కడికి రావడం ఒక విధంగా మంచికే జరిగింది"

భార్యని పిలిచి "కాశీకి తండ్రి మాత్రమే లేడనుకున్నాం. కానీ మంచి తల్లి కూడా లేదన్న విషయం ఇప్పుడే అర్థమయింది. మనల్ని మనం బాగుచేసుకోవడంలో కాదు ఇతరులను బాగు చేయగలగడంలోనూ తృప్తి ఉంది. కాశీకి మంచి తల్లివి కావాలి నువ్వు" అన్నారు.

ఆర్ద్రతతో, భర్తమీద గౌరవంతో కమలమ్మ హృదయం ఆలోఢితమయింది. అతని సుహృద్భావానికి మనస్సులోనే వెయ్యి నమస్కారాలను చెప్పుకుంది.

"కాశీకి మీరు మనిషిగా బ్రతకడం నేర్పుతున్నారు. నేను మంచిగా బ్రతకడం నేర్పుతాను" అన్నది. అంతా చెప్పాక ఆమెకు కళ్ళనీళ్ళు తిరిగాయి.

మళ్ళీ కాశీ వచ్చేసరికి అంతా సరి.

మాస్టరు గారు నవ్వుతూ పలకరించారు.

●●●

స్కూలు నుంచి గిరికను ఇంటికి తీసుకు వెళ్తూంటే గుర్రానికి కాలు బెణికిందని అరగంట ఆలశ్యం చేశాడు బండివాడు. ఏం ప్రమాదం జరిగిపోయిందోనని ముగ్గురు నౌఖర్లను వరసగా పంపారు డాక్టరుగారు. "ఇందరుండగా నేనెందుకు పోతాను" అని కాశీ అంటే ఒప్పుకోలేదు గిరిక. "వాళ్ళంతా లేరని నిన్ను రమ్మనలేదు నాన్నగారు. నాకు భయమనీ కాదు. నీకు పనివుంటుందని" అంది. ఇంక తప్పలేదు. బయటికి కాళ్ళు వేళ్ళాడేసి బండిలో కూచున్నాడు.

ఇంటికి వచ్చేసరికి ఎవరో కొత్తకుర్రాడితో డాక్టరుగారు చెస్ ఆడుతున్నారు. లూసీ తలమీద చేతిని ఉంచి.

"గుర్రాన్ని రెండు దాటులు దాటించి శకటుపని సరిపెట్టేస్తాను" అని కుర్రాడు అరవబోయి చేతిలో బిస్కట్లను ఆ ఉత్సాహంలో నేలమీదికి విసిరాడు. కుక్కలు రెండూ పోట్లాడుకుని వాటిని తింటున్నాయి.

ఓడిపోతున్నా డాక్టరు గారికి సంతోషంగానే ఉంది.

కాశీ, గిరికా బండి దిగేసరికి రాజు కట్టుబడితే ఇల్లెగిరిపోయేటట్టు నవ్వుతూ దగ్గుతూ ఆయాసం తెచ్చుకున్నారు డాక్టరుగారు.

అమ్మాయిని చూసి "మన చక్రం చదరంగాన్ని కాచి వడపోశాడమ్మా వీణ్ణింక మిలటరీలో చేర్చేస్తే ఏ మేజరో అయి కూర్చుంటాడు" అన్నాడు తృప్తిగా.

"ఎలా చదివాడో అడుగు నాన్నా?" అంది గిరిక హుందాగా.

చక్రవర్తి ఏదో జవాబు చెప్పబోతో, డాక్టరుగారు ఆపి "చదువుకోసం అంత తాపత్రయం ఏమిటమ్మా డాక్టరుగారి అబ్బాయి చదువుకోసం వెదుక్కో అక్కరలేదు. అంతగా అవసరమయితే చదువే డాక్టరుగారి అబ్బాయి కోసం వెదుక్కుంటుంది. ఇక వీడీమూడేళ్ళలో షేక్స్పియర్ పెళ్ళాం వయస్సు మీద రీసెర్చి చేశాడట" ఇంకా నవ్వుతున్నారు. పిల్లలు చదువుకోలేదన్నప్పుడు డాక్టర్ గారికి వచ్చినంత ఖుషీ, ఉత్సాహం ఎప్పుడూ రాదు చదువుకోసం తనేం తాపత్రయపడకుండానే ఈ చదువూ హోదా వచ్చిందనీ అలా రావడంలోనే గొప్పతనం ఉందని ఆయన భావన కాని తండ్రి దివాన్ బహదూర్ పలుకుబడి, తన డిగ్రీలకు ఎంత ఉపయోగపడిందో ఆయన మరిచిపోయారు.

ఇంతసేపూ గుమ్మాన్ని ఆనుకుని విసుగ్గా నిలబడ్డ కాశీని చూసి, ఆ ఖులాసాలో నవ్వుతూ పలకరించారు డాక్టరుగారు.

"రావోయ్ కాశీ, చక్రవర్తిని నువ్వు చూసి ఉండవు. ఆంధ్రా యూనివర్సిటీలో బియ్యే చదువుతున్నాడు. సెలవుల్లో ఇంటికి వచ్చి అవన్నీ మరిచిపోవడం ప్రాక్టీసు చేస్తాడు. వీడి దగ్గర కాస్త చురుకుతనాన్ని నేర్చుకుని, వాడికి కాస్త మంచితన్నాన్ని నేర్పు అన్నాడు. కుక్కలు అందుకు ఇష్టం లేనట్టు మూలిగాయి.

"రావోయ్" ఎంతో తెలిసినవాడిలా పిలిచాడు చక్రవర్తి.

బోర్నవిటాకు టైమైందని లేచారు డాక్టరుగారు.

గిరిక పంజాబీ గౌను మీద, క్రేప్ చున్నీ వేసుకుని మెట్లు దిగుతూంటే ఇక వెళ్తానని లేచాడు కాశీ.

"నీ పేరు?" అనడిగాడు చక్రవర్తి.

"కాశీ"

"పట్నంలో మూడేళ్ళు గడిపి సుఖంగా బ్రతకడం ఎలాంటిదో అలవాటు చేసుకుంటున్నానోయ్. నాన్నగారు చెప్పిందంతా పూర్తిగా నమ్మకు. నమ్మినట్టు నటిస్తే చాలు. నన్ను సైకాలజీ సబ్జెక్టు తీసుకోమన్నారు. కానీ సైకాలజీ నన్ను తీసుకోలేదు. నీ వయస్సెంత?"

"పదిహేడు"

సరిగ్గా నీ వయస్సే నాదీను. అప్పుడే జీవితాన్ని గురించి చాలా నేర్చుకున్నాను నేను. రోజూ కొంత నేర్పుతాను నీకు. నాకు చదువుమీద అజీర్ణం కూడా తగ్గిపోతుంది.

డాక్టరుగారు కళ్ళజోడు మరచిపోయానంటూ వచ్చారు.

"నేను తొందరగా ఇంటికి పోవాలి" అన్నాడు కాశీ లేచి.

"ఏం చక్రవర్తికి నువ్వు నచ్చలేదా? నీకు చక్రవర్తి నచ్చలేదా?"

"అదికాదు నాన్నా, అతనికి మన గుర్రబ్బండీ నచ్చలేదు. అందుకనే విసుగొచ్చింది. ఏం అంతేనా?" అంది గిరిక.

"అదికాదండీ"

"ఏదికాదండి. గుర్రబండా, మా అమ్మాయా నచ్చంది?" ఫక్కున నవ్వారు డాక్టరుగారు.

గిరిక, చక్రవర్తి కూడా నవ్వడం సాగించారు.

"ఎనిమిది గంటలకి మాస్టారి ఇంట్లో భజన ఉంది."

హఠాత్తుగా నవ్వు ఆపేశారు డాక్టరుగారు.

"భజన ఏమిటి?" అంది గిరిక.

"రోజూ భజన చెయ్యందే భోజనం చెయ్యం మేము. మాస్టారు చెప్పిన పద్ధతి మరి వస్తానండి" నమస్కారం చేసి త్వరత్వరగా వెళ్ళిపోయాడు.

ఈ చిన్న కుర్రాడి మనసులో 'కలుపు' తీసి, ఎవరో తెలీని వ్యక్తి ఏవోమార్గాలు సిద్ధం చేస్తున్నారని డాక్టరుగారికి అంతవరకూ తెలీదు. తొందరగా అడుగులో అడుగు వేసుకుంటూ దాటిపోతున్న కాశీని చూసి మొదటిసారిగా అతణ్ణి గురించి ఆలోచించారు డాక్టరుగారు.

ఆలోచించిన కొద్దీ ఆశ్చర్యం తక్కువయింది.

**ఓ రోజు చాలా పెద్ద తప్పుపని చేసేశాడు కాశీ**. తీరా చేశాక అది ఎంత పెద్ద తప్పు పనో తెలిసి వచ్చింది. ఆలోచించిన కొద్దీ ఏం చెయ్యాలో తెలీక భయమేసింది. పుస్తకం ఒకటి కొని తెమ్మని మాష్టారు గారు ఇచ్చిన రూపాయి తీసుకు బయలుదేరే వేళకి దారిలో లాటరీ కనిపించింది. ఆటలో గెలుపు ఓటమిలో ఉత్సాహం, అంతకు మించి ఆటవేసే అతను అరిచే అరుపులూ, జీవితాన్నంతా ఆ ఒక్క ఎత్తులోనే కేంద్రీకరించినట్లు ఆటగాళ్ళ ముఖంలో గాంభీర్యం అంతా విచిత్రంగానే కనిపించాయి కాశీకి. ఊహించినట్టే రంగులు మారడం, అంతకు మరింత డబ్బు వస్తూండడం విచిత్రంగానే ఉంది. తన చేతిలోనూ ఒక రూపాయి ఉందన్న ఆలోచన పిచ్చివాణ్ణి చేసింది. ఒకటి రెండు అణాలు మొదటపోయినా రూపాయి అంతా పోవడం జరగదు. అదీగాక, గెలిస్తే, మరో రూపాయికి ఆ రూపాయిని చేర్చగలిగితే ఎంత సంతోషం? కాస్సేపు మాస్టరుగారు, పుస్తకాలు, త్వరగా ఇంటికి వెళ్ళాలన్న ఆలోచనా వెనకపడ్డాయి. రూపాయి జేబులోంచి ఖంగుమని బల్లమీద పడింది. ఆటగాళ్ళకి కళ్ళు జిగేలుమన్నాయి.

డబ్బాలో రంగులు ఎట్లా తిరుగుతున్నాయో, పందెం ఎట్లా వేయాలో అర్థం కావడంలేదు. రూపాయి ఎంత? పూర్తిగా డబ్బంతా పోయాక బిక్కమొహం వేసుకు నిలబడిపోయాడు. దూరంగా ఎలక్ట్రిక్ స్తంభానికి చేరబడి ఏం చెయ్యాలో తోచక నుదుటికి పట్టిన

చెమటని తుడుచుకున్నాడు. మాస్టారుగారు ఉన్నట్టుండి తనని పిలిచి తొందరగా పుస్తకాన్ని కొనుక్కురమ్మనటం గుర్తుకొచ్చింది. చెప్పి గంటయిపోయింది. వెళ్తే ఏమంటారు? భయమేసింది.

మాష్టారు తననెప్పుడూ కేకలు వెయ్యలేదు. కొట్టలేదు. కమలమ్మగారు కూడా 'కాశీ' అన్న పిలుపు తప్ప ఇంకేమీ అనరు. సూటిగా కాశీని చూసి, అతను బెరుకుగా కళ్ళు కదిపితే నవ్వుతారు. చాలు. మరి ఇక ఎప్పటికీ ఆ తప్పు పని చెయ్యలేడు కాశీ. ఆ కళ్ళని అంత సూటిగా చూడటం ఎంత కష్టమో ఒకటి రెండుసార్లు తెల్సునతనికి. ఆ తర్వాత మరెప్పుడూ తప్పుపని చెయ్యలేదు. పల్లెటూరిలో అమ్మ తనని కొట్టడం బాగా గుర్తుంది. కొట్టడమే కాక, ఎన్నో రకాలుగా తిట్టేది. కానీ మాస్టారి చూపులో ఉన్న బలం, కోపం, ఇంకెక్కడా కనిపించేది కాదు. కానీ నవ్వితే అంత చల్లదనం, అంత ఆప్యాయతా, తృప్తీ కనిపించేది.

మళ్ళీ ఇన్నాళ్ళ తర్వాత మాస్టారి కళ్ళనీ, కమలమ్మ గారి నిశ్శబ్దాన్నీ తలుచుకుంటే దిగులుతో గుండె వణికింది.

అపరాహ్నం దాటేవేళకి గుమ్మానికి ఆనుకు నిలబడ్డ కాశీని చూసి నిర్ఘాంతపోయారు మాష్టారుగారు. చేతిలో పుస్తకం లేకపోవడం, ముఖంలో పిరికితనం, బెరుకు చూసి విషయం చాలా వరకూ అర్థమయింది. ఇంకా ఆ సంగతి ఎత్తలేదు.

"వేళకి భోజనం చెయ్యకపోతే ఆరోగ్యం పాడవదా కాశీ. ఆ భోజనం చల్లారిపోయి నీకోసం ఎదురు చూస్తోంది" అని భుజం మీద చెయ్యేసి వంట ఇంటివేపు తీసుకెళ్ళారు.

సిగ్గుతో, బెంగతో మాట్లాడలేకపోయాడు కాశీ. ఎర్రబడిన కాశీ ముఖాన్ని చూసి కమలమ్మ నివ్వెరపోయింది.

"నా పుస్తకం కోసం ఇవాళ కాశీ ఊరంతా తిరిగి వచ్చాడు. త్వరగా భోజనం పెట్టుమరి" అనేసి వెళ్ళిపోయారు.

ఎంత ప్రయత్నించినా భోజనం నోటికి పట్టలేదు. తినమని కమలమ్మ రెండుసార్లు బలవంతం చేస్తే కళ్ళనీళ్ళ పర్యంతం అయింది.

సాయంకాలం బండిలో వస్తూంటే నిస్సహాయంగా గిరికతో చెప్పుకున్నాడు "నన్ను మాస్టరుగారు కొట్టలేదు" అని కళ్ళనీళ్ళు తుడుచుకుంటే గిరిక ఆశ్చర్యపోయింది.

"అదేమిటి?"

అంతా చెప్పాడు. విన్నాక ఫక్కున నవ్వేసింది గిరిక. "ఒక రూపాయికే కొడతారా మీ మాష్టరుగారు. రోజూ రూపాయి అయినా ఖర్చు చెయ్యకపోతే తిడతారు. నాన్నగారు" అంది.

"నేను రూపాయి ఇస్తాను, కావాలంటే" అంది.

"రూపాయి వద్దు, మాష్టారు నన్ను కోప్పడితే చాలు. నేనిక పోతాను" అని దారిలోనే బండి దిగి వచ్చేశాడు.

సాయంకాలం చీకటి పడేవరకూ కొబ్బరి చెట్టు నీడలో కూచున్నాడు. గాలికి ఇసిక వాలుగా లేచి ఇంటిముందు పచారు చేసింది. దూరంగా సముద్రం మీద మబ్బు రంగు పొరకమ్మినట్టు నీళ్ళు రంగుగా కనిపిస్తున్నాయి. కొబ్బరి కొమ్మల వెనుక సూర్యుడు మాయమయినప్పటి ఎరుపు ఏదో గాయం నుంచి కారే రక్తపు చారలాగ కనిపించి క్రమంగా జేగురయి నలుపుతో కలిసిపోయింది.

గుమ్మంలోకి వచ్చి 'కాశీ' అని చీకట్లోకి చూస్తూ కమలమ్మ అరిస్తే చుట్టూ చూసి 'ఇంత చీకటి పడిందా?' అని విస్తుపోయాడు కాశీ.

"నేనివాళ భోజనం చెయ్యనమ్మా" అని అందామనుకున్నాడు. కానీ అంటే మాష్టారు వస్తారని తెలుసు. అందుకని మాట్లాడకుండా లేచాడు. భోజనం దగ్గర మాష్టారు ఏమీ మాట్లాడలేదు. కనీసం తలయినా ఎత్తి చూడలేదు.

ఇక ఆగలేకపోయాడు కాశీ. మరోగంటకి గదిలో రాసుకుంటున్న మాష్టారి దగ్గరకి వచ్చి నిలబడ్డాడు. కాస్సేపటికి ఆయన తలెత్తి కళ్ళజోడులోంచి విచిత్రంగా చూస్తే –

"నన్నెందుకు కొట్టలేదు మాష్టారూ?" అనడిగాడు.

మరింత తెల్లబోయారు మాష్టరుగారు.

"ఏం జరిగింది, చెప్పు"

"పొద్దుట మీరిచ్చిన రూపాయి."

ఆ విషయం అప్పుడే మరిచి పోయారాయన. ఇప్పుడా ప్రసక్తి రాగనే ఫక్కున నవ్వేశారు. "దానికి ఇంత ఆలోచించాలా కాశీ. నీకు అవసరమేమో అనుకున్నాను. చదువేకాని, డబ్బు అవసరం నీకు ఉండదని ఎప్పుడూ ఇవ్వలేదు నీకు, నాది పొరపాటే. నన్నడిగితే మరో రూపాయి ఇచ్చేవాణ్ణి" అని మళ్ళీ పనిచూసుకుంటున్నారు.

"దానితో లాటరీ ఆడేను మాష్టరుగారూ. ఓడిపోయాను. అందుకని పుస్తకం తీసుకురాలేదు"

మాష్టరుగారు దానికి తలయెత్తలేదు. కానీ కలం కిందనే ఉంచేశారు.

ఉన్నట్టుండి ఒక్కసారి నేలన కూలబడిపోయాడు కాశీ "ఇలా మీరు మాట్టాడకపోతే నాకు భయమేస్తుంది మాష్టారూ నన్ను కొట్టండి కొట్టండి" అని తల నేలకేసి కొట్టుకున్నాడు ఆవేశంతో.

కమలమ్మ నిర్ఘాంతపోయి గుమ్మం దగ్గరికి వచ్చి నిలబడిపోయింది. కాశీని ప్రయత్నంతో ఆపేరు మాష్టరుగారు.

"ఒక్క రూపాయితో నువ్వు చాలా గొప్ప విషయాల్ని నేర్చుకున్నావు కాశీ. కొందరికి ఈ పాఠం నేర్చుకోవడానికి జీవితమే ఖర్చయిపోతుంది. తప్పు పనిని ఎట్లా దాచుకోలేమో అర్ధమయింది. ***ఒక మంచిపని చేయలేకపోవడం వల్ల నష్టం లేదు. కానీ ఒక తప్పుపని ఎంత చిన్నదయినా మనస్సుకి స్థిమితాన్ని ఎట్లా మిగలనివ్వదో అర్ధమయింది నీకు. అది చాలు***"

"మరెప్పుడూ నేనిట్లాంటి పని చెయ్యను మాస్టారూ"

అతని తల నిమిరి నవ్వారు మాష్టరుగారు.

"ఇక చెయ్యలేవు కాశీ నాకు తెలుసు" అన్నాడు.

అప్పటికి కాశీ మనస్సుకి స్వాస్థ్యం లభించింది.

●●●

డాక్టరుగారు కాశీమీద ఎన్నడూ శ్రద్ధకానీ, ఆసక్తి గానీ ప్రకటించలేదు అలా ప్రకటించడం తన హోదాకీ, గౌరవానికీ తక్కువనుకున్నారు.

"నాకు నీమీద అభిమానం లేదు. కానీ మా అమ్మాయి దగ్గర సానుభూతిని తమాషాగా కొట్టేశావు" అన్నారు ఓసారి ఏదో మాట్లాడుతూ.

కాశీ ఇవన్నీ ఆలోచించలేదు. ఇంత ఆలోచించవలసిన పనిలేదని మాస్టారు చెప్పి ఉంటారు. ***"ధనవంతుడికి అజీర్ణం చేసినప్పుడల్లా ఎదుటివాడి తక్కువతనాన్ని గుర్తు తెచ్చుకుని దాన్ని తీర్చుకుంటుంటాడు. మనమేమీ అప్పుడు మాట్లాడకూడదు. ఆ రోగం తగ్గాక వాళ్ళు మళ్ళీ మామూలు మనుషులవుతారు. అప్పుడు మనలో ఉండే శక్తి కూడా మిగలదు వాళ్ళకి'*** అన్నారు మాస్టారుగారు.

కానీ, మరో రోజు కాశీ మనస్సుకు తగిలిన గాయాన్ని ఏ విధంగానూ తీర్చలేకపోయారు మాష్టరుగారు.

సాయంకాలం త్వరగా ఇంటికిపోవాలన్న రోజున మరీ ఆలస్యం చేసేది గిరిక. కాశీ మీద కోపం కాదది. అంత విసుగుదల చూడాలన్న చిలిపి ఉత్సాహం, నిర్లక్ష్యం ఆమెచేత అలా చేయించేది. ఆ రోజున సరిగ్గా అలాగే అయింది.

మాష్టారికి వంట్లో బాగులేదని ఇంటికి త్వరగా వెళ్ళాలన్నాడు కాశీ. 'ఏం వంట్లో బాగులేకపోతే నువ్వేమిటి బాగు చేస్తావు' అంది జడవిప్పి అల్లుకుంటూ. గుర్రబ్బండీ కుదుపు ఎక్కువయి రెండుసార్లు వెనకబద్దికి తలకొట్టుకుంది. నవ్వాడు కాశీ "నా మీద కోపాన్ని చూపడం మానేసి, కాస్సేపు గుర్రబ్బండిలో కూర్చున్న విషయం గుర్తుంచుకో" అన్నాడు. గిరికకు నిజంగానే కోపం వచ్చింది. బండి ఆపమని బండి దిగింది.

"నేను నడుస్తాను. నువ్వూ నడు" అంది ఉదాసీనంగా.

ఊరికినే ఆమె ఎంత కోపం తెచ్చుకుంటుందో అర్థమయింది కాశీకి. నవ్వొచ్చింది. "నిన్ను జట్కాబండిలో తీసుకు రమ్మని చెప్పారు డాక్టరుగారు. నువ్వు నడిస్తే నేను నడవవలసిన పనిలేదు" అన్నాడు.

ఏం చెప్పాలో, అతణ్ణి బండి ఎలా దింపాలో తోచక తల గోక్కుంది. ఆ ఓటమికి పెదాలు వణికి ఏడుపు వచ్చినంత పనయింది.

బండి ఆపించి, నాతో సరిగ్గా నడపాలంది అబ్రహాంని. అమ్మాయిగారి కోపాన్ని గౌరవించకపోతే ఎంత తప్పో పన్నెండేళ్ళ అనుభవం నేర్పింది అబ్రహాంకు. 'అలాగేనమ్మా' అన్నాడు.

ఆమె అడుగుల్తో అడుగులు వేయలేక గుర్రం తికమక పడుతోంది. తీరా ఇంటికి చేరేసరికి ఏడు దాటిపోయింది.

అప్పటికే డాక్టరు గారు అమ్మాయి గుర్రబ్బండి రావడం ఆలశ్యమయిందని చిందులు తొక్కుతున్నారు. లోపల్నుంచి మాంచ్ హంటర్‌ని తెప్పించి దానిని ఎవరిమీద ప్రయోగించాలో తెలీక అటూ ఇటూ తిప్పి రెండు ఫ్లవర్ వాజ్‌లు బ్రద్దలుకొట్టారు. నమ్రతతో, బితుకు బితుకులాడుతూ ఇద్దరు నౌకర్లు గాజుముక్కల్ని పోగుచేసే ప్రయత్నంలో నిమగ్నులయారు.

అమ్మాయికి స్వాగతం చెప్తూ కుక్కలు అరవడంతో, మరింత కోపాన్ని అభినయించి సగం ఇంగ్లీషులో, సగం తెలుగులో విసుక్కోవడం ప్రారంభించారు.

"ఈ గుర్రబ్బండి ఉత్త దండగని తెలుసునమ్మా. అయినా గుర్రం బ్రతికుంది కదా అని ఉంచాను. రేపట్నుంచీ నీకు కారే. చెప్పు కాడిలాక్ చాలా, ఫియట్ తెప్పించేదా? అన్నారు గిరిక ముఖంలోని కోపాన్ని ఒక విధంగా అర్థం చేసుకుని.

"గుర్రం బాగానే ఉంది నాన్నా. నాతో పంపిన మనుషులే బాగాలేరు. నేను బండి దిగినా కాశీ దిగడట. మీరు నడవమని చెప్పలేదుగా మరి?"

ఇప్పటికి అంతా అర్థమయిపోయింది. కాశీ నడవటానికి వ్యతిరేకించడం తన అభిజాత్యానికే దెబ్బ తగిలినట్టు కస్సుమన్నారు. నిజంగానే కోపంతో ముఖం ఎర్రబడింది.

గుమ్మం దగ్గర నిలబడ్డ కాశీని "ఏరా ఫూల్" అని పలకరించారు.

"మాష్టారికి జ్వరంగా ఉందండి. వెళ్ళాలి" అన్నాడు మెల్లగా. ఏం చేస్తున్నారో తెలీకుండా చేతిలో కొరడాని ఝుళిపించారు కాశీమీద. "ఇట్లాంటి ఇడియట్స్‌ని పోగుచేశాం గనకనే బంగళా ఇట్లా తగలడింది" అంటూ వాణ్ణి ఊపున బయటికి తోసి గేటు వేశారు. కుక్కల అరుపూ, డాక్టర్ గారి గొంతు ప్రతిధ్వని మధ్య కాశీ వేసిన కేక ఎవ్వరికీ వినిపించలేదు. ఇటు తిరిగితే గిరిక ముఖం వివర్ణమై ఉండడాన్ని గమనించారు డాక్టరుగారు. తండ్రి ఇంత చేస్తాడని తెలీని ఆమె ముఖం తెల్లబడిపోయింది. ఆమె అదురుపాటును గమనించి "వాడెక్కడికీ పోడమ్మా రేపు మళ్ళీ వస్తాడు చూడు" అన్నారు చెవిలో.

హంటర్ దెబ్బ కంటే, తలుపు విసురుతో తగలకూడని చోట కాశీకి దెబ్బ తగిలింది. గుమ్మం దాటి ఇంకా అడుగు వేయకుండా తలుపు ఉధృతంగా పడి కాలుమీద మోపుగా దెబ్బ తగిలింది. మరొక్క అడుగు వెయ్యలేక అలా మెట్ల మీదే కూర్చుండిపోయాడు.

ఆ చీకటిలో కూచుని ఇదంతా ఇంత హఠాత్తుగా ఎందుకు జరగాలో ఊహించలేక అతని మనస్సు పరిపరివిధాలా పోయింది. బయటికి వచ్చి గార్డెన్‌లో కూచుంటే కొంతసేపటికి డాక్టరుగారి కుక్కలు వచ్చి కాలంతా తడివి గాయం తగిలిన చోటు నాలికతో నాకడం ప్రారంభించాయి.

అంత దుఃఖంలోనూ నవ్వొచ్చింది కాశీకి. "ఈ మాత్రం బుద్ధివాళ్ళకు లేకపోయింది" అనుకున్నాడు.

●●●

మాష్టారుగారికి ఈ విషయం చెప్పకూడదనుకున్నాడు మొదట. కానీ ఇంటికి వచ్చేసరికి కాలంతా నొప్పిచేసింది. శరీరాన్ని కదపాలంటే నిస్త్రాణగా ఉంది. చీకటిలో అరుగుమీద కూచుంటే కమలమ్మ చూసి "భోజనం చేశావా కాశీ" అని అడిగితే, అప్పటికి భోజన విషయం గుర్తుకొచ్చింది. మనస్సంతా చికాకుగా ఉంది. 'చేశానమ్మా' అని అబద్ధం చెప్పాడు. అయినా ఈ జవాబు ఆమెకేం పాతది కాదు. చేశానని చెప్పి ఖాళీ కడుపుతో పడుకున్న ఎన్నో రాత్రులు ఆమెకు తెలుసు. పొద్దుట నీరసంగా కళ్ళిప్పితే, కాశీని చూసి కళ్ళనీళ్ళు పెట్టుకునేదామె. ఇక ఇప్పటి కంఠంలో వణుకు కాశీని నిముషంలో పట్టి ఇచ్చేసింది. లోపలికి వెళ్ళి దీపం తీసుకొచ్చి అతని ముఖానికి దగ్గరగా ఉంచి నవ్వింది. "ఎప్పుడూ నువ్వు చెప్పవు. కానీ భోజనం విషయం అబద్ధం చెపితే నాకు నవ్వొస్తుంది కాశీ నీ కళ్ళకి ఇంకా అబద్ధం చెప్పడం రాదు. త్వరగా పద" అంది. ఇక దుఃఖం ఆపుకోలేకపోయాడు. ఆమె దీపం తీసుకు అటు వెళ్ళాక ద్వారానికి తల ఆనించుకు అలా కూర్చుండిపోయాడు.

భోజనం చేశాక మేష్టారి గదిలోకి వెళ్తే గాయాన్ని చూస్తారేమోనని భయమేసింది. ఇవాళ ప్రార్ధన లేదు. చదువు లేదు. కమలమ్మ దీపాన్ని తెచ్చి తన దగ్గర ఉంచిపోతే గాలికి అటూ ఇటూ ఎగురుతున్న వెలుగుని చూస్తూ అలాగే పడుకున్నాడు.

ఏ రాత్రికో కాలు నొప్పిపెడితే చటుక్కున తెలివొచ్చింది. మాస్టరుగారు కూచుని కాలికి కట్టుకడుతున్నారు. కమలమ్మ దీపంతో ప్రక్కనే నిలబడ్డది.

"మాస్టరుగారూ!" అంటూ దిమ్మరపోయాడు.

మాష్టరుగారు తలెత్తలేదు. చలివేయకుండా రగ్గుని వంటినిండా కప్పుకుని జాగ్రత్తగా కట్టుకడుతున్నారు.

"ఇలా అయితే నేను నిన్ను బాగుచేయలేను కాశీ. ఆటలాడటం అంటే ఇలా గాయాలు తగిలించుకోవడం కాదు" అన్నారు.

ఆయనకు కోపం వచ్చిందని వెంటనే గుర్తుపట్టాడు. నాన్న చచ్చిపోయిన రోజూ, అమ్మ తనని తిడుతూ ఉత్తరం రాసిన రోజూ, మామయ్య తనని ఇక్కడికి పంపేసిన రోజూ ఒంటరితనానికి అర్థం తెలీలేదు. కానీ ఇవాళ తనమీద మాస్టరుగారికి కోపం వస్తే తననింకెవరూ ప్రపంచంలో ఆదరించలేరనిపించింది. అనిపించాక ఇంతవరకూ మనస్సులో ఆకట్టుకోగలిగిన దుఃఖం కట్టుతెగింది. గాయం బాధకంటే మనస్సు బాధ ఎక్కువయింది. "ఇప్పుడెలా ఉంది కాశీ" అంటోంది కమలమ్మ.

కళ్ళనీళ్ళు నిండాయి. వేడినీళ్ళతో గాయాన్ని కడిగి ప్లాస్టర్ అంటిస్తున్నారు మాస్టరుగారు. నుదుటిమీద ముత్యాల్లా చెమట పట్టి కళ్ళజోడు మీదికి జారుతోంది. కట్టుకట్టడం అయిపోయాక మెల్లగా అన్నాడు.

"నేను ఎక్కడా ఆటలు ఆడలేదు మాష్టారూ నిజం చెప్తున్నాను" అని.

ఈసారి మాస్టారుగారు తల ఎత్తలేదు.

"గిరికను త్వరగా ఇంటికి తీసుకురాలేదని డాక్టరు కొట్టారు. వీధిలోకి తరిమి తలుపు వేశారు. తలుపు మధ్య కాలుపడింది."

ఈ మాటలకి నివ్వెరపోయారు మాస్టరుగారు. ఓ పక్క దైన్యంతో, మరొక పక్క ఉద్విగ్నతతో ఆయన కళ్ళు మెరిశాయి. ''ఇది నిజమా కాశీ?'' అన్నారు. అంతలో లేచి నిలబడి ''సరే, ఇవాళ్టికి పడుకో. రేపట్నుంచీ ఇక అక్కడకు వెళ్ళనక్కరలేదులే'' అనేసి గది బయటికి వచ్చేశారు.

అంతవరకూ అతి ప్రయత్నం మీద ఆపుకున్న కళ్ళనీళ్ళు ఆగలేదు. మాస్టరుగారి భార్య గమనిస్తుందేమోనని లైటు ఆర్పేసి చీకటిలో స్తబ్దుగా ఉండిపోయాడు.

ఉదయాన్నే పనిగట్టుకుని డాక్టరుగారి దగ్గరికి కాశీని తీసుకుని వచ్చారు మాస్టరుగారు. ఎప్పుడూ చూడని వ్యక్తిని చూస్తూ స్పెన్సర్ సిగార్ని కాల్చడం మరిచిపోయారు డాక్టర్ గారు.

ఆ రోజు మాస్టరుగారికి ఒళ్ళు తెలీడంలేదు. కాశీ కాలుకు తగిలిన గాయాన్ని చూపించి ఒక్కటే మాట అన్నారు ఆ ఉద్రేకంలో ''మీరు మనుష్యుల్ని కన్నారు. కానీ కుక్కల్నే పెంచారు. ప్రపంచంలో చాలామంది బ్రతుకుతున్నారు. మీరొక్కరే కాదు. వాళ్ళ మంచిచెడ్డలు మీకు అక్కరలేకపోయినా, వారికి కావాలి. మీ లండన్ బ్రతుకు ఊహించుకుని ఇక్కడ బ్రతికేవాళ్ళ స్థిమితాన్ని పాడు చెయ్యకండి'' అనేసి వెంటనే వచ్చేశారు.

అనుకోకుండా జరిగిపోయిన ఈ ఉద్ధృతానికి వెంటనే తట్టుకోలేకపోయారు డాక్టరుగారు. ఏం జరిగిందో ఆకళింపుకు తెచ్చుకునేసరికి అప్పుడే మాస్టరుగారు వెళ్ళిపోయారు. 60 ఏళ్ళ అనుభవంలో డాక్టరుగారికి ఇలాంటి అనుభవం కొత్త. ఆయనకు తల తిరిగిపోయింది.

●●●

నాలుగురోజులు తిరక్కుండా అమ్మాయిని తీసుకుని డాక్టరుగారు ఇంటికి వస్తే మాస్టరుగారు ఆశ్చర్యపోయారు. అప్పటికి కాశీ రెండు రోజులుగా జ్వరంతో పడి ఉన్నాడు.

మెట్లెక్కి లోపలికి వస్తూనే మాస్టరుగారి రెండు చేతులూ పట్టుకుని అన్నారు. ''నేనేం చెడ్డవాణ్ణి కాదండీ. మంచితనం నాలోనూ ఉంది. కానీ దానిని ఎలా ప్రదర్శించాలో నా చదువూ, నా అనుభవం నేర్పలేదు. కత్తులు పెట్టి హృదయాల్ని కోశానేకానీ, వాటి మెత్తదనం అర్ధం కాలేదు నాకు. క్షమించండి'' అంటే మాస్టరుగారు కరిగి పోయారు.

కాశీ మంచం దగ్గరికి వచ్చి బరువైన శరీరాన్ని వంచి చెయ్యిపట్టుకు చూశాడు డాక్టరుగారు. ''డాక్టరుగారు కొట్టారన్న ఉదాసీనంతో నీకు జ్వరం వచ్చిందోయ్. అదేం లేదు. నేను మంచి వాణ్ణయిపోయాను. ఇక జ్వరం ఉండదులే'' అన్నారు నవ్వుతూ.

''ఇక మీ అమ్మాయితో గుర్రబ్బండిలో రాడట కాశీ'' అని చెప్పింది కమలమ్మ.

''అమ్మ! ఇది చాలా పెద్ద నష్టమేనే. పోనీ నువ్వు మా అమ్మయిని ఇక నుంచి ఇంటికి తీసుకురానక్కరలేదు. మా అమ్మాయే నిన్ను మా ఇంటికి తీసుకు వస్తూంటుంది'' అని ప్లీడరు పాయింటు వేశారు.

వెళ్తూ వెళ్తూ గిరిక మంచం మీదకు వంగి, రహస్యంగా ''జ్వరం తగ్గాక వస్తావు కదూ'' అంది.

కళ్ళు మూసుకునే తల ఊపాడు కాశీ.

చెట్లన్నీ చిగురించగానే వసంతం వచ్చిందని గుర్తుపట్టి పక్షులన్నీ గొంతులు సవరించుకున్నాయి. ఆకాశం కొత్త రంగులు రంగరించుకుని కొత్త జీవితానికి సిద్ధపడుతున్న మనస్సులాగా ఉంది.

ఆలోచనల్నీ, ఆవేశాల్నీ, పెంచుకోవడం తెలీని చిన్ని మనస్సులు అంతలోనే విశ్రాంతినీ, తృప్తినీ వెదుక్కున్నాయి. కాశీ, గిరిక కలిసి పోవడానికి ఎంతో కాలం పట్టలేదు.

వసంతం పుష్పించడం ముగించుకుని శలవు తీసుకునే సమయానికి వారి జీవితాలు పుష్పించడం ప్రారంభించినయి.

***

## *యౌవనంలో వేసంగి*

అయిదేళ్ళు గడిచాక పాత విషయాలు ఆలోచించు కొంటే అంతా కలలాగ కనిపించింది కాశీకి. అబ్బో ఎంత పెరిగాడు తను.

ఇన్నేళ్ళలో రెండుసార్లు మాత్రం ఇంటికి వెళ్ళి వచ్చాడు. చదువుమీదే దృష్టిని కేంద్రీకరించడం, భవిష్యత్తు కోసం చాలా వాటిని ఎలా వదులుకోవడమో - ఇవన్నీ క్రమంగా నేర్పారు మాస్టరుగారు. కానీ ఇదివరకంత శక్తిలేదు. వయస్సూ పెరిగాయాయనకు. అయినా ప్రతిసారీ ఇదివరకులాగ కాశీని చెప్పు చేతల్లో పెట్టే అవసరం కూడా లేదు. ఇప్పుడు మాస్టారి ఉద్యోగం కూడా పెరిగింది. దానితో పాటు బాధ్యతల బరువూ ఎక్కువయింది.

ఇప్పటికీ ఇంకా గిరికతో కాలేజీ నుంచి ఇంటికి నడవాల్సిన ఉద్యోగం తప్పలేదు. వయస్సు పెరిగే కొద్దీ డాక్టర్‌గారిలో ఉత్సాహం పెరుగుతూ వచ్చింది - 'ఇక్కడ సమ్మెల్తో, అల్లర్లతో, హాస్టల్ భోజనంతో గడవడం కష్టంగా ఉంద'ని చక్రవర్తి ఉత్తరం రాస్తే 'సుఖాన్ని ఖర్చుచేసి చదువు నేర్చుకోవలసినంత అవసరమేమీలేదు నీకు. వెంటనే వచ్చెయ్' అని డాక్టర్‌గారు ఉత్తరం రాశారు. అప్పటికి చదువు బెడద వదిలించుకుని ఒక్కసారి నిట్టూర్చి మొదటిసారీ చివరిసారీ చదువుకు సలాం చేసి బండి ఎక్కాడు చక్రవర్తి. ఇన్నాళ్ళూ తన కోసం కాక, తమ హోదా కోసం, నాన్నగారి కోసం చదివాడు. ఇప్పుడిక ఆ బాధలేదు. రైల్లో కూర్చుని నిట్టూర్చి "అందరికీ ఇట్లాంటి నాన్న ఉంటే ప్రపంచానికి రాజకీయ నాయకుల అవసరం ఉండేది కాదు. చదువులేని వారందరితో ప్రపంచం హాయిగా నడిచిపోయేది" అనుకున్నాడు.

కాశీ ఇన్నేళ్ళ తర్వాత స్వంతంగా జీవితం గడిపే ఆలోచనలు తెచ్చుకోవలసి వచ్చింది. ఇన్నాళ్ళ తర్వాత ఆలోచిస్తే విచిత్రంగా పదేళ్ళ క్రిందటే పల్లెటూరితో పాటు బీదతనాన్ని కూడా వదులుకు వచ్చేశాడనిపించింది. కానీ ఇంటికి వెళ్ళాక అక్కడ అమ్మా, తమ్ముళ్ళూ ఎంత బాధగా బ్రతుకుతున్నారో చూశాక పట్నంలోని తన మంచి బ్రతుక్కి సిగ్గేసింది. అప్పుడిక రెండు మూడు చోట్ల చిన్నపిల్లలకి ప్రైవేట్లు కుదుర్చుకున్నాడు. నెలకి కొంత డబ్బుని ఇంటికి పంపగలుగుతున్నాడు.

ఓసారి మామయ్య ఉత్తరం రాశాడు. "ఇక మాస్టరుగారిని బాధపెట్టడం మంచిదికాదు. ఆయన ఋణాన్ని ఎట్లాగూ తీర్చుకోలేవు నువ్వు. వేరే గది తీసుకో"

నిజమేననిపించింది. మరి రెండు రోజుల్లోనే గది చూసుకుని మాస్టరుగారికి చెపితే మొదట నిర్ఘాంతపోయారు.

"ఈ ఆలోచన ఎవరు చెప్పారు కాశీ? ఒంటరిగా బ్రతికితేనే కానీ, స్వతంత్రంగా బ్రతికినట్టుకాదని నాకింతవరకూ తెలీదే" అన్నారు.

"ఇలా వెళ్ళి మిమ్మల్ని బాధపెట్టున్నానంటే వెళ్ళను మాస్టారూ. మీరు నన్ను మనిషిని చేశారు. ఆ విషయాన్ని మరిచిపోయి వెళ్ళడంలేదు"

కాస్సేపు ఆలోచించి నిట్టూర్చారు. ముసలితనంలో ఆలోచించడాన్ని కూడా తగ్గించుకున్నారు.

"ఇన్ని సంవత్సరాలు నాతో బ్రతికాక, ఇవాళ ఏదో అవయవాన్ని పోగొట్టుకుంటున్నట్టుంది. అయిన నువ్వు చెప్పిందీ నిజమే. ప్రపంచంలో ఇంక చాలా చూడాలి నువ్వు. సరే వెళ్ళు" అన్నారు.

మర్నాడే గదికి మారాడు కాశీ.

●●●

కింగ్ జార్జి ఆసుపత్రి నుంచి ఇంకా మీదికి పోతే బీచ్ వేపు దిగే పల్లాల్లో ఓ పక్కకి వాలినట్టుగా, పది ఇళ్ళు మాత్రం ఉన్నాయి. అక్కడ బ్రతికే వాళ్ళంతా పెంకుటిళ్ళు కట్టుకోగలిగేంత ధనవంతులు కారు. అందువల్ల ఏ చిన్న గాలికయినా ఆ ఇళ్ళపై కప్పులు లేచిపోతుంటాయి. మృత్యువుకు సిద్ధపడ్డ రోగికిలాగ, ఈ ప్రమాదాలకు ఎదురు చూస్తూనే బ్రతుకుతారు అక్కడివాళ్ళు. అసలు అక్కడి వాళ్ళెవరూ బ్రతకరు, బ్రతుకుతున్నామనుకుంటారు.

కనుచూపు మేరలో పాతకాలపు ఔన్నత్యానికి చిహ్నంగా హవా మహల్ సగం శిథిలమయిన గోడలు, ప్రపంచంలో పాపాల్ని చూసి రోదిస్తూన్నట్టు సముద్రపు హోరు, ఎదురుగ్గా యుద్ధకాలపు సైనికుల కాల్పుల స్థావరం అంతా ఏదో చారిత్రకమైన దుర్గంలాగ ఉంటుందక్కడ.

ఆ పాకల్లో అయితే అద్దె చాలా తక్కువ. పాకలంటే మరీ నికృష్టంగా లేవు. పై కప్పు ప్రతీ ప్రమాదానికి సిద్ధపడుతున్నట్టు ఉంటున్నా లోపల చాలా ప్రశాంతంగా, శుభ్రంగా ఉంటుంది. కిటికీలోంచి సముద్రపు విశాలం, మనిషి అల్పత్వాన్ని గుర్తుచేస్తున్నట్టు ఆకాశపు అనంతత్వం తెలుస్తూంటుంది. పట్టణాల్లో నాగరికతను పెళ్ళిచేసుకుని బ్రతికే ప్రజల మధ్య గడపలేక ప్రశాంతత, సహజత్వం – ఇక్కడికి వచ్చి నిద్రపోనట్టు ఉంటుంది.

ఇక్కడికి వచ్చాక గిరికతో కాలేజీ నుంచి ఇంటికి వెళ్ళడం మానుకున్నాడు. ఊరు అక్కడికి చాలా దూరం. వెళ్ళాలంటే రానూ పోనూ అయిదుమైళ్ళ నడక. అదీకాక, ఇక్కడి నిశ్శబ్దాన్ని వదులుకు పోవాలనిపించేది కాదు.

ఓ రోజు అలాగే సముద్రం వేపు చూస్తో కూచుంటే హఠాత్తుగా తలుపు తెరుచుకుని ఎవరో అమ్మాయి అతని కాళ్ళదగ్గర పడింది. అంతవరకూ ఆ ప్రాంతాల్లో బ్రతికే ఎవరి సంగతీ పట్టించుకోలేదు కాశీ. ఇప్పుడీ అమ్మాయి ఇలా రాగానే నిర్ఘాంతపోయాడు.

వచ్చి, ఒక్క ఉదుటున కాళ్ళ మీద పడి ఏడుస్తోంది. ఎందుకంటే చెప్పదు. సాయంకాలపు వెలుగులో సగమే కనిపిస్తోంది ఆమె ముఖం. లేచి దీపం వెలిగించడానికి అవకాశం ఇవ్వడంలేదు. ఏడుస్తోంది.

ముఖం చూశాడు. భయం, పిరికితనం మధ్య ముఖమంతా చెమట పట్టి వణుకుతోంది, నీటిలో పడి ఒలిసిపోయిన లేత పువ్వులా! అంతలోనే నిస్సహాయంగా పడిపోయింది.

ఏం చేయాలో తెలీక చేతనా రహితంగా కూర్చుండిపోయాడు. ఇంతలో మరొకామె వెదుక్కుంటూ వచ్చిందక్కడికి. వయస్సు కంటే జీవితపు బరువు కృంగదీసి, శరీరాన్ని పుర్తిగా లొంగదీసుకున్నట్టు కనిపించింది. కానీ మనస్సుకింకా వయస్సు వచ్చినట్టులేదు. కోపంతో ముఖంలో వణుకులా, సగం చెరిగిన బొట్టూ, ప్రతీ కదలికలోనూ పగిలిపోయేంత శబ్దం చేసే గాజులూ – ఆమెను చూడగానే నివ్వెరపోయాడు కాశి.

అతణ్ణి ఆమె గమనించలేదు. "ఇక్కడికి వచ్చిదాగున్నావే లంజా? బ్రతకడం తెలికపోతే నిన్నెవరే ఆదుకుంటారు? ఇవాళ నా మాటో, నీమాటో నెగ్గాలి" అని జుత్తు పట్టుకుని నేలమీద పడుకున్న పిల్లను అమాంతం ఎత్తి బరబరా ఈడ్చుకుని పోయింది. స్థబ్దుడయి, అచేతనంగా ఆ దృశ్యాన్ని చూస్తూండిపోయాడు. సిగ్గు ఉద్విగ్నతతో అతని ముఖం వివర్ణపోయింది. ఆమె అకారణమైన క్రోధానికీ, దుర్మార్గానికి కారణం తెలీకపోయినా ఏ పెద్ద నేరానికయినా అంత అసభ్యమయిన శిక్ష వెయ్యనక్కరలేదనిపించింది. జాలితో హృదయమంతా కలత పెట్టినట్టయింది.

●●●

మర్నాడు ఆ విషయాన్ని గురించే ఆలోచిస్తూ కూచున్నాడు. సాయంకాలపు ఎర్రదనం పడమటి ఆకాశాన్ని పట్టుకు వదలలేక దూరాన కొద్దిగా సముద్రపు నీలంలో కలిసిపోతోంది. జీవితాన్ని జ్ఞాపకాలలాగ చీకటిని పొదుగుకోలేని ఆకాశం వెలుగు కోసం దిగులు పడినట్టుంది.

ఏదో శబ్దమయితే ఇటు తిరిగాడు. టేబులు మీద ఉన్న దీపం నీడ గుమ్మం దగ్గర పల్చబడింది. గోడకి చేరబడి నిల్చుని చోద్యం చూస్తోంది గిరిక.

ఆశ్చర్యపోయాడు.

లేచి కుర్చీ ముందుకు తీసుకు రాబోతే "నాకంత ఆతిథ్యమేమీ వద్దులే - ఇక్కడ మనుషులు బ్రతగ్గలరా అని ఆలోచిస్తున్నాను" అంది.

వయస్సుతో పాటు అహంకారం, అందం పాలు పెరిగి ప్రపంచంలో ఆ ఒక్క గుణానికే, ఆ ఒక్క సంపదవల్లే బ్రతికున్నంత హుందాతనం ఆ కళ్ళల్లో తెచ్చుకుంది గిరిక. శరీరపు వంపులు ఏవో అనుభవాలమీద హామీ ఇస్తున్నట్టు పెదాలను పదునుగా, ఆయుధాలను చేసుకుని.

"మీలా బ్రతకడం నాకు సాధ్యం కాదు"

"పోనీ ఈ పర్ణశాలలో నీకు విశ్రాంతి దొరుకుతోందిగా - నాకూ కొంచెం చోటియ్యి. నేనూ ఇలా బ్రతగ్గలనేమో చూస్తాను."

ఆ మాటకు తెల్లబోయి ఇటు తిరిగితే "భయపడకులే. ఇప్పుడే నా సామన్లన్నీ తెచ్చుకు ఇక్కడ తిష్ఠ వెయ్యను" అంది. గిరిక నవ్వితే అతనికి భయం. కోపంలో కంటే నవ్వులో ఎన్నో రహస్యాల్ని దాచుకున్నట్టుంది ఎప్పుడూ.

"ఎందుకొచ్చాను?" అంటే, "సాయంకాలం నాతో రాకుండా ఇక్కడ ఏం చేస్తున్నావో చూడాలనిపించింది" అంది.

పదడుగుల వైశాల్యం మాత్రం ఉన్నగదిని ఒక్కసారి పరికించింది. చీకటిలో నేల పూర్తిగా కనిపించడంలేదు. ఏదో నేలమీద తన్నుకుని పడబోయి అతన్ని పట్టుకుంది.

"వస్తావా నాతో?" కిటికీ ఊచల దగ్గర వెలుగుకి అడ్డంగా నిలబడి అడిగింది.

ఆమె వెనుక నుంచి విసురుగా గాలి ముఖాన్ని తాకుతోంది.

"ఇప్పుడా!" అన్నాడు.

"ఏం? ఏదైనా పని ఉందా??"

"ఏం లేదు. ఇప్పుడు రాలేను అంత దూరం"

ఆ మాటకు కోపం వచ్చింది. చటుక్కున లేచి "నాన్నగారికి జ్వరం వచ్చిందట. నువ్వు వస్తే తగ్గిపోతుందంటున్నారు. వస్తే రమ్మన్నారు. నిన్ను ఇప్పుడు నాన్నగారు కూడా బలవంత పెట్టలేరు. అది నీకూ తెలుసు"

వెళ్ళబోతే - లేచి "సరే పద" అన్నాడు.

బట్టలు వేసుకుంటూంటే మళ్ళీ అడిగింది. "ఇక్కడేం సుఖం నీకు - వచ్చెయ్యకూడదూ ఊర్లోకి" -

ఆమెకి వినిపించుకుండా నవ్వాడు. ఆ నిశ్శబ్దంలోంచే అర్థాన్ని వెదుక్కుని నిట్టూర్చింది గిరిక.

గుమ్మం దాటబోతూంటే స్థంభాన్నానుకుని కూచుని ఏడుస్తూ ఆ అమ్మాయి కనిపించింది. ఆ అమ్మాయే.

"ఎవరు?" అని కాశీ పిలిచి, అంతలో ఏదో అనుమానం తోచి లోపలికి తొందరగా వెళ్ళి దీపం తెచ్చాడు. అవును ఆ అమ్మాయే. ఆ కళ్ళల్లో మెత్తదనం - దుఃఖం నిస్సహాయత - అంతా గుర్తే తనకి.

"నువ్వు మళ్ళీ రావనుకున్నాను" అని గొణుక్కుంటే నిర్విణ్ణురాలయి వింటూ నిలబడింది గిరిక.

"మీరే రక్షించాలి బాబూ!" అంటోందా అమ్మాయి ఏడుపు మధ్య.

"ఛ అదేమిటి అలా ఏడుస్తావ్? లే ఎందుకు?"

"మా అమ్మ చంపేస్తుంది. ఇవాళ బ్రతికితే ఇంక పరవాలేదు" - మాట బోధపరచుకోకుండా ఏడుస్తోంది.

ఆ బ్రతకడానికి అర్థం ఏమిటో, ఇప్పుడామె ఎలా బ్రతకడంలేదో అర్థం కాలేదు ఇద్దరికీ. ముఖాన్ని రెండు చేతుల్తో కప్పుకుని ఏడుస్తోంది.

ఉన్నట్టుండి తలెత్తి నిస్సహాయంగా గిరికను చూసింది. గుమ్మాన్ని ఆనుకుని నిశ్శబ్దంగా నిలబడింది గిరిక "మీరైనా చెప్పండమ్మా బాబుకి" అంది.

ఏదో అపస్మారకంలో లాగా నిర్లిప్తుడై నిలబడిపోయాడు కాశీ.

గిరిక కదిలి "రక్షించు, పాపం, అడుగుతోందిగా!" అంది. కంఠంలో జాలిలేదు. ఆ అమ్మాయిని గురించి ఆలోచన మనస్సు వరకూ పోనప్పటికి నిర్లక్ష్యం, హేళన కంఠంలో కనిపించి సిగ్గుతో కృంగిపోయాడు.

పట్టుదల, ఉదాసీనత కలిగించింది.

"నేను బయటికి పోతున్నాను. ఇప్పుడెలా?" అయిష్టత కంటే కంఠంలో నిస్సహాయత కనిపించేసరికి - ఆపిల్ల కళ్ళు ఆశతో మెరిశాయి.

"వెళ్ళకపోతే రక్షించేవాడివేగా?" పకపక నవ్వుతోంది గిరిక.

ఈసారి కాశీ కాళ్ళకి చుట్టుకుంది.

"రెండు రోజులు తిండి లేకపోయినా బ్రతగ్గలను బాబూ - ఈ బాధ మీకు చెప్పలేను. ఇవాళ రాత్రి అమ్మకి దొరికిపోతే - బ్రతికినా చచ్చినట్టే. నన్ను గదిలో పడేసి తాళం వేసి పొండి"

మంత్ర ముగ్ధుడిలాగ ఉండిపోయాడు. గిరిక ఇంకా నిర్లక్ష్యంగానే ఉంది. ఉన్నట్టుండి "అయితే లోపలికి వెళ్ళి నేలమీద పడుకో" అంది. ఒక్కసారి అతని మొహం చూసి ఆ పిల్ల లోపలికి చటుక్కున నడిచింది. తలుపుకు గిరికే తాళం వేస్తూ "ఇదిగో, నీ పేరేమిటి?" అని అడిగింది.

"పన్నా"

తలుపు తాళం వేసి వచ్చి, అలాగే చైతన్యం ఉడిగి నిలబడిన కాశీ జేబులో తాళం చెవి పడేసి, అతను ఇంక అలాగే నిలబడితే నవ్వింది. "నిన్నిక నడిపించాలి కాబోలు"

కొంచెం దూరం వెళ్ళాక ఎలక్ట్రిక్ దీపం వెలుగు అతని ముఖం మీద పడ్డాక, అతని ముఖంలో ప్రేతకళ పడడాన్ని గమనించి మనస్సులో నవ్వుకుంది.

"నిన్నిక ఈ ప్రాంతాన్ని వదిలి రమ్మని అడగనులే. నాదేతప్పు. అయితే ఇందుకేనా పని ఉందన్నావ్?"

అప్రయత్నంగా జరిగిపోయిన ఈ సంఘటనకు మనస్సు వికలమయ్యింది..

ఈ మాటల్తో మనస్సు మరీ బాధాకులితమయింది. చటుక్కున ఇటు తిరిగి "నన్నిప్పుడేం అడక్కు. ఏమీ ఆలోచించలేకపోతున్నాను నేను" అని కాశీ కటువుగా అంటే మొదటిసారి అతని నిర్లక్ష్యాన్ని, హేళననీ చూసి తెల్లబోయింది గిరిక.

ఇంటికి వస్తే తోటలో కూచుని కుక్కతో ఇంగ్లీషు మాట్లాడుతున్నారు డాక్టరుగారు. కాశీని చూస్తూ నవ్వుతూ పలకరించారు.

''ఒక అబద్ధం చెప్పి కాశీని లాక్కొచ్చాను నాన్నా'' అంది గిరిక.

''ఒకటి చాలదమ్మా - పది అబద్ధాలయినా చెప్పి కాశీతో మాట్లాడే అనుభవాన్ని కొనుక్కోవచ్చు. చెప్పినా అబద్ధం హోదా చెడకూడదని నా ఉద్దేశం'' అని నవ్వుతూ కుక్కని సలహా అడిగారు. డాక్టర్‌గారి హాస్యానికి నవ్వడం తెలీక లూసీ బిస్కట్ కోసం కుర్చీ వెదుక్కొంది.

''మీకు జ్వరంగా ఉందట'' అని కాశీ అంటే.

మొదట తెల్లబోయి విరగబడి నవ్వారు డాక్టర్‌గారు. ''నాకు ఒక్కసారే జ్వరం తగిలిందోయ్. కొరియాలో ఉండేటప్పుడు. ఆ తర్వాత మొదటిసారీ, చివరిసారీ జ్వరం నాకు విడాకులిచ్చింది. డాక్టర్లకు జ్వరం వచ్చిందన్నా, రాజకీయ నాయకులకు జీవితం మీద విరక్తి పుట్టిందన్నా నమ్మకు. చాలా మంచి అబద్ధం చెప్పావమ్మా - అందుకని నీకీ సాయంకాలం పూర్తిగా శలవిస్తున్నాను, పదవోయ్ కాశీ, నిజంగానే నీతో పని ఉంది నాకు'

గిరిక నివ్వెరపోయింది. ''అదేమిటి నాన్నా! నేను కాశీని తీసుకొస్తే మీరు తీసుకుపోతున్నారు'' అని ఫిర్యాదు చేసింది.

రెండుసార్లు కుర్చీలోంచి లేవబోయి లేవలేక రొప్పుతున్నారు. ''అది జీవితానికి గొప్ప ఎగ్జాంపుల్ అమ్మా - నీకు కావలసిందెప్పుడూ అనుకున్నప్పుడు దొరకదు. అయితే కాశీ ఇవాళ సాయంకాలం నీతో ఉంటే చాలా? లేకపోతే ఎప్పుడూ నీ దగ్గరే ఉండేటట్టు చేసేదా?''

ఆ మాటకి ఇద్దరూ ఉలిక్కిపడ్డారు. అంతకంటే గిరిక గాభరాపడి ''పో నాన్నా - నీ మాటలెప్పుడూ సగం అర్థం కావు. నా ప్రోగ్రాం అంతా పాడుచేశావు - నాకు కాశీవద్దు. నీ హాస్యం వద్దు'' అంటూ వెళ్ళిపోయింది.

తృప్తిగా నవ్వుకుని ఇటు తిరిగితే ఇంకా మౌనంగా నిలబడే ఉన్నాడు కాశీ.

''అమ్మాయి కోపం చూసినప్పుడల్లా మా ఆవిడ జ్ఞాపకం వస్తుందోయ్. అదేమిటోయ్ అలా నిర్ఘాంతపోతున్నావ్? పెళ్ళి నీకు కాదులే, అమ్మాయికి. మాట్లాడదాం పద''

ఇంతలో డ్రైవరు వచ్చాడు. ''మీరు కారు కావాలన్నారని అమ్మాయిగారు చెప్పారండి. సిద్ధం చేశాను'' అన్నాడు.

ఇక నవ్వు ఆపుకోలేకపోయారు డాక్టర్‌గారు. చూశావోయ్ పైకి సిగ్గుపడతారే కానీ ఆడవాళ్ళకు పెళ్ళిమీద ఆసక్తిపోదు. డాక్టరుకు రోగాలలాగే ఆడవాళ్ళకి పెళ్ళి సామాన్యమయిపోతుంది. భోజనం చెయ్యడం, నిద్రలాగ'' అని డ్రైవరు వైపు తిరిగి ''ఇవాళ కారు వద్దులే. జట్కా బండిలో వెళ్తాం. గుర్రానికి పనిలేక సోమరిగా పూల మొక్కల్నిమేస్తోంది'' అన్నారు.

ఇంకా సిగ్గుపడుతూ కాశీ నిలబడిపోతే ''సిగ్గులో మా అమ్మాయికి, నీకూ పోటీ పెడితే నువ్వే గెలుస్తావ్ - నీ పెళ్ళిని గురించి మాట్లాడనులే బండి ఎక్కు'' అన్నారు.

''నీ ఇష్టం వచ్చిన చోటుకు తీసుకెళ్ళు. ఎక్కడికి వెళ్ళాలని మమ్మల్ని అడగనక్కరలేదు'' అని బండి వాడికి చెప్పి ఇటు తిరిగి కూర్చున్నారు.

కాస్సేపాగి ''నిన్నారోజు కొట్టడం గుర్తుందా?''

ఆశ్చర్యపోయాడు. ''ఏ రోజు?''

''ఆరేళ్ళ కిందట - అమ్మాయిని త్వరగా ఇంటికి తీసుకురాలేదని''

బండి గతుకుల్లో పడి లేస్తూ బాధపెట్టోంది. ''గుర్తుంది'' అన్నాడు కాశీ మెల్లిగా.

''ఆ సంఘటన నా మంచికే జరిగిందనిపిస్తుందోయ్. ఆ రోజు ఓ మంచి వ్యక్తిని చూశాను - మాస్టరుగారు. ఆయన దగ్గర పది సంవత్సరాలుండి నువ్వెంత బాగుపడ్డావో, నేను ఒక రోజులో అంత బాగుపడ్డాను. డబ్బుతో కాదు, మంచితనంలో ఎంత బలం ఉందో ఆ రోజే చూశాను. నేను చెడ్డవాణ్ణేమీ కాదు. ఆనాడే చెప్పానామాట'' అని నల్లబడుతున్న ఆకాశం వేపు చూస్తూ ఏదో ఆలోచిస్తూ అంతలో ఆగిపోయారు డాక్టరుగారు

ఈ సంభాషణకు ప్రారంభమేమిటో, ముగింపేమిటో తెలీక సందిగ్ధంలో ఉండిపోయాడు కాశీ.

అంతలో కాశీ భుజం తట్టి, ''సరేలే ఆ విషయాలకేం? అమ్మాయికి ఇప్పట్లో పెళ్ళి చేయడం అవసరమంటావా కాదా?''

ఈ ప్రశ్నకు పూర్తిగా అప్రతిభుడయాడు కాశీ. ఏదో తడుపుకుని జవాబు చెప్పేలోగానే డాక్టర్‌గారే స్వయంగా జవాబు చెప్పుకున్నారు. ''అయినా నువ్వు మాత్రం ఏం జవాబు చెప్పగలవులే. ప్రశ్న ఇంకో విధంగా అడుగుతాను చూడు. ఆవిడ పోయినా ఇంత బాధ పడలేదు. చక్రం గాడికి ఇల్లేం పట్టదు. ఇక గిరికను మరొక ఇంటికి పంపేస్తే ఈ బెంగతో చచ్చిపోతానేమోనని భయం.''

కాస్త ఆగి చుట్ట కోసం జేబులు తడుపుకున్నారు. ఇన్నాళ్ళ తర్వాత డాక్టరుగారు ఇంత స్పష్టంగా మనస్సు విప్పి ఎందుకు చెపుతున్నారో అర్థం కాలేదు.

***బాగా కష్టాల్లో మునిగిపోయి, ఆలోచనల భారాన్ని మోయలేని సమయంలో ఎవరో నేస్తాన్ని వెదుక్కొంటుంది మనస్సు. మంచికి గానీ, చెడుకి గానీ - ఆ సంఘంలో మరొకరి సలహా మనస్సు మీద పనిచేసినట్టు ఇంకేదీ చెయ్యదు.***

డాక్టర్ గారి నిస్సహాయ స్థితికి జాలి కలిగింది.

''గిరిక పైకి అలా కనిపిస్తుందేగానీ, నువ్వు మా ఇంటికి రానంటే ఇంటికొచ్చి గంటసేపు ఏడ్చేది తెలుసా?''

ఏమీ అనలేదు కాశీ.

''తెలుసు'' అని మాత్రం అన్నాడు.

ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తూ ఎలా చెప్పాలో తెలీక తికమక పడుతూండడం స్పష్టంగా తెలిసింది కాశీకి.

దూరంగా సముద్రపు హోరు తెలుస్తోంది. ఉన్నట్టుండి ఎలక్ట్రిక్ దీపం వెలుగులో బండి మలుపు తిప్పి ఆపాడు గంగులు.

''కాశీ బాబుగారింటికి వచ్చేశామండి'' అన్నాడు.

కోపంతో మండిపడ్డారు డాక్టర్ గారు ''మాట్లాడ వద్దంటే మాట్లాడతావేరా ఫూల్'' అని కాశీ వేపు తిరిగి నవ్వేసి ''ఎంతో చెప్దామని తీసుకు వచ్చానోయ్ నిన్ను. ఇక ఇవాళ నాకు చేతకాదు. కొంచెం నాటకానుభవం ఉన్నా బావుణ్ను. ఇంకెప్పుడన్నా చెప్తాలే'' అన్నారు బండికి చేరబడి.

కాశీ కిందికి దిగి నమస్కారం చేస్తే ''నువ్వు ఇల్లు మారావన్నారేకానీ ఎప్పుడూ చూడనేలేదు. పద నీ గది ఎలా ఉందో చూస్తాను'' అని దిగబోయారు.

హఠాత్తుగా ఓ విషయం గుర్తుకొచ్చి తలమీద పిడుగు పడ్డట్టనిపించింది కాశీకి. పన్నాను డాక్టరుగారు చూస్తే ఏమైనా అనుకోవచ్చు..

బండిలోంచి దిగుతున్న ఆయన్ని హఠాత్తుగా ఆపుతూ ''ఇప్పుడు వద్దు. దయచేసి ఆగిపోండి. నేనే ఓ రోజు వచ్చి స్వయంగా తీసుకువస్తాను. మీకు తెలీదు. బీదవాళ్ళ ఇళ్ళు అన్ని వేళలలోను చూడడానికి వీలుగా ఉండవు'' అంటే డాక్టరుగారు తెల్లబోయారు.

మళ్ళీ లోపలికి చేరబడి నడపమని ''ఇప్పటి కుర్రాళ్ళ మనస్సులో ఏముందో కనిపెట్టడం కష్టం'' అనుకున్నారు.

●●●

అప్పటికి తొమ్మిదయింది.

రూంలోకి వస్తే చలిలో వణుకుతూ గదిమధ్య కుప్పలా పడుకుని ఉంది పన్నా. తలుపు చప్పుడు కాగనే బెదురుగా చూస్తూ లేచి కూర్చుంది.

లోపలికి వచ్చి దీపం వెలిగిస్తే ఆ కాస్తపాటి వెలుగులో ప్రాణమంతా కళ్ళల్లోకి తెచ్చుకుని ఎదుటి వ్యక్తి మీద విశ్వాసంతో బ్రతికే వ్యక్తిని సంభ్రమంతో చూశాడు కాశీ.

అతన్ని అంత జాగ్రత్తగా ఎప్పుడూ చూడలేదామె. విచిత్రంగా ఏదో అద్భుతాన్నిలాగా చూస్తూ ఉండిపోయింది. కాస్సేపటికి మాటలు కూడ దీసుకుని "మీకు చాలా కష్టాన్ని కలిగించాను అన్నయ్యా" అంది.

ఆమె రక్షణ ఎంత అనుకోకుండా జరిగినా, ఆమె కళ్ళల్లో తృప్తి, ఎప్పుడో ధారాపాతంగా కారి చెక్కిళ్ళ మీద ఎండిపోయిన కన్నీటిని చూశాక ఈ సహాయానికి విచారమేం కలగలేదు కాశీకి. కానీ ఇదంతా నటనా? నిజంగా ఆమెకు కలిగిన అపాయం ఏమిటి?

కిటికీలోంచి చల్లగాలి విపరీతంగా వీస్తోంది. గుమ్మం దగ్గరగా అరుస్తున్న కీచురాయి చేతిమీదకు గెంతింది. దీపాన్ని దూలానికి ఉన్న తీగకు తగిలించి, వాలు కుర్చీలో కూచున్నాడు.

చలితో, భయంతో ఒళ్ళంతా కూడదీసుకుని నేల మీద సగం చీకటిలో కూర్చుని ఉంది పన్నా. అంత చీకటిలోనూ నేరేడు పండు రంగు చీరె, ఎర్రటి జాకెట్టు గుర్తు తెలుస్తోంది.

"నీ పేరేమిటన్నావ్?"

"పన్నా"

"నీకేం కష్టం వచ్చిందసలు?"

జవాబు ఎలా చెప్పాలో తెలీక నేలమీద వేలితో గీతలు పెట్టింది. గాలికి దీపం గెంతడం ప్రారంభించింది. మళ్ళీ కాస్త ఆగి తలెత్తి నవ్వేసింది. నివ్వెరపోయాడు కాశీ. మళ్ళీ ఏమనుకుందో ఏమో పూర్తిగా చీకటిలోకి వత్తిగిలి కూచుంది. ఒక నల్లటి ఆకారంగా తప్ప ఆమె ముఖం గుర్తు తెలియడం లేదిప్పుడు. కాస్త ఆగి "మనుషుల్ని ఎందుకు అమ్ముతారో తెలీదన్నయ్యా" అంది.

చివరి మాటను అనదంలో ఏమీ తడబడలేదామె. కానీ ఎంత ప్రయత్నించినా ఆమెను 'అన్నయ్య' అనవద్దని చెప్పలేకపోయాడు. ఆమె నిస్సహాయ స్థితికి, ఆమె పిరికితనాన్ని వదిలిపెట్టడానికి ఈ విధంగా ఒక సహాయాన్ని వెదుక్కునే ప్రయత్నమే ఆ పిలుపులో ఎక్కువగా కనిపించింది. కానీ ఈ వాక్యంలో మరేదో వింత భావం ద్యోతకమయేసరికి దిమ్మెరపోయాడు.

"మనుషుల్ని అమ్మడమేమిటి?"

బరువుగా ఊపిరి తీయడం చీకట్లో తెలుస్తోంది.

"మనుషుల్ని కాదు. శరీరాన్ని" ఈసారి స్పష్టంగా చెప్పింది.

ఆ మాట వినపడటంతోటే ఒక్కసారి ఒళ్ళంతా కంపించింది. అతని అదురుపాటును ఆమె గమనించినట్లుంది. అంత చీకటిలోనూ అస్పష్టంగా ఏదో ప్రయత్నంతో నవ్వుతోంది. క్షణకాలం ఏమీ మాట్లాడలేకపోయాడు. శరీరాన్ని మరొకరి దత్తం చేయటం ఎంత నరకమో ఈ 20 ఏళ్ళ అనుభవం చెప్పలేదు తనకి. కానీ ఆ ప్రళయాన్ని ఊహించవచ్చు. అయితే ఇప్పుడీ వ్యక్తి -

లేచి వెలుగు నీడల మధ్య పచార్లు ప్రారంభించాడు.

"నా మీద తప్పు అభిప్రాయం పెట్టుకోవద్దన్నయ్యా" అంది ఉండుండి. ఆ మాటలతో మళ్ళీ మనస్సుకు సంకెళ్ళు పడ్డాయి.

"లేదు లేదు నీ మీద నాకే అభిప్రాయం లేదు" అన్నాడు తొందరగా ఏవో ఆలోచనలనుంచి తేరుకుని. చుట్టూ గోడలు విరిగి పడి నాలుగు పక్కలనుంచీ ఉధృతంగా చల్లగాలులు తనని తాకుతున్నట్టు అనిపించింది.

అంతలో ఏదో కర్తవ్యం అతణ్ణి ఆపుజేసింది.

ఈ విరామం పన్నాకు భరించరానిదయి అతనికి తనమీద విశ్వాసం కలగలేదన్న ఆలోచన కంఠాన్ని రుద్దపరిచింది. నిశ్శబ్ధంగా ఆమె ఏడుస్తూండడాన్ని ఆశ్చర్యంగా చూస్తూ నిలబడిపోయాడు కాశీ.

"మళ్ళీ ఏడుస్తున్నావా?"

"నా మీద మీకు నమ్మకం కలగడం లేదన్నయ్యా - నేను మీకే కష్టం కలిగించడానికి రాలేదు. నన్ను పంపెయ్యండి" అంది.

గొంతు సవరించుకుని "నాకేం కష్టం లేదు పన్నా - అదికాదు. నువ్వు అన్నయ్యని నన్ను పిలిచినా ఎవరూ నమ్మరు. వయస్సు అలాంటిది. ఏమీ అనుకోకు. నీకిప్పుడేం ప్రమాదం లేదుకదా?"

"నాకేం ప్రమాదం?"

"ఇంటికి వెళితే?"

ఒక్కసారి తెల్లబోయి అతని ముఖం చూసి నవ్వింది. "ఇలా నాకు అలవాటే. కొంతసేపు సాధిస్తుంది. ఇంకా ఓపిక ఉంటే కొడుతుంది. కానీ ఇందాకటి ప్రమాదం లేదు. దెబ్బలకి నేను తట్టుకోగలను"

ఆ మాటలకి వణికిపోయాడు కాశీ. ఆమె మాట్లాడకుండా గుమ్మం వరకూ వచ్చింది. తలుపు సగం తెరిస్తే రొజ్జ గాలి ప్రవాహంలా లోపలికి వచ్చింది.

"చేతనయితే నిన్ను ఇక్కడే ఉంచెయ్యాలని ఉంది - కానీ నేనూ ఒంటరివాణ్ణి. బాగుండదు" అన్నాడు చీకటికి ఇసింటా నిలబడి.

నవ్వింది. "పరవాలేదన్నయ్యా. నాలాంటి మనిషి మీద ఎవరూ గౌరవాన్ని చూపించరు. నాకేం వద్దు. నన్ను నమ్మితే చాలు నువ్వు" వెళ్ళబోయి అంతలో ఆగి మళ్ళీ చెప్పింది. "చెప్పడం మరిచాను. నువ్వు వెళ్ళాక ఎవరో వచ్చారు నన్ను కిటికీలోంచి చూసి తెల్లబోయి, మీ గురుంచి అడిగారు. లేరంటే వెళ్ళిపోయారు"

ఉన్నట్టుండి ఆ విషయం వినేసరికి నిర్విణ్ణుడయిపోయాడు కాశీ.

"ఎవరొచ్చారు?"

"ఏమో తెలీదన్నయ్యా! బాగా ముసలాయన. కళ్ళజోడు పెట్టుకున్నారు. పక్కనెవరో ఆడమనిషి కూడా ఉన్నారు. ప్రతిసారీ 'అమ్మా' అంటూ పలకరిస్తారు. నెమ్మదిగా ఆగి ఆగి మాట్లాడతారు" వంట్లో నిస్త్రాణ కలిగి, జవం ఉడిగి కుర్చీమీద చతికిల పడిపోయాడు సిగ్గు, భయంతో శరీరమంతా ద్రవీభూత మయింది. సందేహంలేదు. మాష్టారే.

"నే వెళ్తానన్నయ్యా" అన్నమాట విన్పించలేదతనికి.

కాస్సేపటికి తలయెత్తి "ఈ విషయం ముందే చెప్పలేదేం?" అని ప్రశ్నిస్తే జవాబు చెప్పడానికి ఎవరూ కనిపించలేదక్కడ.

మనస్సును కొరికే వెయ్యి ఆలోచనలతో ఆ గది మధ్య ఒంటరిగా కూర్చుండిపోయాడు కాశీ.

**మర్నాడు ఉదయమే పనికట్టుకుని మాష్టారి దగ్గరికి వెళ్ళాడు.**

కమలమ్మ కనిపించింది. లోపలికి రాగానే "మాష్టారుగారు ఎక్కడ పిన్నీ?" అంటే తలెత్తింది ఆమె. స్వచ్ఛంగా, పవిత్రంగా ఉన్న ఆ ముఖం చూసి వణికిపోయాడు. సంజె వెలుగులో ఆమె నుదుటి బొట్టు అగ్ని శిఖలాగ కనిపించింది. గదివేపు చూపిందామె లోపలకు మెల్లగా వస్తే జపం చేసుకొంటూ మాస్టరుగారు కనిపించారు. పైకి వచ్చి గదిలో కూచున్నాడు.

ఇక్కడి నిశ్శబ్దమంతా ఏదో చేయని నేరానికి విధిస్తున్న శిక్షలాగా ఉంది.

మాస్టరుగారు వచ్చి ప్రసాదం ఇచ్చారు. ఏం మాట్లాడాలో తోచలేదు. ఆయన తండ్రి ఫోటోకి నమస్కారం చేసి వచ్చి కూచున్నారు. ఏం చెయ్యాలో తెలీక ఆయన నుదుటి గంధపు బొట్టు చూస్తూ కూచున్నాడు. కుర్చీలో కూర్చుని కాస్సేపు కళ్ళుమూసుకున్నారు. తనమీద విధిస్తున్న శిక్షను కఠినం చేస్తున్నట్లనిపించింది.

నిశ్శబ్దాన్నే కార్చిచ్చులాగ కాల్చేమౌనం.

కాస్సేపయాక అప్పటికి ముఖం ఎత్తి నవ్వారు. ఆ నవ్వు తనలో మలినాన్నీ, అనుమానాలను కాల్చేస్తున్నట్టుంది.

భగవద్గీతకు అట్టవేస్తూ ఇటువేపు చూడకుండానే మాట్లాడారు మాష్టరుగారు.

"మామయ్యకు అమ్మకు ఉత్తరం వ్రాశాను. కాశీ..! నిన్ను బాగుచెయ్యమని నీ మామయ్య నాకు బాధ్యత ఇచ్చాడు. కానీ పాడు చెయ్యడానికి కాదు, దానికి ప్రత్యేకంగా అనుమతి పొందడం కోసం రాశాను"

"ఘ్రాస్టారూ?" అన్నాడు తెల్లబోయి ఆ నిర్వికార పరమసమ్యమ గంభీర హృదయం మీద నిన్నటి సంఘటన తీసిన దెబ్బ ఎంత బలమయినదో ఆ నవ్వు బరువులో అర్ధమయింది. మాస్టారేం చెప్పినా ఆలోచించే చెప్పారు. ఆ మాటల్లో పొల్లు ఉండదు. ఇప్పుడీ మాటలు విన్నాక ప్రపంచంలో తన మనస్సుకు సంబంధించిన ఒక్క వ్యక్తీ దూరమయి పోతున్నట్టనిపించింది.

లేచి కిటికీవేపు తిరిగి నిలబడ్డారు. ఆయన ముఖం మీద ఎండపడి నీడ విశాలంగా గోడంతా పాకింది.

"నీ మనస్సుని బాగుపరిచే ప్రయత్నంలో దానికి కావలసిన వేమిటో ఆలోచించడం మరచిపోయాను" అని ఇటు తిరిగి "నువ్వు త్వరగా పెళ్ళి చేసుకోవాలి కాశీ" అన్నారు.

ఒక్కసారిగా కళ్ళనీళ్ళు తిరిగాయి కాశీకి. మాష్టరుగారు ఎంత ఆలోచించి చెపుతున్నా ఇది ఇచ్చిన సలహాకాదని అతనికి తెలుసు. తెలిసి మనస్ఫూర్తిగా మనసంతా కలచినట్టయింది. ఆ ఆదేశం ఏదో శిక్షలాగ, మాస్టారి ముఖం మీద స్పష్టంగా తెలుస్తోంది.

చివరికి గుండె దిటువు చేసుకు అన్నాడు "ఆ అమ్మాయిపేరు తప్ప నాకింకేం తెలీదు మాస్టారూ! మీ మాటకి ఎదురుచెప్పడం నేనింకా నేర్చుకోలేదు. పెళ్ళి చేసుకోమంటే అలాగే చేసుకుంటాను. కాని ఎవరిని పన్నానేనా?"

మొదట మాస్టారు కూడా తెల్లబోయారు ఏం చెప్పాలో తెలీక. ఒక జీవితమార్గాన్ని నిర్దేశించే ధైర్యం కోసం, సమర్ధత కోసం గుంజాటన పడుతూ పచార్లు చేశారు.

కాస్త శక్తిని పూరించుకు చెప్పాడు కాశీ.

"ఒక రాత్రి తలదాచుకోలేకపోతే జీవితమంతా పాడవుతుందని ఏడ్చింది ఆ అమ్మాయి. అంతవరకూ ఎప్పుడూ చూడలేదు నేను. డాక్టరుగారు రమ్మంటున్నారని గిరిక వచ్చింది. వెంటనే ఏం చెయ్యాలో తోచలేదు. నే తిరిగి వచ్చేవరకూ గదిలోనే ఉంటానంది. రావడంతోటే వెళ్ళిపోయింది. "

స్తబ్దులయి కూర్చుండిపోయారు మాస్టరుగారు. చాలాసేపటివరకు మాట్లాడలేదు. ఇంతవరకూ కూడబెట్టిన ఆలోచనల్ని ఒక్కసారి వదులుకోవడం తెలీక తికమకపడ్డారు. అయినా కాశీ అబద్ధం చెప్పడు. మనస్సులో చాలా ఘర్షణ పడుతున్నట్లు ముఖం ఎరుపుదనాన్ని బట్టి తెలిసింది. మళ్ళీ లేచి ఆ తత్తరపాటులో పచార్లు చేశారు.

కమలమ్మ పాలు తీసుకు వచ్చేవేళకి తల ఎత్తి "చాలా పొరపాటు జరిగిపోయింది కమలా? నిన్న నిన్న అక్కడినుంచి వచ్చాక కాశీని గురించి ఆలోచించకుండా, ఆ సంఘటన దుష్ఫలితాలను గురించే ఆలోచించాను. ఇప్పుడిక నువ్వు నన్ను క్షమించాలి కాశీ" అన్నారు.

ఆమెకిదేం అర్థం కాక తెల్లబోతే వెళ్ళి భుజం మీద చెయ్యి వేశారు. "నిన్నటి కాశీకి ఇవాళ్టి కాశీకి ఏం తేడాలేదు. మనలో మార్పుకి అతను తెల్లబోయాడు అంతే. కాశీ మనం అనుకున్నంత పాడయిపోలేదు. నువ్వు అదృష్టవంతురాలివి. మంచి కొడుకుని కనలేకపోయినా, మంచి కొడుకుని పెంచావు" అన్నారు.

కాశీ ఇంకా ఏదో ఆలోచిస్తూంటే "నిన్న రాత్రి లాంటి రాత్రి మరొకటి ఉండకూడదని ఎప్పుడూ అనుకుంటానోయ్. నిన్న రాత్రి నీ మీద ఆలోచనల్తో నా మనస్సెంత పాడయిందో చెప్పలేను. ఎప్పుడన్నా ఒక్కసారి నేను ఆ అమ్మాయితో మాట్లాడాలి" అని చేతికర్ర తీసుకుని కళ్ళజోడు కోసం వెదుక్కున్నారు.

చివరి వాక్యం ఎందుకన్నారో అర్థం కాక మళ్ళీ తెల్లబోయాడు కాశీ.

●●●

మరి నాలుగురోజులకి మామయ్య, అమ్మ దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది.

"మాష్టారిగారి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. నువ్వు బాగుపడతావని ధైర్యంగా రాశారు మాష్టరుగారు. నాకూ ఆ ధైర్యమే ఉంది. ఎప్పుడూ అమ్మనీ, తమ్ముళ్ళనీ మరిచిపోకు"

అమ్మ మరీ విడ్డూరంగా ఉత్తరం రాసింది.

"మమ్మల్ని ఆదరిస్తావనే ఆశతో ఇన్నాళ్ళూ అన్నయ్య పంచన బ్రతుకుతున్నాం. నిన్న ఉత్తరం చదివాక నా నడుం విరిగిపోయింది. నువ్వు ఇలా పాడయిపోతావనుకోలేదు"

●●●

రెండువారాల తర్వాత ఓ రోజు ఉదయమే లేచి చదువుకుంటున్న సమయంలో కిటికీ దగ్గర ఎవరో నిలబడ్డట్టు తోచింది కాశీకి.

ఇంకా చీకటి పూర్తిగా విడని ఆకాశపు వెలుగులో కిటికీ అవతల వ్యక్తిని గుర్తు పట్టలేకపోయాడు. నీలిరంగు చీరె అంచు మాత్రం తెలిసింది. తను తలయెత్తడం చూసి ఆమె పక్కకి తప్పుకుంది. ఇంత ఉదయమే ఎవరు వచ్చారా అనుకుని నిర్ఘాంతపోయాడు. పిలిస్తే గది తలుపు తీసుకు లోపలికి వచ్చింది పన్నా "నేను అన్నయ్యా" అంటూ. చేతిలో ఉన్న బిందె నుంచి జారే నీటితో కుడివేపంతా తడిసి ముద్దయింది. వంపుతో బిందెవంపు కలిసిపోయింది. అప్పుడే స్నానం చేసినట్టు తడిసి బరువెక్కిన చెక్కిళ్ళను కావలించుకున్న శిరోజాల నుంచి నీటిబొట్లు జారి వక్షం మీద మాయమవుతున్నాయి. ఆ చల్లదనాన్ని తట్టుకోలేక మధ్య మధ్య వణుకుతోంది. ముఖం మీంచి కారే నీటిని ఎడం చేత్తో తుడుచుకుంటోంది. లోపలికి వచ్చి అతని ముఖంలో ఆశ్చర్యాన్ని చూసి తనని తానే చూసుకుని నవ్వేసింది.

"తడిసిపోయాను స్నానం చేసి వచ్చేసరికి" అంది స్వాభావికంగా నవ్వుతూ.

ఆ నవ్వులో అమాయకత్వాన్ని గురించే ఇంకా ఆలోచిస్తున్నాడు. కాశీ ఒక్కసారిగా మళ్ళీ పాత జ్ఞాపకాలు గుర్తుకొచ్చి వణికాడు.

"ఎందుకొచ్చావ్?"

''అంతా నిలబడేనా అడగడం - కూర్చోమనకూడదూ?'' అంది. ఆ నాటి బెరుకుదనం ఇప్పటి వ్యక్తిలో లేదు. 'అన్నయ్య' అనే పిలుపుతో ఆ ఇంట్లో చాలా స్వతంత్రం వచ్చినట్టు ''అబ్బ! ఈ బిందెని మోస్తూ నిలబడలేను బాబూ!'' అని కిందకి దించి చాపని గది మధ్యగా పరిచి కూర్చోబోయింది. అంతలో అతని ముఖంలో సంశయాన్ని చూసి ''చాప తడిసిపోతుందేమో. తీసేసేదా?'' అని అడిగింది.

''ఫర్వాలేదు. కూచో'' అన్నాడు.

''నీళ్ళకు బయలుదేరానన్నయ్యా. నువ్వు చదువుకుంటూంటే విచిత్రంగా చూస్తూ నిలబడ్డాను'' అంది మోకాళ్ళ మీద తల ఆనించి చూస్తూ.

చాలా మంచితనం, చాలా పెద్ద సత్యం కళ్ళను మిరుమిట్లు గొలిపి హృదయాన్ని వణికించేట్టు ఆమె అమాయకత్వం, నిష్కాపట్యం, స్నేహపూర్వకంగా ఆమె చేసే పలకరింపూ అతన్ని నిర్విణ్ణుణ్ణి చేస్తున్నాయి.

''నువ్వు చదువుకో. నేనిలా కొంతసేపు కూర్చునిపోతాను'' అంది బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని.

కానీ ఔత్సుక్యం ఇంకా వీడలేదు. అలాగే చూస్తూ కూచున్నాడు.

''నేనిక్కడ కూచుంటే మీకు భయమా?''

ఇంకా మాట్లాడక పోవడం చూసి ఏదో తప్పు చేసినట్టు నిలబడి ''పోనీ వెళ్ళిపోయేదా''అంది గుమ్మాన్ని పట్టుకునే.

''ఆరోజు ఇక్కడికి ఎందుకు వచ్చావ్?'' అన్నాడు.

ఆమె ముఖం క్షణకాలం వివర్ణమయినట్టు గుర్తించాడు. ఏదో వేదనను దాచుకుందుకు ప్రయత్నిస్తోంది. అప్పుడే గదిలోకి వస్తున్న వెలుగు వేపు ముఖం తిప్పింది.

''ఏ రోజు?'' అంది అటు తిరిగే.

''ఇక్కడ ఉన్న రాత్రి''

మళ్ళీ ఆ కళ్ళల్లో దిగులు కనిపించింది. ఆనందార్ణవమంతా క్షణంలో మయమయింది.

''నేను చెప్పను. నన్నింకెప్పుడూ అడక్కు'' అని బిందె ఎత్తుకుంది.

వెళ్ళిపోతుందేమోనని ఆతృతగా లేచి ''ఉండు ఓసారి'' అన్నాడు.

మొదట దిగ్భ్రమతో ఆగిపోయి, అతనేం మాట్లాడలేకపోయేసరికి ఫక్కున నవ్వేసింది.

''నువ్వు చాలా అమాయకుడివన్నయ్యా నీకేం తెలియదు'' అంది.

***స్త్రీ ప్రేమకు రెండే ఫలితాలు. స్త్రీ గొప్పగా ప్రేమించనయినా ప్రేమించగలదు. గొప్పగా ద్వేషాన్నయినా చూపగలదు. గొప్పగా ప్రేమించే స్త్రీ ఎప్పుడూ గొప్పతనంలో ఔన్నత్యాన్ని చూపగలదు. స్త్రీలో ప్రేమకు అర్థం మాతృత్వం గానీ, జాలిగానీ అయి తీరుతుంది. ప్రేయసిగాని, తల్లిగాని, చెల్లెలు గాని ఎవరయినా సరే పురుషుని అసహాయతనీ, అశక్తతనీ ప్రేమించినట్టు మరి దేనినీ ప్రేమించదు.***

తలుపు దాటి అటు తిరిగి కిటికీ దగ్గరికి వచ్చి అతని స్థబ్ధతను చూసి నవ్వుకుంది.

''నాకు చదువు చెప్పవా అన్నయ్యా? ఎప్పటికీ నిన్ను మరిచిపోను'' అంది.

అప్పటికి తేరుకున్నాడు. ఇప్పటికి భయం, అనుమానాలు పోయాయి. ''ఏం చదువుతావు?''

''నువ్వు చెప్పిందంతా చదువుతాను''

మళ్ళీ కుర్చీలోకి వచ్చి కూచున్నాడు. ఇప్పుడు తూర్పు ఆకాశాన వెలుగు ఎక్కువయింది. కిటికీ దగ్గర పన్నా చిత్రకారుడి నలుపు గీతలా అవుపిస్తోంది.

"మీ అమ్మ కొట్టదూ మరి?"

"సాయంకాలం ఇంట్లో ఉండదు. చెప్తానంటే వస్తాను"

కాశి ఇంకా ఆలోచిస్తూంటే "నే పోతా బాబూ! రేపు ఆలోచించి చెప్పు" అంది.

ఆలోచించాడు కాశీ. తనమీద అపనింద ఎట్లాగూ పడింది. ***అపనింద అంటే వేరే ఏమీ లేదు. చాలామంది చెయ్యని పనిని ఒకడు చేస్తే ప్రపంచం విచిత్రంగా చూస్తుంది. ఆ పనిచేసిన వ్యక్తి గొప్పతనానికి ఓ అర్హతా పత్రం ఇస్తుంది. అదీ 'అపనింద' అంటే. దానిని పోగొట్టుకోడానికి ప్రయత్నిస్తే వారతన్ని పోగొట్టుకుంటారు. దానిని భరిస్తూ నవ్వుతూ తిరిగే వ్యక్తిని సంఘం 'వెలి' వేస్తుంది. అదీ అతని గొప్పతనానికి పరాకాష్ఠ అన్ని విధాలా.***

నిస్సంశయంగా పన్నాకు చదువు చెప్పాలనుకున్నాడు. మర్నాడు ఉదయమే నీళ్ళకు వెళ్తూ అడిగితే "సరే, చదువు చెప్తాను. రోజు విడిచి రోజు రా" అని చెప్పాడు నిర్ధారణగా.

"నువ్వు ఒప్పుకుంటావని నాకు తెల్సు అన్నయ్యా. నేనేం చెప్పినా కాదనలేవు నువ్వు" అంది తృప్తిగా.

అప్పటి కళ్ళలో కృతజ్ఞత, ఆర్ద్రత చూసి ఓ క్షణం స్తబ్దుడయాడు కాశీ.

●●●

డాక్టరుగారింటికి వెళితే చక్రవర్తి, గిరికలను ఎదురుగ్గా కూర్చోపెట్టుకుని ఆయన ఏదో మాట్లాడుతున్నారు.

మల్లెపువ్వులన్నీ బల్లమీద కుప్పగా పోసుకుని వాటినేం చెయ్యాలో తెలీనట్టు చూస్తోంది గిరిక. నీలిరంగు సూటు వేసుకుని ఖైదులో ఉంచిన పులిలాగ అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు చక్రవర్తి. ఏదో డాక్టరుగారు చెపుతున్నారు. ఇద్దరూ వింటున్నారు.

కాశీ రాగానే 'రావోయ్' అని పలకరించారే కానీ అందరికీ ఒకే విషయం గుర్తుకు రావడంతో ఎవ్వరికీ నోటి వెంట మాటలేదు. సూటిగా చూస్తూ కూర్చుండిపోయారు డాక్టరుగారు.

"పెళ్ళికోసం, పెళ్ళాం కోసం ఎవరూ ఏమీ ప్రయత్నించక్కరలేదండి. ఆ వయస్సు రాగానే అవన్నీ వాటంతటవే జరిగిపోతాయి" అని ఇటువేపు తిరిగి "పన్నాగారు ఎలా ఉన్నారు?" అన్నాడు చక్రవర్తి తండ్రి పక్కన కూచుంటూ.

ఒక్కసారిగా ఉలిక్కిపడి తలెత్తాడు కాశీ. గిరిక ముఖం కనిపించింది. ఇందాకటి నుంచీ తనవేపే చూస్తున్నట్టుంది. ఇప్పుడు తను చూడగానే అంది. "ఊఁ, చెప్పు. పన్నా అంటే నేను కాదు"

ఫక్కున నవ్వారు డాక్టరుగారు. అతను ఎంతకీ సమాధానం చెప్పకపోయేసరికి "పోనీలే అమ్మా, అలాంటి ప్రశ్నల్ని అడక్కూడదు మనం" అన్నారు.

"అడగకూడదని కాదు. అలాంటి ప్రశ్నలకు జవబులుండవసలు" అని సవరించాడు చక్రవర్తి.

ఉన్నట్టుండి లేచి లోపలికి వెళ్ళింది గిరిక. ఆమె వెళ్ళాక ఒక్కసారి డాక్టర్‌గారు ముందుకు వంగి "ఏం? మాట్లాడ్డంలేదేం?" అన్నారు రహస్యంగా.

అతని మాటల్లో ఔత్సుక్యం, ముఖంలో ఓదార్పు కన్పించి ఆశ్చర్యపోయాడు. అంతలో నవ్వారాయన సర్వజ్ఞుడిలాగా.

"కొరియాలో ఇట్లాంటి అనుభవం ఒకటి మిగిలిపోయిందోయ్. నువ్వేం చేస్తావ్. నీ వయస్సు అలాంటిది. 'పన్నా' బావుంటుందని విన్నాను."

చక్రవర్తి అందుకున్నాడు. "అబ్బే? అది మంచి రిమార్క్ కాదు - పన్నా బాగులేకపోయినా బాధలేదు. పన్నాను ప్రేమిస్తున్నానన్న ఆలోచన, ప్రేమించినప్పటి అనుభవం, ప్రేమించగలగడం ఒక వ్యక్తిత్వాన్నిస్తాయి - పెళ్ళికోసం కాక, పెళ్ళిచేసుకున్నామన్న సర్టిఫికెట్ కోసం ముందుకి వచ్చినట్టు"

ఏదో విషయాన్ని మనస్సులో ఉంచుకు వీరంతా ఈ సంభాషణ సాగిస్తున్నట్టు పసిగట్టి కృంగిపోయాడు.

గిరిక తానే స్వయంగా కాఫీ తీసుకుని వచ్చింది. తొందరపాటులో సరిగా తురుముకోని పువ్వులన్నీ దారిపొడుగునా వెన్నెల వానలాగ జారినాయి.

కాఫీ కప్పు టేబులు మీదుంచుతూండగా అడిగారు "ఏమమ్మా - పన్నా బాగుంటుంది కదూ?"

ఆ ప్రశ్నకు క్షణం విస్తుపోయి కాశీ ముఖం చూసింది. ఇంతసేపటికి మాట్లాడి "నేనేమీ చెప్పలేదు. నువ్వు చెప్పిన విషయాలే విన్నాను. ఇది కూడా చెప్పు" అన్నాడు. అతని కంఠంలో ఉదాసీనతను గమనించి భయపడింది.

చక్రవర్తి అందుకున్నాడు. "ఒక స్త్రీ అందం మీద మరొక స్త్రీని సాక్ష్యమివ్వమనడం అన్యాయం. అసమంజసం. హంతకుణ్ణి హత్య విషయమై చెప్పమన్నట్టు ఏ స్త్రీ మరొక స్త్రీ అందాన్నీ గొప్పతనాన్నీ ఒప్పుకోదు. ఇది సృష్టి రహస్యం. మనిషికేమీ exception కాదు. "

నిజంగానే అన్నయ్య మాటలు నవ్వు తెప్పించాయి గిరికకి. కుర్చీలో కూర్చుంటూ "నువ్వు చెప్పింది నిజమే అన్నయ్యా - మరొకరకయితే నేను ఒప్పుకోకపోయేదాన్ని. కానీ ఈ అమ్మాయి చాలా అందంగా కనిపిస్తుంది. ముఖ్యంగా కాశీకి. అవునా కాశీ?"

ఇక్కడి సంభాషణలు తను తప్ప మిగతా అందరి మధ్య జరగడం, ఏదో నాటకానికి సిద్ధపడుతున్నట్టూ ఆ నవ్వులూ, వాక్యాలూ అన్నీ చూశాక విసుగు కలిగించింది.

"నే లేస్తానండీ" అంటే,

"కూర్చోలే, పన్నా గురించి మాట్లాడం" అంది గిరిక.

ఒక్కసారి చీకటిలో చూసిన ఆ వ్యక్తి మీద ఎంత ఈర్ష్య, జుగుప్స కలుగుతున్నదో ఆ క్షణంలో గుర్తుపట్టాడు కాశీ. కోపం రాలేదు. ఆ మనస్సు చిన్నతనానికి నవ్వొచ్చింది. అయితే అందరూ అంతేనేమో. ఈ ఒక్క విషయం స్త్రీ మనస్సును కొలవడానికి చాలదు. అదే ఆలోచిస్తూ కూచున్నాడు.

"నేను చాలా పెద్దవాణ్ణి కాశీ. నిన్ను చాలా సంవత్సరాలు చూశాను. ఇప్పుడిప్పుడనిపిస్తోంది. నువ్వు పెళ్ళి చేసుకుంటే బాగుంటుందని. ఏమంటావ్?" అన్నారు.

ఇప్పటికి అసలు విషయానికి వచ్చినందుకు స్థిమితపడి నిట్టూర్చాడు కాశీ. ఈ సంభాషణ ఎక్కడికి దారి తీయగలదో ముందే తెలిసింది.

కానీ ముందుగా సమాధానం చెప్పినవాడు చక్రవర్తి. ఈ విషయం వింటూనే ఉప్పెనలాగా నవ్వాడు. అంతా విచిత్రంగా అతనివేపు చూస్తే "ఏమీలేదు. కాశీగారు ఎవరిని పెళ్ళి చేసుకుంటారా అని ఆలోచిస్తున్నాం. ***వివాహం అనే విషయాన్ని అందరు 'స్త్రీ 'లూ ఏకకంఠంతో అంగీకరిస్తారు. కానీ పురుషులంతా ఏక కంఠంతో తిరస్కరిస్తారు. ఎంచేతనంటే ఆ లాటరీలో మగాడు స్వేచ్ఛనీ, ఆడది సుఖాన్ని నష్టపోతారు***" అన్నాడు.

డాక్టరుగారు అతని మాటలకి విరగబడి నవ్వడం ప్రారంభించి, ఇంకా ఉధృతంగా నవ్వడం ఎలాగో తెలీక ఆయాసపడ్డారు.

కానీ కాశీ ఒక్కసారిగా తుళ్ళిపడ్డాడు. ఎంత నవ్వుతూ, ఎంత పరిహాసంతో ఆ మాటలు అన్నా ఓ నగ్నసత్యం అందులో గోచరించడంతో ఒక్క క్షణం ఆగి వెనక్కి తిరిగి చూడవలసి వచ్చింది. తలెత్తితే గిరిక కూడా అదే పరిస్థితిలో కనిపించింది. తెల్లబోయి ఆమె ముఖాన్ని చూశాక నవ్వొచ్చింది.

"ఛీ! అన్నయ్య ఎప్పుడూ ఇంతే. పెళ్ళంటే ఎవరికీ తెలియనట్లు మాట్లాడతాడు"

"అందులో ఆడదానికి తెలీకపోవడం ఏమిటి? ఆడదానికి జీవితంలో రెండే హాబీలు. పెళ్ళి చేసుకోవడం, పిల్లల్ని కనడం" కోపంతో ఆమె లేచిపోబోతే "సన్నివేశానికి టెంపో ఇచ్చానమ్మా స్త్రీ లేకపోతే పెళ్ళిమీద చర్చ బాగుండదు" అని చక్రవర్తి ఆమెని బలవంతంగా కూర్చోపెట్టాడు.

కాసేపాగి "కాశీ మీ ప్రశ్నకు సమాధానం చెప్పలేదు నాన్నా" అంది.

డాక్టరుగారు విస్తుపోయి చూశారు "ఏ ప్రశ్న?"

"మరో విధంగా చెప్పాలంటే గిరికకీ అతని జవాబు వినాలని ఉందన్నమాట.

"ఇక చెప్పండి కాశీనాథంగారూ. ఆడదాని ప్రశ్నను తప్పించుకుంటే చాలా పెద్ద శిక్షని అనుభవించవలసి వస్తుంది"

"ఏమిటి ప్రశ్న?"

"పెళ్ళిచేసుకోరా మీరు?"

"ఎవరిని? ఏన్నానా?"

ఈ మాటకి అంతా ఒకసారి స్తబ్దులయిపోయారు. అంతలో చటుక్కున డాక్టరుగారు అన్నారు. "పోనీ మా గిరికను చేసుకుంటావా?"

అప్రత్యాశితంగా వచ్చిన ప్రశ్నకు క్షణం నిలిచిపోయాడు కాశీణ అంతలో నవ్వేశాడు.

"మీరలా అడక్కూడదు. ఆమెని అడగాలి నన్ను చేసుకుంటుందా అని"

ఈ మాట విని పొంగిపోయాడు చక్రవర్తి. ఒక్కసారి అతని భుజం తట్టి "త్రీ ఛీర్స్ టు యు సార్. పురుషలోకమంతా గర్వించే మాట అన్నారు. అమ్మాయిని ఎన్నుకోమని మగాడికి ఛాన్సు ఇచ్చి చాలా ఆశాభంగాల్ని కొన్ని సంవత్సరాలుగా తెచ్చుకుంటున్నారు మనవాళ్ళు. ఆడదానికే మగవాడిని ఎన్నుకునే అవకాశమివ్వాలి. అదే వివాహానికి థీసిస్. ఇప్పుడు ప్రతి కక్షి ఏమిటి అంటుందో తేలనివ్వండి" అన్నాడు.

డాక్టరుగారు కూడా ప్రసన్నులయ్యారు. అమ్మాయి సరేనంటుందని ఆయన విశ్వాసం. "ఏమమ్మా?" అని ఇటు తిరగబోతే పియానోమీద తల ఆనించి దూరంగా కూచున్న గిరిక కనిపించింది. అక్కడికి ఎప్పుడు వెళ్ళిందో ఎవరూ గుర్తించలేదు. ఈ మాటలు ఆమెకు రుచించడం లేదని తెలిసి క్షణంలో ఖిన్నులయారు.

ఆమె అట్లా విముఖురాలవడంతో ఉత్సాహం వచ్చింది కాశీకి. చక్రవర్తివేపు ప్రయత్నపూర్వకంగా తిరిగి "చూశారా చక్రవర్తిగారూ, ***ఆడవాళ్ళు సాధారణంగా ఎక్కువ మాట్లాడరు. కానీ మాట్లడకుండానే మనస్సును చెప్పే భాష వాళ్ళ దగ్గర చాలా ఉంది"*** అని ఆమెకు వినిపించేలాగా అన్నాడు.

అప్పటికీ గిరిక కదలలేదు. డాక్టరుగారు క్రుద్ధులయి ఇంటి పై కప్పు కేసి చూస్తూ అచేతనంగా ఉండిపోయారు. ఆ ప్రశ్న ఎందుకడిగానా అని కించపడుతూ.

కాశీ ప్రయత్నించి, మాటలు కూడదీసుకుని ఒకేమాట అన్నాడు. "నేను మీ కుక్కల్తో బాటు పెరిగాను. వాటికంటే మరి కొంచెం గౌరవం తప్పిస్తే నాకు ఇక్కడ ఏమీ లభించలేదు. అంతకంటే మీరు చూపించలేరు కూడాను. ఇవాళ నన్నే గిరికకి ఇచ్చి పెళ్ళి చేస్తే మీకు చాల అవమానం కలుగుతుంది. ఇవాళ నా మీద అభిమానంతో ఆ పని చేసినా తరువాత చాలా సంవత్సరాలు దీనికి పశ్చాత్తాపపడక మానరు. గిరికా అంతే"

ఇది విని అందరూ నిర్ఘాంతపోయారు. ముఖ్యంగా డాక్టర్‌గారి ముఖం నల్లబడడం స్పష్టంగా తెలిసింది.

చక్రవర్తి కాశీ మాటల్ని సమర్థించాడు. "మీరు చెప్పింది నిజమేనండి. స్త్రీ మనిషిలో మంచితనాన్నీ, సంస్కారాన్నీ ప్రేమించదు. అందాన్నీ, హుందాతనాన్నీ, తనని తృప్తిపరచగల మొగాడి స్తోమతనీ ప్రేమిస్తుంది"

ఇంత విన్నాక డాక్టర్‌గారి మనస్సు బాధపడినా పాత విషయాలన్నీ గుర్తు తెచ్చుకుంటే అతని మాటల్లో అర్థం సరిగానే కనిపించింది. అయినా ఇన్నాళ్ళూ ఓ పెద్ద ఆశ గిరిక మనస్సులో మిగిలిపోవడం ఆయనకు బాగా తెలుసు. తనకూ అలాంటి సంశయం లేకపోలేదు. ఆ సంశయం ఇవాళ కూకటి వేళ్ళతో పెళ్ళగించుకుపోవడం ఆయనకు ఓ విధంగా ఉపశమనాన్నే కలిగించింది. ఒక్కసారి నిట్టూర్చి వంగి ఊరడింపుగా "అవునవునులే. నాకంతా అర్థమయింది" అని మాత్రం స్పష్టంగా అన్నారు.

కాశీ వెళ్తానని చెప్పి వెళ్ళడం ఆ తర్వాత ఎవరూ గమనించలేదు. ఏదో అపస్మారకంలో పడినట్టు, మూర్ఛనుంచి తేరుకున్నట్టు అంతా నిశ్చలంగా ఉండిపోయారు. ఈ ప్రశ్నల ఉధ్ధృత, ఎప్పుడు వచ్చిందో హఠాత్తుగా కమ్ముకున్న మబ్బు తెర ఒక్కసారిగా ఎట్లా చిన్నాభిన్నమయిందో ఆలోచిస్తే అందరికీ దిగ్భ్రమ కలిగించింది.

తీరా చూస్తే పియానోమీద తల ఆనించి గిరిక నిశ్శబ్దంగా ఏడుస్తోంది.

●●●

మర్నాడు సాయంకాలం పన్నాకు పాఠం చెప్పి, ఆమె వెళ్ళిపోయాక తలుపు వేసుకోవడానికి బయటికి వస్తే మెట్ల పక్క ఎవరో కూర్చున్నట్టనిపించి చకితుడయాడు కాశీ.

అప్పటికి బాగా చీకటిపడింది. గాలి నిట్టూరుస్తూ సాయంకాలపు చల్లదనం కోసం చెట్ల మధ్య పచార్లు చేస్తోంది.

"ఎవరూ?" అంటే మొదట పలకలేదు.

ఏదో అనుమానం తోచి లోపలికి వెళ్ళి కొవ్వొత్తి వెలిగించి బయటికి వస్తే గిరికను గుర్తించి నిర్ఘాంతపోయాడు.

మెట్లకు చేరబడి అపస్మారంలో మిగిలిపోయిన జీవితపు కలలాగు, ఏదో అందని వస్తువు కోసం తపస్సు చేస్తున్నట్లు నిశ్చలంగా కుచుంది.

"నువ్వా!" అంటే నవ్వింది.

"పన్నా వెళ్ళిపోయిందా?"

చీర కొంగు భుజం చుట్టూ తిప్పుకుని, అప్పుడే చలి ప్రారంభమయినట్టు ముడుచుకు కూచుంది.

"ఊఁ"

లేచి నిలబడి కుచ్చిళ్ళు సరిచేసుకుంటోంది. ఇంకా కొవ్వొత్తి పట్టుకుని, అలాగే దిగ్భ్రమతో నిలబడ్డ కాశీని చూసి నవ్వింది. కావాలని ముందుకు వంగి కొవ్వొత్తిని ఆర్పేస్తూ "ఏం చూస్తావు నన్ను? ఇన్నేళ్ళు కాక ఈ ఒక్కరోజు చూస్తే నాలో ఏం కనిపిస్తుంది?"

మాటల్లో నిర్వేదం, ఏదో అర్థాన్ని దాచే యత్నం చూసి విస్తుపోయాడు. ఏదో అడగబోయే లోపల ఆమే మాట్లాడింది.

"ఇంటివరకూ నాతో వస్తావా?"

"ఇంత రాత్రిలో ఇక్కడికెందుకొచ్చావు?"

స్థంభానికి చేరబడి చీకటిలోకి చూస్తోంది. ఎదురుగ్గా తాటితోపు మధ్య ఏదో దీపం వెలిగి ఆరుతున్నట్టు కనిపిస్తోంది. ఆ ప్రశ్నకు జవాబును కొన్ని గంటలుగా ఆలోచిస్తోంది ఆమె. చీకటిలో అతనివేపు తిరిగింది "ఏమో తెలీదు. నిన్న నువ్వు మా ఇంటికి వచ్చిన దగ్గర్నుంచీ నేనేం చేస్తున్నానో నాకేం తెలీడం లేదు. ఇక్కడ బాగా చలివేస్తోంది. ఏదన్నా దళసరి దుప్పటి ఉంటే నాకియ్యి. ఇప్పుడు నాతో ఇంటివరకూ వస్తావా?

"ఇంత రాత్రిలోనా!"

ఆ జవాబు విని ఆశ్చర్యం కలగలేదు. మళ్ళీ నవ్వొచ్చింది గిరికకి. తన జీవితాన్నంతా అరణంగా ఉంచి చేసిన ఈ ప్రయత్నం కూడా అతని స్వార్థాన్నీ, భయాన్నీ, జయించలేక పోయిందన్న ఆలోచన మరీ నవ్వు తెప్పించింది.

"జట్కా పంపించేశాను. నీ ఇష్టం. రాకపోతే మరో అమ్మాయి నీ గదిలో ఉందని తెలిసిపోతే ప్రమాదం. నన్నిక తప్పక పెళ్ళి చేసుకోవలసి వస్తుంది" కొవ్వొత్తి ఆర్పేసినందుకు ఇప్పుడిక విచారపడింది. ఇప్పటి అతని ముఖం చూడాలన్న కోరిక కలిగింది. నవ్వింది. ఆ నవ్వులో జీవం లేని విషయం గుర్తించాడు కాశీ.

"నన్నెందుకిలా కష్టాల్లోకి లాగుతావ్? నేనెంత నిస్సహాయంగా బ్రతుకుతున్నానో నీకు తెలుసు"

ఇంత బలహీనుడి కోసం, పిరికివాడి కోసం తానెందుకు వ్యర్థమయిన ఆలోచనలు పెట్టుకొంటోందో అర్థకాకపోయింది. ఇటువంటి వ్యక్తిని తానెట్లా ప్రేమించగలిగిందా అని తనకు తానే విస్తుపోయింది.

తలుపుకి ఆనుకుని నిలబడి చీకట్లో నవ్వింది.

"ఇంత రాత్రి నీ గదిలో గడపడం నాకెంత నష్టమో ఆలోచించలేదు నువ్వు. అవునులే ఇంక దేన్ని గురించీ ఆలోచించే తీరిక లేదు నీకు. పోనీ, ఈ వీధి చివరివరకూ వస్తావా?" ఇంకా సందేహించడం చూసి "నీ పాతివ్రత్యానికి ఏ భంగం రానివ్వను. నిన్ను పెళ్ళి చేసుకొమ్మని అడగను" అని అతని చెయ్యి ధైర్యంగా పట్టుకుంది.

ఇవాళ్టి గిరికను ఇన్నాళ్ళుగా ఎన్నడూ చూడలేదు. తనని మించి, తాను ఊహించలేనంతగా పెరిగినట్టూ, ప్రతి మాటలోనూ ఏదో ద్వైధీభావం, నైరాశ్యం, హేళన చూసి స్థబ్ధుడయి ఆమె వెనుక నడిచాడు.

చుట్టూ చీకటి.

పిరికితనాన్ని వెలుపలికి లాగి, కోరికలకు రూపం ఇచ్చే చీకటి.

పాత జీవితాన్ని నిలిపి ప్రశ్నించే నిశ్శబ్దం.

ఈ చీకట్లో ఆమె వెనుక నడుస్తూ 'ఆమె ధైర్యానికి అర్థం ఏమిటా?' అని కాక 'ఆమె ధైర్యానికి కారణం ఏమిటా? ' అని ఆలోచించాడు.

ఆలోచిస్తే తన చేతకానితనం, నిస్సహాయత, నిర్లక్ష్యం అన్నీ గుర్తుకొచ్చాయి.

ఏమీ మాట్లాడకుండా ముందుకు నడుస్తోంది గిరిక. అంతలో ఆగి అతనితో కలిసి నడక ప్రారంభించింది. అతని మనస్సులో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి ఆ చీకటిలో ప్రయత్నించి విఫలమయింది. అంత రాత్రిలో ఎదురుగ్గా ఉన్న మైదానం మధ్య ఎవరో మంట వేసుకు కూచున్నారు.

అతని భుజాన్ని రాసుకు నడుస్తోంది. కొంత దూరం వెళ్ళాక హఠాత్తుగా అడిగింది. "నా హోదాని చూసి జాలిపడేగా నేను నీతో బ్రతకలేనన్నావ్"

ఆమె కంఠంలో ప్రగాఢమైన ఉద్వేగ ఛాయలను గమనించి నిర్లిప్తుడయాడు.

అంతలో మళ్ళీ ఆమె చెప్పింది. "నిన్ను పెళ్ళి చేసుకోగలిగేంత పెరగలేదు నేను. అయినా నిన్ను పెళ్ళి చేసుకోవాలని ఎప్పుడూ అనిపించలేదు నాకు. కానీ నాకు తెలియకుండానే నా మనస్సుకు అందనంత పెరిగిపోయావు నువ్వు. అందుకని నిన్ను ఆశ్చర్యంతో చూసి ప్రేమ ఏమోననుకున్నాను."

ఏదో గొంతుకు అడ్డుపడినట్టు ఆగిపోయి, దానికి జవాబు చెప్తాడేమోనని పదియుగాలు ఎదురుచూసింది.

జవాబు ఇవ్వాలన్న విషయం స్ఫురించలేదు కాశీకి. ఆ అంధకారం మధ్య ముందుకు పడిపోకుండా తనని తాను రక్షించుకుంటూ పోతున్నాడు.

"నేను చెప్పేవన్నీ నమ్ముతున్నావా నువ్వు?" అంది.

"ఏది?"

"నిన్ను ప్రేమించడం లేదని-"

"అలాంటి వెప్పుడూ ఆలోచించలేదు నేను. అంత వ్యామోహం నీమీద ఎప్పుడూ కలగలేదు నాకు"

ఈ మాటల్తో ఆమె విశ్వాసభిత్తి అంతా సమూలంగా కూలిపోయింది. దుఃఖం వస్తుందేమోనని పెదాలను నొక్కిపట్టింది.

"పోనీ నీ గురించి నేనెప్పుడయినా ఆలోచిస్తానని ఊహించావా?"

ఒక్క క్షణం నిలబడి అడిగాడు "నా గురించి ఎందుకు ఆలోచించాలి నువ్వు?"

ఈ లుబ్ధవ్యంగ్యం మనస్సుకు సూటిగా తగిలింది. అతని చేతిని గట్టిగా పట్టుకుని తన నడుం చుట్టూ తిప్పుకుంది. "నువ్వేం రాయివి కాదు నిన్ను ప్రపంచమంతా మరచిపోవడానికి. నువ్వు చేసిన పాపమల్లా బీదవాడిగా పుట్టడం" అతనికి ఇంకా దగ్గరగా జరుగుతోంది ఆమె ముఖం. మల్లెపువ్వుల వాసన అతని చెక్కిళ్ళకు రాసుకుంటూంటే మనిషిలో చలనం కలిగింది.

నిబ్బరంతో అన్నాడు. "నిన్ను పెళ్ళి చేసుకోడానికి ఇవాళ కొన్ని అర్హతల్ని కల్పించి 22 ఏళ్ళు బీదతనాన్ని అనుభవించిన మనస్సును గొప్పగా చెయ్యలేవు. ఇవాళ నీ నడుం చుట్టూ చెయ్యి వేసి, నిన్ను ఉద్రేకంతో కౌగలించుకున్నా, నన్ను కోర్టులో నిలబెట్టి, సాక్ష్యం చెప్పించి నీకు బలవంతంగా ముడిపెట్టడానికి ఇక్కడ సాక్షులెవరూ లేరు."

తృటిలో తన నడుం చుట్టూ ఉన్న అతని చేతిని వదిలేసింది. ఉద్వేగంతో, కోపంతో, అసహ్యంతో మనస్సు భగ్గున మండింది. క్షణంలో అదంతా నిస్సహాయతగా మారి అతనికి కనిపించకుండా ముఖం తుడుచుకుంది. మనస్సును ఎక్కడో పారేసుకున్న ఈ మనిషితో ఏం ఆలోచించీ లాభం లేదనుకుంది. అనుకుని ఇట్లా అంది.

"నువ్వు చాలా గొప్పవాడివి. ఎంత గొప్పవాడివంటే నా చిన్నతనాన్ని ఎత్తి చూపగలిగేంత గొప్పవాడివి. పెళ్ళి గురించి మాట్లాడనని నీకు మాట ఇచ్చి తీసుకువచ్చాను. కాకపోతే నీతో పెద్దదెబ్బలాట పెట్టుకుందామని వచ్చాను. ఇంక వెళ్ళిపో. చాలా రాత్రయింది. నేను ఒంటరిగా వెళ్ళగలనులే" అంది.

ఆ కఠోక్తులతో కాశీ నివ్వెరపోయాడు. ఒక్క క్షణం నిలిచిపోయి ఆమె రెండు చేతులూ ఆ చీకటిలో పట్టుకుని "నీమీద నాకు కోపంలేదు గిరికా. నా గురించి ఆలోచించలేదని నా కోపం. నా గురించి ఏ మాత్రమయినా ఆలోచించి ఉంటే ఇవాళ నన్నీ ప్రశ్న వేసేదానివికాదు. నేను నిన్ను వదిలినందుకు కాదు. నువ్వు నన్ను వదిలించుకున్నందుకు ఎప్పుడో ఒకప్పుడు తృప్తిగా నిట్టూరుస్తావు"

ఇక దుఃఖం ఆపుకోలేక ఏడ్చింది. "నా చెయ్యి వదులు పోతా"నంటూ.

ఆమె హఠాత్ పరివర్తనకు కొయ్యబారిపోయాడు.

"కాదు. ఇంటివరకూ వస్తాను" అన్నాడు.

వెంటనే భుజం పట్టుకు ఆపింది. అంతలో దుఃఖాన్ని ఆకట్టుకుంది. "నన్నెవరూ ఎత్తుకుపోరులే. నీ పెళ్ళాన్ని చూసేవరకయినా బ్రతికి ఉంటాను" అని తొందరగా నడిచి వెళ్ళిపోయింది.

అచేతునుడయి ఆ చీకటి మధ్య ఒంటరిగా నిలిచిపోయాడు కాశీ.

వెనక్కి తిరిగి వస్తూంటే ఆమె వదిలిపోయిన ఆలోచనలు తనకి తోడుగా నిలిచాయి.

మరి రెండు రోజుల తరువాత బజారులో చక్రవర్తి తటస్థపడి "చెల్లాయి ఊటీకి వెళ్ళిపోయింది రెస్ట్‌కోసం. ధనవంతుడు పిరికితనం నుంచి విశ్రాంతికీ, ఆడవాళ్ళు మనస్సు నుంచీ విశ్రాంతికీ బయలుదేరతారు సార్. మరి మా చెల్లాయికి పిరికితనం లేదు, మనస్సూలేదు. ఎందుకు వెళ్ళిందో తెలీదు. ముందుకు రెండడుగులు వేస్తే కాశీని వెనక్కి పిలిచి "వెళ్తూ ఓ రహస్యం చెప్పింది. మీకు పెళ్ళి జరిగేటప్పుడు తప్పకుండా వర్తమానం పంపమంది. నాకు కాస్త మాట మాత్రం అందజేస్తే టెలిగ్రాం ఇస్తాను" అనేసి వెళ్ళిపోయాడు.

**పరీక్షలు దగ్గరికొచ్చాయి.** తప్పనిసరిగా దృష్టినంతా అటువేపు కేంద్రీకరించాల్సి వచ్చింది.

ఒక్క ఉత్తరం మాత్రం రాసింది గిరిక. "ఊటీ వింతగా ఉంది. ఇక్కడ నారింజ తోటల్లో తిరుగుతూ అన్నిటినీ మరిచిపోవడం నేర్చుకున్నాను. చివరికి నిన్ను కూడాను" అని.

చదివి నవ్వుకున్నాడు. ఆ వాక్యంలోని ప్రతిమాట ఆమె తనని ఎంతగా మరిచిపోలేకపోతున్నదో చెపుతున్నది.

" ***కోరికలన్నింటినీ వదిలి నిశ్చింతగా బ్రతుకుతున్నానని హామీ ఇవ్వడానికి ప్రయత్నిస్తూంటుంది స్త్రీ హృదయం. కానీ ఆ ప్రయత్నంలో హృదయాన్నే ఎక్కడో వదిలేయడం జరుగుతుంది. కోరికల్తో బరువెక్కిన స్త్రీ ప్రేమకోసం, కోరిన అనుభవం కోసం ఏదన్నా చేస్తుంది. అందుకనే ఆ క్షణంలో ఆమెలో ఆకర్షణ ఎక్కువ*** " అనుకున్నాడు.

పన్నా మాములుగా రోజూ వస్తూ పోతోంది. ***మగాడు విజ్ఞతలను వెదుక్కోవాలి. కానీ విజ్ఞతే స్త్రీని వెదుక్కొంటుంది. అంత సునిశితమయిన మనస్సును సృష్టిలోనే పొదిగాడు దేవుడు.*** రోజు రోజుకి పన్నాలో మార్పుకు కాశీకి తృప్తీ, ఆశ్చర్యం కలిగేది.

ఓ రోజు ప్రయత్నపూర్వకంగా వచ్చి "ఇవాళ పన్నాతో స్నేహం కలుపుకోడానికి వచ్చానోయ్" అన్నారు మాస్టరుగారు. ఆయన ముఖం చూసి ఆ పెదాల్లో, ఆ కళ్ళలో కోపపు ఛాయలు కనిపించకపోవడం చూసి స్థిమితపడ్డాడు. అతనిలో ఇంకా బెరుకుదనం చూసి "ఫరవాలేదులే. ఈసారి ఎవరి మీదా ఫిర్యాదు చేయడానికి రాలేదు. వయస్సు ఎక్కువయిన కొద్దీ మనస్సులో చిన్నవాణ్ణయిపోతున్నాను. నువ్వు పాతాల్ని చెప్పడం చూడాలి" అన్నారు.

నిజంగా పన్నా వచ్చాక ఆయన్ని చూసి భయపడింది. నీలిరంగు పొట్టిపరికిణీ మీద ఏ రంగో తెలియకుండా పూర్తిగా వెలిసిపోయిన ఓణీ, చేతిలో రెండు పుస్తకాలూ, సిగలో ప్రారంభమయి, సన్నటి మెడ క్రిందుగా వేలాడుతున్న పేరు తెలీని పిచ్చిపువ్వులూ, ప్రపంచాన్ని మొదటిసారిగా చూసిన ఏదో అపురూపమైన శక్తిలాగా కనిపించింది. పన్నాని కాక కాస్తపాటి అమాయకత్వాన్నీ, అనుకంపనూ, బెరుకుదనాన్నీ, ఇంకా రూపం దిద్దుకోని అందాన్ని చూసి మొదట చకితులయారు మాస్టరుగారు.

***ఒక నిర్ణీతమయిన 'లయ'తో జీవితాన్ని సాగించుకుపోయే వ్యక్తిలో ప్రవర్తనను గానీ, విప్లవాన్ని గానీ తీసుకురాగల బలమైన శక్తి సృష్టిలో ఏదీలేదు, ఒక్క స్త్రీ తప్పించి.*** కాశీలాంటి వ్యక్తిని మార్చి ఎదురు నిలపగల వ్యక్తిలోని ధైర్యం, శక్తీ ఎంత బలమైనదో చూడాలని ఇవాళ వచ్చారు మాస్టరుగారు. పన్నామీద కంటే కాశీ మార్పు మీద ఆయనకు ఎక్కువ ఆసక్తి.

వెంటనే తనని తను కూడదీసుకుని "ఇలా కూర్చోమ్మా. నన్ను చూసి ఏం భయపడనక్కరలేదు నువ్వు. కాశీ నీకు మాష్టారు. నేను కాశీకి మాస్టార్ని. నీకు ఇనస్పెక్టర్ని అప్పుడప్పుడు వచ్చి నీ చదువునూ, నిన్నూ పరీక్ష చేసిపోతాను" అన్నారు.

కాశీ ముఖంలో ప్రసన్నతను చూసాక తృప్తిపడి నమస్కరించింది పన్నా.

కూచున్నాక "నీ పేరేమిటో నాకు తెలుసు. కానీ నువ్వు చెపితే బావుంటుంది" అన్నారు. కాలు మీద కాలు వేసుకుని చేతికర్ర మీద ముఖాన్ని ఆనిస్తూ.

ఆమెకీ నవ్వొచ్చింది. నేలమీద ఓ మూలకి కూచుని పేరు చెప్పింది. కొంతసేపు కూచుని లేస్తూ "ఇతను నీకు చదువు చెప్తాడు. సరే. నేను నీకు మనిషిగా ఎట్లా బ్రతకాలో చెపుతాను. ఇతను నువ్వెంత చదివావో పరీక్ష చేస్తాడు. నేను నువ్వెంత మారావో, ముఖ్యంగా కాశీని ఎంత మార్చావో చూసి పోతుంటాను" అనేసి వెళ్ళిపోయారు.

హఠాత్తుగా వచ్చిపోయిన ఆ అపరిచిత వ్యక్తి కల్పించుకున్న చొరవలో పన్నా హృదయం రెపరెపలాడింది. ఆ రోజేమీ చదవలేకపోయింది. కొన్ని రోజులపాటు ఆ వృద్ధుడి మీద ఔత్సుక్యం, అభిమానం, తెలీని ఆనందంతో మనస్సంతా నిండిపోయింది తనకు తెలీకుండానే కళ్ళనీళ్ళు తిరిగేవి. అతని దయాపూరితమైన ఓదార్పు తలుచుకుంటే, అట్లాంటి వ్యక్తి అండ ఉంటే ఎంత బావుణ్ణని వాపోయేది. అట్లాంటి సమయంలో ఒంటరిగా కూచుని ఎవరికీ చెప్పలేని దుఃఖాన్ని ఆపుకోలేక ఏడ్చేది.

మాస్టరుగారిని చూశాక మరి చదువు సరిగ్గా సాగడంలేదు. అయినా కాశీకి చెప్పడానికి భయం. బుద్ధిగా వచ్చి సాయంకాలాల్లో అతని ముందు కూచుని భక్తిశ్రద్ధలతో అతను చెప్పేదంతా వినిపోయేది.

●●●

సరిగ్గా ఆ సమయంలో అనుకోని సంఘటన ఒకటి జరిగిపోయింది.

ఒకరోజు తెల్లవారుతునే మాష్టారు ఒక కుర్రాణ్ణి వెంటబెట్టుకు వచ్చారు. మాసిపోయిన బట్టల్తో నిర్జీవంగా ఉన్న ఆ కుర్రాణ్ణి చూసి మొదట పోలికపట్టలేదు కాశీ. వాడు 'అన్నయ్యా' అనగానే తర్వాత గుండెపగిలింది కాశీకి. శంకరాన్ని పోల్చుకున్నాడు. ఆకలి మింగేసిన కళ్ళూ, కష్టాల్ని దాచుకోడం తెలీని అమాయకత్వం, పూర్తి దారిద్ర్యంతో ఉన్న తమ్ముణ్ణి చూసి నిర్విణ్ణుడయిపోయాడు. ఆర్ద్రత, జాలి, వేదనతో మనస్సు చిన్నాభిన్నమయింది.

అప్పటికే చాలా సంవత్సరాలయింది వాళ్ళని చూసి. ఇప్పుడాలోచిస్తే అక్కడికి ఇన్నాళ్ళు ఎందుకు వెళ్ళలేక పోయానా అని విస్తుపోయాడు. ***బ్రతకడానికి డబ్బు ఒక్కటే కాదని, ప్రేమాభిమానాలు, జీవితం మీద హామీ, విశ్రాంతి ఎంత అవసరమో*** తమ్ముణ్ణి చూస్తే బోధపడింది. నిస్సహాయంగా లేచి 'మాష్టారూ' అన్నాడు.

మాష్టారుగారు సముద్రం వేపు చూస్తూ అటు తిరిగి నిలబడ్డారు. పిలిస్తే ఇటు తిరిగారు. మాష్టారి కళ్ళల్లో నీళ్ళు చూడడం అదే ప్రథమం. "ఈ ఆకలి దృశ్యాన్ని పూర్తిగా నీకు చూపలేకపోయాను కాశీ. ఇప్పుడు వీళ్ళ దైన్యాన్ని సగమే చూశావు. ఇంకా చాలా చూడాలి పద నువ్వు. ఇంటికి పద" అన్నారు.

జడునిలాగ నిలబడిపోయాడు కాశీ. ఏదో ఆలోచిస్తున్నారు మాష్టారుగారు. ఉన్నట్టుండి "నేను చాలా పొరపాటు చేశాను కాశీ" అన్నారు.

కాశీ విస్మయంతో తలెత్తి మళ్ళీ చెప్పారు. "నీ గురించే ఆలోచించాను ఇన్నాళ్ళూ. కానీ నీ తమ్ముళ్ళ గురించి ఆలోచించలేదు. నిన్ను బాగుచేస్తున్నాననే తృప్తితో, ఇంకొకరి బాగుకు ఆటంకమవుతున్నానే అన్న విషయాన్ని మరిచిపోయాను."

"వీడిక్కడికి ఎలా వచ్చాడు?"

"మీ అమ్మ వచ్చింది. ఇంటిదగ్గర ఉంది."

వాళ్ళని చూడాలన్న ఉబలాటం ఎక్కువయింది. "అయితే త్వరగా పదండి మేష్టారూ" పద అని లేచాడు.

దారిలో మాష్టరుగారు అన్నారు "ఈ సంవత్సరం నువ్వు చదువు ఆపెయ్యాలి కాశీ. ఇక ఆరునెలల్లో నువు గృహస్తుడివి కాబోతున్నావ్"

అప్పుడే అమ్మ మాట్లాడిందని గ్రహించాడు కాశీ. మాష్టారు ఏం చేసినా ఆలోచించే చేస్తారు. ఇంకేం మాట్లాడలేదు. "అలాగే మాష్టారూ" అన్నాడు.

●●●

ఈ సంవత్సరం చదువు మానేసి ఉద్యోగం చేస్తానంటే భుజం తట్టారు మాష్టరుగారు. "మొదట పరీక్ష పూర్తిచెయ్యి. ఈలోగా ఏమీ ముప్పులేదు" అన్నారు.

కానీ అప్పటికే అతని మనస్సుకు కలిగించే ఆరాటం, తమ్ముళ్ళ దుస్థితీ, పన్నామీద ఆలోచనలూ, భవిష్యత్తు మీద బెంగా ఇవన్నీ బ్రతుకు బరువును అధికం చేశాయి. జీవిత రహస్యమార్గాలలో విశ్రాంతిని వెదుక్కోవడం తెలీని కాశీ వీటిమధ్య నలిగిపోయాడు.

***అనుభవం, కష్టాలూ జీవితానికి ఎంత అవసరమయినా మనస్సుకు మించి పెరిగిపోకూడదు.*** అప్పుడలాగే అయింది.

పరీక్షకు వెళ్ళాడు. కానీ ఏమీ లాభం లేకపోయింది. మరి మూడు నెలల్లోనే ఫలితం తెలిసిపోయింది. కాశీ పరీక్ష తప్పాడు.

మరి చదివే ఆశాలేకపోయింది, అవకాశమూ లేకపోయింది.

పరీక్ష పోయిందనగానే మాష్టరుగారు ఆశ్చర్యపడలేదు. "నువ్వు ప్యాసయితేనే నాకు ఆశ్చర్యం కలిగేది. నీ వయసులో నాకు ఇన్ని అడ్డంకులు కలగలేదు. ఇక ఉద్యోగం చూడడం అవసరం" అన్నారు.

ఆరునెలలు తిరక్కుండానే నెల్లిమర్ల జనుపనార మిల్స్ ఏజన్సీలో ఉద్యోగం చూసిపెట్టారు డాక్టరుగారు.

రెండు మూడు నెలలు ఉద్యోగంలో స్థిరపడిన తరువాత అమ్మనీ, తమ్ముళ్ళనీ తీసుకొచ్చి ఇల్లు మార్చాడు కాశీ.

●●●

గిరిక దాదాపు సంవత్సరంపాటు సిమ్లా, శ్రీనగర్, డార్జిలింగ్, పంపా మొదలైన వన్నీ తిరుగుతూ గడిపి చివరికి ఢిల్లీ వచ్చేసరికి రెండు నెలలు పాతబడిన శుభలేఖ తన వెనుకనే ఊరులన్నీ తిరిగి చివరికి అక్కడికి చేరుకుంది.

తీరా చూస్తే కాశీ పెళ్ళి శుభలేఖ అది. వధువు 'అన్నపూర్ణ' అని ఉంది.

చూస్తూనే ఆశ్చర్యపోయింది గిరిక. వెంటనే తను ఇంటికి వస్తున్నట్టు తంతి ఇచ్చి, విశాఖపట్నానికి బయలుదేరింది.

***<u>జీవితం మీద తుంపర్లు</u>***

కాపురానికి వచ్చేసరికి అన్నపూర్ణకు ఇరవై దాటాయి. జీవితమంతా మొదట కొత్తగా, వింతగా కనిపించింది. భర్త వివాహం అంటే అంతగా తెలీని వయస్సులో మొదటిసారి కాశీని విచిత్రంగా చూసింది. భర్తంటే తెలుసుకోలేని వయస్సు కాదది నిజానికి. అయితే పల్లెటూరిలో ఆమె అన్నేళ్ళ జీవితం మానసికంగా ఆమెలో ఏమీ చలనాన్ని కలిగించలేక పోయింది. మంచితనం, సౌహార్ధం, శుద్ధాంతఃకరణ, జాలి, దయ వీటిని మాత్రం కూడగట్టుకుని కాపురానికి వచ్చింది.

పల్లెటూరిలో ఓ పాత స్నేహితుడి కూతుర్ని చూసి సంబంధం నిర్ణయించాడు కాశీ మామయ్య.

పెళ్ళిలో తన దగ్గరికి వచ్చి "మీరు మంచివారని నిరూపించుకొందుకు ఇంత వరకు ఏమీ మాట్లాడలేదు. మీరు మంచివారని మాకేంటి నిదర్శనం?" అనడిగింది ఓ అమ్మాయి. పదిహేడేళ్ళ ఆ అమ్మాయిని చూసి మొదట నిర్ఘాంతపోయాడు కాశీ.

"నిరూపించుకోడానికి ఏం చెయ్యాలి?"

ఆ అమ్మాయి తికమక పడింది. "ఏం చెయ్యాలో తెలీదు కానీ ఏదైనా ఆగకుండా మాట్లాడండి. లేకపోతే మా అక్కయ్య మిమ్మల్ని పెళ్ళి చేసుకోదు" అని నవ్వు దాచుకుంటూ వెళ్ళిపోబోతే

"నీ పేరేమిటి?" అన్నాడు.

"నన్నుకాదు మీరు పెళ్ళి చేసుకోబోతున్నది. మా అక్కయ్య పేరు తెలుసుకుని పిలిచి అడగండి" అనేసి వెళ్ళిపోయింది.

ఇదీ వసంత.

తర్వాత పెళ్ళిపందిరి అంతట్లోకీ వసంత కాశీకి పెద్ద నేస్తం అయిపోయింది.

పెళ్ళయేవరకూ కాశీ తల్లి గునుస్తూనే ఉంది. పెళ్ళి కూతురులో మంచితనం, అందం, అమాయకత్వం ఆమె దృష్టికి అందలేదు. పీటల మీద కొడుకు పక్క ఆ అమ్మాయి కూర్చుని ఉండగా చూసి, అన్నపూర్ణను రూపాయలు, అణాలు, పైసల్లో లెక్కకట్టుకుని కించపడిపోయింది.

ఆ పట్టుదల, అసహనం మధ్య తనమాట చెల్లలేదనే కోపంతో ఆ నాలుగు రాత్రులు ఎవరినీ చూడకుండా గడిపి, వీలయిన వాళ్ళందరి మీదా శాపనార్థాలు పెట్టింది. వధూవరులు నమస్కారాలు చెయ్యడానికి వస్తే మనస్సులో ఏమనుకున్నదో ఏమోగానీ, ముఖం మీదకి మాత్రం చిరునవ్వు తెచ్చుకోలేకపోయింది.

కాశీ పక్కన కూచుని స్వయంగా అన్ని పనులూ సవ్యంగా జరిగేటట్టు చూశారు మాష్టరుగారు, ఆయన శిష్యుడు మామయ్యాను.

పెళ్ళిలో పీటల మీద కూర్చునే వరకూ ఒక వ్యక్తి కోసం ఎదురుచుస్తూనే ఉన్నాడు కాశీ. ఎంత మరిచిపోదామనుకున్నా. అతని మనస్సు ఆ వ్యక్తి కోసం పందిరంతా వెదుక్కుంది. ఆమె రాని క్షణాలన్నీ సోమరిగా గడిచిపోతున్నట్టనిపించాయి.

చివరికి డాక్టరుగారు కారు దిగితే ఆ కారు నీడలో మరొక వ్యక్తి ఉన్నదేమోనని అతని మనస్సు ఆత్రుతతో వెదికింది. కానీ ఎవరూ కనిపించలేదు.

చక్రవర్తి చాలా హుషారుగా ఉన్నాడు. ఆర్కిటాన్ సూటు వేసుకుని ఓ గులాబి పువ్వును అటూ ఇటూ తిప్పుతూ పెద్ద బంగీని చేత్తో పట్టుకుని ఆయన పక్కకి వచ్చి చూశాడు. "పెళ్ళి చేసుకు మీరు ప్రపంచానికి చాలా మేలు చేస్తున్నారు సార్. మొగాడు పెళ్ళి చేసుకుని ప్రపంచాన్ని ఉద్ధరిస్తాడు. ఆడది పెళ్ళిచేసుకుని తనని తానే ఉద్ధరించుకుంటుంది. మీకు మూడు బహుమానాలు తెచ్చాను. ఫ్యూచర్‌లో పిల్లలకి రబ్బరు బొమ్మలు, కుటుంబ నియంత్రణ మీద సమగ్రమైన గ్రంథం, సంసార జీవితంలో మీ ఆశాభంగాల్ని రాసుకోడానికి ఓ బైండు పుస్తకం" అన్నాడు.

ఆయన మాట్లాడటం అయాక దగ్గరికి పిలిచి గిరిక విషయం అడిగితే "ఇన్విటేషన్ వారం క్రిందటే పంపాను. ***పెళ్ళికి ఆడవాళ్ళు రావటం మానుకున్నారంటే వాళ్ళకి మనమీద చాలా ప్రేమ ఉన్నట్లు లెక్కసార్. ఆడవాళ్ళు తాము ఉన్నచోటే సంతోషాన్ని కలిగించిపోతారు. అందువల్లే ఆడవాళ్ళ అనుభవాలు మనస్సులో నిలిచిపోతాయి.*** ఫరవాలేదు లెండి. మీ వివాహం మీద చెల్లాయికి బ్రీఫ్ సినాప్సిస్ ఇస్తాను."

ఇటు తిరిగితే అన్నపూర్ణ ఈ వ్యక్తి మాటల్లో ఉద్ధృతాన్ని ఆశ్చర్యంతో గమనిస్తూండడం కనిపించింది. అతని మాటల్లోని అపరిచిత వ్యక్తిమీదకి ఆమె దృష్టిపోయిందని గమనించి కాశీ సిగ్గుపడి మళ్ళీ ఆ విషయం ఎత్తలేదు.

కానీ ఇదంతా వసంత కనిపెడుతూనే ఉంది. వీలు చూసుకుని పక్కకు చేరింది. "బావగారు ఎవరి గురించో ఎదురు చూస్తున్నట్టున్నారు" అంది వెటకారంగా.

ఆమె ముఖంలో ఆత్రుతని చూసి నవ్వాడు కాశీ. "అవును ఎదురు చూస్తున్నాను. నువ్వు మాటల్తో నన్ను ఆశ్చర్యపరచగలవు. అలాగే కళ్ళతో ఆశ్చర్యపరిచే వ్యక్తికోసం ఎదురు చూస్తున్నాను" అన్నాడు.

అసంకల్పితంగా మరొక స్త్రీ ప్రసక్తి వచ్చేసరికి ఇటు అన్నపూర్ణ అటు వసంతా తెల్లబోయారు ఆ మాటలకి.

ఇరవై రోజులకి గిరిక వచ్చిందని తెలిశాక మొదట ఉన్న ఆతృత ఆమెని చూడడానికి కనిపించలేదు. పైగా ఆ విషయం విన్నాక, ఆమెకు తెలియకుండా దాచుకోవలసింది చాలా ఉందనీ, ఇప్పుడిక ఆ కళ్ళను, వాటి ప్రశ్నలకు సమాధానాలను వెదుక్కోవడం కష్టమనీ తెలిసివచ్చింది కాశీకి.

మనస్సులో ఏ పొరపొచ్చాలు లేకపోయినా ఏదో తెలీని నేరం చేసినట్టు సంకోచం, బిడియం మాత్రం వదలలేదు. అందువల్ల ఆమెను కలిసే వ్యవధానం పెంచుకుని మనస్సుకు ఊరట కలిగించే యత్నం చేస్తున్నాడు.

కానీ ఈ దొంగతనం ఎంతో కాలం నిలువలేదు.

ఓ రోజు ఆలశ్యంగా ఇంటికి వస్తే గిరిక కనిపించింది. చిలక ఆకుపచ్చ రంగు చీర వదులుగా కట్టుకుని సన్నటి నడుం చుట్టూ తిప్పుకుంటే పెద్ద ఆరిందాలాగా కనిపించింది. తలకి నీళ్ళు పోసుకున్నట్టుంది మెడమీదకి చాలా బలహీనంగా చెదిరి పాకుతున్నట్టు ఓ వింత ఆభరణాన్ని అలంకరించింది. నుదుటి నిండా పెద్దబొట్టు - అంత బొట్టు పెట్టుకోగా ఎప్పుడూ చూడలేదు కాశీ. అతన్ని చూడగానే మొదట కలవరపడి - పోనీ కలవరపడినట్టు నటించి పమిట సరిచేసుకుంటోంది.

ఊర్లన్నీ తిరిగి కాస్తపాటి బలాన్నీ, అందాన్నీ పూరించుకు వచ్చినట్టుకనిపించింది.

అన్నపూర్ణ ఎదురుగ్గా కూచుని జడ అల్లుకుంటోంది. కాశీని చూశాక నవ్వుతూ, అన్నపూర్ణతో అన్నది గిరిక. "మీరు కాశీని చాలా మార్చారండి - నన్ను ఇంతగా ఎప్పుడూ మరిచిపోలేదతను" - అన్నపూర్ణ చకితురాలయి తల ఎత్తితే చీర కొంగుతో నవ్వాపుకుని "పరవాలేదు లెండి. ఇప్పుడే కాశీ బాగున్నాడు. ఇంకా మార్చండి" అంది.

మాట మార్చుతూ "ఎప్పుడొచ్చావు?" అన్నాడు వాకిట్లోకి బల్లలాక్కుని కూచుంటూ సాయంకాలపు ఆకాశంలో వెలుగులో చెట్టునీడలు పల్చగా కిందకి జారాయి.

"అంత తెలీదా నేనెప్పుడొచ్చానో! మూడు నెలలు ఆలశ్యంగా మీ శుభలేఖ అందింది. నీ భార్యని చూడకుండా చచ్చిపోతానేమోనని భయం. ఉత్తరం చూడగానే పరిగెత్తుకు వచ్చాను. నాకు బ్లడ్ ప్రెషర్ ఉందని డాక్టరు చెప్పారు తెలుసా?" అంది.

అన్నపూర్ణకు ఇలా మాట్లాడడం అర్థం కావడంలేదు. విస్మితురాలై చూస్తూ కూచుంది.

"ఇంత చిన్న వయస్సులోనా?" అన్నాడు కాశీ విస్తుపోతూ.

"ఊరికినే..!" పెద్దగా నవ్వింది గిరిక. అన్నపూర్ణవేపు తిరిగి "చూశారా? - కాశీ ఎప్పుడూ తన జీవితానికి పన్నెండేళ్ళ వెనకే ఉంటాడు. నేనింకా చిన్నపిల్లనే అనుకుంటాడు. ఆడవాళ్ళు పైకి కనిపించే కంటే మనస్సులో ఎట్లా పెరుగుతారో మీరు నేర్పండి" అంది.

అన్నపూర్ణ ముఖం సిగ్గుతో వివర్ణమైపోయింది. ఏమీ మాట్లాడలేకపోయింది. "మీకు తాంబూలం ఇస్తాను" అని చెప్పి లేచిపోయింది.

ఈ అవకాశాన్ని తీసుకుని గొంతు తగ్గించి మాట్లాడింది. "మీ ఆవిడను గురించి చాల మట్లాడాలని ఉంది. ఇక్కడెలా పోనీ నాతో వస్తావా?"

బయటకు గిరిక ప్రదర్శిస్తున్న ధైర్యమంతా ఎంత కపటంగా ఉన్నదో తెలుస్తోంది. ఆమె నవ్వు, కళ్ళల్లో తెచ్చి పెట్టుకున్న తృప్తి గమనించి భయపడ్డాడు.

"నేను రాను" అన్నాడు.

"నిన్నేం తినెయ్యనులే - భార్య రాగానే ప్రపంచమంతా చచ్చిపోయిందనుకోకు"

అన్నపూర్ణ వచ్చి నుదుటి బొట్టును మరింత విశాలం చేసింది. తాంబూలం ఉంచుతూ "ఎప్పుడన్నా వస్తూండండి" అని కళ్ళతో ఆహ్వానించింది.

ఒక్క క్షణం నివ్వెరపాటుతో గిరిక అన్నపూర్ణ ముఖం చూస్తో ఉండిపోయింది. ఆ స్వచ్ఛత, నిరాడంబరతా ఆమెను క్షణకాలం నివ్వెరపోయేటట్టు చేశాయి - అంతలో గొంతు సవరించుకు నవ్వేసింది.

"మీరు చాలా మంచివారు. మిమ్మల్ని కాక ఇంకెవరినయినా పెళ్ళిచేసుకుని ఉంటే, కాశీతో పెద్ద తగాదా పెట్టేదాన్ని"

తెల్లబోయింది అన్నపూర్ణ "ఎందుకూ!"

నవ్వి ఆమె భుజం మీద చెయ్యేసి "ఎందుకు అన్న చిన్న ప్రశ్నకు ఇంత సుళువుగా జవాబు చెప్పెయ్యమంటారా? నేను మిమ్మల్ని వదల్ను లెండి. మరోసారి చెప్తాను" అని మరీ ముందుకు వంగి "పోనీ ఎందుకో మీ ఆయన్ని అడగకూడదూ?" అంది.

అన్నపూర్ణ ఆశ్చర్యపడడానికి వ్యవధి ఇవ్వకుండా మాట మార్చి "చూశారా? ఆయన నన్ను దిగబెట్టడానికి రానంటున్నాడు. పెళ్ళిచేసుకున్నాక మర్యాదలు మరిచిపోతే ఎలా చెప్పండి" అంది.

సిగ్గుపడింది అన్నపూర్ణ. ఎప్పుడూ ఆమె కాశీతో మాట్లాడేది చాలా తక్కువ. ఇప్పుడిక తప్పనిసరిగా తలయెత్తి "పోనీ, వెళ్ళిరండి" అంది.

తన ప్రయత్నాన్ని, తన వైముఖ్యాన్ని భగ్నం చెయ్యడానికి గిరిక ఎన్ని విధాల ప్రయత్నించిందో గుర్తించి మనస్సు ఉదాసీనతతో భగ్గుమంటూనే ఉంది. ఆమె మనస్సులో నిర్లక్ష్యంతో కూడిన తృప్తికి నిర్వచనం ఆ పెదాలు ఎప్పటికప్పుడు చెప్తూనే ఉన్నాయి.

వీధిలోకి వచ్చాక - నడుం చుట్టూ చీర తిప్పుకుని దూరంగా నడిచింది. బండిలో ఎందుకు రాలేదా అని ఆశ్చర్యపడ్డాడు.

"మీ ఆవిడ ప్రోత్సహిస్తేనే కానీ నీకు మర్యాద గుర్తుకొచ్చిందికాదే" అంది కాస్త ఆగి.

ఎక్కడో మిల్లులో పెద్ద యంత్రాలు కదులుతున్నట్టూ ఏదో బలంగా నలిగిపోతున్నట్టూ శబ్దం వినిపిస్తోంది.

ఎట్లా జవాబు చెప్పాలో తెలియలేదు. అది గమనించి నవ్వుకుంది గిరిక.

అప్పటికి కొద్దిగా చీకటి పడింది. అతనికి దగ్గరగా జరిగి - "ఊఁ ఇక కోపం తెచ్చుకో నామీద" అంది.

"ఎందుకు కోపం?"

"మీ ఆవిడముందు నిన్ను చిన్నవాణ్ణి చేశానని - నన్ను పెళ్ళి చేసుకోనందుకు విచారపడవులే ఇంక" -

"ఏం?"

"అన్నీ అట్లా అడుగుతావేం? చిన్నపిల్లాడిలాగ. ఎందుకో నీకు తెలీదు. ఒక్క రహస్యం చెప్పనా?"

"ఏమిటి?"

నవ్వి "నాకు వణుకు పుట్తోంది. చెయ్యి పట్టుకోనిస్తావా" అంటే నిర్ఘాంతపోయాడు. అతనిలో ప్రతి చిన్న బలహీనతనూ తడివి, బెదిరించి, కదిపి, అతని కళ్ళల్లో భయాన్ని చూసి నవ్వుకోవాలన్న ఆమె ఉత్సాహం ఎంతకూ తీరడంలేదు.

ఇప్పుడు తృప్తిగా నవ్వుకుని "పోనీ వద్దులే. నీ పాతివ్రత్యానికి భంగం" అంది.

అంతో మళ్ళీ చెప్పింది. "నిన్ను నేను పెళ్ళిచేసుకుంటే ఈ విషయం చెప్పనవసరంలేదనుకున్నాను. కానీ ఇప్పుడు చెప్తాను నీ మంచికే. నువ్వు చాలా బలహీనుడివి. నిన్ను నువ్వు పూర్తిగా భార్యకు ఇచ్చేసుకో. అంటే అర్థమవుతోంది కదూ? "

ఎంత ప్రయత్నించినా ఆమె మనస్సులో ఉన్నదేమిటో అర్థం కావడంలేదు. కాని ఇవాళ చాలా పదునైన ఆయుధాల్ని సిద్ధం చేసుకు వచ్చిందని తెలుసుకుని ఇంకేం మాట్లాడలేదు.

మళ్ళీ తనే చెప్తోంది "అన్నపూర్ణ నువ్వు చాలా గొప్పవాడివనుకుంటుంది. నీమీద ఆమెకు చాలా గౌరవం ఉందికానీ అంత గౌరవం భార్యాభర్తల మధ్య ఉండనక్కరలేదు. మాష్టారు పిల్లల్ని భయపెట్టినట్టు నిన్ను చూస్తే బెదిరిపోతే ఎలా? నువ్వు ఎంత బలహీనుడివో, ఆమె నుంచి నీకెంత ఊరట కావాలో చెప్పుకో మొదట. బహుశ అప్పుడిక నాకంటే ఎక్కువ ప్రేమించి, దయచూపుతుంది అన్నపూర్ణ."

ఏదో గొప్ప రహస్యాన్ని చెప్తున్న సిద్ధుడిలాగా దూరపు ఆకాశం వేపు చూస్తూ చెప్పింది గిరిక.

ఇన్ని విషయాలు ఎలా నేర్చుకుందా అని నిర్ఘాంతపోతున్నాడు. ఆ భాష, ఆ భావాలు స్త్రీలకే ప్రత్యేకమేమో - ***వయస్సు వచ్చిన స్త్రీలో ఒక కొత్త విజ్ఞానం మేల్కొంటుంది. ప్రేమ, కోరిక, తపన పై వారికి అనుభవం కంటే, ప్రకృతే హెచ్చు పాఠాన్ని నేర్పుతుంది. వారికి సహజంగా చాలా విషయాలు తెలిసిపోతాయి. వారి మనస్సును వయస్సు మేల్కొలుపుతుంది. అనుభవం పరిపూర్ణత్వాన్నిస్తుంది.***

"ఏం? వింటున్నావా?" అంది.

"విన్నాను. ఇక వెళ్ళమంటే వెళ్ళిపోతాను"

హఠాత్తుగా వినిపించిన ఈ కఠోక్తికి ఆమె నివ్వెరిపోయింది. అనవసరంగా ఈ విషయాలన్నీ ఎందుకు చెప్పానా అని కించపడింది. చటుక్కున ఆగి "వెంటనే వెళ్ళిపో" అంది.

ఒక్క క్షణం ఆగలేదు కాశీ. రోడ్డు పక్క నీడలోంచి నడుచుకుంటూ వచ్చేశాడు.

అతను దూరాన కనిపించకుండా మాయమయాక తన మీద అంతవరకూ కప్పుకున్న ధైర్యపు అంగి జారిపోయింది. ఇంత కృత్రిమంగా ఎలా మాట్లాడగలిగానా అనుకుంది. ఆలోచిస్తున్న కొద్దీ తన నిస్సహాయత తనకు తెలిసివస్తోంది.

ఆశ్చర్యం - ఇంటికి చేరేసరికి తనకి తెలియకుండానే తను ఏడుస్తోంది.

●●●

మూడేళ్ళు తిరక్కుండానే కుటుంబంలో మరి కొన్ని మార్పులు జరిగిపోయాయి.

మాష్టరుగారు రిటైరయి యలమంచలి చేరుకున్నారు. వెళుతూ వెళుతూ ఓ రహస్యం చెప్పి వెళ్ళారు కాశీకి. ***"మంచో చెడో ప్రతి వ్యక్తిలో ఏదో శక్తి ఉంటుంది. ప్రపంచంలో కొందరు బాగుపడకపోవడానికి ఒకటే కారణం తమ గురించి తప్ప మిగతా అందరి గురించీ ఆలోచిస్తారు. నువ్వుగొప్పవాడివి. సమర్థుడివి - నీ వల్లే ప్రపంచం నడుస్తోంది - అనుకోవడం మరిచిపోకు"***

55ఏళ్ళ మేష్టారి జీవితాన్ని పదహారేళ్ళు కాశీ చూశాడు. కానీ ఇన్నాళ్ళూ ఇంతగర్వంతో, ఇంత మదంతో బ్రతికిన విషయం ఆ కళ్ళలో, ఆ మాటలో, ఆ చిరునవ్వులో గమనించలేకపోయాడు. "అంత గర్వం అవసరమా మాష్టారూ!" అన్నాడు పిరికిగా.

"ఒక్కటే ప్రయత్నం కాశీ. నువ్వు ప్రపంచాన్ని జయిస్తావా నిన్ను ప్రపంచం జయిస్తుందా అని - ***నువ్వు ప్రపంచాన్నీ జయించకపోయినా పరవాలేదు. నిన్ను ప్రపంచం జయించకుండా చూచుకుంటే చాలు."***

ఇందులో కొన్ని బోధపడని వాక్యాలు మిగిలిపోయాయి. వయస్సు వాటికి అర్థం చెప్పగలదేమోనని మనస్సులో జాగ్రత్తగా దాచుకున్నాడు వాటిని.

ఆరు నెలలు తిరక్కుండానే అన్నపూర్ణ తల్లి న్యుమోనియాతో హఠాత్తుగా చనిపోయినట్టు తెలిసివచ్చింది. తండ్రి చనిపోవడం తెలీదు అన్నపూర్ణకి. అమ్మపోయిందంటే మొదట ఆశ్చర్యమేసింది. అది చాలా వింత విషయంలాగు పుట్టింటికి భర్తతో కలిసివస్తే ఓ పెద్ద సమస్య ఎదురుగ్గా నిలుచున్నట్టు గుర్తించింది - వసంత.

కాశీ కూడా ఏం చెయ్యాలో తెలీక సందిగ్ధంలో పడిపోయాడు.

తనని గురించి తాను ఆలోచించేంత పెరగలేదు వసంత. అందుకని నిశ్చలంగా ఉండిపోయింది.

"నలుగురి మాటల్ని మరచి బ్రతికేంత తెలీదు నాకు. మంచి చెయ్యాలని ఉన్నా మనస్సు మొరాయిస్తోంది. వసంత మీద నీకు నమ్మకం ఉంటే ఇంటికి రమ్మను. నాకేం అభ్యంతరంలేదు" అని కాశీ భార్యతో చెప్పాడు.

అన్నపూర్ణ కాస్సేపు నిశ్శబ్దంగా నిలబడిపోయింది. భర్త మనస్సులో సంకోచాన్ని గుర్తించి వణికింది. అయినా తప్పదు - ఈ నిశ్శబ్దంలో, ఈ ప్రళయంలో ఒంటరిగా చెల్లెల్ని వదిలేసి వెళ్ళేకంటే - ఆ కుటుంబంలో కలిశాక ఏమన్నా ఘర్షణలు, సర్దుబాట్లూ వస్తే వాటికి సిద్ధపడటం మంచిదనిపించింది.

మరో ఆలోచనలేకుండా వసంతను తీసుకుని ఆ దంపతులిద్దరూ తిరిగి వచ్చారు. అప్పటికి వసంతకు పదిహేను సంవత్సరాలు.

వసంతని చూసేసరికి గుండె ఝల్లుమంది కాశీ తల్లికి. వసంత కాలు పెట్టడంతో కొయ్యబారిపోయింది. ఆమె మనస్సులో డబ్బు గోడలు మరీ దళసరయి కదలనంత స్థిరపడిపోయాయి. తల్లి చావుపట్ల ఏదో కాస్త సానుభూతిని చూపడానికి సిద్ధపడుతున్న ఆవిడకి ఈ నూతన వ్యక్తి రాక క్రుద్దురాల్ని చేసింది.

ఈ విషయమై కొడుకుని కదిపి చూసింది. నవ్వాడు. "ఒక మనిషి చచ్చిపోయిందమ్మా ఆ ఇంట్లో. రెండో మనిషిని నేను చంపడం ఇష్టంలేక తెచ్చాను. అంత క్రూరంగా ఉండటం నాకెవరూ నేర్పలేదు మరి" అన్నాడు.

అంతే నరసమ్మగారు మరింకేమీ మాట్లాడలేదు.

●●●

మరి మూడు రోజులు తర్వాత ఆకాశం మబ్బుపడిన సంజెవేళ చక్రవర్తి ఆత్రుతతో పరిగెత్తుకు వచ్చి "మా నాన్నగారిని కుక్కలు కరిచేశాయి - మీరోసారి రావాలి" అంటే దిమ్మెరపోయాడు కాశీ.

"ఏ కుక్కలు?"

"మావే."

కుక్కలకి డాక్టర్ మీద కాదు, డాక్టగారు కుక్కలమీద చూపే విశ్వాసం ప్రపంచంలో ఎవరూ దేనిమీదా చూపరు. అమ్మాయి ప్రేమమీదా, చక్రవర్తి చదువుమీద చివరికి తన భార్యమీదాను. అయితే ఇవాళ ఆ కుక్కలు అతణ్ణి కరిచాక ఇంకా ప్రపంచం ఇట్లా ఎందుకు నడుస్తోందా అని విస్తుపోయాడు. జాలి కలగడంలేదు ఎంత ప్రయత్నించినా. ఆశ్చర్యం - అంతకుమించి లుబ్ధవ్యంగ్యం అంటారే? ఉన్నట్టుండి ఓ బిచ్చగాడు లేచి వెళ్ళి రాష్ట్రపతి భవనంలో మకాం వేశాడన్న ఆశ్చర్యం ఎంత పెద్దది - అలాగ.

"మీకు బాగా తెల్సా? - కుక్కలేనా?"

అంత ఆత్రుతలోనూ నవ్వాడు చక్రవర్తి. "అవునండీ. కుక్కలే. మొదట మా నాన్నగారే కుక్కల్ని కరవబోయారు. అందుకు కుక్కలు కించపడి, మనస్సులో నాలుగు రోజులు ఆ ఉద్వేగాన్ని అనుభవించిన, ఆరాటపడి - చివరికి నిన్న కరిచేశాయి."

చకితుడయి నిలబడిపోయాడు కాశీ.

"ఇక వ్యవధిలేదు. పదండి దారిలో అంతా చెప్తాను" అని చెయ్యిపుచ్చుకు ఈడ్చుకుపోయాడు.

కుక్కలు కరవడమే నిజమయితే ఇక డాక్టరుగారు బ్రతకరనిపించింది. అవి ప్రాణాల్ని తీసేంత తీవ్రంగా కరిచాయనికాదు అంత ప్రాణానికి ప్రాణంగా పెంచిన కుక్కలే తనని కరిచాయన్న ఆలోచనని డాక్టరుగారి మనస్సు భరించలేదు కనుక.

పెద్దపాము కరిచినా మనస్సు కూడదీసుకుని, మృత్యువుని ఎదిరించి బ్రతగ్గల వ్యక్తి, తన దగ్గర ఎప్పుడూ తోకాడిస్తూ తిరిగే కుక్కపిల్ల ఇంట్లో పాలుతాగేసి పారిపోతే ఆ అవిశ్వాశాన్ని భరించలేక హఠాత్తుగా చచ్చిపోతాడు. ఒకటి శరీరానికి గాయం. రెండవది మనస్సుది.

ఇదే ఆలోచిస్తున్నాడు కాశీ.

తీరా వెళితే మంచానికి అంటుకు పడుకుని ఉన్నారు డాక్టరుగారు. నిన్న సాయంకాలపు సంఘటన తరువాత ఇరవైరోజులు జ్వరం పడ్డంతగా కృంగిపోయారు. డాక్టర్ గారిని చూసి తెల్లబోయాడు కాశీ. కుడికాలు క్రింద ఎత్తుగా తలగడలు పేచి మీదకు ఒక గొలుసు కట్టారు. తలవేపు దీపం నీడలో కూచున్న నల్లటి ముఖం, చీరె అంచు ఎరుపూ తెలిసింది.

యూకలిప్టస్ ఆయల్ వాసన గదంతా వ్యాపించింది. ఏదో పాత మేగజైన్‌ని తిరగేస్తున్నారు. అతన్ని చూసి నవ్వి "నా రెండు కుక్కలికీ పిచ్చెక్కిందోయ్ - వాటికిప్పుడు తగ్గింది కాని - నాకు పిచ్చెత్తింది" అన్నారు.

ఆ సమయంలో అల్లాంటి హాస్యానికి ఎవ్వరూ నవ్వలేదు. అందరి మనస్సుల్లో వణుకునీ గుర్తించారు డాక్టర్‌గారు.

"నేను ఇంతలో చచ్చిపోతానని వీళ్ళ భయం. డాక్టర్, ఆశావాది, ఈ మృత్యువుతో పెనుగులాడినంతగా ఎవరూ పెనుగులాడరని వీళ్ళకి చెప్పు."

ఎంత పరిహాసాన్నీ సృష్టించడానికి ప్రయత్నిస్తున్న ఆ కంఠంలో నిర్వేదం తెలుస్తోంది. ఇంకా వ్యవధి ఇస్తే ఆ సంభాషణ ఎటుపోతుందోనని కుర్చీమీద కూచుని "అసలేం జరిగింది?" అన్నాడు.

"మొన్న ఒక పెద్దమనిషి వస్తే - అన్నీ కలిసి అరవడం మానేశాయి. తన గొప్పతనాన్ని గుర్తించలేదని ఆయన చిన్నబుచ్చుకున్నారు. కుక్కల్లో దేన్నయినా క్షమించగలంగాని అజ్ఞానాన్ని క్షమించలేము. (మనుషుల్లో అది తల్క్రిందులనుకో - ఎందుకంటే వాళ్ళు విజ్ఞానం ఎక్కువయిన కొద్దీ చెడిపోతారు కనుక) కోపం వచ్చి వీటికో మంచి శిక్షను ఏర్పాటు చేశాను. ఓ చీకటి గదిలో వీటిని రెండు రోజులుంచాలన్నాను. కార్పొరల్ పనిష్మెంట్. రెండురోజులు వాటికి తిండిపెట్టకుండా పడేశాను. బాగా ఆకలితో మాడిపోయాయి. మూడోరోజున వెళ్ళి చూడబోతే ఒక్క అరవడమే కాక - ఇంకా చాలా గొప్పగుణాలు వాటికి వచ్చేశాయి, ఉదాహరణకి నన్నూ అనుమానించాయి. ఫలితం - మీదపడి నన్ను కరిచాయి. మనుషులయితే ఇంత తెలివిగా పగ తీర్చుకోగలరంటావా? " తృప్తిగా నవ్వుతున్నారు. మతి చలించిందేమోనని ఒక్క క్షణం అనుమానం కలిగింది. కానీ అది నిజంకాదు. నిజంగానే అనే ప్రతిమాటా ఉద్దేశించే చెపుతున్నారు డాక్టర్ గారు. కుక్కలమీద అంత విశ్వాసం ఆయనకి.

ఒక్క విషయం మాత్రం గుర్తుకొస్తోంది. కుక్కలకి మూడురోజులు తిండిపెట్టకపోతే తమకోపానికి ప్రతీకారం చేశాయి. మరితను? కొన్ని రాత్రులు ఈయన పదవికీ, గొప్పతనానికీ, నిర్లక్ష్యానికీ, ఆకలిని అనుభవించవలసి వచ్చింది.

పదిహేనేళ్ళ జీవితాన్ని గుర్తుచేసుకుని నవ్వుకున్నాడు. "అంత చిన్న శిక్షను క్షమించలేకపోయాయి కుక్కలు. నేను చాలా క్షమించానే!" అని నవ్వుకున్నాడు కాశీ.

ఈ నవ్వుకి అర్థాన్ని తెలుసుకోలేకపోయారు డాక్టర్ గారు.

గది బయటకు వస్తే గుమ్మం నీడలో గిరిక కనిపించింది. ఆమె ముఖంలో భయాన్నీ, కంఠంలో వణుకునీ చూసి ఏమీ చెప్పలేకాగిపోయాడు.

"గిరికా!" అని పిలిస్తే అసహాయతను ప్రకటించడానికి ఆలంబనం దొరికినట్టు అతని భుజానికి తల ఆనించి ఏడుస్తోంది.

సిగ్గుతో క్రుంగిపోయాడు కాశీ. ఆమె ముఖం ఆనిన భాగం శరీరం నుంచి వేరయిపోతున్నట్టు ఆమె మీద అనుభూతికంటే, ఈ గుంజాటన ఎక్కువయింది.

"నాన్నగారు బ్రతకరు కాశీ." అంది స్పష్టతలేని మాటల్తో.

"ఛ! అలాంటి ఆలోచనలు పెట్టుకోకు. ఆయనకు మానసికమైన ధైర్యం ఉంది. అది చాలు మనిషికి - మరి 50 ఏళ్ళు బ్రతకడానికి" అన్నాడు.

కానీ మరి యాభై రోజులు కూడా బ్రతకలేదు డాక్టర్‌గారు. నెల తిరగకుండానే కాలిలో ఎముకలు క్రుళ్ళిపోవడం ప్రారంభించాయి. చనిపోవడానికి గాయమే కారణమని తేల్చారు డాక్టర్లు.

కానీ మనస్సే గాయపడి చెడిపోయిందన్న విషయం ఒక్క కాశీకి మాత్రమే అర్థమయింది.

ఓ రోజు చీకటి పడేవేళకి కన్నుమూశారాయన.

✱✱✱

**ఇవన్నీ కష్టాలేమీకాదు - మార్పులు,** ఏవో కొన్ని అట్లా జరిగిపోవాలి - ఇవన్నీ ఒక్కొక్కప్పుడు జీవితం మీద తుంపర్లు -

అయితే జీవితం మీద సుఖంతుంపర్లో, కష్టాలతుంపర్లో తెలియలేదు.

**భగవంతుడు కష్టాలు, భయం, సంకోచం, అసంతృప్తితో ఈ ప్రపంచాన్ని తయారుచేసి ఆశ, తృప్తి, ఆనందం, కాస్త పైన చిలికాడేమోననిపిస్తూంటుంది అప్పుడప్పుడు. లేకపోతే పూర్తి ఆనందం ఎందుకని కనిపించవు? కాకపోతే ప్రపంచంలో ఏ పనీ ఏ సంఘటనా ఆనందం మీద పూర్తి హామీని ఎందుకని ఇవ్వవు. ఆనందాన్ని సూచించడమే తప్పు? -**

**ఇక దుఃఖం - ప్రపంచంలో ప్రతీ వస్తువూ, ప్రతీ వ్యక్తీ - సంఘటనా దుఃఖానికి సూచనకాక హామీని కూడా ఇస్తాయి.**

**దుఃఖం నుంచి తృప్తీ, ప్రళయం నుంచి ప్రశాంతత. కన్నీటిలో సుప్త సౌందర్యాన్ని చూడగలిగిన వాడికే ఈ ప్రపంచమేమో మరి -**

డాక్టరుగారు చనిపోవడంతో చాలా విషయాలు బయటపడ్డాయి. ముఖ్యంగా ఆయన డబ్బేమీ దాచి ఉంచలేదన్న విషయం.

డాక్టరిగారికెప్పుడూ భవిష్యత్తులేదు. భూతకాలాన్ని లక్ష్యంతో బ్రతికారు. భవిష్యత్తుని నిర్లక్ష్యానికి అమ్మేశారు.

అందుకని ఆయన చనిపోయాక చాలా అప్పులు బయటికి తేలాయి.

చక్రవర్తికి 25 ఏళ్ళు వచ్చినా పసివాడుగా ఉండేటట్టు జాగ్రపడ్డారు డాక్టర్‌గారు. గిరికకు పన్నెండేళ్ళనుంచే ప్రపంచాన్నంతా ఆకళింపుకు తెచ్చుకోవడం నేర్పారు. అందుకని నాన్నగారి జీవితం రహస్యాన్ని అప్పటికి గుర్తించి నవ్వుకుంది. అంత విషాదంలోనూ "అట్లా బ్రతకడం అందరికీ సాధ్యం కాదు" అని అనుకుంది.

అప్పులన్నీ తీరేసరికి - కారు, బంగళా, పెద్దతోట అన్నీ కరిగిపోయాయి ఇన్సూరెన్సు బాపతు ఆరువేలు ఇద్దరికీ మిగిలాయి.

పాత జీవితానికి చిహ్నంగా గంగులు నౌకరుగా మిగిలాడు.

**కొందరు వ్యక్తుల్ని ధనం ప్రేమిస్తుంది. చాతనయిన వాళ్ళు దానిచేత వెట్టిచాకిరీ చేయించుకుంటారు. చేతకాని వాళ్ళు దానికి వెట్టిచాకిరీ చేస్తారు.** డాక్టరుగారితో పాటు అలాంటి హుందా, స్థాయి పడిపోయింది.

●●●

తనని అత్తగారు అసహ్యించుకునేందుకు కారణం అర్థంకాలేదు అన్నపూర్ణకు.

అందుకని ఓ రోజు అట్లాంటి ప్రసక్తి వస్తే తెల్లబోయింది.

ఏదో మాట మీద మాట పెరిగి అన్నాళ్ళూ దాచుకున్న కోపాన్నంతా కక్కేసింది నరసమ్మగారు.

"నిన్ను చూసి కాదు - చచ్చిపోయిన మీ నాన్నగారి గొప్పతనాన్ని చూసి పెళ్ళిచేశాడు అన్నయ్య - దరిద్రాన్ని పెళ్ళిచేసుకుని, బీదతనానికి కాపురం చేస్తున్నాడు వాడు."

ఈ కఠోక్తులకు నిర్విణ్ణురాలయింది అన్నపూర్ణ. వెంటనే సమాధానం ఏమీ చెప్పలేక గోడకి చేరగిలబడి పోయింది.

కానీ ఈ మాటలన్నీ ఎక్కడినుంచి విన్నదో ఏమో వసంత వెంటనే అక్కడికి చేరింది. వయస్సులోని వేగిరపాటు రక్తాన్ని రగిల్చి, ఈ మాటలు కోపంతో ఆమెను ఊగించాయి.

"మనుషుల్ని కాక పరువు మర్యాదల్ని పెళ్ళిచేసుకునేంత గొప్పవాళ్ళని తెలీదు మాకు - డబ్బుకే మీరంతా పిల్లల్ని కన్నారని తెలిస్తే - ఆ మూల పల్లెటూళ్ళోనే పడి చచ్చేవాళ్ళం - ఈ సుఖాన్ని పంచుకునే కంటే"

అట్లా విరుచుకుపడిన చెల్లెల్ని ఎలా ఆపాలో తెలీలేదు అన్నపూర్ణకు. క్రోధావమానాలతో కంఠం రుద్ధమయింది. శక్తి నశించింది. అట్లాగే స్థంభానికి చేరబడి కూర్చుండిపోయింది. కానీ అభిజాత్యమంతా ఆ మాటల్తో మంటగలిసిపోయినట్టు నరసమ్మగారు నెత్తీనోరు కొట్టుకుని కోపాన్ని ఆపుకోలేక లేచి నిలబడి ఆ వసారా అంతా పరుగులు తీసింది.

"అయ్యో! అయ్యో ఎంత మాటన్నావే. ఎంత మీకు పరువూ ప్రతిష్టలూ లేకపోతే అలా వాగుతావు - మీ అక్కయ్యకాదు, నువ్వు కాపురం చెయ్యడానికి వచ్చావు వాడితో. మీ అమ్మ చచ్చి, నువ్వు రావడంతోటే కొంపకి శని పట్టుకుంది."

ఈ మాటలకి 19 ఏళ్ళ హృదయం రెపరెపలాడింది. అంత నీచత్వం, మాలిన్యం ఎన్నడూ చూడలేదామె. కొన్ని మాటలు మరీ గుండెలోంచి దూసుకుపోయాయి.

అన్నపూర్ణ మాట్లాడలేక చెల్లెలి చెయ్యిపట్టుకుని "నన్ను చంపెయ్యదల్చుకున్నావా వసూ - నేనెట్లా బ్రతకును - నీ లాంటి మనిషిని ఇంట్లో పెట్టుకుని" అని ఏడ్చింది.

ఇక అక్కడ నిలబడలేక లోపలికిపోయి ఏడుస్తూ కూచుంది వసంత. ఆనాడు కార్యక్రమం అంతా అలా ఏడుపుల్తో ముగిసింది.

ఆ రోజు నరసమ్మగారికి కార్తీక పౌర్ణమి - ఉపవాసం. అందుకని తీరుబాటుగా తిట్లల్తోనూ, శాపనార్థాలతోనూ రోజంతా గడిపింది. దేవుడి పూజ ఎట్లాగూ లేదు కనుక, తిట్ల మధ్య 'అన్నపూర్ణ' పేరు ఎలాగూ వస్తోంది కనుక ఆ రోజుకా పుణ్యం చాలునని సరిపెట్టుకుంది. ఓ వెయ్యిసార్లయినా ఆ పేరు తల్చుకుని శోకాలు పెట్టింది.

సాయంకాలం కాశీ ఇంటికొచ్చేసరికి అంతా నిర్లిప్తత కమ్ముకుంది.

నరసమ్మగారు, దేవుడు ఒక్కసారి కనిపించిన తరువాత ఆనంద పారవశ్యంతో కలిగిన అలసటలాగా - రొప్పుతూ వాకిట్లో కూర్చుంది.

లోపలికి వస్తే అన్నపూర్ణ ఏడుస్తూ కనిపించింది. నివ్వెరపోయాడతను. పట్టుదారాల్ని చెదురుగా పడేసినట్టు, జుత్తంతా మంచం మీద పడేసుకుని నేలమీద కూచుని ఏడుస్తోంది.

ఏమిటని కదిపితే ఇంతసేపయాక ఏం చెప్పాలా అని ఆలోచించింది.

అవును. ఏం చెప్పాలి?

అతను కాళ్ళు కడుక్కుని వచ్చేలోగా ఒక విచిత్రమయిన విషయాన్ని ఆమె తెలుసుకోగలిగింది.

అట్లాంటి విషయాలు భర్తతో చెప్పడం ఎంత కష్టమో తెలిసివచ్చింది. వెంటనే కళ్ళు తుడుచుకుంది.

"నేను నిజంగా బీదదాన్నే - ఇంకెప్పుడూ నా కష్టాలు ఆయనతో చెప్పను" అనుకుంది.

అనుకుని ఊరట చెందింది.

●●●

కానీ ఆమె మ్లానవదనాన్ని చూసి, ఆ ఇంట్లో నిశ్శబ్దాన్ని చూసి, అందరి తాటస్థ్యాన్ని గమనించి - దాని కంతా ఓ అర్థాన్ని కల్పించుకోకుండా ఉండలేకపోయారు. గణపతి, శంకరం - ఇది జరిగేసరికి ఇంట్లో లేరు.

వసంత కనిపిస్తే అడిగాడు. ఇంకా దుఃఖాన్ని దాచుకోవాలన్నంత తెలీదు ఆమెకు. ఇతను అడిగేసరికి మళ్ళీ దుఃఖంతో పెదాలు వణికితే ముఖం కప్పుకుంది.

"విషయం ఏమిటి చెప్పు" అంటే -

"ఇలాగయితే అక్క చచ్చిపోతుంది బావా - బాధగా బ్రతికాంగానీ, నీచంగా బ్రతకలేదు. నువ్వు ఆమెను చూసి జాలిపడి పెళ్ళిచేసుకున్నావని ఎందుకు చెప్పలేదు?"

ఆ మాటలకి కాశీ కొయ్యబారిపోయాడు.

ఆమె ముఖంలో ఉద్వేగఛాయలు, నిబ్బరం మళ్ళీ ఆశ్చర్యపరిచాయి.

"అదేమిటి వసంతా?" అన్నాడు.

అంతా చెప్పింది.

రెండు విషయాలు ఆనాటికి స్పష్టంగా అర్థమయాయి కాశీకి. అన్నపూర్ణలో సహనం, అమ్మలో అసంతృప్తికి కారణం.

మెట్లెక్కుతూ "ఇదికూడా ఒకందుకు మంచిదే నా దగ్గర మంచి ఆస్తి ఉన్నదన్న విషయం అర్థమయింది - అన్నపూర్ణ - ఏ పరిస్థితుల్లోనూ దీనిని వదులుకోకూడదు" అనుకున్నాడు.

●●●

కానీ ఓ రోజు యాదృచ్ఛికంగా ఓ సంఘటన జరిగిపోయింది.

**సాధారణంగా మొగాడికి 'అహం' దెబ్బతిన్నప్పుడు, ఆడదానికి 'అహం' దెబ్బతిన్నప్పుడూ కోపం వస్తుంది. స్త్రీ మీద ఆధిక్యతను సాధించలనే ఆకాంక్ష పురుషుడికీ, పురుషునికి తపన తాను పూర్తిగా ఇచ్చేసుకోవాలన్న ఆకాంక్ష స్త్రీకి ఎక్కువ కనుక -**

**నిశ్శబ్దంతో స్త్రీ విధించే శిక్ష గొప్పది - మాటల్లో చాలా నిస్సహాయిత ఉంది. నిశ్శబ్దంలో ప్రళయాన్ని చూపలేని వ్యక్తి మాట్లాడి చిన్నతనాన్ని ప్రకటించుకుంటాడు.**

ఓ రోజు అలాగే అయింది. భోజనం దగ్గర ఏదో మాట మీద మాట పెరిగింది. అన్నపూర్ణ నిశ్శబ్దంగా జవాబు చెప్పకుండా ఊరుకుంటే నరసమ్మగారు కల్పించుకుని "దానితో మాట్లాడి లాభం ఏమిటి? ఈ ఇంటికి వచ్చాక బ్రతకడం నేర్చుకుని, మాటలు మరిచిపోయింది." అంది.

ఈ ఊహ నిజంగానే బాధ పెట్టింది. ఆ కోపంలో, 'అహం' దెబ్బతిన్న మనస్సు వెంటనే కూడదీసుకోలేక భోజనాన్ని వదిలేసి లేచి ఏం చేస్తున్నాడో తెలియకుండా భార్యని కొట్టాడు.

ఈ ఆకస్మిక ఉద్రేకానికి అన్నపూర్ణ ఆకులాగ రెపరెపలాడింది. ఆశ్చర్యపడడంకన్నా వ్యవధిలేక అవమానంతో, సిగ్గుతో, దుఃఖంతో కుప్పగా కూలిపోయింది.

ఉడుకెత్తిన రక్తం చల్లారి - మనస్సుకి స్థిమితం చిక్కడం ప్రారంభించాక, తన పని తనకే వెగటనిపించింది.

మేడమీద వసారాలో కుర్చీ వేసుకోబోతే చలి మరీ ఎక్కువయి పంటిని కొరికింది –

తను కొట్టినప్పుడు ఆమె ముఖం ఇంకా గుర్తుంది. అన్నపూర్ణ మేడమీదకి వస్తుందేమోనని భయమేసింది. సంకోచంతో, భయంతో, వ్యధతో మనస్సంతా ఆలోఢితమయింది. చీకటి రాత్రిలో వీధి చివరి వరకూ పేర్చినట్టు దీపాలు కనిపిస్తున్నాయి – ఏదో కొత్త మార్గాన్ని నిర్దేశిస్తున్నట్టు.

ఎవరో దూరాన చీకటిలోంచి అరుస్తున్నారు.

చీకటి తన యాత్ర ముగించుకుని తన మనస్సులో నిలిచిపోయినట్టనిపించింది.

ఆశతో బరువెక్కిన హృదయాన్ని లాగ భరించలేక మూలుగుతుంది గాలి.

చీకటికి భయపడి తూర్పు ఆకాశాన్ని పరుచుకున్న పల్చటి వెన్నెల – పడమటి ఆకాశానికి అర్థం కల్పిస్తున్నట్టున్న ఒంటి నక్షత్రం –

ఏదో ప్రళయానికి ఆ రాత్రి శక్తిని కూడదీసుకుంటున్నట్టుంది.

ఇక అక్కడ కూర్చోలేక ధోవతి తీసుకు బయటికి వచ్చాడు.

గమ్యమేదో తెలిసినట్టు మనసే మార్గాన్ని నిర్దేశిస్తోంది.

రైలు కట్ట దగ్గరికి వచ్చి – చల్లబడిన గట్టుమీద కూర్చుని ఏటిలోకి కాళ్ళు ఆనించాడు. నీరు తగిలినంత మేర వెచ్చగా ఉంది. ప్రపంచం చల్లదనాన్ని పంచుకోడానికి నీరు మొరాయిస్తోంది.

ఎప్పటివో విషయాలు గుర్తుకొస్తున్నాయి. తనకప్పుడు తొమ్మిదేళ్ళు. ఓ రాత్రి హఠాత్తుగా లేస్తే అమ్మని నాన్న చావబాదుతూండడం చూశాడు. ఎందుకో ఏడుపొచ్చింది. ఏం చెయ్యాలో తెలీక ఏడ్చాడు. అమ్మనేదో తిడుతున్నాడు నాన్న. అమ్మ నిశ్శబ్దంగా ఏడుస్తోంది.

వణికిపోతూ మంచానికి అంటుకు పడుకుండిపోయాడు.

కొంతసేపటికి నాన్న మళ్ళీ పక్కమీదకి వచ్చి పడుకోమన్నాడు. తను వణికిపోతూండడం చూసి ఆప్యాయంగా పిలిచి గుండెకు హత్తుకుని దుప్పటి కప్పాడు.

నాన్న అమ్మని ఎందుకు కొట్టేవాడు.

ఆలోచిస్తున్నకొద్దీ భయంవేసింది. ఏదో అవ్యక్తమయిన శాపం తమ కుటుంబాన్ని వెన్నాడుతున్నట్టుంది.

"భగవాన్ నాన్నలో చాలా మంచి గుణాలున్నాయి. అవన్నీ వదిలేసి ఈ చెడుపనిని నాకు ఎందుకు పంచుతున్నావ్?" అనుకున్నాడు.

నాన్నకూడా ఇట్లాంటి బాధలు పడలేకే ఆ రోజు చచ్చిపోయాడా? అందుకు ముఖ్యంగా అమ్మే కారణమా!

నాన్న చచ్చిపోవటానికి చాలారోజుల ముందే అతని మనస్సూ, ఆశలూ, ఆశయాలూ – అన్నీ చచ్చిపోయి ఉంటాయేమో!

ఆకస్మికంగా మాష్టరుగారు గుర్తుకొచ్చారు. ఉప్పెనలా దుఃఖం పొర్లుకొచ్చింది.

ఆ నిశ్శబ్దం మధ్య నిస్సహాయంగా తన ఆలోచనలకి తానె బందీ అయి దుఃఖానికి 'వెలి' అయాడు.

వయస్సంతా అనుభవాలతో వణికి వెనక్కి పోతున్నట్టుంది. వేసవి వెచ్చదనం మనస్సు వరకూ పోవడంలేదు. జీవితం పట్ల భయంతోనే చల్లబడి పీల్చిన గాలి లోపలనే గడ్డ కట్టుతోంది. శరీరానికి తాకిన ప్రతీ వెండికిరణం, గుండెల్ని చల్లదనంతో చీల్చి నిర్వేదాన్ని కలిగిస్తోంది. ఇప్పుడేం చెయ్యాలి అన్న ఆలోచనతో మాటిమాటికీ మనస్సు సందిగ్ధంలో పడిపోతోంది. 'నేను పూర్తిగా ఓడిపోయాను' అన్న ఆలోచనకు మనస్సుతో పొత్తు కుదరడంలేదు. ఇదే యౌవనంలో వేసంగి ఏమో మరి.

మేఘం లేకుండాను తుంపర్లు ప్రారంభమయినాయి. ఆకాశం కనుబొమలు ముడిచిన క్రుద్ధ వదనాన్ని గుర్తుతెస్తున్నట్టుంది. గాలికి స్థిమితంగా అంతవరకూ నిలబడ్డ రెండు మూడు చుక్కలు తుళ్ళిపోయాయి.

లేచి ఇంటి ముఖం పట్టేసరికి తుంపర్లతో శరీరం తడిసిపోయింది. జీవితమే తడిసిపోతున్నట్టనిపించింది.

అప్పటికి చాలా సమయం దాటిపోయింది. చీకటిలో ఇంటి ముందు నిలబడి "ప్రపంచం పూర్తిగా వ్యర్థుణ్ణయాను నేను" అనుకున్నాడు.

తలుపు తట్టడానికి భయం. చీకట్లోనూ ఆ కళ్ళు తనని పృచ్ఛిస్తాయి. 'నీ తప్పు నువ్వు తెలుసుకు పారిపోయావా?' అని పరిహాసం చేస్తాయి.

ఎవరో తలుపు తీశారు. ప్రతి చిన్న శబ్దం తనని ఉలిక్కిపడేటట్టు చేస్తోంది.

ఆ చీకటిలో ఎవరో గుర్తించలేక "మెల్లగా తలుపు తియ్యి వసంతా?" అన్నాడు.

తలుపు నీడలో నిలబడ్డ ఆమెను ఉద్దేశించి పదే పదే మాటల్ని సవరించుకుంటూ "అక్కయ్యను లేపకు. నేను మేడమీదకి పోయి పడుకోగలను లే" అన్నాడు.

ఆమె నవ్వుకోవడం స్పష్టంగా తెలిసింది.

"అక్కయ్య అయితే అంత భయం ఎందుకు? ఇంత రాత్రివరకూ తిరిగితే ఒళ్ళు ఏమవుతుంది?"

నిర్ఘాంతపోయాడు. ఆ గొంతు ఎవరిదో అతనికి స్పష్టంగా తెలుసు. ఏ అపయాన్ని తప్పించుకునేందుకు సంకటపడ్డాడో అదే అపాయం.

కంఠాన్ని సవరించుకుని "నా మనస్సేం బాగా లేదు అన్నపూర్ణా" అన్నాడు.

అతి ప్రయత్నంతో ఉద్వేగాన్ని ఆపుకున్నది ఆమె. "బాగులేకపోవడానికి ఏం చేశారు మీరు? నా మీద మీకు అధికారం ఉన్నదని నలుగురికీ తెలిసేట్టు చేశారు. మంచిదేగా? ఇంకెవరూ నన్నేమీ అనరు. ఎప్పుడూ ఇట్లా బయటికి వెళ్ళిపోకండి. పదండి' అని చెయ్యిపుచ్చుకుంది.

అతనింకా అక్కడి నుంచి కదలకపోవడం చూసి చకితురాలయి "అలా నిలబడి పోయారేం?" అన్నది.

మాట్లాడకబోతే దుఃఖం వస్తుందేమోనని భయం వేసిందతనికి. దైన్యత అనే కార్చిచ్చు హృదయాన్ని భస్మీపటలం చేస్తోంది. ఆమె చెయ్యికోసం చీకట్లో వెదికితే సన్నటి మెడ అందింది. "నిన్నెప్పుడూ కొట్టను అనూ!" అన్నాడు మెల్లగా.

ఆమె తెల్లబోయింది. అతని దైన్యత మరీ గుండెల్ని కోస్తోంది. "ఆ విషయాన్ని నేనప్పుడే మరిచిపోయాను" అంది అస్పష్టంగా.

ఇక తనని తాను నిగ్రహించుకోలేకపోయాడు.

ఆ చీకటి రాత్రిలో ఆమె చేతిని తన ముఖానికి ఆనించుకుని చిన్నపిల్లాడిలాగా ఏడ్చేశాడు.

●●●

డాక్టర్‌గారి సంసారం పూర్తిగా చితికిపోయింది.

**సుఖాల ముగింపు 'అసంతృప్తి' ఏమో తెలీదు.**

గిరికకేమీ విచారంలేదు. అటువంటి పరిస్థితి రాగలదన్న విషయాన్ని ఇకప్పుడన్నా ఆమె ఊహించింది. ఇక చక్రవర్తి ఇట్లాంటి విషయాలు ఆలోచించనేలేదు.

"ఒకసారయినా బీదతనాన్ని రుచి చూడకపోతే బాగులేదు. నాన్నగారు అందుకు ఓ అవకాశాన్ని కల్పించారు. భేషో" అన్నాడు.

ఓ చిన్న ఇల్లు తీసుకున్నారు ఇద్దరూ కలిసి. **అనుభవాలూ, ఆలోచనలూ స్త్రీని పెరిగేట్టు చేస్తాయి. పురుషుడు అనుభవాలతో చిన్నవాడవుతూంటాడు. అందుకనే స్త్రీకి త్వరగా మనస్సులో వృద్ధాప్యం సంభవిస్తుంది. పురుషుడిది మనస్సులో త్వరగా యవనం గూడుకట్టుకుంటూ ఉంటుంది.**

గిరిక చాలా మారినట్టు ఆమె కళ్ళలో నీడలు, నవ్వులో బరువూ, మాటలో నిలకడ, ఆలోచన ఇవన్నీ పట్టిచ్చాయి. గిరిక పెద్దతనంలో ఆకర్షణ లేదు. ఆ నిశ్శబ్దంలో ఏదో భయం కనిపించింది కాశీకి.

ఓ రోజు మళ్ళీ ఇంటికి వచ్చింది. భార్య ప్రక్కనున్నదన్న దృష్టి లేకుండా తనని చూస్తూ కూచుంది. ఏదో అపస్మారంలో ఉన్నట్లు, స్మృతి విస్మృతుల మధ్య నిట్టూర్పులాగ మధ్య మధ్య నవ్వింది.

అన్నపూర్ణ ఏమీ ప్రశ్నించలేక విస్మయంతో కూర్చుండిపోయింది.

"ఏం చూస్తున్నావలాగ?" అంటే నవ్వింది. ఎప్పుడో చిన్నప్పటి గిరిక నవ్విన నవ్వు.

"నిన్నే" అని ఇటు తిరిగి అన్నపూర్ణతో అంది. "నాకు సిగ్గుపడడం ఇంకా తెలీదండి. మీరు కొద్దిగా నేర్పాలి. ఏం ఆలోచిస్తున్నానో చెప్పనా?" అనడిగింది.

"చెప్పండి"

"ఏ విషయం మీదా అశ్రద్ధ చూపకూడదని మొదట మీరూ, తర్వాత మా నాన్నగారి కుక్కలూ నాకు పాఠాలు నేర్పాయి. ఈ విషయం నాకు మొదట తెలీదు. తెలిస్తే కాశీని మీ వరకూ రానిచ్చే దాన్ని కాదు"

అభిమానంతో, సిగ్గుతో, అవ్యక్తమయిన తృప్తితో తల ఎత్తలేకపోయింది అన్నపూర్ణ.

ఆమె మాటలు ఎంత స్నేహపూర్వకంగా ఉన్నా, ఆ మాటల్లో అర్థం ఏదో వస్తువును పోగొట్టుకున్నప్పటి వేదన చూసి నిర్విణ్ణుడయాడు కాశీ.

ఎంతకీ అన్నపూర్ణ మాట్లాడకపోవడం చూసి "ఏం నామీద కోపమా?" అంది.

"అబ్బే ఎందుకూ నేను శ్రద్ధగా చూసుకోగలుగుతున్నానా అని ఆలోచిస్తున్నాను" అని కాశీ వేపు తిరిగి

"మరి ఇవాళ ఈవిడని ఇంటివరకూ దిగబెట్టరూ!" అంది.

ఆ మాటలకి ఇద్దరూ తెల్లబోయారు. ఆమె అంతరంగంలో ఎటువంటి ఆలోచనలు రేగాయో గుర్తించి ఇక ఏమీ మాట్లాడలేదు.

"సరే, వెళ్దాము" అని కాశీ అన్నాక ఇక కూర్చునే అవకాశం లేకపోయింది.

వెళ్ళబోతూ నవ్వి అన్నపూర్ణ రెండు చేతులూ పట్టుకుంది గిరిక. "నేను చాలా పోగొట్టుకున్నాను జీవితంలో కానీ ఇంకా మనస్సు పోలేదు. భయపడకండి. మళ్ళీ కాశీని తిప్పి పంపిస్తాను" అనేసి వెళ్ళిపోయింది.

స్తబ్దురాలయి అన్నపూర్ణ గోడకి చేరబడి ఆ సంజె వెలుగులో కనిపించినంత సేపూ గిరికను చూస్తూ తన ప్రేమకు ఒక పోటీ ఏర్పడినందుకు మనస్సులో నివ్వెరపోయింది.

హఠాత్తుగా ఆమెకు గిరిక మాటలు గుర్తుకొచ్చాయి.

అక్కడికి సగం కనిపిస్తున్న వెలుగులోనికి తిరిగి మంగళసూత్రాన్ని కళ్ళకు అద్దుకుని మనస్సులో వెయ్యి దేవుళ్ళకి ఏమనో నమస్కారాలు చెప్పుకుంది.

●●●

మెట్రిక్యులేషన్ రెండోసారి తప్పాడు గణపతి. చదువుకోవాలన్న ఉత్సాహం మాట అటుంచి, పరీక్ష తప్పడం మీద భయం పెరిగి "నేనిక చదవను" అన్నాడు. వయస్సుకు తగిన చదువూ కాదు. అప్పటికే 20 ఏళ్ళు దాటిపోయాయి.

ఓ రోజు వసంతని ఆ గణపతికిస్తే బావుంటుందని అన్నపూర్ణ కదిపితే ఛరుమని లేచి శాపనార్థాలు పెట్టింది నరసమ్మగారు.

"ఎంత సిగ్గులేక అలా మాట్లాడుతావు నువ్వు. పెద్ద కొడుక్కి దక్కిన భాగ్యం చూస్తున్నాం కదూ? ఈ ఏడుపులూ, పెడబొబ్బలూ ఇంకా కొనుక్కోనక్కరలేదు" అంటూ అన్నాళ్ళూ దాచుకున్న మత్సరాన్ని ఒలకబోసింది.

ఈ మాటలకి అన్నపూర్ణ మొదట ఉలిక్కిపడింది. అంత అసహనం, అక్కసు ఆమెలో ఉన్నదని ఇంతవరకూ తెలీదు. ఏమైనా ఒక్క  విషయం మాత్రం నిజం. తాము బీదవాళ్ళే వసంతనే ఇచ్చి పెళ్ళి చేయాలని అడగడానికి తనకే అధికారం లేదు.

"దాన్నసలు ఇక్కడుంచడమే పాపం, మా కుటుంబం మీదశాపం అయిపోయింది. ఒక్కచోట దరిద్రం ప్రారంభమయితే ఇక ఆగదు. నాకు తెల్సు" అని అన్నపూర్ణ మాటల్ని ఇంకా సాగతీస్తోంది నరసమ్మగారు.

ఆ సరికి ఇంట్లో పరిస్థితులు పూర్తిగా అర్థం చేసుకుంది వసంత. అనుభవంలేనితనానికి ఉడుకు రక్తం తోడయింది. పైగా అక్కయ్య అట్లా నిస్సహాయంగా ఉండిపోవడం చూశాక వళ్ళు మండింది. ఆ ఉదాసీనతతో నరసమ్మగారి ముందు పడింది.

"మీ అబ్బాయిని చేసుకు ఊరేగాలని నాకేం కోరికలేదు. అక్కయ్య పిచ్చిగా మిమల్ని అడిగింది. ఉరిపోసుకు చస్తానే కానీ మీ అబ్బాయిని చేసుకోను. మీరేం భయపడకండి" అనేస్తే అన్నపూర్ణ, నరసమ్మగారూ దిమ్మెరపోయి శిలల్లా ఉండిపోయారు.

ఒక్క క్షణం ఈ ఉద్ధుతాన్ని తట్టుకుని మళ్ళా కేకలు, అరుపులూ ప్రారంభించింది నరసమ్మగారు.

అయితే ఇక్కడ వాళ్ళంతా ఒక్క విషయాన్ని మరిచిపోయారు. అభిజాత్యం అంతస్తుల ప్రసక్తితో గణపతి కూడా ఒక మనిషేనన్న విషయం, చదరంగంలో పావుల్లాగ అతన్ని తమకి తెలియకుండానే అంత 'చిన్న' చేశారు. అందుకు దురదృష్టం తోడయి గణపతి మేడమీద కూచుని ఇవన్నీ వినవలసి వచ్చింది. ఆ మాటలు, కేకలు ఇల్లుదాటి ఎంత దూరం వెళ్తున్నాయో అర్థమయింది. ఇక వేదన, అవమానంతో క్రుంగిపోయి తల ఎత్తలేకపోయాడు.

అంతవరకూ కొడుకును ఇవ్వడానికి వీల్లేదన్న పట్టుదల నరసమ్మగారికి పోయింది వసంత మాటలతో. ఈ మాటలు ఆవిడను మరీ రెచ్చిపోయేటట్టు చేశాయి. "చూశావా చూశావా? దీనికి నా కొడుకు సరిపోలేదని. ఇంకా మహారాజు వస్తాడులే రాణీగారి కోసం, సిగ్గు, బిడియాన్ని అమ్మేసుకున్న మనుషుల గతి ఎప్పుడూ ఇంతే" అంటూ తిట్లు లంకించుకుంది.

వసంత ఇక అక్కడ నిలబడలేకపోయింది. మనిషిలో ఎంత ఉద్విగ్నత, సూటిదనం ఉన్నా ఆ కోపంతో ఎంత వాడిగా మాట్లాడగలిగినా అన్ని మాటల్నీ, శాపనార్థాల్నీ తట్టుకోగల చేవ, వయస్సు తెచ్చిన నిభ లేకపోవడంతో ఆ మాటల్తో మనస్సు కలిచినట్టయి దుఃఖంతో లుమ్మ తిరిగింది. ఇక అక్కడ నిలబడలేక వెళ్ళిపోయింది.

వసంత కల్పించుకున్న తరువాత ఇంక ఎన్ని తిట్టినా ఏమీ అనలేదు అన్నపూర్ణ. ఆమె దుందుడుకుతనం, వేగిరపాటు ఆమె మనస్సును అందరికంటే ఎక్కువగా కల్లోలితం చేశాయి. "తిట్టండి. ఎన్నయినా అనండి దాన్ని. ఆ పాపిష్టిదాన్ని ఇక్కడికి తీసుకురావడమే తప్పయిపోయింది" అంది ఆ ఆవేశంలో.

కానీ ఎంత ప్రయత్నించినా దుఃఖం ఆపుకోలేపోయింది. ఎవరు ఏమన్నా తనామెకు అక్కయ్య. తల్లీ తండ్రీలేని చెల్లెలికి ఓదార్పు తన నుంచి కాక ఎలా లభిస్తుంది? తల్లి గుర్తుకొచ్చింది. చెల్లెల్ని ఊరడించాలని పదిసార్లు తలుపు తట్టినా తియ్యలేదు వసంత. ఇక చేసేదిలేక నిస్సహాయంగా వంటింట్లో కూర్చుని ఏడ్చింది.

కానీ ఇంకా వాకిట్లో అత్తగారి శాపనార్థాలు వినిపిస్తూనే ఉన్నాయి.

●●●

వైకుంఠ తీర్థులు ఆఫీసులో ఎప్పుడూ అంత కఠినంగా మాట్లాడలేదు. తనని మించి పెరిగిపోయిన పాపాన్ని దాచుకుందుకు చేసే ప్రయత్నంలో కళ్ళను రెపరెపలాడించి, కళ్ళజోడు రెండుసార్లు తీసి చేత్తో పట్టుకుని, కాశీతో చెప్పాలనుకుని చెప్పలేక, చివరికి అనేశాడు ''ఇలాగయితే లాభం లేదబ్బాయ్!''

ఎలాగయితే లాభం లేదో తెలియలేదు కాశీకి.

''ఏమిటి?'' అంటే

''ఈ ఫైళ్ళనీ ఇట్లా మిగిలిపోతే ఎలా చావమంటావు నన్ను? ఏ రోజూ నువ్వు పూర్తిచేస్తావనుకుంటే అబ్బగాడి పెళ్ళి తంతు చేస్తున్నావ్'' అని ఇంకా వ్రాయని ఫైళ్ళన్నింటినీ పోగు చేసి కూచున్నారు వాటిముందు.

దానికి జవాబు సిద్ధంగానే ఉంది కాశీ దగ్గర. కానీ ఆ విషయాన్ని ఎందుకు చెప్పకూడదో తెల్సునతనికి. నవ్వాడు. ఆ నవ్వులో అతను చెప్పని విషయాలన్నీ అర్థమయాయి బ్రాహ్మడికి. అర్థమయాక వళ్ళు మండింది.

''ఈ వికవికలు నా దగ్గరేమి కుదరవయ్యా అంతా నా మీద కోపంతో ఏడిపిస్తే ఎలా? పని అదీ ముఖ్యం''

''అయితే ఈ పని మీదే''

చటుక్కున లేచి నిలబడ్డాడు తీర్థులు. పొడుంతో బండవారిన ముక్కు కోపానికి రెపరెపలాడింది. తీర్థులుకి సాధారణంగా కోపం రాదు. ఆయన మొదటి పెళ్ళాం తనని కొట్టడానికి ప్రయత్నించిన రోజున ఆఫీసులో తప్ప ఎక్కడా కోపం తెచ్చుకోనని ముక్కుపొడుం డబ్బీమీద, మేనేజరు గారి రెండో పెళ్ళాం మీదా, తన పెళ్ళాం రవ్వల నెక్లెసు మీదా ఒట్టు వేసి ప్రమాణం చేశాడు తీర్థులు. (ఆ నెక్లెసు జనుపనార గిరాకీ పెరిగిన రోజుల్లో కొన్నది) అందుకని ఇప్పుడు చాలా రోజులుగా మిగిలిపోయిన కోపాన్ని తెచ్చుకుని ''ఏదీ మళ్ళీ అను'' అన్నాడు.

ఏమీ చలించలేదు కాశీ. అతనికి ఆరోజు అంత ధైర్యం ఎలా వచ్చిందో తెలియదు. **నిస్సహాయుడు, బలహీనుడు ఒక్కసారి కళ్ళు తెరిస్తే పుట్టే ప్రళయం విచిత్రమయింది.** అప్పుడలాగే అయింది.

''మళ్ళీ చెప్పినా ఇంతే. బెదిరిస్తే చెయ్యను నేను. మీరు పెద్ద కూలీ. నేను చిన్న కూలీ. స్నేహంగా బ్రతుకుదాం'' అన్నాడు.

ఇక గంగ వెర్రులెత్తిపోయాడు తీర్థులు. ''మర్రిచెట్టు కెగిరిన కాకి ఆకాశానికి ఎగరలేనా అనుకుందిట. పెద్ద కూలీలంత ఎమీ తెలీని పెద్దమ్మలనుకోకు. ఈ జుత్తు ఎంత నెరసిందో చూశావా? అంతమంది చిన్న కూలీల్ని చూశాన్నేను. మరి సాయంకాలానికి ఇదేదో తేల్చేస్తాను చూడు'' అని ధోవతి నడుంకి చుట్టి పని మధ్య నుంచి లేచిపోయేడు.

తప్పనిసరి, అవసరం కాక తన అధికారాల్ని నిర్ధారణగా చాటుకొనడానికి తీర్థులు చేసే ప్రయత్నంలా కనిపించిందది. కొందరి అభిమానులు స్తోమతును పెరిగి సుఖాన్నీ, తృప్తినీ ఫలహారం చేస్తాయి. ఎంత ప్రయత్నించీ తీర్థులు కోపానికి సబబైన అర్థం చేసుకోలేకపోయాడు.

తీర్థులు వాక్యం బ్రహ్మ వాక్యమేనని అక్కడ అందరికీ తెలుసు. అందులో గల రహస్యం వాళ్ళకి తెలుసునని కూడా మేనేజరుకి తెలుసు. హెడ్డు గుమాస్తా తలపెడితే పంది నంది కావడం ఎంత సాధ్యమో నంది పంది కావడం అంతే సాధ్యం.

ఉన్న రహస్యమల్లా ఆఫీసర్‌గారి రెండో భార్యదీ, తీర్థులదీ ఒకే ఊరు కావడం. ఇద్దరికీ ఏవో లొసుగులున్నట్టు జనవాక్యం. అది చాలు తీర్థులు గుమాస్తాల ప్రాణాలమీద కత్తికావడానికి.

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఇన్ని విషయాలు తోటి గుమాస్తాలు చెప్పాక కింకర్తవ్యతా మూఢుడయిపోయాడు కాశీ. కానీ ఓ రోజు డాక్టర్ గారింటికి వెళ్ళేరోజు మాష్టారు చెప్పిన మొదటి వాక్యం గుర్తుంది. **"జీవితంలో ఏ గొప్ప సుఖానికీ నీ అంతరాత్మనీ, ఆత్మగౌరవాన్నీ ఖర్చుచేయకు. ఏ అమూల్యమయిన ఆనందానికయినా అది చాలా పెద్ద ఖరీదు"** అన్నారు.

వెంటనే లేచాడు.

ఆఫీసర్ గారి రెండో భార్యతో, తన లౌక్యాన్నంతా ఉపయోగించి, ఆఫీసర్‌గారిని ఒప్పించి ఓ బర్తరఫ్ కాగితం సంపాయించుకు వచ్చేసరికి టేబులు మీద కాశీ రాజీనామా కాగితం చూసి కుప్పలా కూలిపోయాడు తీర్ధులు.

నలభై ఏళ్ళ జీవితంలో ఇంత చెప్పుదెబ్బ పాపం తీర్ధులకి కొత్త.

ఇరవై ఏళ్ళ సర్వీసులో మొదటిసారి తను హెడ్ గుమాస్తా ముఖంలో దైన్యతను చూసి తృప్తిగా నవ్వుకున్నారు. ముసలి గుమస్తాలంతా రాజీనామా ఇచ్చిపోయిన కుర్రాడిని మనస్సులో ప్రశంసిస్తూ.

**అన్నిటికీ మాష్టారే తనకి ప్రమాణం.**

ఉద్యోగం వదులుకున్న బాధకంటే వ్యక్తిగత విలువల్ని అంత చిన్న తాత్కాలికమైన తృప్తికోసం ఎంత సులువుగా ఖర్చు చేస్తారా అన్న ఆశ్చర్యం, విసుగు అతన్ని బాధపెడుతున్నాయి.

క్రిందపడిన వేటినయినా ఏరుకోవడానికి మిఠాయి దుకాణం దగ్గర నిలబడ్డ కుక్క చివరిసారిగా నిస్పృహ చేరుకుంది.

ఎలక్ట్రిక్ స్థంభం మీద ఆ రాత్రి చీకటికంతా వెలుగు చూసే దీపం జీవితంలో ఆశలాగ వెలిగి ఆరుతూ స్మృతి విస్మృతుల మధ్య మనస్సు సందిగ్ధతలాగా ఉంది.

ఎదురుగా వాడినమల్లెపూదండల దుకాణం వేపు చూస్తూ నడుస్తూ రెండోసారి పేవ్‌మెంటు మీంచి రోడ్డుమీద అడుగేసి తుళ్ళిపడ్డాడు కాశీ.

ఓ చిన్న కుర్రాడు కానీ కోసం తనతో పదడుగులు నడిచి, తను ఇవ్వబోతే ఇంతలో దూరాన గాలిపడగ, చూసి, పుచ్చుకోవడం మరిచిపోయి పారిపోయాడు, గుమాస్తా పండగ బోనస్ మీద మమకారాన్ని కొడుకు పుట్టాడని తెలియగానే మరచిపోయినట్టు.

సందు మలుపు తిరగాలని మరచిపోయి ఎదురుగ్గా అయ్యర్ హోటల్లోకి వచ్చి అరవంలో పలకరించిన సర్వర్‌తో ఏమనాలో తెలీక తెల్లబోయాడు కాశీ.

అంతా విసుగు.. విసుగు..

తనది కాని పనిచేస్తున్నట్టు, ప్రపంచమంతా మరెవరి కోసమో ఊడిగం చేస్తున్నట్టు, ఎవరో కనిపించని యజమాని విధించిన పనుల్ని చక్కబెడుతున్నట్టు - ప్రతీ కదలికా, ప్రతి సంఘటనా అంతే.

హోటల్‌లోంచి వస్తే కుర్రాడికి పాలిస్తూ వాడి ముఖంలో తృప్తిని చూసి డబ్బులు అడగడం మరిచిపోయింది 21 ఏళ్ళ గుజరాతీ బిచ్చగత్తె.

కానీ డబ్బాలో పడితే తుళ్ళిపడి తన కొడుకుని తననుంచి వేరు చేస్తారేమో అన్నంత భయంతో వాడిని గుండెకు హత్తుకుని చుట్టూ చూసింది. తరువాత కానీని చూసుకుని తృప్తిగా నవ్వుతోంది. ఆమెకు ముందు పళ్ళు కనిపించడంలేదు.

ఉద్యోగాన్ని వదిలేశానన్న బాధకంటే ఆలోచించిన కొద్దీ మనస్సులో పిరికితనాన్ని వదులుకోగలిగిన ధీమా తృప్తినిచ్చింది.

కానీ ఇంకా అసంతృప్తి, ఇంటిదగ్గర భార్య, తల్లి, మరదలు, తమ్ముళ్ళూ ఒక జీవితం ఒక జీవితకాలమంతా ప్రయత్నించినా తృప్తిపరచలేని సంసారం.

అతనికి భయమేసింది.

తనలాగే బయపడ్డ కుక్క ఒకటి ఓ కారు మరీ దగ్గరగా వచ్చి బ్రేక్ వేస్తే అరిచి, వెనక కాళ్ళమీద కూచుని, తనని ఆశ్చర్యంగా చూస్తున్న మనుషులకేసి చూసి, నిజంగా చచ్చిపోయనేమోననుకుని, నేలమీద తల ఆనించి ప్రాణం వదిలింది.

మనిషి కాదు కనుక, పోలీసులకేం పనిలేదు.

కళ్ళజోడు ఎక్కడో పారేసుకుని, జర్నలిస్టు ఒకడు దాని పూర్వ చరిత్రని పక్కవాడి చెవిలో నూరిపోస్తున్నాడు.

***జీవితం..జీవితం..***

***దానికి ఒక వేగం ఉంది. ఆ వేగానికి నువ్వన్నా ఒదిగి నిలబడాలి. 'చేవ' ఉంటే నీ ఆలసటను దానికయినా పంచగలగాలి. దానితో పరిగెత్తినవాడు ఎప్పుడూ నిలబడలేక పోయాడు. దానికి కళ్ళెం వేయబోయిన వాడు వేయలేక ఆ వేగానికి ఈడ్చుకుని చచ్చిపోయాడు. మరి? ఇక 'మరి' లేదు ఈ ప్రాసెస్‌కి.***

ఇంటికి అల్లంత దూరంలో ఉండగానే ఇంట్లో తల్లికేకలు విని విస్మితుడయాడు కాశీ. కొడుకుని చూసి మరింత గొంతు పెద్దది చేసి జాగ్రత్తగా మాటల్ని కూడదీసుకుని ఎదురుగ్గా లేని ఇద్దరు వ్యక్తుల్నీ ఆడిపోసుకోవడం ప్రారంభించింది.

అమ్మ సంగతి తనకు పూర్తిగా తెలుసు. ఏమీ తోచనప్పుడో, నలుగురిలో తను లోకువయిపోతున్నాననిపించి నప్పుడో అట్లా అరిచి కాస్త స్థిమితపడుతుంది. చిన్నప్పుడయితే నాన్నమీద కోపం వచ్చినప్పుడల్లా తనని కొట్టేది. అప్పుడు ఎందుకో తెలీక ఏడ్చేవాడు. కాస్త పెద్దయాక తిట్టేది. అప్పుడు నవ్వేవాడు. కానీ ఇప్పుడు నవ్వురాలేదు. ఎవరో 'సంచితం' చేసి పోయిన పాపాల విశాల స్థూపంలాగా తన జీవితం కనిపించింది. ఇన్ని సంఘటనల మధ్య.

ఆ గల్లంతుకు కాస్త క్రుద్ధుడయి, అయినా ఆవేశాన్ని తొక్కిపట్టుకుని లోపలికి వచ్చాడు. మేడమీదకి వెళితే శంకరం చెప్పాడు ఈ కథంతా.

అంతా విని దిమ్మరపోయాడు. విన్నాక అడిగిన మొదటి ప్రశ్న ఇది "వసంత ఎక్కడుంది?"

తనకు తెలీదన్నాడు శంకరం.

కిందకి వచ్చేసరికి తల్లి మళ్ళీ మొదలెట్టింది. "ఆ అందగత్తెను ఎక్కడికో పంపెయ్. లేకపోతే నేనిక్కడ ఉండను. నీకింకా ఉంచుకోవాలనుంటే దానికీ పుస్తెకట్టి ఇక్కడో నవాబుగారి జమానా ఏర్పాటు చెయ్" అని అరిచింది.

ఆ మాటలకి కాశీ కొయ్యబారిపోయాడు. గదిలో పక్కమీద కూలబడిన వసంతకూ, వంటింట్లో భోజనం పెడుతున్న అన్నపూర్ణకూ ఈ మాటలు గుండెను ఒరుసుకుపోయాయి. ఇంతగా పరిస్థితి విషమిస్తుందని అన్నపూర్ణ మొదట అనుకోలేదు. నిశ్శబ్ధంగా భర్త వచ్చి పీటమీద కూర్చోవడం తెలిసి కూడా సిగ్గుతో, ఉద్విగ్నతతో తల ఎత్తలేకపోయింది. వెలుగునీడల మధ్య ఆమె ముఖాన్ని చూసి, ఏమీ చదవలేకపోయాడు కాశీ. నిశ్శబ్ధంగా అన్నం వడ్డించింది అన్నపూర్ణ.

బయట ఇంకా తల్లి మాటలు వినిపిస్తూనే ఉన్నాయి. అక్కడ కూచుని గట్టిగా అరవడానికి ఓపిక లేక ఎవరితో చెప్పాలా అని క్షణం ఆలోచించింది. ఆలోచించి పెరటివేపు వెళ్ళి లక్ష్మీకాంతమ్మగారు, గోపమ్మగారిని పిలిచి నూతి అంచుకు చేరబడి మళ్ళా కథలా మొదటినుంచీ చెప్పుకు వచ్చేసింది నరసమ్మగారు. మధ్య మధ్య కొడుక్కి వినిపించేలాగు శ్రుతి పెంచుతోంది.

పెరట్లో కొబ్బరిచెట్టు గాలికిఎదిరించడానికి ప్రయత్నించి ప్రయత్నించి ఓడిపోయి నిస్పృహ చెందినట్టు చీకట్లో ఒక మట్టను రాలిస్తే తుళ్ళిపడింది నరసమ్మ.

"ఇట్లా వాళ్ళిద్దరు ఎట్లా రాలిపోతారా?" అంటే భోజనం తింటున్నవాడల్లా తుళ్ళిపడ్డాడు కాశీ.

ముఖం ఎత్తి అన్నపూర్ణ ముఖంలో ద్వైదీభావమేమీ కనిపించకపోవడం చూసి మరీ విస్తుబోయాడు. ఏదో ఆలోచన జవాబు లేకుండా మిగిలిపోయింది.

ప్రకృతి వైపరీత్యాన్ని తట్టుకోలేక చీకటిమధ్య కొబ్బరిచెట్టు మూలుగుతోంది.

గాలికి రెక్కతెగిన పక్షిలాగ ఎగిరిపడుతోంది వసారాలో వేలాడదీసిన దీపం.

ఏడుస్తోందేమోనని దీపం వెలుగులో ఆమె ముఖాన్ని వెదక ప్రయత్నించి మరోసారి విఫలుడయాడు.

"నాకు తెలీక అడుగుతాను. మీ చెల్లెలికి మా గణపతి సరిపోడా?"

ఆమె మనస్సు అనుకంపతో రెపరెపలాడింది. ఏమయినా సరే ఇవాళ ఆయన అడిగే ఏ ప్రశ్నకూ జవాబు ఇవ్వకూడదని నిశ్చయించుకుంది. ఆమె మనస్సులో ఆందోళన ఆ అంతర్యామికే తెలుసు. అయినా ఎంత ప్రయత్నిద్దామన్నా అవతల అత్తగారు మాట్లాడే మాటలనుంచి తన మనసుని మళ్ళించలేకపోతోంది. ప్రశ్న విన్నాక మాట్లాడబోతే కంఠం రుద్ధమయింది. సాయంకాలం నుంచీ జరిగిన సంఘటనలు ఏకమై ఆమె సహనాన్ని చంపేశాయి.

ఉదాసీనతతో అంది "అవును సరిపోడు. దానికి పెళ్ళికాకపోతే బాధలేదు. కానీ ఈ ఇంట్లోకి ఇంకో మనిషి ఛస్తే రానివ్వను."

నిర్ఘాంతపోయి అతను తలెత్తితే దుఃఖాన్ని ఆపుకోవడం తెలీక ఎర్రబడిన ఆమె ముఖాన్ని చూసి స్తబ్ధుడయిపోయాడు. ఇక ఆగలేక భర్తముందు మొదటిసారిగా గుమ్మానికి తల ఆనించి ఏడ్చేసింది.

కానీ రోజంతా తను ఎదుర్కొన్న కష్టాన్ని పంచుకోడానికి ఇక అక్కడెవరూ సిద్ధంగా కనిపించలేదు. వాళ్ళ మనసుల్లాగే, తన జీవితం పాడయింది. వాళ్ళకు అదను కనిపించింది. తనకు లేదు. మేడమీద కుర్చీలో కూర్చుంటే చల్లగాలి నిశ్శబ్దంగా ఓదారుస్తున్నట్టుంది.

జీవితంలో వెన్నెల రాత్రుల అనుభవం అతనికి తెలియదింకా. శరీరం కంటే మనస్సు త్వరగా యౌవనాన్ని వదులుకుంటున్నట్టనిపించింది.

ఒంటరిబ్రతుకు గడపడం తెలీని పిరికివాడి మనస్సులో సంశయంలాగ తూర్పు ఆకాశాన్ని ఒక నక్షత్రం వేలాడుతోంది.

నిరాశ అనే అంగీని తొడుక్కుని చీకటి మన్నుతిన్న పాములాగ అతనిపైన నిద్రపోయింది.

ఆకలి తీరని 'కుతి'తో దేనికో ప్రపంచాన్ని వెదుక్కుంటున్నట్టు విసురుగా గాలి. వీటి మధ్య ఎప్పుడు పట్టిందో నిద్రపట్టేసింది. నిద్రపట్టిందని మెలుకువ వచ్చాక తెలిసింది. ఇంకా దూరంగా పెరట్లో నరసమ్మగారి మాటలు వినిపిస్తున్నాయి. వంటగదిలో గిన్నె చప్పుడు తెలుస్తోంది.

"పెళ్ళాం వచ్చాక ఎవరూ కనిపించరులే. ఇంకొకరయితే దాని మాటలకి ఇవాళ చచ్చేవాళ్ళు. తీరా వాడి పెళ్ళాం మాటలే రుచించాయి." ఇట్లా జరుగుతోంది సంభాషణ.

ఇంకొకళ్ళ రహస్యాల్ని పంచుకుందామనే ఆశతో మనస్సంతా చెవులు చేసుకుని వింటున్నారు గోపమ్మ, లక్ష్మీకాంతమ్మాను.

ఇక ఆగలేకపోయాడు. కుర్చీలోంచి లేచి మేడదిగి వచ్చాడు పెరట్లోకి.

యుద్ధానికి ఓడి తలవంచిన సైనికుడిలాగా కొబ్బరిచెట్టు చీకటిలో ఒదిగి నిలబడింది.

"అమ్మా వాళ్ళని మొదట పంపెయ్" అని అరిచాడు ఇంకా వదలని నిద్రమత్తులో తల్లి. మాట అంటూనే లోపలికి వెళ్ళాడు. ఇంటిపనులు చక్కబెడుతున్న అన్నపూర్ణ జుత్తుపట్టుకుని ఈడ్చుకొచ్చి తల్లి ముందుంచాడు.

"రోజంతా అనవసరంగా కేకలు వేసి నోరు పాడుచేసుకున్నావమ్మా. దీన్ని కొట్టడమే నీకు కావలిసి వస్తే నీ కోపం ఆ పని చేసేవాణ్ణి. పోనీ ఇప్పుడు చూడు. నువ్వు చాలనే వరకూ కొడతాను దీన్ని" అంటూ ఒళ్ళు వంచి చేతి కర్రతో బాదాడు.

శిలాప్రతిమలాగా అచేతనమయి ఉండిపోయింది తల్లి. ఒక్కమాట ఆమె నోటివెంట వెలువడలేదు.

ఏ క్షణాన వచ్చి అడ్డుకుందో వసంత వచ్చి ఆపేవరకూ ఉద్రేకాన్ని ఆపుకోలేక పోయాడు కాశీ. తీరా చూస్తే తనే ఏడుస్తున్నట్టనిపించింది.

ఇంతసేపూ కిక్కురుమనలేదు అన్నపూర్ణ. ఈ ప్రళయం ఎందుకు జరుగబోతోందో, ఎట్లా ముగుస్తుందో ఆలోచించే లోగా అంతా జరిగిపోయింది. జడపదార్థంలాగ, అతని కోపానికి ʻఎరʼ అయి అట్లా ఉండిపోయింది.

వసంత ఆపాక అలసటను తగ్గించుకుని చేతికర్ర పారేస్తూ "నీకెప్పుడు దాన్ని కొట్టాలనిపించినా నాకు చెప్పు. నన్ను మనిషిగా కన్నావు నువ్వు. అదొక్కటే నువ్వు చేసిన తప్పు" అన్నాడు.

మరి అక్కడ నిలబడలేదు వసంత. వచ్చినట్లే మాయమయిపోయింది.

అన్నపూర్ణను నేలమీంచి లేవనెత్తి భుజానికి ఆనించుకు గదిలోకి తీసుకువచ్చి కూలవేశాడు. నేలమీద కుప్పలా కూలిపోయింది. బాధతో, దుఃఖంతో, సిగ్గుతో, వ్యథతో, నిస్త్రాణతో, ఆమె హృదయం వెయ్యి వ్రక్కలయింది. ఒక్కమాట అనడానికీ శక్తి లేకపోయింది ఆమెకి.

తలుపులు దగ్గరగా వేసుకుని నిస్సహాయంగా ఆమె పక్కన కూచుని చిన్నపిల్లాడిలాగా ఏడ్చాడు కాశీ.

●●●

"మీరు వెంటనే రావాలి. ఇట్లా మరి నాలుగు రోజులుంటే ఆత్మహత్య చేసుకుంటానేమోనని భయమేస్తోంది" అని కాశీ ఉత్తరం రాస్తే తెల్లబోయి ఆతృతతో పరిగెత్తుకు వచ్చారు మాష్టరుగారు.

వచ్చేటప్పటికి అన్నపూర్ణ మంచం పట్టి ఉంది. రెండు చేతుల్తో తల పట్టుకుని కూచున్న కాశీని చూసి విస్తుపోయారు.

అన్నపూర్ణ స్థితి కూడా విపరీతంగా ఉంది. శరీరానికి తగిలిన గాయం కంటే మనస్సుకు తగిలిన గాయం బాధ ఆమెను కృంగదీసి మంచం పట్టించింది. ఇంట్లో ఎవరూ ఆమెతో మాట్లాడడంలేదు ఒక్క కాశీ తప్ప. వసంత ఆ రోజునుంచీ భయపడి ఆమె ఎదుట పడడంలేదు.

"ఇదేమిటి కాశీ?!" అంటే

నవ్వాడు కాశీ.

"మీరు మంచిగా బ్రతకడమే నేర్పారుకానీ, పశువులాగ ఎందుకు బ్రతకకూడదో నేర్పలేదు మాష్టారూ.. ఇది నా సమర్థతకి చిహ్నం" అన్నాడు.

ప్రతీమాటకు అతని గొంతు వణకడం, హృదయం వ్యథాకులితమయి సంతప్తమయిన తీరూ కనిపెట్టారు మాష్టరుగారు. అన్నపూర్ణ నీరసంగా పెదాల్ని కదిపి పలకరించింది.

ఇంతకంటే మాటలకి అందని ప్రళయమేదో జరిగిందని అతని ముఖం చూసి గ్రహించారు మాష్టరుగారు. గ్రహించి తనుగా ఏమీ అడగలేదు.

ఎవరితోనో మాట్లాడడం గమనించి నరసమ్మగారు, వసంత, అంతా వాకిట్లో ఉన్నారనీ, ఈ మాటలని వింటున్నారని తెలియడంతోటే మొదటిసారిగా ఈ విషయాన్ని చెప్పాలనుకున్నాడు కాశీ.

"మీకో ముఖ్యమయిన విషయాన్ని చెప్పాలనుకుని పిలిచాను మాష్టరుగారూ"

శక్తిచాలక శరీరంలో ప్రతీ అవయవం తాత్సారం చేస్తున్నా, ఆయన చెప్పే విషయమేదో వినడానికి కళ్ళల్లోకి ఆత్రుత తెచ్చుకుంది అన్నపూర్ణ.

తెల్లబోయారు మాష్టరుగారు. "ఏమిటది కాశీ?" అన్నారు.

"నా ఉద్యోగం పోయింది మేష్టారూ"

ఆరు రోజుల తరువాత మొదటిసారిగా ఈ ఇంట్లో విషయాన్ని చెప్పాడు.

తుళ్ళిపడడానికి కావలసిన శక్తిని మాత్రం ఆమె బలహీనపు నరాలు ఇచ్చాయి. నీరసంగా తల ఎత్తింది. ఆ మాటల్లో నిజాన్ని ఇంకా మనస్సు అంగీకరించడం లేదు. రక్తంలో ఎరుపంతా ఆ కళ్ళల్లోకి పాకినట్టయింది. అయినా ఆశ్చర్యాన్ని నీరసం తినేసి, నిస్పృహను మిగిల్చిందక్కడ.

ఇంకా నిర్ఘాంతపోతున్నారు మేష్టరుగారు.

"అవును, మాష్టరుగారూ, ఆఫీసులో పరిస్థితులు బాగోలేవు. తలవంచి బ్రతకడం తెలీదు నాకు. ఇంట్లో ఈ విషయాన్ని వినేవారెవరూ కనిపించలేదు. కష్టం వల్లకాదు, కష్టానికి తగిన ఓదార్పు దొరక్కపోవడం మనస్సుమీద పెద్ద శిక్ష అయితీరుతుంది. ఈ విషయాలన్నీ చెప్పుకుందామని మిమ్మల్ని పిలిపించాను" అన్నాడు.

ఈ మాటలకి వాకిట్లో అందరూ కొయ్యబారిపోయారు.

తర్వాత విషయాన్నంతా విపులంగా వసంత చెప్పింది మాష్టరుగారికి. కొంచెం సేపు ఏం చెయ్యాలో అర్థంకాక అలానే కూర్చుండిపోయారు. అంతలో ఏదో తోచి "లేచిరా కాశీ అలా వెళ్దాం" అన్నారు.

ఏదో చెప్పడానికి సిద్ధపడుతున్నారని ఆయన ముఖం చూస్తూనే గ్రహించాడు కాశీ. గ్రహించి ఇంక మాట్లాడలేదు.

వెన్నెల చార బాటను కౌగిలించుకుంది. పక్కన నిలువుగా పెరిగిన సరుగుడు చెట్లమీద ఏదో చిక్కటి ద్రవాన్ని కుమ్మరిస్తున్నట్టు మనస్సు చెదిరిన చిత్రకారుడి కుంచె మరకలా ఉంది ఆకాశం.

రాళ్ళు తన్నుకుంటూ అడుగులు వేశాడు కాశీ. ఎక్కడికని అడగలేదు. మాష్టరుగారు కూడా చెప్పలేదు.

సగం కనిపించే వెలుగులో మాష్టారి వయస్సు చాలా అనుభవాన్ని దాచుకున్న నుదుటి ముడతలు చెపుతున్నాయి. ఇదివరకంత ఉత్సాహంగా నడవలేకపోతున్నారు. కొంత దూరం వెళ్ళాక జేబులోంచి కళ్ళజోడు తీసి పెట్టుకున్నారు.

తీరా చూస్తే కొంతసేపయాక క్రైస్తవుల సమాధులున్న ప్రాంతానికి తీసుకువచ్చారు. ఊరి వెలుగు అల్లంత దూరంలో తెలుస్తోంది.

ప్రపంచంలో నిశ్శబ్దమంతా ఏకీకృతమయి ఇక్కడ విశ్రమించినట్టు ఏదో ప్రళయంతో నిండిన గతానికి సాక్ష్యం ఇస్తున్నట్టు, వెన్నెల్లో పహరా ఇస్తున్నట్టు, నిలబడ్డ సమాధులను చూసి విస్తుపోతూ 'మాష్టారూ' అన్నాడు కాశీ.

మర్రిచెట్టు వెన్నెల వెలుగుని సగం ఆపింది. గుడ్డి వెలుగులో మాష్టరుగారు తలయెత్తి కాశీ ముఖంలో దిగ్భ్రమను చూసి నవ్వారు. "వీళ్ళు చచ్చిపోయారు కాశీ. మనకేమీ అపకారం చెయ్యలేరు. బ్రతికి ఉన్న చాలామంది కంటే వీళ్ళు మంచివాళ్ళు"

సగం సగం శిథిలమయిన సమాధుల మధ్యనుంచి ఏదో వెదుక్కుంటూ తిరుగుతున్నారు మాష్టరుగారు.

వెన్నెలలో నిలబడుతున్న కొద్దీ చలి, భయం ఎక్కువవుతున్నట్టుంది. మర్రిచెట్టు నీడకి వచ్చి నిలబడితే చెయ్యి కదిపితే చల్లదనం వణికిస్తోంది.

ఆ రాత్రి స్తబ్ధత ఎన్నాళ్ళుగానో మిగిలిపోయిన కథను తిరిగి తనకి చెపుతున్నట్టుంది.

మాష్టరుగారింకా ఆగలేదు. ఏదో వెదుకుతున్నారు. "ఏం వెదుకుతున్నారు మేషారూ?" అంటే

"చచ్చిపోయిన మిత్రుడి సమాధికోసం చూస్తున్నాను. జాన్ అతని పేరు. దాదాపు పదేళ్ళ క్రితం.. ఇదిగో కాశీ!" అని కేకేశారు ఉత్సాహంగా.

అయిదు అడుగుల పొడవున అన్ని సమాధులలోకీ అతి సామాన్యంగా ఉంది.

ఆ పిలుపుకు దగ్గరకు వచ్చాడు. మాష్టరుగారు సమాధి పక్కన కూచుని వణుకుతున్నారు. ఇంకా చూస్తే ఆయన ముఖంలో ఉద్రేకం, కాస్తపాటి సంతోషం కాశీకి నివ్వెరపాటును కలిగించాయి.

ఆశ్చర్యపోతూ "మాష్టరూ?" అన్నాడు.

కాసేపటి వరకూ మాష్టరుగారు మాట్లాడటం లేదు. 'కూచో' అని చేతికర్రతో సంజ్ఞచేశారు.

రుద్ధమయిన కంఠాన్ని సవరించుకుందుకు శతవిధాల ప్రయత్నించి మెల్లగా అన్నారు. "నేను చాలా గంభీరంగా కనిపిస్తాను కాశీ. కానీ నా మనస్సు అంత పిరికిది మరొకటి లేదోయ్. ఎప్పుడన్నా జీవితంలో దెబ్బ తింటే పిరికిగా ఏడవాలనిపిస్తుంది. కమల ఉంది కనుక బ్రతకగలుగుతున్నాను."

రాత్రి, ఆ ప్రాంతానికి తీసుకువచ్చి ఇక్కడ ఈ విషయాలు చెప్పడానికి కారణం ఏమిటో అర్థంకాలేదు కాశీకి.

క్షణం ఆగి ఆయనే మొదలుపెట్టారు. "ఈ ప్రపంచంలో కొడుకుని ప్రేమించడంలో గొప్పతనాన్ని ఇద్దరే నేర్పారోయ్. నాకు కొడుకులు లేరు. అయినా నా చేతుల్తో వెయ్యిమందిని పెంచాను. కానీ ఇద్దరే నా మనస్సుని తూట్లు తూట్లు చేసే ప్రేమను పంచిపెట్టిపోయారు."

సమాధి ముందు వేసిన పాలరాతి రాయిని గట్టిగా కావలించుకున్నారు. ఆయన చేతులు వణుకు, కంఠంలో అదురుపాటుని వెన్నెల నీడలు దాచలేకపోయాయి. తలయెత్తి "ఎవరో చెప్పనా?" అన్నారు మళ్ళీ.

ఏదో తెలీని పిట్ట ఆ చీకట్లో ఆశ్రయం కోసం వెతుక్కుంటూ వెన్నెల ఆకాశంలో పల్టీలు కొట్టోంది.

కళ్ళజోడు తీసి తుడుచుకుంటూ "ఆ పాలరాతి మీద ఏం ఉందో చదువు అన్నారు."

అక్షరాలు సరిగా కనిపించడం లేదు. అక్షరాలు ఎత్తుపల్లాలు ఉన్నచోట ఏవో పురుగులు గూళ్ళను కట్టుకుని ఓ వ్యక్తి చరిత్రను దాచి ఉంచాయి. "ఎ.జాన్, జననం 1909 జనవరి 16. మరణం 1939 మార్చి 3" అని చదివాడు. మనస్సు ఎందుకో తెలీని కీడును ఊహిస్తున్నట్టు కనపడుతోంది.

"ఇంకా క్రింద ఏదైనా వాక్యం ఉంటుంది చదువు" అన్నారు మాష్టరుగారు కోటుని మెడవరకూ లాక్కొని.

నిజమే. ఏదో వాక్యం కనిపిస్తోంది. చదవడానికి శతవిధాల ప్రయత్నించాడు. 'తనని తాను ప్రేమించుకోలేని వ్యక్తి, ప్రపంచాన్ని ఎట్లా ప్రేమించడమో తెలీక చచ్చిపోయాడు. నిజాయితీ అతనికి శత్రువయింది. ప్రపంచం పెద్ద ప్రళయంగా కనిపించింది. చివరికి మృత్యువు ఒడిలో అతని విశ్రాంతి దొరికింది'

ఆ వాక్యాలు చదివి తల ఎత్తితే ఆ సమాధిమీద తలానించి చిన్నపిల్లాడిలా ఏడుస్తున్నారు మాష్టరుగారు. నివ్వెరపోయాడు కాశీ.

"వీడికి ఓనమాలు నేనే వ్రాసి పెట్టాను. చివరికి వీడి సమాధి మీద వాక్యాలు కూడా నేనే రాయవలసి వచ్చింది. కొడుకు చచ్చిపోయినప్పటి దుఃఖం నాకు తెలీదు కాశీ. ఈ సమాధిని నేనే నా కమల చేతి గాజులు అమ్మి కట్టించాను. నాకే మతం మీదా నమ్మకంలేదు. మనిషి మంచితనం మీద తప్ప. వాడి తర్వాత నిన్ను ప్రేమించడం నేర్చుకున్నాను" అని ఆగారు.

ఏదో దాచుకోలేని బాధ కార్చిచ్చులాగా అతణ్ణి నిశ్శబ్దంగా దగ్ధం చేస్తుండడం గ్రహించాడు కాశీ.

వెన్నెల చారకి నల్లటి మేఘం అడ్డునిలిచింది. పక్కనే ఏదో పొగ దట్టంగా లేచింది. ఏవో పక్షులు చెట్లమీద విపరీతంగా గోల చేస్తున్నాయి. ఆ నిశ్శబ్దం మరీ భరించరానిదిగా ఉంది.

"ఇక పోదామా మాష్టారూ!" అన్నాడు. అప్పటికి మాష్టారుగారు తల ఎత్తారు.

అంతలో తేరుకుని "ఇక్కడ నుంచి వెళ్ళిపోదాం. కానీ అప్పుడే మనం ఇంటికి వెళ్ళొద్దు కాశీ. నీకు ఏం చెప్పాలని తీసుకువచ్చానో అది మరిచిపోయాను. ఇప్పుడిక నన్ను నేను కూడదీసుకుంటున్నాను" అని లేచారు.

జోళ్ళు చేత్తోపట్టుకుని కాశీ భుజం మీద సగం ఆనుకుని క్రైస్తవ సమాధులన్న ప్రాంతం నుంచి బైటికి వచ్చేశారు. దూరాన రైలుకట్ట పక్కనే పాడుపడిన జీవితపు దిగులులాగ ఎండిన పర్ర.

రోడ్డు పక్కనుంచి మెల్లగా నడకసాగించారు. ఏదో అపస్మారంలో లాగ మాష్టారి భుజాన్ని మోస్తూ నడిచాడు.

ఎప్పుడు ప్రారంభించారో చెప్పడం ప్రారంభించారు. ***"కొందరు మనుషులు బ్రతికుండినా చచ్చిపోయినా చచ్చిపోయాక గుండెల్ని కోసేసేంత ప్రత్యక్షంగా మనస్సులో బ్రతుకుతారు. మన జీవితంలో ప్రతి పనికి వాళ్ళిచ్చే సాక్ష్యంతో, వాళ్ళ జ్ఞాపకాల అలసటతో మన శక్తంతా ఖర్చు అయిపోతుంది. ప్రేమ, ఆనందం నిన్ను కృంగదీసినంతగా దుఃఖం, నిరాశ నిన్ను కృంగదీయలేవు"*** కాస్త ఆగి "నా మట్టుకు నేను జాన్ వల్లే పదేళ్ళు త్వరగా ముసలివాణ్ణయిపోయాను. వాడు ఎన్నో ఏళ్ళ క్రిందట చచ్చిపోయాడు. కానీ చచ్చిపోయాక నా మనస్సులో బ్రతకడం ప్రారంభించాడు."

మాష్టారి ప్రతీ అడుగూ తెలుస్తోంది. ఎక్కడో చూస్తూ నడుస్తున్నారు. చీకటి నీడ రోడ్డుమీద పడినచోట ఏదో జంతువు పడుకుని బరువుగా గాలి పీలుస్తోంది.

ఆ వ్యవధానం భరించరానిదిగా ఉంది. మాష్టారుగారు మళ్ళీ చెప్పడం సాగించారు. "జ్వరం వచ్చి, పదినెలలు తీసుకు చచ్చిపోయిన వాడిని తల్చుకుంటే అంత బాధ ఉండదు. కారణం కనిపిస్తుంది కనుక కాస్త ఉపశమనం ఉంటుంది. కానీ మనస్సులో ఏదో భాగం చెడిపోయి తన కోసం కాక, తన మనస్సులో పిరికితనం, భయం, చేతగానితనానికి ఆహుతయి చచ్చిపోతాడే ఆ చావు ఎవరికీ రాకూడదంటాను. జాన్ అలాగే చచ్చిపోయాడు. వాడికి అన్నీ నేర్పాను. కానీ బ్రతకడం ఎలాగో నేర్పలేదు. మంచితనం, నిజాయితీనీ చెప్పాను. కానీ వాటిని ఎట్లా వినియోగించుకోవాలో నేర్పలేదు. పెళ్ళయిన పదినెలలకి ఉత్తరం వ్రాస్తే వెళ్ళాను. మరి మూడురోజులకి ఇక్కడికి తీసుకువచ్చి సమాధి చేశాను."

ఇప్పుడిక ఏడవడం లేదు, మాష్టరు. కాశీ భుజాన్ని బలంగా పట్టుకున్నారు. చివరిమాట అని నిర్వేదం తెచ్చిపెట్టుకు న్నారు. అంతలో ఆగి కాశీ రెండుచేతులూ పట్టుకుని –

"ఈ ముసలి హృదయానికి ఒక దెబ్బ చాలు కాశీ. నువ్వు బాగుపడకపోతే నా గుండె పగిలిపోతుంది. ఇవాళ నీ ఇంటి పరిస్థితి చూస్తే నాకు ఎందుకో భయం వేసింది. నేను నీకంటే పిరికివాణ్ణి. అందుకే నిన్ను తీసుకువచ్చి ఇవన్నీ చెప్పి, నా దుఃఖాన్ని పంచాను"

గొంతు తడి అందడం లేదు. కాశీ మనస్సు రాను రాను వేదనాకులితమయింది.

"నన్నేం చెయ్యమంటారు మేష్టారూ?" అనడిగాడు కాస్సేపటికి కాస్సేపాగి.

మాష్టారు అతణ్ణి ఆపారు. "ఉండు ఇంకా నేను చెప్పవలసింది పూర్తికాలేదు. ఒక్క ప్రశ్న అడిగేదా మొదట?" అన్నాడు.

"అడగండి"

"అన్నపూర్ణను కొడతావుట. నిజమేనా?"

నిర్ఘాంతపోయాడు. ఆ గుడ్డివెలుగులో ముఖంలో ఆశ్చర్యాన్ని దాచుకోవడం తెలియలేదు. తలకి మరీ దగ్గరగా ఏదో పక్షి ఎగిరిపోయింది.

"ఎవరు చెప్పారు?"

"అంటే నిజమేనన్నమాటేగా?"

చాలా సేపటివరకూ మాట్లాడలేదు కాశీ. "నేను చాలా బలహీనుణ్ణి మాష్టారూ. తగినంత ధైర్యంతో బ్రతకడం నేర్పలేదు మీరు. నాబలహీనత మరీ ఎక్కువగా కనిపించినప్పుడల్లా దాన్ని దాచుకొందుకు ఈ పశుత్వాన్ని ఆధారం చేసుకుంటాను" అన్నాడు.

అంత విషాదంలోనూ ఆశ్చర్యంతో కాశీవేపు తల తిప్పి చీకటిలో అతణ్ణి వాత్సల్యంతో దగ్గరికి తీసుకున్నారు. మాట్లాడితే కంఠం మరీ బరువెక్కి పగులుతోంది.

"అన్నిటికన్నా నీలో 'మంచితనం' ఉందోయ్. అందుకే నాకు మరీ దగ్గరగా తీసుకున్నాను నిన్ను. నిజమే నీకు ధైర్యాన్ని ఇవ్వకపోవడం తప్పే. ఇవాళ ఆలోపాన్ని భర్తీ చేసుకుపోతాను"

నడిచి నడిచి కొబ్బరితోట మధ్యకి వచ్చారు. "ఇంక నేను నడవలేను కాశీ. ఎక్కడో కూర్చోవాలి మనం. ఇవాళ నాలో చాలా శక్తి ఉంది. ఇట్లాంటి రాత్రి మళ్ళీ మనకి దొరకదు."

కొబ్బరి చెట్టు నీడల్లోంచి వెన్నెల చారకట్టి ఏదో గీతలు గీసినట్టు పడుతోంది. జీవితంలో కష్టసుఖాల వెలుగునీడల్లా.

బరువుగా గాలి పీల్చుకుంటున్నారు మాష్టరుగారు. "ఎవరు ఈ విషయం చెప్పారని అడిగావు కదూ? చెపుతాను విను. మొదట శంకరం రాశాడు. నీకు చెప్పడానికి భయం. అందుకుని ఉత్తరం రాస్తే పరిగెత్తుకు వచ్చాను."

దిమ్మెరపోయాడు కాశీ.

ఏదో చెప్పడానికి మాష్టరుగారు తనని తాను సిద్ధం చేసుకుంటున్నారు. ఉండుండి ఒక్కమాట మాత్రం అన్నారు. "***ప్రకృతిని ఆధారం చేసుకు బ్రతకడానికి ప్రయత్నించిన ప్రతీ వ్యక్తీ వీగిపోతూనే ఉన్నాడు. ప్రకృతి ఏ మేధస్సు పరిమితికీ లొంగని శక్తి ఫలితం 'నిరాశ' మాత్రమే అవుతుంది. కానీ ప్రకృతిని ప్రమాణంగా చేసుకుని రంగుల కుంచెతో అనుభవాల వర్ణాలను చిత్రిస్తూండగానే ఏర్పడే చిత్రమయిన చిత్రంతో ప్రకృతి కూడా రాజీపడుతుంది. ఆ చిత్రాన్ని ఆధారం చేసుకునే బ్రతకగలగాలి. అదీ పెద్ద రహస్యం.***"

చీకట్లో ఏదో రాయి మీద గెంతుకుంటూ పోయింది. చల్లగాలి రివ్వున వీచింది. ఆ మాటల్లో చాలా విషయాలు అర్థం కాలేదు కాశీకి. అతని కళ్ళల్లో ప్రశ్నను గుర్తించి మళ్ళీ వివరించారు మాష్టరుగారు. "***ప్రపంచం ఒక నాటుపనిముట్టు కాశీ. దానిని నీ అవసరాలకు తగినట్టు పదునుపెట్టాలి. నువ్వు చెప్పినట్టు ప్రపంచం మారదు. తెలివిగా నువ్వే దానికి అనుగుణంగా మారి నీ ప్రయత్నాలను సాధించగలగాలి. అంతేకానీ, నేను కోరుకున్నది లభించడం లేదని, బాధపడే వ్యక్తి జీవితాన్ని పట్టం కట్టుకుంది. నీకు లభించిన సాధనాన్ని ఎంత తెలివిగా ఉపయోగించుకోగలనా అని, ఆలోచించాలిగాని, ఏది లభించలేదో ఊహించుకుని నిరాశ చెందడం వల్ల లాభం లేదు. అంటే తప్పు మార్గాలు తొక్కమనర్థం కాదు. ఈ నీతి, ధర్మం, సంఘం ఇవన్నీ ఉండనే ఉండాయి. మనం ప్రయత్నించినా ఇవి వదలవు మనల్ని.***"

మాష్టరుగారు చెప్పదలచుకున్న విషయం ఓ కొలిక్కి వచ్చింది. దీనికి చిన్న జవాబుని కూడా సిద్ధం చేసుకున్నాడు. ముణుకుల మీద తల ఆనించి మెల్లగా అన్నాడు. "నాకు ఏ ప్రయత్నమూ సాధ్యం కాలేదన్న అసతృప్తి ఉండదు మేష్టారూ! సాధించడానికి ప్రయత్నం చెయ్యలేకపోతున్నాననే కించా, నామీద నాకు విసుగు. పువ్వు రంగుల్తో ఠీవిగా ఒళ్ళు విరుచుకోకపోతే పోనీ, అసలు పువ్వుకి వయస్సు రాకపోతే ఎట్లా?"

మూడోక్లాసు కుర్రాడు లెక్క తప్పు చేసినప్పుడు, వాత్సల్యంతో సరిదిద్దేప్పుడు నవ్వేంత హుందాగా నవ్వారు మాష్టరుగారు. ఆ ప్రశ్నకు ఆయన పొదిలో బాణం ఉండనే ఉంది. అసలు విషయానికి వచ్చామని అనుకుని మనస్సులో చాలా సంతోషిస్తూ మాటల్ని కూడదీసుకున్నారు.

"ఈ ఒక్క విషయమే నీకు చెప్పాలనుకున్నాను కాశీ. ఇది చెప్పలేదు కనుకనే జాన్ చచ్చిపోయాడు. ఇక నీకు ఈ రహస్యం దాచి ఆలశ్యం చెయ్యను. ***చెట్టును నాటాక పువ్వుకోసం ఎదురుచూస్తూ దాని ముందు కూచుని తపస్సు చేస్తూ ఉంటాడనుకో ఒక వ్యక్తి మరొక వ్యక్తి దేవుణ్ణి మనసులో నిలుపుకుని పువ్వును చెట్టు సృష్టించడానికి కావలసిన సపర్య అంతా చేస్తాడు. సపర్య చేస్తున్నంత మాత్రాన అతని మనసులో దేవుడు లేడని కాదు. దేవుని గుర్తింపు మంచిదే ఇక్కడ. కానీ అంతకు మించి నువ్వు చేసేపని ముఖ్యం. నువ్వు ఎంత శ్రద్ధగా ప్రార్థన జరిపావు అనికాక, నువ్వు ఎంత శ్రద్ధగా మొక్కను పెంచడానికి కృషి చేశావు అన్న ప్రశ్నపై ఫలితం ఆధారపడి ఉంటుంది'*** అని ఇటు తిరిగి "మొక్క నీ జీవితం అనుకో. ఫలితాలు ఆ పువ్వులయితే నీ సమస్య పారిపోతుంది ఆ ఉవాచ?"

చల్లగాలి వెయ్యకపోయినా అతని శరీరం విచిత్రంగా వణుకుతోంది. మనస్సు తెలీని ఆరాటం పడుతోంది. ఈ రాత్రి చీకటి మధ్య కూచుని మాష్టరుగారు తన మనస్సుకు శస్త్రచికిత్స చేస్తున్నట్టనిపించింది. మాష్టరుగారు ప్రశ్నలు అడిగి, సమాధానం కోసం ఎదురు చూసే వ్యవధానం, ఆ నిశ్శబ్దం, భరించరానిదిగా ఉంది.

ఆయన ఆగగానే "ఇంకా చెప్పండి మాష్టరుగారూ! అంతా విన్నాక నా మనస్సును మీ సూచనలకు పోల్చి చూసుకుంటాను" అన్నాడు.

సత్యానికి దగ్గరగా వస్తున్నప్పటి దిగ్భ్రమ, భీతి అవిశ్వాసభిత్తి కూలడం ఇవన్నీ ఆ కంఠం వణుకులో పొడగట్టడంతో తృప్తికరంగా తలపంకించారు మాష్టరుగారు. అలా చెపుతూనే పోతున్నారు. "నీ జీవితంలో నువ్వు చేసే ప్రతీపనికి ఎవరికీ జవాబు చెప్పుకోవలసిన పనిలేదు. ఎవరూ నువ్వేం చేశావని అడగరు. కానీ ఒకరికి మాత్రం నీ పనుల ప్రసక్తి అవసరం అది నీ మనస్సు. అందువల్ల ప్రతిపనీ నీ మనస్సుకు అతికేటట్టు, నీ మనస్సు చెప్పినట్టు నువ్వు చేసుకుపోవాలి."

"కానీ ***ఈ బలహీనతలు"***

***"అవి ఏదో ఒక రూపంలో ప్రతీవ్యక్తికీ ఉంటాయి. ఎంత ప్రయత్నించే ఒక్కరోజులో వాటిని దూరంగా త్రోసి పారెయ్యలేవు నువ్వు. చెడ్డ అలవాట్లను 'నువ్వు 'గా ప్రయత్నించి వదులుకోలేవు. చెడ్డ అలవాట్లే నిన్ను వదిలిపోయే పరిస్థితి తీసుకురవాలి. అంటే మరేం లేదు. వాటిని ఎదిరించి నిలబడగల మంచి అలవాట్లను చేసుకోవాలి. అవి చెడ్డవాటిని త్రోసి పారేస్తాయి."***

మళ్ళీ కాశీ మాట్లాడతాడేమోనని ఎదురు చూశారు మాష్టరుగారు. కానీ అతనేదో ఆలోచిస్తున్నాడు. వ్యవధి ఇవ్వక మళ్ళీ వెంటనే చెప్పారు. ***జీవితంలో మరొకరి సహాయాన్ని పొందడం ఎంత కష్టంలోనయినా మన పిరికితనాన్నే చెపుతుంది. మన కోపాలకు, జీవితంలో పరాజయాలకు, అసంతృప్తులకూ దాదాపు చాలా వాటికి ఈ పిరికితనమే కారణం. చేవతో నిత్యజీవితంలోని కష్టాలను ఎదుర్కోలేని వ్యక్తి ఈ జీవితం బాగులేదంటాడు. తురాయి చుట్టుకోవడం చేతకానివాడు తలవంకర అనుకున్నట్టు. ఇందుకు ఒక్కటే మార్గం. ఫలితం***

***'నిరాశ' అని తెలిసినా ప్రయత్నించగల ధైర్యం ఉండాలి. ఆ ప్రయత్నం విఫలం కావడంలోనూ ఒక తృప్తి ఉంది. నీమీద నాకు విశ్వాసం ఏర్పడుతుంది మొదట. ఏ పనన్నా చివరంటా ప్రయత్నించగలవన్న నిర్ధారణ. అది చాలు. నీ కృషికి అది పెద్ద బహుమానమే అవుతుంది.''***

''ఎక్కడో ఇంగ్లీషులో ఒక వాక్యం ఉంది. ఆశ సూర్యుడిలాంటిదట. దానిని చూస్తూ ముందుకు ప్రయాణం చేస్తూంటే మన బాధ్యతల నీడ మన వెనక పెరుగుతూందట. ***ఆశల్ని మనస్సులో ఉంచుకుని గుర్తుచేసుకుని మరిచిపోవాలి. వాటివేపు నడిస్తేనే చాలదు. నిలబడి ఆలోచించి, వాటిని ఎట్లా సాధించాలా అన్న ఆలోచన ముఖ్యం.''***

మాష్టరుగారు అలసిపోవడం ఆయన మాట తొందరపాటులో బరువులో తెలుస్తోంది. అయినా ఏదో తెలీని వేగంతో, ఉద్రేకంతో చెపుతున్నారు మాటల్ని ఈ విషయాన్నంతా కాశీ కోసం జాగ్రత్త చేసినట్టుగా, చెప్పుకుపోతున్నారు.

***''అన్నిటికన్నా ముఖ్యం నువ్వు నువ్వేనని ఏ పరిస్థితుల్లోనూ మరిచిపోకూడదు. మానసికమైన గర్వం ముఖ్యం కాశీ. నేను కాశీని. గొప్పవాడిని. నాలాంటి వ్యక్తి ప్రపంచంలో ఉండడు. ఉండబోడు' అన్న నిర్ధారణ, మదం నీకు ఎంత బలాన్ని ఇస్తుందో ఆలోచించు. ఇంకొకరిలాగా లేవన్న ఆలోచన నీలో ఎప్పుడు ప్రారంభమయిందో, వెయ్యిరోగులు నెత్తిన కూర్చున్నట్టు బలహీనుడివయిపోతావు నువ్వు. ప్రపంచంలో చాలామంది తమ మీద తాము నమ్మకంతో, తృప్తితో బ్రతకరు. తమ మనస్సు మీదా, ఆలోచనమీదా, వ్యక్తిత మీదా అసంతృప్తి ఇవన్నీకాదు, అతని అసంతృప్తే అతన్ని మొదట తినేస్తుంది. ఎంత గొప్పగా బ్రతికావన్నది కాదు ముఖ్యం. ఎంత ధైర్యంగా బ్రతికావన్నది ప్రధానం కావాలి. పైకి ఎంత సాధువుగా ఉన్నా, మనస్సులో నీ అంత గర్వి, అహంభావి మరొకరు ఉండకూడదు. అంతే. లేకపోతే నువ్వు బ్రతకలేవు.'***

***''చిన్నప్పటి నుంచీ చిన్నపిల్లలకి నిరుత్సాహకరమైన విషయమే నేర్పుతాం.'నువ్వు అల్లరి చేస్తున్నావు. వాళ్ళ పాపలాగ ఎందుకుండకూడదు?' అంటే, ఉండలేడేమోనన్న పిరికితనం అప్పటినుంచీ ఆ చిన్న హృదయంలో ప్రారంభమవుతూంది. అయితే ఆ మాటతో అతని వెయ్యేళ్ళ భవిష్యత్తును ఆ తల్లితండ్రులు ఎట్లా త్రుంచి పారేస్తున్నారో అర్థం చేసుకోరు. ఇదే దౌర్భాగ్యం.''***

''నువ్వు నువ్వే అందుకు నేను అంగీకారం తెలుపకపోయినా నీకు బాధలేదు. ఈ విశాల ప్రపంచంలో నా అవసరం నీకెంత? నేను లేకుండానే నువ్వు బ్రతగ్గలవు. ఆ ధైర్యం కావాలి. ***నువ్వు ఎంత ప్రయత్నించి 'ఏది కాలేవో' దానిని గురించి ఆలోచించకు. ఎంత ప్రయత్నించీ దేనిని విశ్వసించలేవో దానిని మరిచిపో. భవిష్యత్తు నిన్ను తయారు చేయదు. నువ్వే ఉజ్వలమైన భవిష్యత్తును సిద్ధం చేసుకోవాలి. ఇట్లా ఆలోచిస్తే నీ పిరికితనం, భయం, అసంతృప్తి, నిరుత్సాహం, నీ అభివృద్ధికి ఎంత అడ్డు నిలుస్తున్నాయో అర్థమవుతుంది.''***

ఇంత చెప్పాక ఆగిపోయారు మాష్టరుగారు. ఒక్కమాట కూడా ఆయనకు తెలుసు. అందుకని ఆశ్చర్యపడలేదు. అర్థంకాని ప్రశ్నలతో ఆరాటపడుతున్న మనస్సులో ఈ విషయాలు పొదుగుకోవడం ఎట్లా అని ఆరాటపడుతున్నాను విన్నాక ప్రశ్నలు ఎంత చిన్నవో అర్థమయింది. ఈ రాత్రితో మనస్సు చెర విడి, తెలీని దీప్తితో పవిత్రంగా నిలబడ్డట్టుంది. ఏ ప్రశ్నకూ సరియైన సమాధానం దొరకలేదేమోననిపిస్తున్నా ఆలోచించిన కొద్దీ ప్రశ్న స్వరూపమే కనిపించడంలేదు.

భుజం తట్టారు మాష్టారుగారు.

''అన్నపూర్ణని కొట్టి నీ మనస్సును నువ్వే శిక్షించుకుంటున్నావు కాశీ. ఇంత చెప్పాక ఆ సంఘటనకు కారణం ఏమిటో అర్థమయి ఉంటుంది. నీమీద పెద్దశిక్షను విధించుకోవాలనుకున్నప్పుడు ప్రపంచం చాలా అల్పంగా కనిపిస్తుంది. ***ప్రపంచం గొప్పగా కనిపించిందంటే నిదర్శనం. నువ్వు గొప్పగా ఉన్నావని!*** ఇక నేనివాళ అలసిపోయాను. పోదాం పద'' అన్నారు.

సంకోచాల్ని ఆ రాత్రి చీకటిలో సన్యసించి ఆ నిర్వికార పరమ సంయమి నీడలో మెల్లగా నడిఇచి ఇంటికి చేరుకున్నాడు కాశీ.

**– అతను మరో కాశీ.**

ఆ అస్వస్థత నుంచి చాలారోజుల వరకూ తేరుకోలేదు అన్నపూర్ణ. శరీరాన్ని కాక మనస్సునే ఈ రోగం పట్టుకుని చాలారోజులు బాధపెట్టింది. తేరుకొనేసరికి ఓ విషయం చెప్పారు డాక్టర్లు ఆమె తల్లి కాబోతున్నదని.

***అసంతృప్తి, దుఃఖం, ఆవేదన, భయం మధ్య కాస్త వ్యామోహాన్ని, ఆశనూ, కోరికనూ పొదిగి ప్రపంచాన్ని ఔత్సుక్యం కలిగించే వస్తువుగా తయారుచేశాడు దేవుడు.***

***చిరునవ్వుకీ, కన్నీటికీ మధ్య ఊగే విచిత్రమయిన త్రాసు జీవితం. తూకపురాళ్ళు అనుభవాలు. ఫలితం మానవుడు.***

ఇన్నాళ్ళ కష్టాలకి, ఇన్నాళ్ళ మనస్తాపం నుంచి ఈ ఫలితం ఆటవిడుపు కనిపించింది.

మాస్టరుగారు కూడా ఊరికే తిరిగి వెళ్ళలేదు. వెళ్తూ వెళ్తూ ఉద్యోగానికి ప్రయత్నం జరిపే వెళ్ళారు. ప్రయత్నం మీద ఇంకో మంచి కంపెనీలో ఉద్యోగం దొరికింది.

ఆనాడే మాష్టరుగారికి ఉత్తరం రాశాడు కాశీ.

తల్లికూడా ఇప్పుడేం కష్టాలు తీసుకురావడం లేదు. కోడలు తల్లి కాబోతోందన్న విషయం ఆమె శాపనార్థాలకు గల అవకాశాన్ని త్రోసిపుచ్చింది.

గణపతి ఏదో చిన్న ఉద్యోగంలో ప్రవేశించాడు.

విచిత్రం.

తను క్షేమంగా ఉన్నాడన్న ఆలోచన తనని మరీ భయపెట్టోంది. ***ఎక్కువ సుఖం, ఎక్కువ ప్రేమ, ఎక్కువ ఆనందం అంత ప్రమాదకరమైన విషయాలు లేవు. పెద్ద బడబానలాన్ని హృదయంలో దాచుకు బ్రతకవచ్చు కానీ అంచులు తెగిన ప్రేమ హృదయాన్ని దావాలనంగా కాల్చివేస్తుంది.***

***చాలా సుఖం ప్రక్కనే (లేక సుఖంగా ఉన్నామనుకున్న తృప్తి ప్రక్కనే)భయం, పిరికితనం ఉన్నాయేమోననిపిస్తుంది. కొంత హాయిని సంపాదించుకున్న వాడికి దానిని దాచుకోవడం ఎట్లా అన్న పిరికితనం, ప్రేయసి ఒడిలో ప్రపంచాన్ని మరిచి, ఈ అనుభవం దూరమయాక ఎట్లా బ్రతకడమా అని తపన పడినట్టు. అందువల్లనే అనుభవం కంటే అనుభవాన్ని ఊహించుకోవడంలో ఎంతో తృప్తీ ఆనందం ఉంది. దేని గురించో ఆలోచించడం వ్యసనం మానవుడికి. తృప్తి గురించి ఆలోచించే మనస్సే దాన్ని వదులుకునే ప్రగాఢమైన విషాదాన్ని గురించీ ఆలోచిస్తుంది.***

ఆ సుఖాన్ని తనకే మిగుల్చుకోవాలన్న బాధ.

మనస్సులోని వెన్నెల ఇంత క్షణికమేమో? ఏమైనా సరే, ఈ అనుభవం ఎంత అనిశ్చితమైనా సరే దాన్ని వదులుకోనంటుంది మనస్సు. మాష్టారు, అన్నపూర్ణ, పాత అనుభవాల విషణ్ణత ఇప్పటి విశ్రాంతి ఎంత గొప్పదో చెప్తున్నట్టనిపిస్తోంది.

సాయంకాలం వేళల్లో ఎప్పుడూ రైలు కట్ట పక్క మైదానానికి షికారు వెళ్ళేవాడు. కానీ ఇప్పుడు ఇల్లు కదలడం మానేశాడు.

చీకటికి, తన మనస్సులో నిశ్శబ్దానికీ బందీ అయాడు.

"ఎందుకిట్లా కూర్చున్నారు?" అని ఓసారి అన్నపూర్ణ అడిగితే.

"నేను చాల సుఖంగా ఉన్నాను. ఈ సుఖం ఎవరన్నా స్వంతం చేసుకుంటారేమోనని భయం నాకు. అందుకని ఎక్కడికీ వెళ్ళడం లేదు" అన్నాడు.

ఆమె నవ్వింది.

●●●

***ఉఫ్! జీవితం అంటే ఏమిటసలు?***

***సాధారణంగా విషాదాంతమయే నాటకానికి సుఖం, తృప్తి రంగులు పూసుకుని, హాయిగా బ్రతుకుతున్నామన్న అభినయాన్ని చెయ్యడం, గొప్పగా నటిస్తే ప్రపంచం తెల్లబోయి చూస్తుంది. గొప్పగా నటించకపోయినా తెల్లబోయి చూస్తుంది. రంగులు జారిపోతే, నవ్వుతుంది. ఎప్పుడన్నా నువ్వు ఓ నవ్వు నవ్వితే నవ్వుతుంది. కానీ విచిత్రం. నువ్వు ఏడిస్తే ఏడవదు. అప్పుడూ నవ్వుతుంది.***

ఏమైనా గానీ, జీవితంలో వెన్నెల రాత్రులివేనేమోననిపించింది.

***<u>హృదయానికి చలి</u>***

జీవితాన్ని మంచిచెడ్డలు, ప్రేమ, సౌహార్ధం, అభిమానాలతో కాక రూపాయలు అణాలు పైసల్తో తూకం వేసుకునే ఇంట్లో పుట్టింది విజయలక్ష్మి. తండ్రి రిటైర్డు తాసిల్దారు. మొదట ఆమెను కాశీకి ఇవ్వబోయి, వీలులేక చివరికి గణపతికి ఇవ్వడానికి సిద్ధపడ్డాడు. స్తోమతు కంటే కుటుంబం స్థాయి, అభిజాత్యంపై పట్టుదల కలవాడు కావడం చేత గణపతిని కాక, కాశీలో శీలాన్ని, వారి కుటుంబపు పరపతినీ చూసే ఇచ్చాడు.

నాలుగేళ్ళ తర్వాత మాట ఇది.

గణపతి భార్య జయలక్ష్మి అన్నపూర్ణ కంటే ఆస్తితోనే ఇంటికి వచ్చింది. అమ్మాయి అందచందం, మంచితనమ్మాట అటుంచి, గుమ్మంలో ఆమెను చూస్తూనే ఉక్కిరి బిక్కిరి అయిపోయింది నరసమ్మగారు. తీరా సంతోషానికి కారణం ఆలోచించుకున్నాక జయలక్ష్మిని చూసినప్పటి సంతోషం కాదనీ వాళ్ళ నాన్నగారి జేబు బరువు చూసినప్పటి సంతోషం అనీ తేలిపోయింది.

ఇంకా ప్రపంచాన్ని పూర్తిగా చూడని గణపతి అమ్మ కళ్ళతో జయలక్ష్మి అందాన్ని కొలిచి, అన్నయ్య మనస్సుతో ఆలోచించి, డబ్బుకి మంగళసూత్రాన్ని కట్టాడు.

మరో ఆరునెలలకే అన్నపూర్ణకి కొడుకు పుడితే నరసమ్మగారు మొదటిసారిగా సంతోషించి ఇక ఆ ఇంట్లో కష్టాలు తీరిపోయాయనుకుంది.

●●●

ఆ వెన్నెల రాత్రి తనలో చాలా భాగాన్ని వాడేసుకుంది. మరి కాస్సేపు అక్కడ గడిపితే ఆ తియ్యదనంలో మత్తుకు పూర్తిగా నిస్సహాయుడయిపోతాడని భయం వేసింది. దారి వెదుక్కుంటూ ఆకాశం మధ్య ఎగురుతున్న పిట్టలు ఆ రాత్రి వెన్నెలను పుక్కిలిస్తున్నట్లు పక్కకి తిరుగుతున్నప్పుడల్లా రెక్కల మెరుపు తెలుస్తోంది.

ఆ రాత్రి హాయికి ప్రపంచమంతా సొమ్మసిల్లి వెన్నెల ఒడిలో నిద్రపోతున్నట్టుంది.

చెయ్యి కదిపితే ఇసుక చల్లదనం ఒంటిని ‘జివ్వు’ మనిపిస్తోంది. ఒకే గమనానికి పెనుగులాడుతున్న బ్రతుకుల్లాగ చంద్రుడు ముఖం చూసుకునే ఆ నీటిమీద దూరంగా అటూ ఇటూ ఊగుతున్నాయి నీడలు.

పక్కనే వాస్తవికత సాక్ష్యంలా జీవితంలో ఆశయాల గోడల్లాగ కొండ..

ఏదో మనస్సుకు సంబంధించిన వస్తువును పోగొట్టుకుని నిస్సహాయంగా రోదిస్తున్నట్టు సముద్రపుహోరు –

నెల నాటి వెన్నెల

***శరీరం కంటే త్వరగా మనస్సు ముసిలిదయితే పిరికితనం, భయం తనకు తెలియకుండానే జీవితాన్ని పెనవేసుకుంటాయి. అప్పుడిక వ్యక్తి కాక, కొన్ని సంశయాల పోగుగా బ్రతుకుతాడు. తన కోసం కాక, ఆ పిరికితనం కోసం, ఆ పిరికితనం వల్ల జీవిస్తాడు.***

***చాలా ధైర్యవంతుడికి అనిశ్చితమైన జీవితంలాగ, అతి పిరికివాడికి కాలమూ కళ్ళెం వేస్తుంది. ఆ పిరికితనాన్ని మోసుకు అట్లా బ్రతుకుతూనే ఉంటాడు.***

ఆలోచనల్ని తెంపుకుని లేచేవేళకి కాశీకి ఈ విషయమే తట్టింది.

కానీ, ఇదేమిటి? గిరికకు ఈ రాత్రిలో ఇక్కడ విశ్రాంతి తీసుకోవలసిన అవసరం ఏమొచ్చింది?

రెండడుగులు వేసి దూరాన ఇసకలో వెల్లికిలా పడుకుని నక్షత్రాలు చాందినీని ఆశతో చూస్తున్న గిరికను పోలిక పట్టి విస్తుపోయాడు.

చంద్రుడి వెలుగులో చెదిరి బలహీనంగా మెరుస్తున్న చుక్కల్ని చూస్తూ మనస్సుకి అర్థం చెప్పుకోబోయి వెయ్యోసారి విఫలమవుతోంది గిరిక.

ఆ రాత్రి నిశ్శబ్దమంతా తన కోరికల పర్యవసానాన్ని స్పష్టం చేస్తున్నట్టు సముద్రపు హోరు ఆ పర్యవసానానికే 'లయ' వేస్తున్నట్టు.

పక్కకి వచ్చి "ఇక్కడేం చేస్తున్నా?" అని కాశీ అడిగితే.

త్రుళ్ళిపడలేదు. ఇదివరకే ఇట్లాంటి విషయాల్ని చాలా ఎదుర్కొన్న మనస్సు తృళ్ళిపడడం ఎప్పుడో మరచిపోయింది.

క్షణం విస్తుపోయి చూసి "కూచో" అంది. 'నువ్వు వస్తావని నాకు తెలుసు' అన్నట్టుగా.

కావలించుకోడానికి చేతులు జాచినట్టు కోరకల బరువులాగా నురుగు మోసుకొంటూ ఆశతో వచ్చిన కెరటం కాళ్ళవరకూ వచ్చి విరిగిపోయింది. వెన్నెట్లో నురుగుని చూసి లేచి కూచుని కిలకిలా నవ్వుతూ రెండు చేతుల్తో నురుగును తీసి ముఖానికి రాసుకుంది గిరిక.

నిర్ఘాంతపోయి చూస్తూ నిలబడ్డాడు.

"ఇక్కడేం చేస్తున్నావు?" అనడిగాడు రెండు యుగాల తర్వాత ఆమె తనవేపు ముఖం తిప్పితే.

నవ్వింది. మరేదో లోకంలో ఉన్నట్టుగా ఆ అనుభూతికి మాటలే ఆటంకం అన్నట్టుగా కళ్ళను అరవిచ్చి నవ్వింది. "ఏం చేస్తున్నావు కాదు, ఏం ఆలోచిస్తున్నావు అని అడుగు"

ఏదో అపస్మారంలో ఉన్నట్టు కనిపిస్తున్న గిరికను సంకోచంతో చూస్తూ కూర్చుండిపోయాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" అన్నాడు.

మునుకుల మీద తల ఆనించి, ఇసుకను త్రవ్వి గుజ్జనగూడు కడుతోంది.

"నీ గురించే ఆలోచిస్తున్నాను"

అతనామాటలకి నిర్ఘాంతపోతాడని తెలుసు అందుకనే తల ఎత్తకుండా నవ్వి "నీ గురించి ఆలోచించినప్పుడల్లా ఇలా పిచ్చి ఎత్తుతుంది నాకు. ఇది మొదటిసారి కాదు ఇక్కడకి రావడం. ఇప్పుడర్థమయిందా?"

అతనేదో అడిగేలోపున లేచి నిలబడింది. "నీటిలో నిలబడదాం వస్తావా?"

"నేను రాను, నాకు భయం"

ఈసారి మరీ విపరీతంగా నవ్వుతోంది.

"చూశావా, నీ ప్రాణం మీద నీకు హక్కులేదు. నువ్వు చచ్చిపోవాలంటే మీ ఆవిడ పర్మిషన్ కావాలి. నీకు తెలీదేమో నువ్వప్పుడు చచ్చిపోయావు" నవ్వుతూ నీటివైపు నడిచింది.

అంతవరకూ ఆమెకోసమే నిరీక్షిస్తున్నట్టు కెరటాలు ఉవ్వెత్తున లేచి ఆమె పాదాల్ని చుంబిస్తున్నాయి. చంద్రుడికి ఎదురుగా నిలబడ్డ ఆమె ఎవరో చిత్రకారుడి చిత్తురూపంలా అవుపించింది. ఆమె చుట్టూ విరిగిన కెరటాలు, ఆ సౌందర్యపు తాకిడికి బలహీనమయిన,

జవాన్ని వదులుకు వెనక్కుపోతున్నాయి. అంత హోరునీ మించి ఆమె నవ్వు ఆ రాత్రికి 'లయ' వేస్తున్నట్టు. మళ్ళీ ఇటు తిరిగి 'రావూ!' అంటోంది.

"నువ్వు చచ్చిపోయావు" అన్న విషయాన్నే ఇంకా ఆలోచిస్తున్నాడు కాశీ.

ఆలోచించిన కొద్దీ భయం ఎక్కువవుతోంది. ప్రపంచమంటే తగని భయం పట్టుకుంది కాశీకి. ***ప్రపంచం అంటే వేరే ఏమీ లేదు. ఓ పెద్ద ఆసుపత్రి. అన్ని రకాల పేషెంట్లూ ఉంటారందులో. అవినీతి నుంచి సంతోషం, దుఃఖంలో ఆత్మ సంతృప్తి, అసత్యంలోంచి తృప్తి, కపటంలోంచి హోరు, బీదతనం నుంచి విశాంతి లభించే చోటు ఇక్కడ మృత్యువు నుంచి ఆశను సృష్టించి మృతకళేబరాలకు ప్రాణం పోస్తారు. ప్రవహింపజేస్తారు. ఒక్కదానికే ఇక్కడ మందులేదు. స్త్రీత్వం తీర్చుకునే పగకి. కానీ అన్నిటికీ ఒక ముగింపు ఉంది. ఈ ఆసుపత్రి చాలా గొప్పది. అక్కడున్నంతవరకూ సుఖమనుకునే 'తృప్తి' లోషన్ వాసన కమ్మగా ఉంటుంది. ఓ రోజు బయటపడ్డాక అసలు రోగం బయటపడుతుంది.***

ఉండుండి సన్నజాజుల వాసన గుప్పుమంది. కళ్ళుమూసుకుని "ఇంక ఏం లేదు చచ్చిపోయాను, చచ్చిపోయాను" అనుకున్నాడు మనసులో.

కళ్ళిప్పితే తడిసిన సన్నజాజుల్ని జడలోంచి తీయడానికి ప్రయత్నిస్తోంది "చూశావా తడిసిపోయాను" అంది నవ్వుతూ పక్కన కూచుని, ఆమె భుజం శరీరానికి తాకిన చోట నీటితో భుజం తడిసి గాలికి చలివేస్తోంది.

ఇంకా ఆలోచిస్తున్నాడు. "ఏమిటి ఆలోచిస్తున్నావు? మరోసారి ఇట్లాగే తడిసిపోయాను. గుర్తుందా నీకు?" అంది.

ఈసారి తుళ్ళిపడ్డాడు కాశీ.

"ఎప్పుడు?"

"ఎందుకంత ఆశ్చర్యం? నీతో నన్ను పెళ్ళిచేసుకోమని మారాంచేస్తూ నడచిన రోజు గుర్తులేదా? ఇవాళ తపనతో తడిసిపోయాను. ఆ రోజు కోరికలతో ఆశలో తడిపేశావు నన్ను" అని మళ్ళీ నవ్వి "అదేమిటో నిన్ను చూసినప్పుడల్లా కవిత్వం వస్తుంది నాకు. ఎప్పుడూ ఇట్లాగే మాట్లాడగలిగితే బావుణ్ణు"

ఇవాళ్టి ఆమె మనస్సుకి అర్థం చెప్పడం చాతకావడం లేదు. ఎందుకో ఆ సుప్త సౌందర్యాన్నీ, భయంకరమైన ఆ చిరునవ్వునీ భరిస్తూ ఉద్వేగాన్ని అణచుకుని అక్కడ ఎంతోసేపు కూర్చోలేడనిపించింది.

రెండు ఓడలూ ఎంతోసేపు తగాదాపడి తీరానికి ఇంకా దూరంగా సాగిపోతున్నట్టున్నాయి.

తడికొంగుతో ముఖాన్ని తుడుచుకుని 'అయ్యో బొట్టు చెరిగిపోయింది' అనుకుంది. కాశీ ఆశ్చర్యంగా చూస్తే "బొట్టులేకపోతే ముఖం బాగుండదు కదూ?" అని అడిగి "పోనీ జవాబు చెప్పొద్దులే" అని తన ప్రశ్నకు తనే సిగ్గుపడింది.

ఇంకా అలా స్తబ్దుగానే కూచుని గిరిక ఇట్లా ఎందుకు మారిపోయిందా అని ఆలోచిస్తున్నాడు కాశీ.

అతని ప్రతి ఆలోచనకూ జవాబు ఉంది ఆమె దగ్గర. ప్రశ్న వస్తే సరైన సమాధానాన్ని సిద్ధం చేసుకుని కూచుంది ఆమె. కానీ ఆ నిశ్శబ్దంలో మౌనంగానే ఇద్దరూ భావాల్తో తగాదాపడుతున్నారు.

ఉండుండి, చలికి కుచించుకుపోయి గిరిక అంది "మరీ అమాయకంగా కనిపిస్తే నీకు మరో పెద్ద శిక్ష విధించాలనిపిస్తుంది నాకు"

ఆ మాటలకి దిమ్మరపోయి ఇటు తిరిగాడు కాశీ.

"ఏమిటి?"

అంతలో నవ్వేసింది.

''ఒక్కోసారి నా బలహీనతకి నేనే సిగ్గుపడిపోతాను. నీ అమాయకత్వానికీ, ఓర్పుకీ కాకపోతే నిన్ను ప్రేమించేదాన్నికాదు. '' ఇంతసేపటికి తాను మాట్లాడాడు.

''కానీ చాలా ఉన్నాయి నీలో''

చీకట్లో కళ్ళు పెద్దవి చేసి అతనివేపు తిరిగింది. ''ఏదీ కాస్త చెప్పు వింటా'' అన్నది. నమ్రత కలిగిన విద్యార్థిలాగా అతని ముందు చేతులు కట్టుకుని కూచుంటూ.

నవ్వొచ్చిందతనికి ''నీ కళ్ళు చూస్తే భయం నాకింకా పోలేదు. ఇటీవల మాటల్ని పదును పెడుతున్నావు. నువ్వు ఎవర్నీ ప్రేమించలేవు. ఆ విషయం ఇంకా నీకు తెలీలేదు''

క్షణంలో ఆమె ముఖం వివర్ణమయిపోవడం అంత రాత్రిలోనూ గమనించాడు. ఉన్నట్టుండి రెండు చేతుల్తోనూ ముఖం కప్పుకుంది.

ఏడుస్తుందేమోనని అనుకున్నాడు.

భుజం మీద చెయ్యివేస్తే నీటి చల్లదనం ఏదో హెచ్చరిక చేస్తున్నట్టుంది.

''ఛీ! ఇంత మాత్రానికే ఏడవాలా?''

తల ఎత్తింది. ''నేనేం ఏడవలేదు. ఎందుకు ప్రేమించలేనో చెప్పు'' ముఖంలో ఉదాసీనత, ఉద్విగ్నత కనిపించేసరికి నవ్వుకున్నాడు.

''పోనీలే, ఆ విషయాలు ఇప్పుడు వద్దులే. పద ..పోదాం''

చెయ్యిపట్టుకు ఆపింది. ''అలాక్కాదు. ఎందుకో చెప్పాలి. లేకపోతే వెళ్ళనివ్వను.''

ఆ బీచ్‌లో వారిద్దరే ఒంటరిగా ఉండడాన్ని గమనించి సిగ్గుతో కుంచుకుపోయాడు కాశీ, కానీ ఆ ప్రశ్నకు సమాధానం తనకూ తెలీదు.

గిరిక ఎందుకు ప్రేమించలేదు? అదికాదు సరైన ప్రశ్న గిరిక ఎందుకు ప్రేమించాలి? అని ప్రశ్నించుకోవాలి. అందరూ తనని ప్రేమించాలనే ఆత్రుతతో, ఆ ఆశతో తనూ ప్రేమించాలన్న ఆత్రుతతో, ఆ ఆశతో తనూ ప్రేమించాలన్న విషయాన్ని మరిచిపోయి వెన్నెలని అనుభవించే చకోరం లాగ.

ఆమె ముఖంలో సంకోచం చూశాక నవ్వొచ్చింది.

''నువ్వు ఎవర్నీ ప్రేమించలేవు. అందరూ నిన్ను ప్రేమించాలనుకుంటావు. ఇప్పటికింతే చెప్పగలను. ఇక లే'' అన్నాడు.

ఇంకేం మాట్లాడలేదు. నెమ్మదిగా లేచి నిలబడింది. అతని ప్రక్కనే నిలబడింది. రోడ్డు మీదకి వచ్చేవరకూ ఇద్దరూ మాట్లాడలేదు. రోదించి రోదించి అలసిపోయిన మనస్సులాగ సముద్రం హోరు తగ్గి మెల్లగా మూలుగుతోంది.

నౌకల చివరి వెలుగు సముద్రం ఆవలి అంచువేపు తెలుస్తోంది.

''ఏం ఇట్లా వచ్చావు?'' అని అడిగింది గిరిక ఉన్నట్టుంది.

బాధపడ్డ మనస్సును మరింత గాయపరచుకోవడం ఇష్టంలేక మాట మార్చుతోందని గ్రహించాడు.

''ఇంటి విషయలు కాస్సేపన్నా మరిచిపోదామని'' అన్నాడు.

మాటల్లో వెనకపడింది. దగ్గరకు జరగడానికి భుజం పట్టుకు ఆపింది.

''పెళ్ళాం పిల్లలూ అంత బరువయ్యారన్నమాట''

''వాళ్ళిద్దరూ తప్పించి''

మళ్ళీ నవ్వుతోంది. ''నన్ను పెళ్ళిచేసుకోలేకపోయానని ఎప్పుడన్నా అనుకుంటావా?'' పాత పద్ధతిలోనే అడిగింది.

ఇదివరకు గిరిక ఆ ప్రశ్న అడిగితే కోపం వచ్చేది. ఇప్పుడిక తనూ నవ్వాడు.

"అనుకోకు. నువ్వు అనవసరంగా జీవితాన్ని వ్యర్థం చేస్తున్నవేమోననిపిస్తుంది."

"అంటే ఏం చెయ్యాలి? పెళ్ళి చేసుకుని పిల్లల్ని కనాలా?"

అతను "అదే గిరికా!" అన్నాడు.

రాయి తన్నుకుని, అతన్ని అనుకుని జోడు సరిచేసుకుంది. అప్పుడు నవ్వింది అతని మాటలకి.

"ఎవరిని?" అంది ఆ ప్రశ్నలు అర్థం తనకి తెలుసు. అంతకుమించి ఆమెకళ్ళల్లో అర్థం.

"అదిగో మళ్ళీ నన్నెలాగూ చేసుకోలేవని నీకు తెలుసు"

"పోనీ రెండో పెళ్ళిచేసుకో"

ఆమె కంఠంలో నిబ్బరం భయపెడ్తోంది.

"అట్లా మాట్లాడితే వెళ్ళిపోతాను"

చెయ్యి పట్టుకు ఆపింది. "నీ పెళ్ళాం మీద నీకెంత ప్రేమో మాటిమాటికీ గుర్తు చేసుకుని, నేను దాన్ని పొందలేకపోయానే అని బాధపడాలని, ఓ సరదా కోపం వస్తే నీ పెళ్ళాన్ని కొట్తావట. నన్ను తిట్టనన్నా తిట్టవు మరి"

ఆమాటలకి కాశీ నిర్విణ్ణుడయాడు. అప్రతిభుడయి తెల్లబోతే "అలా తెల్లబోకు ఇదేం పాతివ్రత్యం కాదులే. నువ్వు పెళ్ళి చేసుకోకపోతే నేను చచ్చిపోను" అంది.

ఇద్దరి పక్కనుంచి ఓ రిక్షా వెళ్ళింది. ఇద్దరూ ఒసారి తృళ్ళిపడి ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. వెనక సముద్రపు హోరు లీలగా వినిపిస్తోంది.

పదిగజాలు ముందుకు వెళ్ళిన రిక్షా హఠాత్తుగా ఆగింది. ఎవరో దిగి వెనక్కి నడిచివచ్చారు. దగ్గరకు వచ్చాక అతనిని పోలికపట్టి నివ్వెరపోయాడు కాశీ.

విజయలక్ష్మి తండ్రి శేషాద్రిరావుగారు మొదట ఏం చేయాలా అని ఆలోచించి, ఇద్దర్నీ ఓ క్షణం పరికించి నవ్వేశారు.

"రిక్షాలో స్థలం ఖాళీ ఉందోయ్ నువ్వే అయి ఉంటావనుకున్నాను. పోనీ, నేను వెళ్ళిపోనా?" అన్నారు.

కాశీ ఏం మాట్లాడుతాడా అని గిరిక కూడా ఎదురు చూస్తోంది.

"ఎప్పుడు వచ్చారు?" అన్నాడు కాశీ.

"మెయిల్ లేట్ అయింది. మీ ఇల్లు మరిచిపోయాను. ఇంతవరకూ వీడు ఊరంతా తిప్పాడు."

గిరిక తెల్లబోయింది.

మళ్ళీ ఆయన్ని పిలిచి, దగ్గరకి వెళ్ళాడు కాశీ, విస్తుపోయి ఆగారు శేషాద్రిగారు "అన్నపూర్ణ ఇంకా నా కోసం ఎదురు చూస్తుందేమో? గిరికతో తిరుగుతూండగా బీచ్‌లో కలిశానని చెప్తారా ఓసారి?"

మొదట ఆశ్చర్యంగా చూసి, అంతలో నవ్వేసి "నువ్వు చెప్పమంటే అలాగే. ఆడవాళ్ళకు ఇట్లాంటి విషయాలు రుచించవు" అని ఆయన రిక్షా ఎక్కాడు.

గిరిక ముందుకు వచ్చి "ఆయన నాతో మాట్లాడవలసిన 'పను'లేమి లేవు తీసుకు.. .." ఇంక మాటలు బయటకి రాకుండా ఆమె నోటిని బలవంతంగా మూశాడు కాశీ. ఆ చీకట్లో శేషాద్రిగారు ఇది గమనించలేదు.

రిక్షా మెల్లగా కదిలిపోయింది. కనచూపు మేరదాటి పోయాక గిరిక వేపు తిరిగి "నన్ను పూర్తిగా నాశనం చెయ్యాలనుకున్నావా నువ్వా - త్వరగా ఇంటికి పద. నిన్ను దిగబెట్టి వెళ్తాను" అన్నాడు.

నోటికి కొంగు అడ్డం పెట్టుకుని పకపక నవ్వసాగింది గిరిక. "పాపం, నీకు చాలా కష్టాలు వచ్చాయి నా వల్ల. అబద్ధం ఆడడమన్నా తెలీదు నీకు, మీ ఆవిడతో చెప్పడానికి అయితే పద" అని తొందరగా నడిచింది.

●●●

కాశీ భోజనం చేసి మేడమీదకి వచ్చేసరికి శంకరం వచ్చాడు. వసారాలోకి కుర్చీ లాక్కుని నడుం చేరవేసే వరకు స్థంభం నీడలో నిలబడి ఇక అప్పుడు ముందుకు వచ్చాడు.

ఇల్లంతా హడావిడిగా ఉంది. శేషాద్రిరావుగారు ఊరికేరారు ఓ పదిరోజులకి సరిపోయే విశేషాల్ని, వీలయితే మరి ఇద్దరు స్నేహితుల్ని వెంటబెట్టుకుని వియ్యాల వారింటిలో బైఠాయిస్తారు. భోజనం చెయ్యడంలాగ, నిద్రపోవడంలాగా, మాట్లాడడం ఆయనకు వ్యసనం.

ఆడవాళ్ళంతా భోజనం చేశాక అందర్ని వసారాలో కూర్చోపెట్టి టూకీగా ప్రపంచ రాజకీయాల్ని భారత యుద్ధ పరంగా తర్జుమా చెపుతున్నారు.

మర్నాటికి పంచదార అప్పు పుట్టుందేమో కనుక్కుపోదామన్న పక్క ఇంటి దొడ్డమ్మగారు, నారాయణాష్టకంలో నాలుగో చరణం మరచిపోయి నరసమ్మగారి దగ్గర నేర్చుకుపోదామని వచ్చిన లలితమ్మగారు - ఈ సంభాషణ ఉధృతానికి తట్టుకోలేక గోడలకి చేరబడిపోయారు. శేషాద్రి రావుగారికి మంచి ప్రేక్షకులు కుదిరారు. అమ్మాయి తాంబూలం తెచ్చి ఇచ్చాక విజృంభించారు.

"రష్యావాడిని కౌరవసేన అనుకుందామండీ - ఇక శకునిమామ ఉండాలిగా సింపుల్‌గా దిగాలనుకుంటే పోయింది. మరి కృష్ణుడెవరో తెలుసా? జవహర్ లాల్ నెహ్రూ! ఆ కాలంలో మొదట మాట్లాడుకుని అస్త్రాలు ప్రయోగించుకున్నారు. కానీ ఈ కాలంలో అస్త్రాలు ప్రయోగించచక మాట్లాడుకుంటున్నారు. అదీ ఇంప్రూవ్ మెంటు"

కళ్ళుమూసుకుని ఆలోచిస్తున్నాడు కాశీ.

***జీవితంలో అన్నీ పోగొట్టుకున్నవాడు నైరాశ్యాన్నీ దాచుకుందుకు మాటల్ని సాధనం చేసుకుంటాడు. జీవితంలో ఏమీ పోగొట్టుకొందుకు లేనివాడు మాటల్ని ఆశయించు కొంటాడు. జీవితం మీద, ప్రపంచం మీద భక్తి ప్రపత్తులున్న వాడికే మాటలు దొరకవు. మాట్లాడే సమయమూ దొరకదు.***

ప్రపంచ యుద్ధానికి రామరావణ యుద్దానికి ఏవో పోలికలున్నాయని శేషాద్రిగారు చెపుతున్నారు.

"ప్రపంచం అవ్యాహతంగా తాగే రుచిలేని మందు మాటలు" అనుకున్నాడు.

నక్షత్రాలు దారం తెగిన పూసలదండలా వరస విడి చెదురుగా ఆకాశాన్ని పరుచుకున్నాయి.

ఆసలు ఉడిగిన జీవితాన్ని గుర్తు తెచ్చేలాగా చీకటి ఆకాశం.

పక్కనేదో శబ్దమైతే ఇటు తిరిగాడు.

"మళ్ళీ పరీక్షకి జీతం కట్టాలన్నయ్యా.."

ఈ పరీక్షకు ఎంత జీతం కట్టాలో కాశీకి తెలుసు. రెండేళ్ళు అదే నాలుగవ ఫారం పరీక్షకి జీతం కట్టూనే ఉన్నాడు. శంకరం తెలివైనవాడే కానీ ప్రతిభలేదు. నాలుగవఫారం అలా తప్పుతూనే ఉన్నాడు. అందుకని "ఎంతకట్టాలి?" అని అడగలేదు. 30 రూపాయలు కట్టాలి.

"సరే వెళ్ళు" అన్నాడే కానీ ఏం చెయ్యాలో తోచలేదు.

***ధనవంతుడికి మనసులో, బీదవాడికి రూపాయలలోనూ విషాదం మిగిలిపోతుంది. ధనవంతుడి దుఃఖాన్ని మనస్సు కొని తెస్తుంది. బీదవాడి దుఃఖాన్ని ప్రపంచం సిద్ధం చేస్తుంది.***

మేడమీద గదిలో పక్కవెయ్యడానికి విజయలక్ష్మి వెళ్తూంటే పిలిచారు. "గణపతి ఎక్కడున్నాడమ్మా?"

గోడ చాటున నిలబడింది. "నాన్నతో మాట్లాడుతున్నాడండి."

"సరే, మాట్లాడాక ఒకసారి రమ్మను"

శేషాద్రిగారి పురాణం నచ్చక ఒక్కొక్కరే వెళ్ళిపోయారు. "అందుకనే రష్యావాడికి, అమెరికావాడికి అంత తగాదా - ఎందుకూ?" అని ప్రశ్నించి చుట్టూ చూస్తే నరసమ్మగారు నిద్రపోతూ కనిపించింది. ఈ విషయం ఎవరైనా గమనించారో లేదో నిర్ధారణ చేసుకుని అప్పటికి తన ప్రసంగం చాలించి లేచరు శేషాద్రిరావుగారు. పక్కనే గణపతి కూర్చున్నాడు.

మరి పదినిముషాలకు వచ్చాడు కాశీ దగ్గరకి "ఏం అన్నయ్యా?"

"ఇప్పుడు నా దగ్గర డబ్బులేదు. ఉంటే ఇవ్వు. తమ్ముడికి పరీక్షకి జీతం కట్టాలట"

దానికి సమాధానం తెలీదు గణపతికి. వెళ్ళి అవుతూనే తన మనస్సునీ, వివేచనా జ్ఞానాన్ని ఎక్కడో పెళ్ళానికి ఇచ్చేశాడు. పెళ్ళయాక విజయలక్ష్మి విజ్ఞతను ప్రతీ పనికీ సాక్ష్యం తెచ్చుకోవడాన్ని నేర్చుకున్నాడు. అతనికేం వ్యక్తిత్వం లేదు. అదే అతని వ్యక్తిత్వం.

సరేనంటూ మేడ దిగాడు. మేడమెట్ల మీద గాజుల చప్పుడు వినిపించి తెల్లబోయాడు కాశీ. గదిబయట విజయలక్ష్మి నిలబడి ఆ మాటలన్నిటినీ జాగ్రత్తగా వింది.

మరి అరగంట తర్వాత దుప్పటి కోసం కాశీ క్రిందకి వస్తూంటే గణపతి మెట్లపక్క నిలబడి మాట్లాడాడు. "డబ్బు నా దగ్గరా ఏం మిగలేదన్నయ్యా. వచ్చేసారి చూస్తాలే."

దండెం మీద ఏవో బట్టల్ని వేస్తూ విజయలక్ష్మి అక్కడే ఉంది. గోడకి చేరబడి చుట్ట వెలిగించుకుంటున్న వాడల్లా శేషాద్రిరావుగారు లేచి నిలబడ్డారు.

ఆ మాటలకి నిర్ఘాంతపోయాడు కాశీ. ఇందరు ఉండగా ఏం మాట్లాడడానికి తోచలేదు.

శేషాద్రిరావుగారు అందుకున్నారు. "అయినా బావగారికి నువ్వేం సహాయం చెయ్యగలవోయ్. ఏదో మాట వరసకి కదిపి ఉంటారు. ఏమండీ బావగారూ, అంతగా అవసరమయితే నేను 50 సర్దుతాను"

"అక్కరలేదులెండి. అంత అవసరం లేదు" అని దిగివచ్చేశాడు.

వంట ఇంట్లో ఎంగిళ్ళ మధ్య నిలబడి ఏదో పుస్తకం, పెన్సిలు పట్టుకు ఆలోచిస్తోంది అన్నపూర్ణ. భర్త రావడం చూసి మొదట తెల్లబోయి అంతలో నవ్వేసింది.

"ఏం చేస్తున్నా?" అని ఆశ్చర్యపోతూ అడిగితే.

"ఎప్పుడో నేర్చుకున్న పాత జావళీ మరిచిపోయాను. గుర్తుచేసుకుని రాసుకుంటున్నాను" అని భర్త ఇంకా తెల్లబోతే నవ్వింది.

"ఇప్పుడా తీరిక చిక్కింది?" అనుకున్నాడు కాశీ.

వెనక్కి తిరిగి మేడమీదకి బయలుదేరబోతే మెల్లగా చీకటి నిశ్శబ్దంలో అంట్లు పెరట్లోకి చేరవేస్తూ పాడుతోంది అన్నపూర్ణ.

"అంత వేళాయనే కాంతుడే రాడేమి.

ఇంత కోపమేల నా చెంత చేరడదేమి"

విజయలక్ష్మి, గణపతి, వాళ్ళ నాన్నతో ప్రస్తుత సినిమాలోని వివిధ లోపాలపై మాట్లాడుతున్నారు. పురాణాలలో కూడా సినిమా ప్రసక్తి ఉన్నదనీ, దేవతలు అప్పుడప్పుడు ఇంద్ర సభలో నృత్యాలు మొహం మొత్తినప్పుడల్లా సినిమాలు చూసేవారని పాఠాంతరం చెపుతున్నారు శేషాద్రిరావుగారు.

మేడమీద శంకరం తనగదిలో కూచుని చదువుతున్నాడు.

ఏమీ తోచక కండువా తీసుకుని గిరిక దగ్గరకు బయలుదేరాడు.

వీధిచివర ఎల్క్ట్రిక్ స్థంభం దగ్గర మలుపు తిరుగుతూ ఎదురుగ్గా తారసపడ్డ వ్యక్తిని చూసి దిమ్మెరపోయాడు.

అతని ముఖం చూడడానికి భయపడి, చెదురుగా పక్కనుంచి తప్పుకుపోవడానికి ప్రయత్నించి చీకటిలోనికి వత్తిగిలి నిలబడింది.

అయినా ఆ మనిషి తనకి గుర్తే.

అన్యాయమని తెలిసి కూడా ఏదో భరించరాని శిక్షని అనుభవిస్తున్నప్పటి నిర్వేదం ఆ కళ్ళలో - మోయరానంత బిగువయిన యవనానికి తూలిపోయే నడుం, సన్నగా మెలికలు తిరిగి కన్నుమూస్తే మాయమవుతుందన్న ప్రలోభాన్ని కలిగించేట్టు.

'పన్నా..!!' అంటే చీకటిలో చేపలా కదిలింది. పలికిందో, తలపంకించిందో అర్థం కాలేదు.

"మళ్ళీ ఎన్నాళ్ళకి చూశాను నిన్ను నీ సంగతే మరచిపోయాను. నా గొడవల్లో" అంటూంటే కాశీ గొంతు ఆర్థ్రతతో అభిమానంతో పూడుకుపోయింది.

ఆమెను చూస్తూ - జ్ఞాపకాలు అతణ్ణి కొన్ని సంవత్సరాలు వెనక్కు తీసుకుపోయాయి. అలాగే ఎల్క్ట్రిక్ స్థంభానికి చేరబడి నిలబడిపోయాడు.

అదేమిటి ఎంతకూ తలెత్తలేదేం?

ఇదివరికటి కంటే బరువుగా శరీరంలో ప్రతి అవయవం స్థిరపడి నిండుగా తయారయింది. దీపం నీడలో ఆమె ముఖంలో సంకోచంకాక, నిర్లక్ష్యం ఠీవి తెలుస్తోంది.

"ఎట్లా బ్రతుకుతున్నావు?" అంటే నవ్వుతోందని ఆ పల్చటి పెదాల కదలిక బట్టి గుర్తించాడు - అప్పటికీ తల ఎత్తలేదు.

అంతలో మళ్ళీ నిబ్బరాన్ని తెచ్చుకుని "నా గురించి ఏమీ ఆలోచించనని మాట ఇవ్వండి" అంది.

నిజంగానే నవ్వొచ్చింది కాశీకి. "నా గురించే ఎప్పుడూ ఆలోచిస్తానని మాటివ్వండి అని అడిగితే చిక్కులోపడే వాణ్ణి. నీ గురించేకాదు. నా గురించే నేను ఆలోచించుకోకుండా చెయ్యగలవాళ్ళు అక్కడ మా ఇంట్లో చాలామంది ఉన్నారు. కొన్నాళ్ళయేసరికి నువ్వుకూడా ఆలోచించాలన్న విషయ మరిచిపోతావు. ఓసారి మా ఇంటికి వస్తావా?" అన్నాడు.

"ఏమిటి" మరో దగ్గరగా లాక్కొని "అమ్మో - నేనా" అంది.

"ఏం? నువ్వే - నిన్ను చూస్తే ఒక్క వ్యక్తే అక్కడ ఆశ్చర్యపడకుండా ఆదరిస్తుంది"

"ఎవరు? మీ ఆవిడా?"

"అవును ఆవిడకి నా మంచితనం మీద అనమ్మకం ఉంది. వస్తావా మరీ?"

కుంచుకుపోయి మొహం మీదకి చీరచెంగు లాక్కుంటోంది. "నేను రాను. నన్నెప్పుడూ ఇట్లా రమ్మనకండి. నేను రాకపోతేనే మీకు మంచిది" తొందర తొందరగా మాట్లాడుతోంది.

ఆశ్చర్యపోయాడు కాశీ. ఏవో సిద్ధం చేసుకున్న జవాబుల్లాగా భీతితో కళ్ళను అటూ ఇటూ ఆడిస్తూ ముఖం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది.

నల్లగా, ఇదివరకు లావణ్యాన్ని కోల్పోయి - గడుసు తనంతో! అందంలో గడుసుతనం అతుకుతుందా ఎక్కడన్నా? కానీ అక్కడ పన్నా ముఖంలో అదే చూశాడు. సాలెపురుగు గూడులో అందంలాంటిది.

తెల్లబోయి "అదేమిటీ?" అన్నాడు ఆమె మాటలకి

"మీరు చెప్పిన చదువు నన్ను చాలా పాడుచేసింది. చదువుకుని అన్నిటినీ ఆలోచించడం నేర్చుకున్నాను ఆలోచించలేక పోతే ఎంత బావుణ్ను"

ఆ మాటలకి పూర్తి అర్థం తెలీడంలేదు. మనస్సు భరించలేనంత దుఃఖం పెరిగినప్పటి ఉద్వేగం ఆ మాటల్లో తెలిసింది పన్నా ఏదో కష్టాల్లో ఉంది - ఆమెకే అర్థం కాని కష్టాలు.

కానీ చదువు ఆమెను ఎట్లా పాడుచేసింది. ఓ విచిత్రమయిన అవయవం మనస్సు ఉన్నదని తెలియజేయడం పాపమా?

పాపమే అనిపిస్తోంది. మనస్సు ఎంత విచిత్రమయినదో తెలిపితే చాలదు. ఎంత చంచలమయినదో చెప్పాలి.

ఖిన్నుడయాడు ఆమె మాటలకి -

"రేపు ఇంటికి వస్తావా?"

"ఎందుకూ?" తెల్లబోయి చూసింది.

"ఏదన్నా ఇస్తాను."

వింతగా చూసింది. "ఏమిటి?"

ఇంక ఇట్లా దొంగతనంగా ఏవో మనస్సులో దాచుకుని మాట్లాడలేకపోయాడు. ఆమె రెండు చేతులూ పట్టుకుని "పన్నా నువ్వేదో కష్టాల్లో ఉన్నావు. నాకెందుకు చెప్పవు?"

ఒక్కసారిగా ముఖం కప్పుకు ఏడుస్తుందేమోననుకున్నాడు. పెదాల్ని బిగబట్టి ఆపుకుంది. నవ్వింది.

పన్నా మారిపోయిందనుకున్నాడు. వెళ్ళబోతూ అంతలో ఆగి?" ఒక్కమాట ఇస్తావా అన్నయ్యా" అంది.

ఆ పిలుపు మరిచిపోయి చాలారోజులయింది. మళ్ళీ ఇవాళ, విని ఉలిక్కిపడ్డాడు.

"చెప్పు" అన్నాడు.

"ఎప్పుడూ మా ఇంటికి రాకండి. నేను ఎప్పుడన్నా కలుస్తాను"

ఆశ్చర్యపోయాడు. అంతలో అతనికి జవాబు చెప్పడానికి వ్యవధి ఇవ్వకుండా మాటల్ని జతచేసుకుని. ఇలా అంది. "నీ మీద నాకేం కోపం లేదు అన్నయ్యా - నా మీద కోపం వద్దు. నేనెలా, ఎక్కడ బ్రతికినా నిన్ను మరిచిపోలేదు. ఇంకా నువ్వు నాగురించి ఆలోచిస్తే నా మీద అసహ్యం పుడుతుంది. అలా జరిగితే బ్రతకన్నేను. ఎంత కష్టంలో ఉన్నా నువ్వు ఆదరిస్తావు - అప్పుడు నా విషయమంతా చెపితే నువ్వు క్షమిస్తావన్న ధైర్యంతో బ్రతుకుతున్నా నేను. అలా తెల్లబోకు. నేను ఆడదాన్నయిపోయాను. లేకపోతే నా మనస్సంతా నీ ముందుంచి నిన్ను ఒక్కసారి కావలించుకుని ఏడవాలనిపిస్తోంది" మరిక దుఃఖం ఆపుకోలేకపోయింది. ముఖం చీకటి వేపు తిప్పుకుని వెనక్కి తిరక్కుండా వెళ్ళిపోయింది.

ఏదో చెప్పాలనుకుని, ఏమీ చెప్పలేక అలాగే నిర్విణ్ణుడయిపోయాడు.

ఆ నిశ్శబ్దం మరీ భరించరానిదయింది. కర్తవ్యాల్ని మరిచిపోయిన కుక్క ఎలక్ట్రిక్ స్తంభం చుట్టూ పచార్లు చేస్తోంది.

ఇన్నాళ్ళూ ఆమెను ఎట్లా మరిచిపోయానా అని విస్తుపోయాడు.

గిరిక ఇంటికి వస్తే గుమ్మంలో నౌకరు గంగులు కునికిపాట్లు పడుతున్నాడు.

***బీదవాడికి చివరిక్షణాల్లో అనుభవాలు, జ్ఞాపకాలు - ధనవంతుడికి చివరి క్షణాల్లో నౌకరూ, పెంపుడు కుక్కా వదిలిపోవేమోననిపించింది.*** నవ్వుకున్నాడు.

తట్టిపిలిస్తే తుళ్ళిపడి లేచాడు గంగులు. కాశీని ఆశ్చర్యంగా చుసి "ఇంత రాత్రిలో వచ్చారేమిటి బాబూ?" అన్నాడు.

అప్పటికి తట్టింది. రాత్రివేళ అలా రావడం ఎంతకూడని పనో.

**ఒక పక్క ఇంట్లో పరిస్థితులు, మరొక పక్క పన్నా గురించి** ఆలోచనలు మనస్సు చెదిరిపోయింది. అట్లా రావడం మంచిది కాదు.

"ఇప్పుడు టైమెంతయి ఉంటుంది గంగులూ?" అన్నాడు.

"అర్ధరాత్రి దాటి ఉంటుంది బాబూ"

వెళ్ళిపోదామని రెండడుగులు వేసి అంతలో వెనక్కి తిరిగి "ఇవాళ నేను వెళ్ళేదిలేదు. ఇక్కడికి వచ్చి పొరపాటు చేశానని చెప్పివెళ్తాను" అనుకుని "మీ అమ్మగారిని లేపు" అని వసారాలోకి వచ్చి కూచున్నాడు.

ఇదేదో కలలో సంఘటనలాగ ఉంది గంగులికి, లేచి లోపల గదిలోకి వచ్చి మెల్లగా అమ్మగారిని పిలుస్తున్నాడు.

ఎంతోసేపటికి గిరిక బయటకి వచ్చి మెట్లమీద కూచుని తోటవేపు చూస్తున్న కాశీని చూసి నివ్వెరపోయింది.

"కాశీ" అంది.

"అవును నేనే" అని లేచాడు.

ఒక్క క్షణం అతనివేపు చూస్తూ నిలబడిపోయి ఏం చెప్పాలో తెలీక స్తబ్ధురాలయిపోయింది.

ఆమె ముఖంలో ఆశ్చర్యాన్ని కనిపెట్టి నవ్వుకున్నాడు కాశీ.

"నిన్ను ఏదో కష్టాల్లో ఇరికించాలని రాలేదు గిరికా నేను.."

మధ్యలో ఆపి "సరేలే మొదట లోపలికి రా - నౌకరు ఇక్కడే ఉన్నాడు" అని మందలించింది.

ఆమె వెనుకనే వచ్చి ఆమె కట్టుకున్న నేరేడు పండు రంగు చీరవేపే చూస్తూ నిలబడ్డాడు.

"సింహాచలం ఉన్నాడేమో చూడు గంగులూ. ఉంటే గుర్రబ్బండి సిద్ధం చేయమను. లేకపోతే నువ్వే తీసుకురా బాబుగారు ఇక్కడెంతో సేపు ఉండరు. త్వరగా రావాలి" అంది.

గంగులు వెళ్ళిపోయాక. "నువ్వెపుడూ ఇలా తొందర పనులే చేస్తావు. ఇప్పుడేం ముంచుకొచ్చిందని" అని అతని ఎదురుగ్గా కూచుని అడిగింది.

ఆ ప్రశ్నకు జవాబు చెప్పకుండా ఆమె కళ్ళవేపు అలానే చూస్తూ కూచుంటే ఆమె విస్తుపోయింది.

"ఏమిటలా చూస్తావు?"

నవ్వాడు "నా మీద ఇంకా నీకు నమ్మకమే? ఇంత రాత్రి వచ్చి నిన్ను హఠాత్తుగా కావలించుకుంటానని ఎందుకనుకోవు?"

అతని ముఖంలో భీకరాన్ని చూసి నవ్వేసింది. "అబ్బో! అంత చేతనవునా నీకు. సరేలే, విషయం చెప్పు ఎందుకొచ్చారు?

"హఠాత్తుగా నిన్ను చూడాలనిపించింది. ఎప్పుడన్నా అన్నపూర్ణ చచ్చిపోతే - నిన్ను తప్పక పెళ్ళి చేసుకుంటాను"

ఉన్నట్టుండి ఒక్కసారిగా కళ్ళనీళ్ళు తిరిగాయి ఆమెకు.

"అదేమిటి నువ్వు ఏడుస్తావ్?"

"ఇంతరాత్రి వచ్చి ఏడిపించకపోతే ఏం చెప్పు? నేనెప్పుడో చచ్చిపోయాను" అంది.

"సరే ఇక అసలు విషయం చెప్తాను విను. తమ్ముడికి పరీక్షలకి డబ్బు కట్టాలి నా దగ్గరేం లేదు"

"అందుకా ఇంత రాత్రిలో వచ్చావు?"

"అందుక్కాదని చెపితే నమ్మవుగా మరీ?"

"సరే ఉండు వస్తాను"

మేడమీదికి తొందరగా వెళ్ళి నల్లటి శాలువాతో తిరిగి వచ్చింది. ఏభైరూపాయలు చేతిలో ఉంచుతూ "ఇది చాలా?" అంది.

"ఇంత అక్కరలేదు నాకు."

"అవసరం ఉంటుంది. నీకు లేకపోతే మీ ఆవిణ్ణి అడుగు" అని శాలువానిస్తూ "ఇది ఉదయాన్నే పంపించు. ఇక పద బండి వచ్చి ఉంటుంది" అంది.

***ఎదురుగ్గా ఉన్నంత వరకూ ఆడది మన గురించి ఆలోచించకుండా చేసి, ఎదురుగ్గా లేకపోయిన తర్వాత పూర్తిగా ఆమె గురించే ఆలోచించేటట్టు చేస్తుంది.***

ఇంకేం మాట్టాడకుండా బయటికి వస్తే చలిలో వణుకుతున్న గుర్రాన్ని బండికి కట్టి తీసుకొచ్చి నిలబడ్డాడు గంగులు - సింహాచలం కనిపించలేదంటూ.

"సరే. ఇక వెళ్ళు. ఆ శాలువ ఎవరిచ్చారంటే మీ ఆవిడదగ్గర కవిత్వం చెప్పకు. నేనిచ్చానని చెప్పు" అంది బండిలోకి ఎక్కుతున్న కాశీతో.

"ఈ డబ్బు ఇంత త్వరలో తీర్చుకోలేను" అంటే కోపంతో చూసింది - "నువ్వింకా చాలా నాకు బాకీపడిపోయావు. వీటన్నింటినీ తీర్చుకోవాలంటే ఈ జీవితం చాలదు. ఇక బండి పోనియ్యి గంగులూ" అంది.

సన్నని రేకులా దూరాన గిరిక కనిపించేవరకూ అలా చూస్తూ కూర్చున్నాడు.

తీరా చూస్తే అతని మనస్సు ఇవాళ విచిత్రమైన అనుభవాల్తో అలసిపోయినట్టనిపించింది.

బరువుగా తల వెనక్కు చేరవేసి, కళ్ళు మూసుకుని నిశ్చలంగా ఉండిపోయాడు.

ఇంటికి వచ్చేసరికి బండిలోనే నిద్రపట్టేసింది.

●●●

మాష్టరుగారికి కడుపులో కాన్సరు వచ్చిందని తెలిసింది.

ఆ ఊరునుంచి వచ్చిన ఓ వ్యక్తి చెప్పిపోయాడు. ఏ పరిస్థితుల్లోనూ ఇటువంటి విషయాల్ని మాష్టరుగారు స్వయంగా బయట పెట్టరని తెలుసు. కానీ ఇప్పుడది బయట పడిందంటే పరిస్థితి మరీ విషమించినట్టుంది.

మాష్టరుగారు లేకపోతే ఎట్లా బ్రతకడమో ఇంకా తెలీదు తనకు. ఎక్కడ ఎన్ని ప్రళయాలు దాపురించినా ఓ క్షణంలో మనస్సును స్వాధీనంలో ఉంచుకోలేని గడ్డురోజుల్లో ఒకసారి పారిపోయి మాష్టారి పంచన తలదాచుకోవచ్చుననే ఆలోచన అతన్ని ఇట్లా బ్రతికిస్తోంది. ఆయన లేకపోతే పెద్ద ఆస్తి పోయినట్టే.

వెంటనే బయలుదేరాలని శతవిధాలా ప్రయత్నించాడు. కానీ పరిస్థితులు.. డబ్బు.. పరిస్థితులు మనస్సునీ, డబ్బు శరీరాన్నీ కట్టిపడేశాయి. ఓ సంవత్సరంలో చాలా మార్పు వచ్చింది కుటుంబంలో.

ఎంత ప్రయత్నించీ కదలలేకపోయాడు. ఇక చేసేది లేక మాష్టారి పరిస్థితిని ఊహించుకుంటూ కాలుకాలిన పిల్లిలా ఊరంతా తిరిగాడు.

***ఏ కష్టాలూ, బాధలూ, దుఃఖాలూ మానవుడి మీద పెద్ద శిక్షను విధించలేవు. ఒక్క చేతకానితనం తప్ప.***

ఆలోచించిన కొద్దీ ఆ అశక్తత స్పష్టంగా తోచి ఓ మూలన కూర్చుని చిన్నపిల్లడిలా ఏడ్చాడు. ఎవరికీ చెప్పలేని ఆవేదన అది. కానీ దుఃఖంలో, కష్టాలు తీరవు. మేష్టారుగారికి ఒక ఉత్తరం మాత్రం వ్రాశాడు. "మీరు బాగు చేయించుకోండి. మీరు వీలుచూసుకుని వస్తానంటే, నేను సెలవుపెట్టి ఆపరేషన్‌కు సిద్ధంగా ఉంటాను" అని వ్రాశాడు.

మాష్టారు మరి మూడురోజుల్లో జవాబు వ్రాశారు. "నాకేం బాధలేదు. మరీ కొన్నాళ్ళు బ్రతకగలను. శరీరానికి కాదు - మనస్సుకేదో మరమ్మత్తు కావాలి. లోపలి ఏదో భాగం చెడిపోయింది. బహుశా నువ్వు నా దగ్గర లేకపోవడమేమో దాన్ని బాగుచేసుకునే ప్రయత్నం చేస్తున్నాను."

ఆ ఉత్తరాన్ని పట్టుకుని వెర్రివాడిలా పదిరోజులు తిరిగాడు కాశీ. కానీ డబ్బు డబ్బు అతని ప్రయత్నాలన్నీ ఆ ఆలోచనవద్ద చెదిరిపోయాయి. చివరికి అన్నపూర్ణతో కూడా ఆ విషయం చెప్పకుండా నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

ఆడవాళ్ళు పెట్టే గడ్డి చాలా రుచిగానూ ఉంటుంది. తృప్తినీ కలిగిస్తుంది. అది తినడం మొదలెట్టాక బుద్ధి కూడా గడ్డినే తినడం ప్రారంభిస్తూంటుంది. కొన్నాళ్ళకి తనూ ఆలోచించాలన్న విషయాన్ని గణపతి మరచిపోయాడు. రెండుకి నాలుగు కలిపితే అయిదేనని జయలక్ష్మి అంటే అది అయిదే, చస్తే ఆరుకాదు అదీ పద్ధతి.

డబ్బు ఇవ్వమని ఎప్పుడూ తమ్ముణ్ణి అడగలేదు కాశీ. సగం జీతం మాత్రమే ఇస్తున్నాడు గణపతి. ఒక పక్క శంకరం చదువు.

అయినా విసుగెత్తడంలేదు జీవితం.

అన్ని విధలా నిరుత్సాహం, నిరాశా కలిగించే పరిస్థితుల్లో ఇరుక్కుపోయింది అతని జీవితం. ఇప్పుడిక ఒక్కొక్క చిక్కునే విప్పుకుని నడుస్తున్నాడు ముందుకు. ఆ ఆటని వదులుకోవాలనిలేదు. ఎప్పటికప్పుడు కొత్త శక్తిని పూరించుకుని ముందుకు సాగుతూనే ఉన్నాడు.

ఆరునెలల తర్వాత ఈసారి కూడా పరీక్ష కాలేదని శంకరం వచ్చి చెపితే ఆశ్చర్యపడలేదు. విసుక్కోలేదతను. "పరీక్షకయినా నీమీద జాలి కలగడంలేదు పోనీలే" అన్నాడు.

నిజమే, చదువు మీద ఆసక్తి కలిగించే ఏదో శక్తి తనలో లోపించింది. అదే మాటిమాటికీ శంకరానికి అనిపించసాగింది. తనకి చదువు సరైన మార్గం కాదనుకున్నాడు. చివరిసారిగా విసిగిపోయాడు. అన్నయ్య దగ్గరికి వచ్చి "నేనిక చదవను" అన్నాడు.

తరువాత ఏమిటని అడగలేదు కాశీ. "సరే మీ ఇష్టం" అన్నాడు.

వసారలో నిలబడ్డది వసంత.

ఇన్నాళ్ళుగా ఇంట్లో ఉంటూ ఈ అన్నదమ్ముల వింత ప్రవృత్తులకు ఓ నిర్వచనాన్ని సిద్ధం చేసుకోవడానికి వెయ్యోసారి ప్రయత్నించి విఫలురాలయింది.

నవ్వే, ఏడ్చే విచిత్రమయిన జంతువు మానవుడు. సృష్టిలో ప్రాణి ఎట్లా ఉన్నాడో, ఎట్లా ఉండాలో ఉన్న విషయపు బేధసాధ్యుశ్యాలకు ప్రమాణం మానవుడు. కానీ ఇదేమిటీ? వాళ్ళకి "ఎట్లా ఉన్నాం?" అన్న ఆలోచన తప్పు "ఎట్లా ఉండాలీ?" అన్న ఆలోచనలేదేం? ఆలోచించాలన్న ఒక్క విషయాన్నీ గుర్తుంచుకుని, ఏం ఆలోచించుకోవాలో మరిచిపోయినప్పటి జీవితపు విచిత్రపర్యవసానం ఈ రూపాలు. బ్రతకాలని తెలుసు, ఎట్లా బ్రతకాలో తెలీదు వీళ్ళకు, "మీరు బ్రతుకుతున్నారా?" అని ఎప్పటికప్పుడు ఎవరో ఒక వ్యక్తి గుర్తుచేయాలి.

చదువు చదవనని శంకరం, సరే మానెయ్యమని కాశీ అనుకుని, అక్కడితో ఒక పెద్ద సమస్య పరిష్కారమైందని ఇద్దరూ నిట్టూర్చి విడిపోయారంటే చూసి నిర్ఘాంతపోయింది వసంత. ఆ చేతకానితనానికి, తమపై తామే చూపుకునే అలక్ష్యానికి ఆమెకు విసుగూ కోపమూ వచ్చాయి. అందుకని తలవంచుకుని శంకరం మెట్లు దిగుతుంటే అడ్డంగా నిలబడింది. "మీరెట్లా బ్రతుకుతారు?" అంటూ -

దిమ్మెరపోయాడు శంకరం. అదే మొదటిసారి ఆమెను సూటిగా చూసి మాట్లాడడం.

"అదేమిటి?" అన్నాడు.

"నేను చదవను అనుకుంటే సరిపోదు. ఏం చేస్తారో చెప్పండి మరి" అంది.

అంతలో నవ్వాడు. ''నాకు చదువురాదు'' అన్నాడు తలవంచుకునే.

అంత కోపంలోనూ అతని నిస్సహాయపు జవాబుకు అప్రతిభురాలయింది. ఈ వ్యక్తిమీద కోపాన్ని, ఉదాసీనతని ఎంత ప్రకటించీ లాభం లేదనిపించింది. ***కొందరి కష్టాలకి ''ఎందుకు?'' అన్న ప్రశ్న ఉండదు. ''ఇక ఎట్లా?'' అన్న ప్రశ్న తప్ప.***

''అల్లా ఊరుకుంటే మనల్ని మనం బాగుచేసుకోవడం కష్టం. కొన్నాళ్ళయాక ఇప్పట్లో మన విషయం మనం చూసుకోకపోవడంలో తప్పు తెలుస్తుంది. మళ్ళీ పరీక్షకి కట్టండి. మీరు డబ్బు ఖర్చుచేయకపోవడం వల్ల ఈ ఇంట్లో ఎవరికీ మేలు జరగదు. నా మాట వినండి'' అంది ప్రాధేయపూర్వకంగా.

శంకరానికి అనుకోకుండా తటస్థపడిన ఈ సంఘటన కలవర పరుస్తూనే ఉంది. చదువు మానేయాలనుకున్నాడే కానీ, మానేసి ఏం చెయ్యాలో ఆలోచించలేకపోయాడు. మానేస్తే ఇంత బెడద ఇదని ఆవిడ చెప్పేవరకూ తెలీదు. అంతా విన్నాక విసుగేసింది. నేను చదవకపోతే ఎవరికి నష్టం? ఎందుకు చదవాలి? అనుకున్నాడు.

''నేను చదవను. ఇంకేదన్నా చేస్తాను'' అనేసి మెట్లు దిగి వెళ్ళిపోయాడు.

తెల్లబోయి అతడివేపు చూస్తూ నిలబడిపోయింది వసంత.

●●●

ఒక రోజు ఉదయమే స్నానానికి బావిదగ్గరకు వస్తూంటే ఎవరివో మాటలు వినిపించాయి. అవతలి ఇంటి వాళ్ళతో మాట్లాడుతోంది జయలక్ష్మి. ప్రతీ మాటలో ప్రయత్నంలో ఏదో కృత్రిమమైన ఆవేదనతో చెప్పకపోతోంది ఆమె. ''వంటపని ఆవిడ ఎవరికీ ఇవ్వదు. తనేఎంతో కష్టపడుతున్నట్టు అందరూ అనుకోవాలని బాధ, ఈ సర్టిఫికెట్లు మాకేం అక్కరలేదు. కావలసినా ఆవిడ ఒప్పుకుంటేగా? నేను వంటచేస్తానంటే అసలు కిట్టదు. ఆ భోజనం తినలేం. హోటల్ భోజనమే ఇంతకన్నా నయం''

నివ్వెరపోయాడు కాశీ. మనస్సు దాచుకు బ్రతికే మనుషులున్నారని అన్నాళ్ళకి స్పష్టంగా తెలిసింది. జయలక్ష్మి వయస్సు చాలా తక్కువే. కానీ ఈర్ష్య, జుగుప్స, క్రోధం మెల్లమెల్లగా ఆమె మనస్సులోని భాగాల్ని తినేస్తున్నాయి. ***తమకు సుఖం తెచ్చుకునే కంటే, ఇతరులకు కనిపించే కష్టాల్లో సుఖం వెదుక్కోమంటారు కొందరు.***

రాత్రి ఆ విషయం అన్నపూర్ణని అడిగితే మొదట తెల్లబోయింది ఆ ఇల్లాలు. ఆయన ముఖం చూసి అంతలో నవ్వేసింది.

ఆ రోజంతా ఆ విషయమై ఆలోచించి ఒక నిర్ణయానికి రాలేకపోయాడు కాశీ. ***స్త్రీలాగే వాళ్ళు కల్పించే సమస్యలూ, వాటి పరిష్కార మార్గాలూ కష్టతరంగానే ఉంటాయి.***

నవ్వుకు అర్థం ఊహించేంత తెలీదు కాశీకి. అందుకని మళ్ళీ అడిగితే ఈసారి సమాధానం చెప్పింది మంచం సర్దుతూ.

''మీరు 500 రూపయలు సంపాదించినప్పుడు మరదలు వండిపెడుతుంది లెండి'' అని, ఆయన తెల్లబోతే మళ్ళీ చెప్పింది. ''నేను మిమ్మల్ని బాధపెట్టాలని అనడంలేదు. ఆవిడ వండడం నాకేం నచ్చదు'' అంది.

అన్నపూర్ణ సూటిగా మాట్లాడదు. కానీ ఈ విషయంలో తనకు తెలియనిదేదో రహస్యం ఉంది. అయినా జయలక్ష్మి అట్లా పై వాళ్ళతో మాటలు పెట్టుకోడాన్ని సహించలేక పోయాడు. ఆమె చేతకాని వంట కంటే అట్లా పై వాళ్ళతో చెప్పడం మరీ పెద్ద శిక్ష అనిపించింది.

అందుకని విసుగ్గా, చికాకుతో సమాధానం చెప్పాడు. ''ఎవరూ ఈ ఇంట్లో బాధపడుతూ బ్రతకడం ఇష్టంలేదు. రేపట్నుంచీ నువ్వు వంటపని ముట్టుకోకు. వాళ్ళనే చెయ్యనీ'' అన్నాడు.

అప్పట్లో అతని ముఖంలో ద్వైదీ భావాన్ని గుర్తించి ఇంకేమీ మాట్లాడలేదు. అన్నపూర్ణ క్రిందకి వచ్చి మంచినీళ్ళు తీసుకొచ్చేవరకూ ఇంకా అలానే కూర్చుని ఉన్నాడతను.

స్థిమిత పడ్డాక "కొట్టలేదేం?" అని అడిగింది నవ్వుతూ.

దిగ్భ్రాంతుడయాడు.

"మీకూ ఓపిక తగ్గిపోయింది. లేకపోతే విసుగుపుట్టి ఉంటుంది. నాకు అలవాటయిపోయినట్టుంది మందు తెస్తానుండండి" అని బయటికి వచ్చేసింది.

మళ్ళీ వచ్చేసరికి నిశ్శబ్ధంగా పడుకుని ఉన్నాడు కాశీ. నిద్రపోతున్నాడనుకుని టేబులు మీద మందు ఉంచి దీపం తగ్గించబోతే కాశీ 'అనూ' అంటే తుళ్ళిపడింది.

"నిన్నెన్నిసార్లు కొట్టాను అనూ?" అని అడిగాడు. కంఠం జీరవోయి రుద్ధమవడాన్ని గమనించి చకితురాలయి అంతలో గొంతు సవరించుకుని "పోనీండి. ఇప్పుడెందుకీ విషయాలు" అంది.

"నామీద నాకెన్నిసార్లు అసహ్యం వేసిందో తెలుసుకోవాలని - ఇక నా మీద నాకెప్పుడూ అసహ్యం కలగదు. నువ్వే నన్నిలా తయారు చేశావు. ఇక నిన్ను కొట్టను" అని అటు తిరిగి పడుకున్నాడు.

పెదాల్ని నొక్కుకుని అతి ప్రయత్నంతో దుఃఖాన్ని ఆపుకొన్నది అన్నపూర్ణ. బయటినుంచి ఒక చారగా వెన్నెల గదిలో పడుతోంది. తలుపు దగ్గరగా వేసి గది బయట వెన్నెల నీడలో కూర్చుని "మళ్ళీ మనస్సుని బాధపెట్టాను" అని నొచ్చుకుంది.

ఏదో నల్లటి పురుగు శబ్దం చేసుకుంటూ వెన్నెట్లో గిరికీలు కొట్తోంది.

●●●

పదిరోజుల తరువాత భర్త ఆఫీసుకు సిద్ధమయ్యే సమయానికి చెప్పింది అన్నపూర్ణ, "మరదిగారు మరోకాపరం పెట్టవచ్చు. మంచి ఇల్లు చూసి పెడితే బావుంటుంది"

లాల్చీ చిరుగుని దాచుకోడానికి ప్రయత్నిస్తున్నవాడల్లా అద్దంలో అన్నపూర్ణ ముఖాన్ని గమనించి నిర్ఘాంతపోయాడు ఆ మాటలకి. గుమ్మానికి పసుపు రాస్తోంది ఆమె.

"అన్నపూర్ణ - ఇది నిజమేనా ఏమిటి?" అన్నాడు ఆమెకు ఎదురుగ్గా వచ్చి.

"ఇది నేను ఊహించిన విషయం - ఆ ప్రయత్నం చేసుకుంటున్నట్టు నాకు తోచింది" ఆయనింకా ఆశ్చర్యపోతే నవ్వింది. "ఎప్పుడూ అనుకోలేదు ఇలా జరుగుతుందని?"

లేచి గుమ్మాన్ని పట్టుకుని నిలబడ్డాడు. గణపతికి ఈ ఆలోచనలు ఎవరు కలిగించారో తెలుసు. శేషాద్రిగారు ఈ మధ్య తరుచు వచ్చి పోతున్నాడు. వంటపనిలో పదిరోజులు జోక్యం కలిగించుకుని ఇహ నేను చెయ్యలేనని బయటికి తప్పుకుంది జయలక్ష్మి. ఆ పదిరోజులూ గొణుగుతూనే ఉన్నాడు గణపతి.

"పెద్దవాళ్ళుంటూ ఈ ఇంట్లో ఏడ్చింది ఎందుకు? చెయ్యిసాయమన్నా లేకపోతే అది ఒక్కత్తీ ఎలా చస్తుంది?" ఈ మాటల్ని చాలా సార్లు అనడం యాదృచ్ఛికంగా విన్నాడు కాశీ.

"నువ్వు సహాయం చెయ్యడంలేదూ?" అనడిగాడు అన్నపూర్ణని, నీలూని బడికి పంపించడానికి బట్టలు వేస్తోంది తల ఎత్తకుండానే "నేనా వంట ఇంట్లో అడుగు పెడితే మీకా రోజు భోజనాలు ఉండవు. నేనక్కడికి రావడం ఆవిడికి ఇష్టంలేదు" నవ్వుకుంది.

ఇంతగా జుగుప్సాభావాలు స్త్రీలలో ఎట్లా రేగుతాయో అని ఆశ్చర్యపోయాడు. ఎవరెట్లావున్నా నరసమ్మగారు పట్టించుకోరు వేళకి భోజనం చేసి, నలుగురికి దీవనలు పెట్టే శక్తిని సంపాదించుకుని పక్క ఇళ్ళల్లో సంచారం చేసి వచ్చేదావిడ.

చివరికి విసుగెత్తి "నిన్ను ఏడిపించడానికి వంట ఇల్లంతా అవక తవకగా వదిలేసిపోయింది ఆవిడగారు నేనక్కడ వేగలేను" అని ఏడుస్తూ ఓ రోజు వంట ఇంట్లోంచి వెళ్ళిపోయింది జయలక్ష్మి. ఈ మాటలకి తెల్లబోయింది అన్నపూర్ణ. అప్పుడక్కడ శంకరం ఉన్నాడు. చిన్న వదినకు ఎప్పుడూ సమాధానం చెప్పి ఎరగడతను. కానీ ఇన్నాళ్ళ భోజనం, ఆవిడ ఇప్పటి తీరు చూశాక ఇహ ఆగలేకపోయాడు. "అంత చేతకాకపోతే ఆ సామాన్లు అక్కడ పారేసి వెళ్ళు వదినా - మంచి భోజనం చేసి మాకూ ఇప్పటికే పదిరోజులయి పోయింది" అని దెప్పి పొడిచాడు. అక్కడితో జయలక్ష్మి అభిజాత్యానికి మరింత దెబ్బ తగిలింది. ఎవరో వంటి మీద చెయ్యి చేసుకున్నట్టుగా అరుస్తూ తన గదిలోకి పరిగెత్తింది. అయితే ఆ సమయానికి కాశీ, గణపతి ఇద్దరూ ఇంట్లో లేరు. అందుకని ఆ భాగవతం అంతటితో ముగిసింది.

తీరా ఇన్నాళ్ళ తర్వాత మళ్ళీ ఉధ్ధృతం తల ఎత్తేసరికి చకితుడయాడు కాశీ. ఏం చెయ్యడానికి తోచలేదు.

"నువ్వేం వాళ్ళని కష్టపెట్టలేదుకదా?" అన్నాడు గుమ్మానికి బొట్టుదిద్దుతున్న అన్నపూర్ణ దగ్గరికి వచ్చి, పని పూర్తిచేసి అద్దం ముందుకు వచ్చి బొట్టును దిద్దుకుంది. అతని మాటలకి నవ్వొచ్చింది. ఇన్నాళ్ళకి ఎదురుగ్గా నిలబడి సమాధానం చెప్పింది. "మీతో ఇన్నాళ్ళూ గడిపి ఒక్క విషయం మాత్రం నేర్చుకున్నాను. ఎవరినీ కష్టపెట్టడం తెలీదు నాకు"

తెల్లపోతే "మీరు మాత్రం ఈ విషయాలు ఎవరితోనూ అనకండి. మరొక్క సంగతి చెప్పేదా?"

"ఊఁ"

"మరిదిగారిమీద ఇదివరకులాగ కోపాన్ని చూపకండి, ఇప్పుడు ఆయన్ని అంటే బాధపడేవాళ్ళు చాలామంది ఉన్నారు" అని పమిట నడుంచుట్టూ తిప్పుకుని లోపలికి వెళ్ళిపోయింది.

ఆమె జాగ్రత్తకి ఆశ్చర్యపోయాడు.

కానీ జరగవలసిందేదో జరిగిపోయింది.

ఓ సాయంకాలం చీకటి ముసురుకొనే వేళకి కాశీ ఇంటికి వస్తే వాకట్లో ఆడంగులంతా సభ తీర్చి కూచున్నారు.

గోడకి చేరబడి నరసమ్మగారు, మల్లెపూలు ముందు పోసుకుని దండ కడుతూ జయలక్ష్మి ఏదో మాట్లాడుతున్నారు.

స్థంభం చాటున కూర్చున్న వ్యక్తులెవరో తెలియడం లేదు. వసారా మధ్యగా వేలాడదీసిన దీపం చలికి వణుకుతూ కునికిపాట్లు పడుతోంది. వసారాలో అన్నపూర్ణ, వసంత ఉన్నట్టులేదు. ఏం చేయాలో తెలీక గుమ్మంలోనే ఆగిపోయాడు. వాళ్ళ మాటలు అక్కడికి స్పష్టంగా తెలుస్తున్నాయి. "నేనంతా అనుకున్నాను సుమండీ" అంటున్నారు ఎవరో - కంఠంలో ఆశ్చర్యం తెలుస్తోంది.

"నిజమే!" అని పృచ్ఛిస్తోంది శక్తినంతా మాటల్లో పూరించి మరొకావిడ.

జయలక్ష్మి ఒకటే నవ్వు -

నరసమ్మగారు ఓసారి "ఈ జీవితానికి ఇంతే ముగింపు" అన్నట్టు మూలుగుతూ ముగ్గురు దేవుళ్ళను ఒక్కసారిగా తల్చుకున్నారు.

అంతలో మల్లెపువ్వుల్ని పక్కకి జరిపి - జయలక్ష్మి చెప్తోంది. "ఆ పెళ్ళికాని అమ్మాయి వసంతని ఇంట్లో ఉంచుకోకండని నేనెన్నోసార్లు చెప్పాను అత్తగారితో - నీకు తెలుసా అది? అది ఆయనగారికి రెండో పెళ్ళాం -"

అది అక్కడివాళ్ళ ఆశ్చర్యానికి పరాకాష్ట.

రకరకాల గొంతులతో ప్రపంచం త్రేతాయుగం నుంచీ ఎంత పాడయిందో విమర్శించారు.

"ఆయనగారు సరే - ఇంట్లో పిల్లలు, చుట్టుపక్కల వాళ్ళు - మనం అడవుల్లో బ్రతకడంలేదు ఇలా బరితెగి.."

ఆ మాటతో కాశీకి రక్తమంతా కదిలి - మనస్సు వశం తప్పింది. శరీరమంతా అవమానంతో, ఇక్కడి వ్యక్తుల మీద జుగుప్సతో మంటలు లేచినట్టయింది. ఆ క్షణంలో కట్టుతెంచుకున్న ఉద్వేగం ఉచితానుచితాల్ని మరిచిపోయేటట్టు చేసింది. ఇక నిలబడలేక ముందుకు వచ్చి "జయలక్ష్మీ" అని అరిచాడు.

ఉన్నట్టుండి హఠాత్తుగా పిడుగుపడ్డట్టు అంతా తృళ్ళిపడి వెనక్కు తిరిగారు.

కాస్సేపటివరకూ ఆవేశం మాటల్ని అడ్డుకొంది. ప్రగాఢమైన ఉద్వేగ ఛాయలు ముఖాని వివర్ణం చేశాయి. ఆ పరమసంయమి గంభీర హృదయం ఆ క్షణాన్న ఆలోఢితమయి - అక్కడి వాళ్ళందరి భయభ్రాంతుల్ని చేసింది.

ఆ క్షణాన్నే గుడినుంచి అన్నపూర్ణ, వసంత తిరిగి వస్తూ ఈ దృశ్యాన్ని చూస్తూ దిమ్మెరపోయి నిలబడిపోయారు.

ఉద్రేకంలో ఏదో మాట్లాడాడు కాశీ. "మీరంతా మనస్సును చంపేసుకుని బ్రతుకుతున్నారిక్కడ. మీతో బ్రతికే వాళ్ళందరినీ చంపేసి మీ రొక్కరే బ్రతకడం గొప్పదనం కాదు. జయలక్ష్మీ నువ్వు ఆడదానివయిపోయావు - ఇదే నా తమ్ముడు ఆ మాటలు అనివుంటే రక్తం కళ్ళచూసేటట్టు కొట్టేవాణ్ణి."

జయలక్ష్మికి, నరసమ్మగారికి నోటంట మాట పెగలలేదు. ఇద్దరు స్థంభీభూతులయారు.

భయపడి అన్నపూర్ణ అడ్డుపడింది. అంత ఉద్రేకంలోనూ అన్నపూర్ణను చూశాక అసహాయత, ఆర్ధ్రత గుండెను కదిలించింది ఆమె మీద ప్రేమకి కాకపోతే, తను ప్రపంచానికి పూర్తిగా వ్యర్థుడయినట్టు - ఇప్పుడిక ఆమె నీడలోనే తనకు ప్రశాంతమైన ఆశ్రయం లభించేటట్లు ఆ కళ్లల్లో ప్రేమను చూశాక ఒక్కసారిగా దుఃఖం వచ్చింది.

నవ్వి మెల్లగా అతణ్ణి హెచ్చరిస్తూ చెవిలో అంది. "ఆవిడ మీ అన్నపూర్ణకాదు - ఇలాంటి పని మంచిదికాదు" - ఆ మాటలకి ఒక్కసారి నిశ్చేష్టుడయిపోయాడు.

మళ్ళీ జయలక్ష్మి తల ఎత్తేలోగా అక్కడెవరూ కనిపించలేదు. నరసమ్మగారు కూడా ఎక్కడికో వెళ్ళిపోయారు. దీపం ఇంకా ఓ పక్క మిణుకు మిణుకు మంటోంది.

తన తప్పు - తనకు కళ్ళకు కట్టినట్టయి నిస్సహాయంగా నేలన కూచుని బావురుమని ఏడ్చేసింది జయలక్ష్మి.

●●●

ఉదయం సంధ్యావందనం చేసుకుందుకు క్రిందకు వస్తే ఇంట్లో సగం వస్తువులు కనిపించలేదు. చీకటిలో దీపం వెలిగించేసరికి పొయ్యి మధ్యనుంచి ఓ పిల్లి అరుస్తూ లేచి బయటికి పరుగెత్తింది. కిటికీలోంచి చల్లగాలి వీస్తోంది.

గదులన్నీ సగం బోసిపోయి, ఏదో లోపం స్పష్టంగా తెలుస్తోంది. విస్తుపోతూ కొబ్బరి చెట్టు నీడకి వచ్చి నిలబడితే అప్పటికి కాస్త అర్థమయింది.

కుడివేపు రెండు గదుల్లోంచి పొగ వస్తోంది. అటు చూశాడు - అమ్మ, జయలక్ష్మి అక్కడ కూచుని ఏదో మాట్లాడుకుంటున్నారు.

కొబ్బరి చెట్టు ఒక్కసారి కదలి, పువ్వు జలజలరాలింది. ఇంత హఠాత్తుగా ఈ పని జరగటానికి కారణమేమిటో తెలుసు తనకు. 'ఇట్లా జరిగిందేమో' అన్న ఆశ్చర్యం తప్ప ఎందుకు జరిగిందన్న ఆశ్చర్యం లేదు. వాళ్ళిద్దరూ ఏదో మాట్లాడుకు నవ్వుకుంటున్నారు. గదిలోకి వస్తే కాలికి ఏదో తన్నుకుని పగిలింది - తీరా చూస్తే ఏ అర్థరాత్రో వెలిగించి వదిలేసిన దీపం.

నేలన కూచుని మెల్లగా గాజుముక్కల్ని ఒక్కటొక్కటే పోగు చేశాడు.

అప్పటికింకా అన్నపూర్ణ కిందకి రాలేదు. సగం ఖాళీ అయిన ఇంటిని చూసుకుని నవ్వుకున్నాడు. ఉన్నట్టుండి హఠాత్తుగా తండ్రి గుర్తుకొచ్చాడు. "ఒకసారి శాశ్వతంగా వేరు కావడమే సాధ్యమని నేర్పావు నువ్వు. కానీ ఇట్లాకూడా అన్నదమ్ములు విడిపోవచ్చునని నాకు తెలీదు - ఈ ఆడవాళ్ళు చెప్పేవరకూ" అనుకున్నాడు. అతనికి దుఃఖం, కోపం కలగలేదు.

గదిమధ్య పీట వేసుకుని కూర్చున్నాడు. స్నానం చేసి లోపలికి వస్తే ఏ దేవుడూ అతని మనస్సులో కదలడం లేదు.

మేడమీదికి వస్తే నీలూని లేవదీస్తోంది అన్నపూర్ణ.

"నువ్వు చెప్పింది నిజం" అన్నాడు గది మధ్య నిలబడి.

"ఏమిటీ?"

"తమ్ముడు వేరేగా ఉంటున్నాడు -"

నిర్ఘాంతపోయింది. పరిహాసానికి అంటున్నారేమోనని భర్తవేపు విచిత్రంగా చూసింది. "ఇక ఒంటరిగా బ్రతకడం మనం నేర్చుకోవాలి. ఇది ప్రారంభం" అన్నాడు.

ఏం చెయ్యాలో తెలీడంలేదు ఆమెకు. "అలా జరగనివ్వకండి. చూసేవాళ్ళకి కూడా బాగుండదు" అంది లేచి, ఆత్రుతగా.

కానీ ఆ మాటలు వినడంలేదు.

మంచం మీద కూచుని ఏదో ఆలోచిస్తున్నాడు కాశీ. "నేనే తప్పు చేశానులే. ఇప్పుడెలాగూ వాళ్ళని ఆపలేము. వెళ్ళి క్షమాపణ చెప్పుకుని వస్తాను" అని కిందకి వచ్చాడు.

గణపతి మొదటిసారిగా బజారుకు బయలుదేరుతున్నాడు. అన్నయ్యను చూసి పక్కకి తప్పుకోబోయాడు. కాశీ నవ్వాడు. "బజారుకు వెళ్తున్నావా?" - అని అన్నయ్య పలకరిస్తే ఏమీ చెప్పలేక నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

"కూరలు జాగ్రత్తగా చూసి తెచ్చుకో. వంకాయలు నీ వంటికి మంచిదికాదు. ఎందుకయినా మంచిది మరదల్ని ఒక్కసారి అడిగివెళ్ళు" అన్నాడు.

ఆయన ముఖంలో అసహనభావం ఏ కోశానా లేకపోగా, ఆ హితోక్తులకు కంఠం రుద్ధమయింది గణపతికి.

"నేను కాదన్నయ్యా - జయ చెప్తేనే ఇదంతా.." నవ్వి బుజం తట్టాడు కాశీ "పరవాలేదులే. ఎంతకాలం నా కోసం, నా వల్ల బ్రతుకుతారు మీరంతా. ఈ మాత్రం మార్పు చాలా అవసరం త్వరగా వెళ్ళుమరి" అన్నాడు.

అన్నయ్య మాటలకి గణపతి మనస్సు పూర్తిగా కలవరపడింది. ఏదో అవ్యక్తమయిన దుష్టశక్తి ప్రోత్సాహంతో ఈ పనులన్నీ జరిగిపోతున్నట్టనిపించింది.

***తప్పుతోవ పట్టేప్పుడు వచ్చే ప్రోత్సాహం, అప్పుడు లభించే ఫలితం - మంచికానీ, చెడుకానీ చాలా తొందరగా, నిర్విఘ్నంగా లభిస్తుంది. గులాబి పువ్వును ముళ్ళ మధ్య నుంచి వేరు చేసి రేకులు విదిల్చినంత తేలిక -***

జయలక్ష్మి కూర్చున్న గదివేపు వస్తే కొడుకుని చూసి నరసమ్మగారు స్నానానికని అక్కడినుంచి లేచిపోయారు.

భయంతో, సంకోచంతో సంత్రప్తమయిన మనస్సుతో బావగారి ముఖం చూడలేక జయలక్ష్మి ఆ గదిలో తారట్లాడింది.

ఇదంతా చూస్తుంటే కాశీ ముఖంలో ఔత్సుక్యం కనిపించింది. ***రగిల్చి, కదిపి, గుంజి, ఎత్తి చూపగలిగితే - దొంగలో కలిగే విషాదం, హంతకుడిలో కలిగే పశ్చాత్తాపానికి మేర ఉండదు.***

ఈ విషయం ఆమె ముఖం చూడగానే తెలిసివచ్చింది.

"నేను నిన్న చాలా తప్పుచేశాను మరదలా - దీనికి ప్రతీకారం ఎట్లాగా అని రాత్రంతా ఆలోచిస్తున్నాను. నువ్వు నిజంగా నామీద మంచి శిక్షనే విధించావు. ఇంకా ఈ శిక్ష పూర్తికాలేదు. మంచి కాఫీ చేసెయ్యి. త్రాగి కాస్త ఉపశమనాన్ని కలిగించుకుంటాను" అని పీటవేసుకుని గుమ్మంలో కూచున్నాడు.

ఈ మాటలకి జయలక్ష్మి పూర్తిగా అప్రతిభురాలయింది. ఏం చెప్పడానికీ మాటలు దొరకడం లేదు ఆమె పాప పుణ్యాల్ని తూకం వేసే న్యాయ మూర్తిలాగా పీటమీద మఠం వేసుకుని కళ్ళుమూసుకుని కూర్చున్నాడు కాశీ. ఆ ముఖంలో కోపం, అసహనం, జుగుప్స ఏమీ కనిపించక నిర్మలంగా ఉంది. అను కంపనతో ఆ ముఖంలో దీప్తిని చూస్తూ విస్తుపోయి నిలబడింది.

హఠాత్తుగా ఆమెకు కళ్ళనీళ్ళు తిరిగాయి. మనస్సులో అతని హృదయ నిర్మల్యానికి జోహార్లు అర్పించింది -

కానీ ఇంకా అతనట్లా నిశ్చలంగా కూర్చునే ఉన్నాడు.

ఇక చేసేదిలేక కాఫీ చెయ్యడానికి ప్రత్యేక శ్రద్ధతో పూనుకుంది.

"తప్పు చేశానేమో?" అన్న ఆలోచన ఆమెను ప్రతీక్షణం కోతపెట్టసాగింది.

●●●

హేమంతం -

చలికి ఇంటిముందు సన్నజాజుల పందిరి మీద పువ్వులన్నీ ముదుచుకుని ఏదో అందని కోరికను తీర్చుకోడానికి తపస్సు చేస్తున్నట్టున్నాయి. ప్రతి చిన్నగాలికీ తూలిపోతామన్న భయంతో శ్రద్ధగా చెట్టుకు అంటిపెట్టుకుని నిలబడ్డట్టున్నాయి.

పందిరి క్రిందకి అన్నపూర్ణ వచ్చి నిలబడేసరికి గుమ్మం దగ్గర ఎవరో కనిపించారు నల్లగా, బొద్దుగా అనుభవాలతో నడుం వంగిన వ్యక్తి.

ఆమెను చూసి "కాశీ బాబుగారు ఉన్నారా అమ్మా?" అన్నాడు.

అతని మాటల్లో వణుకు, ఆత్రుత చూసి ఆశ్చర్యపోయింది. బొమలు ముడిచిన ఆ చిన్న కళ్ళల్లో ఏ విషయం స్పష్టంకాకపోవడంతో మరీ విస్తుపోయింది.

"ఎందుకు?"

"పని ఉందమ్మా"

"నాతో చెప్పు - సంధ్యావందనం చేసుకుంటున్నారు."

సంశయిస్తూ ఆగిపోయాడు.

"పరవాలేదులే. నా దగ్గర ఆయనకి రహస్యాలు లేవు. అవసరమయితే - ఆయనకు వెంటనే చెపుతాను" ఆలోచిస్తున్న కొద్దీ అతను చెప్పబోయే విషయం తన భర్త జీవితానికి సంబంధించినదిలా, ఆ విషయం ప్రత్యేకంగా మనస్సుకు కొంత పని ఇచ్చేదిలాగా తోచింది అన్నపూర్ణకు.

ఎంతోసేపు తటపటాయించి, మాటలు కూడదీసుకుని చెప్పాడు. "పన్నా రమ్మని చెప్పమందమ్మా" -

మొదట తెల్లబోయింది. ఎప్పుడూ ఆ పేరు వినలేదామె. కనీసం కాశీకూడా ఎప్పుడూ ఆ ప్రసక్తి తీసుకురాలేదు. అందుకని క్షణం నివ్వెరపోయింది. అయినా అంతలో తనని తాను కూడదీసుకుని తన ఉద్వేగ ఛాయలు అతనికి కనిపించనియ్యలేదు.

సన్నజాజి పందిరి నీడలోకి ముఖం తిప్పుకుని సగం విడిన రెండు మొగ్గల్ని కోసింది.

కొమ్మల్తో రెండు ఆకులు తెగి అభివందనం చేస్తున్నట్టు కాళ్ళు కావలించుకున్నాయి. వంగి వాటిని తీయబోతే పందిరి కర్ర నుదుటికి బలంగా కొట్టుకుంది. కుంకుమ చెదిరిపోకుండా సరిచూసుకుంది. నుదుటికి తగిలిన దెబ్బకే కళ్ళు చెమ్మగిల్లాయి.

భర్త మీద చాలా విశ్వాసం తనకు.

"ఏమిటివాళ ఇదంతా?" అని మనస్సులో అనుకుంది. ఎందుకో తెలీని దుఃఖం, మనస్సంతా ఏవో ఆలోచనలతో, తపన తప్తమయినాయి -

అయినా భర్తమీద చాలా విశ్వాసం తనకు. ఆ ప్రశ్నకు అర్థం లేదని తెలిసికూడా అడిగింది "పన్నా ఎలా ఉందిప్పుడు?"

నవ్వాడు తను. ప్రశ్నకంటే ఆ సమాధానం మరింత ఔత్సుక్యం రేపింది.

"పనేమిటి చెప్పు"

తలని కట్టుకున్న కండువా భుజం మీదకి లాక్కుని కంటిని తుడుచుకుంటున్నాడతను.

"పన్నాతో పనేమిటమ్మా - క్షణంలోనో సగంలోనో చచ్చిపోయేట్టుంది. మరి బ్రతకదు. అయితే బాబుమీదే దానికి గురి. ఒక్కసారి వచ్చి చూస్తే చల్లగా చచ్చిపోతుంది. నేను తొందరగా పోవాలమ్మా" అని మరి అక్కడ నిలవకుండా నడిచి వెళ్ళిపోయాడు.

ఒక కాలు కుంటి. ఎండలో అటూ ఇటూ ఊగుతూ నడిచిపోతున్న వ్యక్తిని చూస్తూ - అతను పరిచయం చేసిపోయిన ఎప్పుడూ చూడని వ్యక్తిని గురించి ఆలోచనల్ని పెంచుకుంది.

పన్నా - ఎలా ఉంటుంది - పన్నా -

పిలిచి ఏదో అడగాలనుకుంది - కానీ ఆ ప్రశ్నని సిద్ధం చేసుకోవడానికి ఇంకా కొంత కాలం పడుతుంది. అప్పుడే ఆ నల్లటి శరీరం వీధి చివరికి వెళ్ళి కాస్త ఆగి మలుపు తిరిగింది.

ఆలోచిస్తూ లోపలికి వచ్చింది. సూర్యుడికి - ఎదురుగ్గా నిలబడి వాకిట్లో నమస్కారం చేస్తూ కనిపించాడు భర్త తెల్లటి శరీరం మాటు కిరణాలు పడి - వెనక పొడవాటి నీడను సిద్ధం చేశాయి.

పందిరి కింద అట్లాగే నిలబడి నిశ్చలంగా నమస్కారం చేస్తున్న భర్తని వింతగా చూస్తూ నిలబడిపోయింది.

కళ్ళు విప్పాక అన్నపూర్ణ ముఖంలో ఆశ్చర్యం చూసి చకితుడయాడు కాశీ.

"ఏం?" అని భర్త పలకరించాక కూడా ఇంకా ఆలోచిస్తోంది. పన్నా పేరు విన్నప్పటి నుంచీ మనసెందుకో ఆరాటపడుతోంది అది ఈర్ష్య. సహించలేని తనం కాదు ఆత్రుత, ఉత్కర్ష - పన్నా ఎట్లా ఉంటుందో చూడాలన్న ఆకాంక్ష.

లోపల దేవుడి ముందు కూచుని కళ్ళు మూసుకున్న భర్త పక్కకి వచ్చి కూర్చుని మెల్లగా చెవిలో అంది. "పన్నా కబురు పంపించింది."

ఆ మాటలు వినగానే తృళ్ళిపడ్డాడు కాశీ. కళ్ళిప్పితే ముఖానికి దగ్గరగా ఉన్నాయి ఆమె కళ్ళు - విచిత్రంగా ఆమెను చూశాడు.

"పన్నా!"

"అవును మెల్లగా మాట్లాడుతోంది. "బహుశా త్వరలో చచ్చిపోవచ్చునట. మీ కోసం కబురు పంపించింది" ఒక్కసారిగా వణికాడు కాశీ. ఎప్పటి పన్నా? మనస్సులో ఆమె ఆలోచనలు పాతపడి, ఇంకా పాతపడి ఇప్పటి గొడవలు, కోరికలూ, ఆశయాల వధ్యపడి నలిగిపోయాయి. ఆరునెలల క్రితం ఎలక్ట్రిక్ దీపం నీడలో కనిపించిన పన్నా - ఆప్పటి ఆమె నవ్వు - హెచ్చరిక గుర్తుకొచ్చి ఒక్కసారి కళ్ళు మూసుకున్నాడు.

ఇదేమిటి? - ఈ విషయాన్ని విన్నాక ఏడుస్తాడేమిటి?

ఆర్ద్రతతో ఆమె గుండె పగిలింది.

"ఇక ఆలశ్యం చెయ్యకండి. తొందరగా వెళ్ళండి. ఇప్పుడు వెళ్ళకపోతే జీవితమంతా ఈ విషయాన్ని గురించి బాధపడాలేమోనని నా కనిపిస్తోంది"

ఎప్పుడూ చూడని ఆ వ్యక్తిని గురించి భార్య ప్రోత్సాహం విని మరీ నిర్ఘాంతపోతున్నాడు. ఎదురుగా దేవుని ముఖం కన్నీటి తెరలవెనుక మాసిపోయింది. నిజమే ఏడుస్తున్నాడు తను.

పన్నాను చూసి పది నెలలయింది. ఆమెను ఇన్నాళ్ళు ఎట్లా మరిచిపోయాడు అన్నది ఆశ్చర్యం.

లేచి బట్టలు వేసుకుంటూంటే పాలు తెచ్చి ఇస్తూ గుమ్మాన్ని ఆనుకుని నిలడి అడిగింది. "పన్నా ఎవరూ?"

ఎట్లా చెప్పాలా అని ఓక్షణం ఆలోచించాడు. ఆమె ముఖంలో ఉత్సుకత తప్ప ఇంకేం కనిపించలేదు. ఆమె భుజం మీద చెయ్యివేసి "పన్నా నాకేమవుతుందో తెలీదు. బహుశా ఆమెకీ తెలీదు. కానీ నాకు చెల్లెలు లేదు. ఉంటే అలాగే ఉండేదేమో" అంత విషాదంలోనూ, ఆశ్చర్యంతో తడిబారిన ఆమె కళ్ళను చూశాక నవ్వొచ్చింది.

త్వరగా బట్టలు వేసుకున్నాడు.

ద్వారం దగ్గరికి వచ్చేసరికి నుదుటి బొట్టు దిద్దుకుంటూ అన్నపూర్ణ కనిపించింది. చుట్టూ ఎర్రటి శాలువా కప్పుకుని సిద్ధంగా ఉంది.

అతను ఆశ్చర్యంగా చూస్తే -

"నేనూ మీతో వస్తాను" అంది.

దిమ్మెరపోయాడు. "ఎక్కడికి?"

తడబడలేదు. "పన్నాను చూడడానికి"

నోట మాట పెగలడంలేదు.

"మరి నాకు ఆఫీసు భోజనం?"

"అదంతా తర్వాత చేస్తాను - కాదనకండి, ఇప్పుడు పన్నాను చూడలేకపోతే, మరెప్పుడూ చూడలేననిపిస్తోంది పదండి"

ఆ ముఖంలో పట్టుదలనూ, నిశ్చయాన్నీ చూసి ఇంకేమీ మాట్లాడకుండా బయలుదేరాడు.

ఆ ప్రాంతానికి వస్తే - ఎన్నో సంవత్సరాల క్రిందట పాత జీవితం - గిరిక, డాక్టరుగారు, అంతా గుర్తుకొచ్చారు. అదంతా పాతకలలాగా - పక్కన అన్నపూర్ణతో నడుస్తూ ఊహించుకున్నాడు.

ఇంకా అదేపాక.. పన్నా ఉండే ఇల్లు. పక్కన ఆరిపోతున్న కొమ్మల్తో గన్నేరు చెట్టు - ఇంటిముందు పగిలిన రెండు కుండల్లోంచి ఏవో తింటున్నాయి కుక్కలు.

ఇంటికి వచ్చిన నల్లటి వ్యక్తి దిగాలుపడి బయట కూచునున్నాడు.

కాశీని చూడగానే కొండంత ధైర్యంతో లేచాడు - అయినా శక్తినంతా కూడదీసుకుని కూడా పలకరించలేకపోయాడు. ఏదో చెప్పాలని ప్రయత్నం. ఏమీ చెప్పలేకపోతున్నాడు.

లోపలికి ఇద్దరూ వస్తే గదికి ఓ మూలగా వేసిన మంచం మీద పన్నా పడుకుని ఉంది. నిద్రపోతున్నట్టు ముఖం ప్రశాంతంగా - ఏవో కలలమీద, సుదీర్ఘపు సుస్థిర భవిష్యత్తుమీద ఆ నిద్ర, ఆ ప్రశాంతత హాయిని ఇస్తున్నట్టు.

"పన్నాకేమొచ్చింది?" అని ఇటు తిరిగి అడిగితే -

"పన్నాకు ఇంకేమీ రాదు బాబూ - ఒక్క క్షణం క్రితం చచ్చిపోయింది"

ఇద్దరికీ గుండె ఝల్లుమంది. మళ్ళీ అటువేపు ముఖం తిప్పితే, చచ్చిపోవడం ఇంత సులువా? అనిపించింది. ఆ ముఖంలో ప్రేతఛాయలున్నాయనడానికి మనసు అంగీకరించడంలేదు. పన్నా మెడలో గుర్తుతెలీని ఎవరో దేవుడు బొమ్మ వేలాడుతోంది. పాఠాలు చెప్పమని తనమీదికి వంగినప్పుడల్లా పచ్చటి నరాల కదలికకి - మెడమీద బలహీనంగా దేవుడు కదిలేవాడు. ఇంకా ఆ దేవుడు అట్లాగే ఉన్నాడు. కానీ ఇప్పుడు అతనిలో చలనం లేదు. పన్నా చచ్చిపోయింది. చావు ఇంత సులభమయితే ఈ జీవితాన్ని విశ్వసించడం ఎట్లా? -

అలాగే స్తబ్ధుగా నిలబడి చూస్తోంది అన్నపూర్ణ -

నిశ్శబ్దాన్నే కార్చిచ్చులా కాల్చే మౌనంతో, ప్రపంచంలో ప్రశాంతత ఒక్కచోట 'సంచితం' చేస్తే ఇంత ప్రళయం ఉంటుందని నిరూపణ చేస్తున్నట్టు తెలిసే ఆ నల్లటి పెదాల్లో చిరునవ్వు, అప్పటి పలకరింపు, అల్లరి - అంతా -

"నన్ను చేసుకోమంటే నవ్వేదండి - చేసుకుంటే ఈసరికి బాగుపడేది. పిల్లలు కావాలని - చుట్టుపక్కల వాళ్ళందర్నీ చివరి రోజుల్లో పోగుచేసింది"

కాలం గడిచిన కొద్దీ పన్నా మరీ చిన్నదయినట్టు - ఆ ముఖంలో బిగువూ, నిశ్చయం - చిన్నప్పుడు అంత బరువుగా, అంత పట్టుదలతో ఉండేది కాదు. అమ్మ కొట్టిందని ఏడుస్తూ తన గదిలో తల దాచుకున్న గుర్తుకు వస్తోంది.

బయటికి వచ్చక కాశీని దూరంగా పిలిచి "ఓ రహస్యం చెప్పేదా బాబూజీ?" అన్నాడు నల్లటి వ్యక్తి.

"ఏమిటి?"

"పన్నాను ఎవరో హత్యచేశారు. ఎవరు హత్య చేశారో కూడా తెలుసు - వీపులో ఎడం వేపు బాకు బలంగా నాటింది. మీరు చూడలేదు"

నిర్ఘాంతపోయాడు కాశీ. ఈ సుప్త సౌందర్యం మీద ఎవరో పగతీర్చుకునే అవసరం ఉంటుందని అతను ఊహించలేని విషయం. ఈసారి గుమ్మం దగ్గరకి వచ్చి నిలబడితే ఆముఖంలో ప్రశాంతతకు వేరే అర్థం కనిపించింది -

'సంచితం' చేసిన పాపాల విశాల స్థూపంలాంటి జీవితాన్ని వదులుకుంటున్నప్పటి ప్రశాంతత ప్రపంచపు పాపానికి పరిహారంగా శరీరాన్ని వదులుకుంటూ - ప్రపంచాన్నంతా క్షమించగల చిరునవ్వు మానవుడి అల్పత్వాన్ని గుర్తించాక చేసే అపహాస్యం, హేళన.

చటుక్కున పక్కకు తిరిగి "పన్నా ఎలా బ్రతికిందో నీకు తెలుసా?" అని అడిగాడు.

"తెలుసండి. వద్దని ఎంత చెప్పినా వినలేదు. తల్లి పాడుచేసింది. శరీరాన్నమ్ముకుని"

"తల్లి ఎక్కడుంది?"

"వాళ్ళిద్దరికీ ఎప్పుడో తగాదాలు వచ్చాయండి. ఓ రోజు ఎవరికీ చెప్పకుండా ముసల్ది ఎక్కడికో పారిపోయింది - డబ్బంతా పట్టుకుని"

అన్నపూర్ణ లోపల్నుంచి బయటికి వచ్చింది. అప్పటి ఆమె ముఖంలో స్తబ్ధత నిర్లిప్తత చూసి విస్మితుడయాడు కాశీ.

"పోదామా?" అన్నాడు అన్నపూర్ణతో.

అతనివేపు తిరిగి "ఎవరితో ఆ విషయం చెప్పకు వీరడూ - చివరి పనులన్నీ నువ్వే చూడు" అని కొంత డబ్బును అతని చేతిలో ఉంచి అన్నపూర్ణ చెయ్యిపట్టుకు వచ్చేశాడు.

కొంతదూరం వరకూ ఇద్దరూ మాట్లాడుకోలేదు.

"పన్నాతో మాట్లాడితే బావుండేది. ఇన్నాళ్ళవరకూ నాకెందుకు తెలియలేదా అని బాధ" అంది అన్నపూర్ణ.

ఏదో ఆలోచిస్తున్నాడు కాశీ. కొంతసేపు ఆగి "నీకీ విషయం తెల్సా? పన్నాను ఎవరో హత్యచేశారు"

ఒక్కసారిగా తృళ్ళిపడింది అన్నపూర్ణ. ఏదో అడగాలని అతనివేపు ముఖం తిప్పింది. కానీ అతని ముఖం చూసి భయపడి ఆగిపోయింది.

ఎవరిమీదో కోపంతో, పగతో ఎరుపెక్కింది అతని ముఖం.

"తమ నీచత్వాన్నీ, చేతకాని తనాన్నీ దాచుకునేందుకు దౌర్జన్యం పన్నా ప్రాణాల్ని బలితీసుకుంది. ఎప్పుడూ ప్రపంచలో ఇలాగే జరుగుతుంది. అమాయకత్వానికి మొదటి శిక్ష తప్పదు. ప్రపంచం దాన్ని గుర్తించేసరికి అంతాసరి. పన్నా చచ్చిపోతే బాధలేదు. కానీ ప్రపంచం మీద తన చిరునవ్వుతో పెద్ద సవాలు చేసి చచ్చిపోయింది. దాన్ని ఎదుర్కొనడానికి ప్రపంచం ఇంకా పెరగాలి. ఈ మనుషులూ, ఈ సంఘం చాలదు. నాకు ఆకలిగా ఉంది త్వరగా పోదాం పద" అన్నాడు.

**ఆకులు రాలడం**

ఇది ఆకులు రాలడమో, ఆశలు రాలడమో, అర్థం కాలేదు.

శిశిరం తల ఎత్తి ప్రపంచానికి దిగులు ముసుగుతొడిగింది. ప్రతి సంజెలోనూ ప్రపంచాన్ని చూసి అంతటికీ పర్యవసానం ఈ 'శూన్యమే' నా అనిపించేంత ఏదో కనిపించని లోటు ప్రకృతి అంతా -

ఇక కాశీ -

అతని స్వేచ్ఛని పిరికితనం హత్యచేసింది. జీవితం మీద ఆశలు సాధనలవల్ల ఆసక్తిని ఉరితీశాయి. ఎవరికీ జవాబు చెప్పని 'నిశ్శబ్ధం' మనస్సుని మండించింది. నిప్పంటించింది. నీతిని ఇంట్లో కట్టిపడేసి నిటారుగా తలెత్తుకు తిరగడం తెలీక కాశీ మెదడులో కల్లోలం కాపురం పెట్టుకొని బాధ తిమింగలాలను కన్నది.

కొన్నాళ్ళుగా ఉన్న గణపతి, అమ్మ కూడా ఇప్పుడు లేకుండా పోయేసరికి ఆర్థికంగా కూడా ఎదురు దెబ్బలు తగలడం ప్రారంభించాయి కాశీకి. అయినా ఎవరికీ చెప్పలేని బాధ అది - మనస్సులో తగిలే ఒక్కొక్క గాయానికీ ఎవరు మందిస్తారు.

***మనస్సుకు పెద్ద గర్వం ఉంది. తను ప్రపంచం అందరి గురించీ ఆలోచించగలనని. కానీ ఆశ్చర్యం ఏమిటంటే - ప్రపంచాన్ని గురించి ఆలోచించే ప్రయత్నంలో తనని గురించి తాను ఆలోచించడం మరిచిపోతుంది.***

కాశీ విషయంలో అంతే అయింది -

మరి పదినెలల తరువాత హఠాత్తుగా శంకరం ఎదురు పడి "నేను సైకిలు షాపు పెట్టదల్చుకున్నాను" అంటే తెల్లబోయాడు.

గుమ్మం బయట మరో వ్యక్తి నిలబడడం గమనించాడు కాశీ.

ఎవరని పలకరిస్తే "ఉండండి - ఈ సిగరెట్టు కాలడం లేదు - మన ఆశల్లాగ - జస్టెమినిట్" అని తొందరపడుతున్నాడు చక్రవర్తి.

చాలా ఆలోచనల్నుంచి చక్రవర్తితో గడిపే రెండు క్షణాలు విశ్రాంతి నిచ్చినట్టు అనిపిస్తుంది.

ఎదుటివాడి గురించి ఆలోచించకుండా, తన గురించి కూడా తాను ఆలోచించని పరిస్థితికి అందర్నీ తీసుకువస్తాడు చక్రవర్తి.

ఇప్పుడతన్ని చూశాక - మనఃపూర్వక ఆహ్వానించాడు కాశీ.

నీలిరంగు ట్వీడ్ సూటులో విధిగా రెండు మల్లెపువ్వులు - బనార్సీ జుంజుం వాలాసెంటు - పెదాల మీద చిరనవ్వు, అవకాశం దొరికినప్పుడు సైకాలజీ మీద జనరలైజేషన్స్, కాస్తపాటి విశ్రాంతి, కొన్ని సిగరెట్లు, హాస్యం - ఇదీ చక్రవర్తి.

''పూర్తిగా ఏడ్చి మా చెల్లి జీవితమంతా పాడుచేసుకుందండి - నేనేమీ ఏడవలేక పాడుచేసుకున్నాను. ***ఏడ్చినా మన ఏడుపు ప్రపంచానికి తెలియకూడదు. మనస్సులోనే ప్రాసెస్ అంతా జరిగిపోవాలి. ఒక్కటే రహస్యమండి - మీ నవ్వును ప్రపంచం పంచుకుంటుంది దుఃఖాన్ని పంచుకోదు***''

నవ్వుతూనే ఒక్కోసారి గుండె వణికించే నగ్న సత్యాన్ని చెప్తాడు. అంత బరువైన విషయాన్ని చెప్పినా మళ్ళీ ఆలోచించడానికి వ్యవధి ఇవ్వడు.

అతని దగ్గర జీవితం మాట పెద్ద సిద్ధాంతం ఉంది. దాంట్లోని పుటల్ని ఒక్కొక్కటిగా తెరుస్తాడు.

ఇంత తెలిసిన వాడు ఎందుకు పెళ్ళిచేసుకోలేదా అని కాశీ ఆశ్చర్యం - ఆ విషయం అడిగితే ఓ సారి అన్నాడు.

''పెళ్ళి నేనెందుకు చేసుకోలేదా అని కాదు. పెళ్ళి నన్నెందుకు చేసుకోలేదా అని అడగండి - మానవుడి అవసరాల వత్తిడి మరీ భరించరానిదయితే - స్త్రీ నీడలో రక్షణ పొందడాన్ని పెళ్ళి అంటాం మనం. నాకు ఆ రక్షణ అక్కరలేదు. నేను మాటల్లో, హాస్యంలో రక్షణ పొందగలను. ఇక ఎవరయినా అమ్మాయికి నాదగ్గర రక్షణ కావలిస్తే నాకేం అభ్యంతరం ఉండదు.''

ఇప్పటికి సిగరెటుకు చివరిపీల్పు ఇచ్చి లోపలికి వచ్చి కూర్చున్నాడు.

''మీ వాడు ఏదో ప్రణాళిక తయారు చేశాడు - బ్రతకడానికి. బ్రతకడానికి ప్రణాళిక అక్కరలేదసలు. ఇతరులను బ్రతికేటట్టు చేయడానికే ప్రణాళికలంటే వినడు. సరే మీరు ఎప్రూవ్ చెయ్యండి. మేమిద్దరం సమిష్టిగా సైకిల్ షాపును సాధించి తీరుతాం''

''అయితే ఆలోచన చెప్పింది మీరేనా?''

''నాన్సెన్స్ - ఆలోచనలు ఎవరికీ చెప్పిరావండి - ఈ ఆలోచన అతనికి సగం, నాకు సగం వచ్చింది. బ్రతకాలన్న ఆలోచన అతనికి (ఓ రహస్యం- బ్రతకాలన్న ఆలోచన వచ్చి మరుక్షణంలోనే ఆ వ్యక్తి చచ్చిపోయినట్టు లెక్క ఇది నా సిద్ధాంతం) ఇకెట్లా బ్రతకాలన్న ఆలోచన నాకు వచ్చింది. ఇదీ సంగతీ -''

''అది చాలా పెద్ద ప్రయత్నం చక్రవర్తిగారూ - వీడు సాధించగలడా అని నా అనుమానం''

***''పెద్ద ప్రయత్నాలు చేయడానికి పెద్ద కృషి ఏమీ అక్కరలేదు. ఉదాహరణకి రాజకీయ నాయకుల్ని, దేవుణ్ణి తీసుకోండి - ఎప్పుడూ భక్తుల దగ్గర తిరుగుతాట్ట దేవుడు - ఎన్.జీ.వోలాగ చచ్చి చెడి మనుషుల్ని తయారు చెయ్యకుండా. ఇక రాజకీయ నాయకుడు - సూపర్ మాన్ ప్రజల డబ్బుతో ఎప్పుడూ పెద్ద ప్రయత్నాలు చేస్తూనే ఉంటాడు - తన కోసం***''.

నవ్వాడు కాశీ. ఈ మనిషిలో జీవితం పట్ల ఎంత నిర్లక్ష్యం ఉన్నదా అని. అందరికీ సాధ్యం కాని బ్రతుకది. ఎంత ప్రయత్నించీ, ప్రతి వ్యక్తి అంత విముఖత్వాన్ని ప్రకటించలేడు.

''ఏమంటావు అన్నయ్యా?'' అన్నాడు శంకరం గోడకి ఆనుకుని నిలబడి.

''సరే ప్రయత్నించు'' అన్నాడు కాశీ చివరికి.

''బ్రతకడానికి ఓ సింపుల్ సిద్ధాంతాన్ని సిద్ధం చేశాన***ండి. ఇటీవల - 20వ శతాబ్దంలో సుఖంగా బ్రతకడం అంటే ఇంకేమీలేదు. తను తప్ప ఇంకెవరూ బ్రతకలేని పరిస్థితిని తీసుకురావడం, కష్టాల్లో పడి బాధగా బ్రతకడమంటే ఒక్కటే అర్థం. తను తప్ప ఇతరులంతా బ్రతికే పరిస్థితి తీసుకురావడం - ఇక మధ్యతరగతివాడు తను బ్రతకలేడు, ఇతరుల్ని బ్రతకనివ్వడు'***

గుక్క తిప్పుకోకుండా నవ్వడం సాగించాడు కాశీ. ఎంతోసేపటికి ఆగి ''మరి మీరే తరగతికి చెందుతారు?''

"నేనింకా బ్రతకడం ప్రారంభించలేదు. ప్రయోగశాలలోనే జీవితాన్ని మరిచిపోయాను. ఇక అక్కడినుంచి కదపాలన్న ఉత్సాహం నాకు లేదు".

"మరి నేను?" -

నవ్వాడు - అతనిలో కాస్త బెదురూ, అదురుపాటు గమనించాడు కాశీ -

"మీరు నాకంటే పెద్దవారు మిత్రులు కనుక సూటిగా చెప్పేస్తున్నాను. మీరు బ్రతకడంలేదు. బ్రతుకుతున్నామని మీ మనస్సును నమ్మించాలని చూస్తున్నారు. కానీ మనస్సు ఉన్నది చూశారూ? - అది చాలా సెన్సిటివ్. ఎప్పుడో ఈ రహస్యాన్ని కనిపెట్టేస్తుంది. అది కనిపెట్టిందా, పెద్ద బాంబు బ్రద్దలయినట్టే - అక్కడ ప్రారంభమవుతుంది అసలయిన ట్రాజెడీ" -

కాశీకి ముఖం వివర్ణమయింది. ఇంతగా అర్థం చేసుకు సునిశితంగా ఆలోచించే వ్యక్తికి ఇది సరైన స్థలం కాదేమో అనిపించింది. విచిత్రంగా చక్రవర్తిని చూస్తూ కూచున్నాడు. చక్రవర్తి సిగరెట్టు కాలుస్తున్నాడు.

"సిగరెట్టు మీరెందుకు మానెయ్యకూడదు - చక్రవర్తిగారూ?" అన్నాడు.

నవ్వాడు. ఆ నవ్వుకు ప్రపంచమంతా తక్కువగానే తూగుతున్నట్టనిపించింది. "నేను చాలా తెలివిగా మాట్లాడినప్పుడల్లా సిగరెట్టు కాల్చి నన్ను నేను రక్షించుకుంటాను కాశీనాథంగారూ - ఆ విధంగా నా తెలివినంతా గాల్లో వదిలేస్తాను. విజ్ఞానాన్ని దాచుకోకూడదు. ప్రదర్శించి మరిచిపోవాలి" -

శంకరం బయటపడేసరికి అక్కడ స్థంభం చాటునే వసంత కనిపించింది. అతన్ని చూడగానే పక్కకి జరిగి "ఛీ! ఏం పనిచేశారు?" అంది.

అతను తెల్లబోయాడు.

"ఏం?" అన్నాడు ఏమీ అర్థం కాక. "మీరు శరీరాన్ని వంచి ఏమీ కష్టం చెయ్యలేరు. చదువుకోడానికి ఇంకా వయస్సుంది. ఇట్లా మిమ్మల్ని మీరు నాశనం చేసుకోడం ఏం బాగోలేదు" ఉదాసీనంగా, కృత్రిమ కోపంతో అన్నది.

ఈ వ్యక్తి తనని గురించి ఇంతగా ఆలోచిస్తున్న దేమిటా అని విస్తుపోయాడు మొదట. ఆమె ముఖం చూస్తే ధైర్యం ఇంకా రాలేదు 'ఎందుకిట్లా చేశానా' అని ఆలోచిస్తున్నాడు.

ఇటు తిరిగితే ఈసారి కళ్ళలో ఆ ప్రశ్న ఎదురయింది. నవ్వాడు "ఇంతకంటే నాకేమీ రాదనిపిస్తుంది. ఇప్పుడు అన్నయ్యకు ఎలా సహాయపడతానన్న ప్రశ్న తప్ప, నేనెట్లా బ్రతుకుతానన్నది కాదు - ఈ ఇంటి పరిస్థితులు ఇప్పటికి ఎలా ఉన్నాయో తెలుసుగా?"

ఈలోగా చక్రవర్తి కాశీతో మాటలు ముగించుకుని అక్కడికి వచ్చేశాడు. "ఏమిటోయ్ - ఆరు బయట నిలబడి ప్రపంచం గురించి అంతగా ఆలోచిస్తున్నావు - నిన్ను నాతో ఆరునెలలు తిప్పి దేని గురించీ ఆలోచించనక్కరలేదన్న విషయాన్ని నేర్పించాలి" అని స్థంభం చాటున ఉన్న వసంతని చూసి నాలిక కొరుక్కుని - "నమస్కారమండీ" అన్నాడు. వసంత మాట్లాడకుండా నమస్కారం చేసింది.

ఇద్దరూ ఇంకా మౌనంగా ఉండడం చూసి మళ్ళీ కదిపాడు. "ఏమిటా ఆలోచన? "

"నేను చదవాలంటుందీవిడ" అన్నాడు శంకరం.

వసంత సిగ్గుపడింది ఆ మాటలకి. అది గమనించి చక్రవర్తి అందుకున్నాడు. "చదువుకునేవాళ్ళు మూడు రకాలు. తన చదువు తనకే పనికి వచ్చేటట్టు చూసుకునే వాళ్ళు - తన చదువు తనకి తప్ప ప్రపంచానికంతటికీ పనికి వచ్చేటట్టు చూసుకునే వాళ్ళు - మూడో కోవకు చెందినవాణ్ణి నేను. ఈ చదువు ఎవరికీ పనికి రాకుండా జాగ్రత్తపడగలిగాను. జీవితంలో బ్రతకడం చేతకాని 'ఫూల్స్' అంతా కాలేజీల్లో సర్టిఫికెట్ల కోసం దేవుళ్ళాడి తమకు ఏమీ చేతకాలేదన్న విషయం క్షుణ్ణంగాతెలుసుకు వస్తారు. నువ్వివాళ సైకిలు షాపు పెట్టి,

రేపు అందమైన ఆడవాళ్ళ సలహాలు పాటించవచ్చు. కానీ అన్నీ కాదు - రా - బ్రతకడం ఎలాగో చెప్తాను" అని భుజం మీద చెయ్యివేశాడు.

ఈ మాటల ఉధ్ధుతానికి వసంత నిర్విణ్ణురాలయి చేష్టలు ఉడిగి నిలబడి అంతలో ఆగి మళ్ళీ వెనక్కి తిరిగి వచ్చి, ఆమె వేపు వంగి రహస్యంగా చెప్పాడు చక్రవర్తి. "వట్టి పిరికి మనిషి శంకరం.. మీకు తెలుసుగా! ***పిరికివాళ్ళని బాగు చెయ్యాలంటే అతను తప్ప మిగతా వాళ్ళంతా పిరికివాళ్ళేనని నిరూపించి, వాళ్ళు బాగుపడటానికి అవకాశం ఉన్నదని ఆశను కలిగించాలి.*** ఆ మాటలకి బాధపడకండి. శంకరం బాగుపడతాడు. చూస్తూండండి." అనేసి వెళ్ళిపోయాడు.

ఆమె దిగ్భ్రాంతురాలయి నిలబడిపోయింది. శంకరం మీద ఆలోచన కంటే, ఈ వ్యక్తి విచిత్ర ప్రవర్తన ఆమెను మరింత చకితురాల్ని చేసింది. ఔచిత్యం వీడని మాటలు, హాస్యం, అన్నీ అట్లా ఉండగా ఎదుటివారిని వ్యక్తులుగా కాక, ఏవో ఆటబొమ్మల్ని లాగ తేలిక పరిచే వైఖరి ఆమెకు నచ్చలేదు.

మాట్లాడేప్పుడు ఆ ముఖంలో ఆశలూ, కోరికలూ, బాధ, ఆశ్చర్యం, ఏమీ కనిపించవు. ఎదుటివారిని వ్యక్తిగా గుర్తించి వారిని గురించి ఆలోచించడం ప్రారంభిస్తే ఇక తన పతనం ప్రారంభమవుతుందన్న జ్ఞాపకం ఎప్పుడూ వదులుకోడేమో?

అతని గురించి ఆలోచిస్తున్న కొలదీ నవ్వు రాలేదామెకు. కానీ తనకు తెలీని, పూర్తిగా అర్ధం కాని ఇంకో వ్యక్తి నవ్వుతూ మాట్లాడే వ్యక్తి వెనక ఉన్నట్టు తోచింది.

వాకిట్లో అక్కయ్య దీపం వెలిగించి వెళితే, ఇంకా స్థంభం చాటునే నిలబడి "అప్పుడే చీకటిపడిందా?" అని విస్మితురాలయింది వసంత.

●●●

జీవితంలో రెండేళ్ళ ప్రమాణం ఎంత?

నీలూ ఇప్పుడు నాలుగో తరగతి చదువుతున్నాడు.

చక్రవర్తి ఆసరాతో శంకరం నిలబడ్డాడు. సైకిలు షాపు బాగా సాగుతోంది. నిజమే, బ్రతకడానికి చదువు ఒక్కటే మార్గం కాదని నేర్చుకున్నాడు.

మానవుణ్ణి చూసి, అతని జీవితాన్ని తెరచి పరికించిన కొద్దీ, దుఃఖమే కనిపిస్తుంది. అందువల్ల నవ్వుతూనే ప్రయత్నం ప్రారంభించాలి.

చీకటి ముసుగు కప్పుకుని రాత్రి ఒంటరిగా రోదించినప్పటి భయం, వణుకుదల, పిరికితనం, సంశయం అవీ మిగిలాయి కాశీ జీవితంలో.

శంకరం అట్లా ఒంటరిగా బ్రతుకుతూ తెచ్చేదంతా తన చేతుల్లో పోయడం నచ్చలేదు అన్నపూర్ణకు. "డబ్బు ఆర్జించి ఒకరికి పెట్టే వయస్సుకాదు నీది. అనవసరంగా నిన్ను నువ్వు కష్టపెట్టుకుంటున్నావు శంకరం" అని ఎప్పుడన్నా అన్నపూర్ణ అంటే నవ్వేవాడు. నవ్వి కళ్ళనిండా నీళ్ళు తెచ్చుకుని "నాకు చిన్నతనంలో నాన్న గుర్తులేదు. కాస్త జ్ఞానం వచ్చాక అన్నయ్యనీ, నిన్నూ ప్రేమించడం నేర్చుకున్నాను. పనిచేసి నేనూ మనిషిననిపించుకోవడం కన్నా సుఖం ఎక్కడన్నా ఉందో లేదో నాకు తెలీదు. తెలిస్తే అప్పుడు మానేస్తానులే" అనేవాడు.

హృదయమంతా ఆ మాటలకి కదలి అతను చూడకుండా ఆమె కూడా కళ్ళనీళ్ళు తుడుచుకునేది.

కొత్తగా నరసమ్మగారు ఇప్పుడొక పట్టుదల పట్టి కూచున్నారు. చిన్నవాడికి పెళ్ళి జరిగిపోవాలని. వసంత ఆమె గుండెమీద నల్లరాయి అయికూచుంది.

ఈ విషయంలో అన్నపూర్ణ కూడా నిర్ణీతమయిన సలహా ఇవ్వలేకపోయింది. వసంత గురించి ఆనాడు చెలరేగిన ప్రళయం ఇంకా మరచిపోలేదు. అందుకని కాశీ అడిగితే మాట్లాడకుండా ఊరుకుంది.

మాష్టారికి ఉత్తరం రాస్తే 'నీ కుటుంబానికి చెయ్యవలసిన ఆఖరి సహాయం అది. శంకరానికి పెళ్ళిచేశాక ఇక ఆ బాధ్యతలేమీ మిగలవు. నీ కుటుంబాన్ని నువ్వు సాకడం తప్పు. వెంటనే పెళ్ళి చెయ్యమనే నా సలహా" అని వ్రాశారు.

"నన్ను నేనే పోషించుకోలేని పరిస్థితి ఇది. నాకు పెళ్ళివద్దని చెప్పువదినా" అని శంకరం ఓ రోజు ఆమె ముందుకు చూసి రహస్యంగా చెపితే అన్నపూర్ణ ఆశ్చర్యంగా చూసి నవ్వింది. "సాధారణంగా బాగులేకపోవటమే మన కుటుంబాల్లో ఎప్పుడూ ఉంటుంది శంకరం."

కాశీ మామయ్యకు ఉత్తరం రాస్తే ఆ పనికే ఎదురు చూస్తున్నట్టూ ఆ చుట్టుపక్కల నాలుగు పల్లెల్నీ చుట్టబెట్టి మరి నెలరోజులకి ఉత్తరం రాశాడు.

"నీకో రహస్యం తెలిదు. అన్నపూర్ణ వల్లనే నువ్వు ఇవ్వాళ ఆ మాత్రం సుఖంగానన్నా బ్రతకగలుగుతున్నావు. శంకరానికి మరో అన్నపూర్ణను చూశాను. నిజంగా అన్నపూర్ణే. నువ్వోసారి వచ్చి చూసి వెళ్ళు" అని వ్రాశాడు ఉత్తరం.

"నేను శంకరం పెళ్ళాన్ని చూడాలి" అంది అన్నపూర్ణ.

ముఖం నిండా ముసుగు కప్పుకుని, తలుపుకు చేరబడి అమాయకంగా నేలవేపు చూస్తూ కూచున్న ఓ పుత్తడి బొమ్మని చూసి మనసులో తృప్తిపడింది అన్నపూర్ణ. "అవును, ఆ పెదాలు అట్లా అమాయకంగా ఉండాలి. ఆ కళ్ళు అంతే. అలాగే బెరుకుగా ఉండాలి. ముఖంలో అల్లాగే పల్చగా పై పొరలో రక్తం కదలిక తెలిసేట్టు."

వెళ్తూ వెళ్తూ ఓ రహస్యం ఆ అమ్మాయి చెవిలో చెప్పేసి వెళ్ళింది అన్నపూర్ణ "గొప్ప ఆస్తిని స్వాధీనం చేసుకుంటున్నావు అమ్మా నువ్వు. మా శంకరం మామూలు మనిషి కాదు. బొట్టు పెద్దదిగా పెట్టుకోవడం అలవాటు చేసుకో"

విజయనగరంలో పెళ్ళి, పెళ్ళివారంతా విశాఖ నుంచి తరలి వెళ్ళాలి.

అక్కడ పెళ్ళి జరిగే సమయానికి నీలూ పరీక్షలు. "చిన్న తరగతే కనక ఫర్వాలేదులే, వచ్చెయ్" అంది అన్నపూర్ణ.

"చిన్న తరగతయినా చదువే. ఈ సంవత్సరం విలువ ఇప్పుడు కాదు పెద్దయాక తెలుస్తుంది" అన్నాడు కాశీ.

ఇక ఇంటిదగ్గర ఎవరు నిలిచిపోవాలన్న ప్రశ్న వచ్చింది.

"పోనీ నేను ఉంటాను" అంది వసంత.

ఆమె ఆగిపోవడం ఏమీ అడ్డంకుగా కనిపించలేదు నరసమ్మగారికి. "అవును వసంత ఉండడమే బావుంటుంది. వాణ్ణి జాగ్రత్తగా చూస్తుంది" అని సమర్థించారు.

చివరికి ఆమె ఉండడానికే నిశ్చయమయింది.

వెళ్ళబోయే ముందు వరకు శంకరానికి ఈ విషయం తెలీదు. తీరా తెలిశాక ఆశ్చర్యపోతూ "మీరు రారా?" అని వసంతని అడిగితే నవ్వింది. "నేను నీలూకి తోడుగా ఉంటాను లెండి. ఇక్కడ ఉండి కూడా మీ పెళ్ళికి సహాయం చేస్తున్నట్టే లెక్క. మీ భార్య వచ్చాక ప్రత్యేకంగా ఆమెను పరిచయం చేసుకుంటాను వెళ్ళి. ఇక్కడొక మంచి చెల్లెలు ఆమె కోసం ఎదురుచూస్తూంటుందని చెప్పండి" అంది.

"మా నెపోలియన్‌కి పెళ్ళి జరుగుతుందన్న వార్త రెండు గంటలు ఆలశ్యంగా అందింది మాకు. వివాహంలో ఇవ్వాల్సిన బహుమానానికి ఓ అమ్మాయిని సంప్రదించి ప్రజెంటు కొనితెచ్చాను. ఇదిగో సబ్బుపెట్టె. ఇదిగో కలం వేరీస్ హానరబుల్ బ్రైడ్ గ్రూమ్' అంటూ చక్రవర్తి హడావుడి పడుతూ వచ్చాడు.

ఎప్పుడన్నా చక్రవర్తి హడావుడీ పడకపోతేనే ఆశ్చర్యం. సిల్కు పైజమా, లాల్చీ వేసుకున్నాడు. ఎప్పుడూ మల్లెపువ్వులు విధిగా ఉండితీరాలి. మాటలన్నీ అన్నాక చుట్టూ వెదికితే ఇంట్లో అలికిడి కనిపించకపోయేసరికి నిరుత్తరుడయిపోయాడు. రెండు సార్లు శంకరాన్ని పిలిచాడు. విస్తుపోయి సన్నజాజి పందిరిని ఆనుకుని నిలబడ్డాడు.

ఎంతో వ్యవధి తరువాత 'ఇంట్లో అంతా గంట క్రిందటే బయలుదేరిపోయారు' అన్న జవాబు భుజం పక్కనే వినిపించేసరికి తుళ్ళిపడాడు. ఇటు తిరిగితే వసంత.. సన్నజాజుల కొమ్మల మధ్య జీవితమంతా ఒకే కోరికగా ఆ పుష్పాన్ని ప్రసవించినట్టు చెదిరే వెలుగుల మధ్య సన్నగా, పేలవంగా ఏదో వింతదృశ్యాన్నో, పడమటి ఆకాశపు ఎరుపునో గుర్తు చేసేలాగున.

"మీరొక్కరే మిగిలిపోయారేం మరి?"

ఇంటి నిశ్శబ్దానికి అర్థం ఇప్పటికి తెలిసింది.

నవ్వింది ప్రశ్న విని "అందరూ పెళ్ళికే పోయి కూర్చుంటే ఎట్లా? ఇక్కడా పనులు మిగిలిపోతాయి"

"ఏ పనులు? పువ్వులు కొయ్యడమా?"

పందిరంతా వెదికినా ఒక్క పువ్వు దొరకలేదు చక్రవర్తికి.

"పువ్వులన్నీ కోసేశారు" అంటూ ఆమె వేపు తిరిగి "అట్లా చెట్ల మధ్య నిలబడకండి. నా ఎక్స్‌రే కళ్ళకి మీరు పువ్వులాగానే కనిపిస్తున్నారు. ప్రపంచంలో రెండింటిని మాత్రం అలక్ష్యం చేయడం ఇంకా నేర్చుకోలేదు నేను పువ్వునీ, స్త్రీనీ."

పందిరి రాటకు తల ఆనించి ఆమె సిగ్గుపడితే "అలా సిగ్గుపడకండి. నాకు సిగ్గుపడడం తెలీదు. అందువల్ల ఆ గొప్పతనాన్ని నేను గుర్తించడం కష్టం. మీ జవాబు మరచిపోయాను."

ఆమె ఏమిటో అర్థంకాక ఆశ్చర్యంగా చూసింది.

ఓ కొమ్మ అతని సిల్కు లాల్చీని పట్టుకుని లాగుతుంది.

"మీరిక్కడ ఉన్న కారణం?"

"నీలూ పరీక్షలు నేను తోడుగా ఉండాలని, వాడికి వంట చేసిపెట్టడానికి."

ఫక్కున నవ్వాడు. "పరీక్షల మీదకూడా అంత శ్రద్ధయితే ఎలాగ? ఏమయినా, మీకు పెళ్ళిని చూసే అవకాశం లేకుండా చెయ్యడం విచారంగా ఉంది. రెండేనండి చాలా ఉత్సాహాన్ని కలిగించే ఘట్టాలు. పెళ్ళి చేసుకోవడంలో ఆశ్చర్యంలేదు. పెళ్ళిచేసుకోవడాన్ని చూడడంలో ఇంట్రెస్టు ఉంది. ఇందాక మీరు సిగ్గుపడ్డారే. సరిగ్గా పెళ్ళికూతురు అలాగే ఇక పెళ్ళికొడుకు జీవితానికి అదే చివరిసారిగా స్వాతంత్ర్యాన్ని అనుభవించే రోజులాగ. అందరి మధ్యనుంచీ ఏ క్షణాన్నయినా పారిపోవడానికి వీలవుతుందేమోనని పిరికిగా చూస్తూ వాస్తవాన్ని ఆలోచిస్తే నేనూ పెళ్ళికొడుకును కాలేదా అని ఆశ్చర్యం వేస్తోంది."

ఇటు తిరిగేసరికి వసంత కనిపించలేదు. నవ్వుకున్నాడు.

మెల్లగా వసారాలోకి వచ్చి కుర్చీలో కూచుని పందిర దగ్గర మల్లెపువ్వుల వాసనని గుర్తుచేసుకుంటున్నాడు. కుర్చీలో ఆ పువ్వులు పడేసి ఉన్నాయి.

పావుగంట తర్వాత ఆమె బయటికి వచ్చి "ఇక్కడే ఉన్నారా? వెళ్ళిపోయారనుకున్నాను."

*"ఆడవాళ్ళు చాలా ఆలోచించకుండా ఊహిస్తారండీ. అందువల్లనే వాళ్ళు జీవితంలో త్వరగా డిసప్పాయింట్ అవుతారు.* మీకిందాక నా మాటలకి కోపం వచ్చినట్టుంది. నా చేతిలో మల్లెపువ్వులు ఆ విషయాలు చెప్పాయి. క్షమాపణ చెప్పుకుందుకు ఇంత వ్యవధి తీసుకున్నాను."

నవ్వింది వసంత. అతనితో మాట్లాడినప్పుడల్లా మనసును దాచుకోడానికి వీలుకాదు. ప్రయత్నించయినా పూర్తి మనస్సుతో మాట్లాడాలి. లేకపోతే గ్రహించేస్తాడు. ప్రయత్నం అక్కరలేకుండా ఇవాళ అతని మాటలకి నవ్వు వస్తోంది. ఓ పక్క సగం సగం వెలిసిపోతున్న మరొక పక్క చంద్రుడి చల్లదనం కలిసిపోయి ఆ సాయంకాలపు సోమరి ఘడియలకి ఓ బరువు వచ్చినట్టనిపించింది. ఆ పేలవమయిన వెలుగుతో.

ఎర్రటి కెంపు చీరె నడుం మీద నుంచి మునుకుల వరకూ జారింది. నీలూ ఎక్కడన్నా కనిపిస్తాడేమోనని వీధి చివరి వరకూ కళ్ళతో వెదికింది. ఇటు తిరిగితే మనస్సంతా కళ్ళు చేసుకుని తనవేపే చూస్తున్నాడు చక్రవర్తి.

అతన్ని చూసి ఎప్పుడూ ఎవరూ భయపడనక్కరలేదు. మనిషి గురించి ఆలోచించని అలక్ష్యం అతనిలో ప్రత్యేకంగా ఉంది. కానీ మొదటిసారిగా మనిషిని గురించి ఆలోచిస్తే పులికి మొదటిసారి మనిషి రక్తం రుచి తెలిసినట్టు.

ఆ ముఖంలో నిర్విణ్ణతను చూసి భయం భయంగా నవ్వింది. "నాకు మీ మీద కోపంలేదు. నిజం" అంది. అన్నాక 'ఇలా మాట్లాడుతున్నానేమిటి నేను' అని చకితురాలయింది.

అతను లేచి నిలబడి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటే మల్లెపువ్వులు నేలరాలిపోయి చెదిరిపోయాయి. వాటిని ఏరుకునేందుకు నేలమీద కూచున్నాడు. చేతులు కట్టుకుని గోడకి ఆనుకుని నిలబడ్డది వసంత.

మెల్లగా అన్నాడు. "చిన్నతనం నుంచీ ఏ ఆడదీ నన్ను పెంచలేదు. అమ్మ నాకు గుర్తులేదు. నాన్నగారు నేను గొప్పగా బ్రతకడమే నేర్పారు కానీ, ప్రేమతో బ్రతకడం నేర్పలేదు. అందుకని స్త్రీని చూసినప్పుడల్లా చాలా ప్రలోభం కలుగుతుంది. ఆమె చేతుల్లో పెరిగి ఉంటే బావుండేది అన్న ఆలోచన, నిజంగా మీకు కోపం వస్తే నేను చాలా బాధపడతాను."

ఆలోచిస్తున్న కొద్దీ మరీ చిన్నవాడయిపోతున్నాడు చక్రవర్తి. అతని మాటల్ని వింటూ దిగ్భ్రమతో అతణ్ణి చూస్తూ నిలబడిపోయింది. ఇన్ని భావాల్ని, ఇంత మనస్సును దాచుకుని రోజూ అన్ని మాటలూ, హాస్యం ఆలోచిస్తున్న కొద్దీ ఆశ్చర్యం కలుగుతోంది.

ఆమె స్తబ్దత అతణ్ణి భయపెట్టింది. సూటిగా చూసే ఆమె కళ్ళకు సమాధానం చెప్పలేక ఇటు తిరిగితే చీకటి ఆకాశంలో పల్టీలు కొట్టే పక్షులు కనిపించాయి.

"నేను మీరనుకున్నంత బలవంతుణ్ణి, ధైర్యవంతుణ్ణి కాదు. కనీసం మీ కళ్ళని ఎదుర్కొనే పాటి ధైర్యంలేదు నాకు" అని ఇటు తిరిగి "అదేమిటి? మీరు ఏడుస్తున్నారు" అన్నాడు.

ఆమె నవ్వింది. "ఇంక చీకటి పడింది మీరు వెళ్ళరూ..!?" అంది.

చుట్టూ చూసి ఆశ్చర్యపోయాడు. "నిజమే, చీకటి పడింది. ఇంతగా ఎప్పుడూ మాటల్ని మరిచిపోలేదు నేను. మాటలు రాని రోజున నా మనస్సు పనిచేయడం ప్రారంభిస్తుంది. మిమల్ని బాధపెట్టాలన్న ఉద్దేశ్యం నాకెప్పుడూ లేదు. నమస్కారం" అనేసి వచ్చేశాడు.

అతను వెళ్ళాక చూసుకుంటే ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి.

అదేమిటి తను ఏడుస్తోందేం. !!??

**పడమటి ఆకాశపు** ఎరుపు చూసినప్పుడల్లా దిగులు కలుగుతుంది. ఏవో ఊహించని విషాదాల్ని జీవితం అనుభవిస్తున్నట్టు మరచిపోలేని దుఃఖాన్నీ, అసంతృప్తినీ రగిల్చే శక్తి ఏదో చేస్తుంది.

దూరాన పోక చెట్టు కొమ్మ మీద ఏదో పేరు తెలీని పిట్ట నిలబడింది.

పడమటి ఆకాశం నిశ్శబ్దంగా, చల్లగా, ఏదో ప్రళయాన్ని దాచుకున్న హృదయంలాగా -

ఉన్నట్టుండి తలుపు తోసుకు చక్రవర్తి లోపలికి వస్తే దిమ్మెరపోయింది వసంత.

"మీరు ఒంటరిగా ఇక్కడ బ్రతకలేరని నాకనిపించింది. ఇవాళ సాయంకాలం ఎక్కడికి తిరగాలా అని ఆలోచిస్తే మీరే గుర్తుకొచ్చారు. నిన్ననేనట్లా అయిపోయానేమిటి? మీరేమనుకున్నారు?" అంటూ వాకిట్లో ఎత్తుగా ఉన్న అరుగు మీద కూచున్నాడు.

ఎందుకో భయం వేసింది వసంతకు. ఆ క్షణంలో అతని చొరవకి చికాకు కలిగింది.

"మీ నిస్సహాయతను గురించి ఆలోచించరు. పోనీ, ఇతరులనయినా ఆలోచించడానికి వ్యవధి ఎందుకు ఇవ్వరు? మళ్ళీ ఇప్పుడు ఎందుకు వచ్చారు?" అంది.

ఇది వరకెప్పుడూ ఆమెతో ఇట్లా మాట్లాడే అవకాశం కలగలేదు. నిన్న మాట్లాడే వ్యవధి తక్కువయినా తన మాటల్ని వినడంలో ఆమె కనపరచిన ఆసక్తి అతనికేదో బలాన్నిచ్చింది. ***తన మీద ఆసక్తి చూపగల వ్యక్తి ప్రపంచంలో ఉన్నదని హామీ ఎంత గొప్పది.***

ఇప్పుడు వసంత ఇట్లా అనేసరికి బిత్తరపోయాడు. లేవబోతే కాలికింద ఏదో పడింది. చూస్తే, నల్లటి పురుగు ఏదో రెక్క తెగి కొట్టుకుంటోంది.

బాధపడ్డాడు.

"మంచిమిత్రుడు అక్కరలేదా మీకు?" అన్నాడు స్తంభానికి చేరబడి.

"మంచి మిత్రుడు. మంచిమిత్రుడెందుకండీ తృప్తిగా బ్రతికే వ్యక్తికి. ఎప్పుడన్నా దారీ తెన్నూ తోచక చచ్చే పరిస్థితి వస్తే అప్పుడూ మంచి మిత్రుడు. మీకింకా అర్థంకాదు ఏం చెయ్యను?" అని ఉదాసీనంగా విసుక్కుంది.

ఇవాళంతా ఆమె సూటిగా మాట్లాడటం లేదు. ఎంత ప్రయత్నించీ ఆమె మనస్సును గుర్తించలేకపోయాడు.

"మిమ్మల్ని నిన్న ఆ మాటల్తో బాధపెట్టాను. నాకు తెలుసు"

చటుక్కున ఇటు తిరిగింది. "మీరు ప్రతి విషయాన్నీ అంత ఆలోచిస్తారేం చక్రవర్తిగారూ. దేని గురించీ ఎక్కువ ఆలోచించకూడదన్న సంగతిని మీ దగ్గర నేర్చుకున్నాను నేను. హాయిగానే బ్రతుకుతున్నాను వెళ్ళండి. అట్లా తిరిగి మిమ్మల్ని మీరు మరిచిపోగలరేమో ప్రయత్నించండి. మంచి మిత్రుడు కావలసి వచ్చినప్పుడు నేనే మీ దగ్గరకి వస్తాను"

చివరి వాక్యం ఒక్కటే అర్థమయింది. ఆమెకు ఎదురుగ్గా వచ్చి నిలబడి "వస్తారా?" అన్నాడు.

ఆమె ఉలిక్కిపడింది "ఎక్కడికి?" అంది.

"నా దగ్గరకి మీకు తెలీదు. మీకు నేస్తం కావాలి. జీవితమంతా మరచిపోలేని గొప్పమిత్రుణ్ణి అవుతాను నేను."

కోపంతో, అతనిమీద జాలితో, విసుగుతో మళ్ళీ కళ్ళనీళ్ళు తిరిగాయి.

"అట్లా ఏడవకండి. నన్ను ఏదీ జయించలేకపోయింది ఇంతవరకూ మీ కన్నీళ్ళు చూస్తే నాకు మాట రాదు."

"మీకేం తెలీదు చక్రవర్తిగారూ బ్రతకడం కూడా చేతకాదు. మీరు చాలా గొప్పవారనుకున్నాను. మరి కొంతసేపు మీరిక్కడ కూచుంటే మిమ్మల్ని చూస్తే అసహ్యించుకోవడం ప్రారంభమయేట్టుంది. మాటలు ఇవాళకాదు. దయచేసి వెళ్ళిపోండి"

ఆమె కళ్ళల్లో ఆజ్ఞకి భయపడ్డాడు అతను. ముఖంలో అంత ఎరుపు, పట్టుదలా ఎప్పుడూ చూడలేదతడు.

"వెళ్ళిపోతాను. నాకివాళ పిచ్చెత్తుతుంది. నాకు తెలుసు" అంటూ వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళాక అటువేపు చూస్తూ తలపట్టుకు ఒంటరిగా ఏడుస్తూ కూచుంది వసంత. "భగవాన్ నాకెందుకింత సూటిగా మాట్లాడే కరుకుదనాన్ని ఇచ్చావు? మూగదాన్ని చేసినా బాగుండేది" అనుకుంది.

కానీ చక్రవర్తి ఆ ఇంటిని వదిలిపెట్టలేదు. కనీసం ఆ రెండు రోజుల్లో పదిసార్లయినా తిరిగాడు. విచిత్రం. ఇప్పుడతను పూర్తిగా మారిపోయాడు. మనిషిలో అప్పటి హాస్యం లేదు. ఆ నవ్వులేదు. ఓ భయం, ఆమె మాటలమీదే తన జీవితమంతా ఆధారపడినట్టు కళ్ళలో ఆత్రుత.

"ఇక నన్ను పొమ్మనకండి. కుక్కని అట్లా విదిలించుకుంటే భాష తెలీదు కనక గుంజాటన పడుతుంది. నేను తప్పక ఏడుస్తాను" ఆమె నవ్వితే 'నిజం' అన్నాడు.

ఇక అప్రతిభురాలయింది. ఇంటిలో ప్రతీ పనికీ కల్పించుకు తిరిగాడు.

"నా గురించి మీరు ఆలోచించడం లేదు. మీ మనస్సు మీకు ప్రత్యక్షమవుతోంది" అని వసంత అంటే

"అన్నిటినీ మరిచిపోయి, ఒక మీ గురించే ఆలోచించడం నేర్చుకున్నాను. ఇక ఇదివరకులా అన్నిటినీ తేలికగా చూసి, నవ్వేసే చక్రవర్తి కనిపించడు మీకు" అన్నాడు.

ఇక అతనికి ఎలా చెప్పడమో తెలియలేదు.

ఒకసారి నవ్వుతూ అన్నది. "మీరు చెప్పిన మంచి మిత్రుడు అవసరం నాకు కలిగేట్టుంది"

"ఏం?"

"ఎందుకో మీకూ తెలుసు. నేను నాశనం కావడానికి ఇంకెంతో వ్యవధిలేదు. మీకు సంతోషంగా లేదూ?" అంది.

అట్లాంటి మాటలు అసలు అర్థం కావు చక్రవర్తికి. పుస్తకాల్లో స్త్రీలనే మనస్సులో ఊహించాడేకానీ, వసంతలాంటి వ్యక్తులు జీవితంలో తటస్థపడితే ఏం చేయాలో నేర్చుకోలేదతను.

ఇద్దరూ అలాగే నిలబడి పడమటి ఆకాశం వేపు చూస్తూండిపోయారు.

ఆకాశం గుండె గాయపడి రక్తం స్రవిస్తున్నట్టుంది పడమటివేపు మరకలు. ఆ ఎర్రదనానికి అర్థం లేదు. నిరాశ జీవితాన్ని వణికించే చివరి వణుకు. జీవిత మందిరంలోని నిశీధి నిశబ్దం, పగిలిన హృదయం కనే చివరి కలల నిట్టూర్పులూ ఆత్మవిశ్వాసం నశింపులోని నిర్వేదం ఇవీ గుర్తుకొస్తాయి. ఆ ఎరుపును చూస్తూంటే ఆ దృశ్యానికి వేయిప్రతిబింబాలు ఉన్నాయి. కదిపి, నిలిపి పలకరించే ప్రళయం అది.

భయంతో మనస్సు వశం తప్పి ఇటు తిరిగేసరికి శ్వాసతెలిసేంత దగ్గరగా నిలబడ్డాడు చక్రవర్తి. అతని శరీరం తనకేదో హామీఇస్తున్నట్టు మనస్సు కలవరానికి అది జవాబులాగ, ఆ కళ్ళల్లో ఏవో అర్థం కాని భావాలు చదువుకుని కలతపడ్డ మనస్సుతో నిలిచిపోయింది. ఏ ఆలోచన చేయడానికీ మనస్సు తాత్సారం చేస్తోంది. తెలీకుండానే కళ్ళనీళ్ళు తిరుగుతున్నాయి. ప్రపంచంలో దేనిగురించీ ఆలోచించనక్కరలేని స్థితివస్తే బావుంటుందని సతమతమవుతోంది అనుభవం చాలని మనస్సు. నడుం దగ్గర అతనివేళ్ళు వణకడం తెలుస్తోంది మొదట భయం. ఇప్పుడదీ లేదు. ఈ సంఘటనకు ఎన్నో రోజులుగా సిద్ధపడినట్టు ఓ నిర్లక్ష్యం రక్తంలో ప్రవేశించింది. రక్తంలో ఏదో కొత్తశక్తి మనతో నిమిత్తంలేని ప్రసారాన్ని చేసుకుపోతోంది. పెదాలు వణుకుతున్నాయి. కళ్ళెత్తి చూస్తే అతని ముఖం తన కళ్ళలో ఏదో వెదుక్కోవడం కనిపించింది. అతని నిశ్చలత ముందు తన జీవిత పూర్ణ పాత్రను ముంచేసి రిక్తహస్తాలతో నిలబడినట్టనిపించింది. ఒక్కసారి కావలించుకుని "నన్ను ఎప్పుడూ అన్యాయం చేసి వదిలిపోకండి" అందామని ఉంది కానీ దానికి

శక్తిచాలటం లేదు. శరీరంలోని ఉద్వేగం వేడికి ధైర్యం దగ్ధమయింది. పిరికితనంతో, సిగ్గుతో సగం చచ్చిపోయింది. నడుం మీద అతని వేళ్ళు దార్లు వెదుక్కుంటున్నాయి. రక్తప్రవాహం నిలిచిపోతుందేమోనన్నంత దగ్గరగా.

సాయంకాలపు చల్లదనం ఓ క్షణం సిగ్గుపడినట్టనిపించింది. ఓ పిట్ట గోడ మీదవాలి ఇటువేపు చూసి, తెల్లబోయి, నిశ్శబ్దంగా ఎగిరిపోయింది.

గుండె బరువు అతని మనస్సులో ఆతృతని పరీక్షిస్తోంది. ఇప్పుడు దుఃఖం రావడంలేదు నవ్వు వచ్చింది. ఆనవ్వుకి అర్థం ఊహించే స్థిమితం లేదు అప్పుడు.

"నన్ను మీలో కలిపేసుకోండి. నేనిక ఏమీ కాను" అంది. అదేమిటి కంఠం అట్లా పగిలిందేం? కొంతసేపయాక అతని చేతుల్లో సొమ్మసిల్లిపోయింది.

ఇంత దుఃఖం ఎట్లా ఆపుకోగలిగానా అని అప్పుడు విస్తుపోయింది వసంత.

●●●

పెళ్ళి నుంచి అంతా వచ్చేసరికి ఇల్లంతా నిశ్చలంగా ఉంది.

వసంత నవ్వుతూ పలకరించింది అక్కయ్యను. "పెళ్ళి ఎలా జరిగింది అక్కయ్యా?"

"బాగానే జరిగింది. నీ కళ్ళు అట్లా ఉన్నాయేం?"

"ఎర్రగానా?"

"అవును"

"నువ్వింకా పిచ్చిదానివి. చెల్లెలిమీద చాలా నమ్మకం నీకు. నా కళ్ళేకాదు నేనే మారిపోయాను పూర్తిగా" అనుకుంది మనస్సులో.

ఆమె నవ్వే నవ్వుకి ఇదివరకటి నవ్వుకీ పోలిక లేదు. అన్నపూర్ణకి ఆశ్చర్యం వేసింది.

"పిన్ని అలా ఉందేం నీలూ?" అనడిగితే.

"ఎలా ఉంది?" అన్నాడు వాడు ఆశ్చర్యపోతూ. వాణ్ణి అడిగినందుకు తనని తానే తిట్టుకుందామని ప్రయత్నించింది.

కానీ ఇప్పుడిక అతనే హఠాత్తుగా పలకరిస్తే తుళ్ళిపడింది.

"ఎలా జరిగింది? పెళ్ళికొడుకు ముఖానికి పసుపు ఆ నిండుదనం తెలుస్తూనే ఉంది. "

"మీరు రాలేదని బాధపడ్డాను. వస్తే బావుండేది."

"అవును బావుండేది" అంది ఏదో ఆలోచిస్తూ. అంతలో అతనివేపు తిరిగి "మీరు వెళ్ళి జీవితమంతా ఉపయోగపడే అనుభవాన్ని తెచ్చుకున్నారు. నేనిక్కడ ఉండి జీవితమంతా నాశనమయే అనుభవాన్ని తెచ్చుకున్నాను - అంతే తేడా" అంది.

అతను తెల్లబోయి చూస్తే "వెళ్ళండి నన్నెప్పుడూ ఒంటరిగా కలవకండి - ఎవరన్నా చూస్తే బావుండదు" అంది నవ్వుతూ.

నిజంగానే భయపడ్డాడు శంకరం. ఇవాళ చాలా విచిత్రంగా, కొత్తగా కనిపించింది వసంత. ఆమె ఆ మాట అన్నాక మరి ఒక్క క్షణం కూడా అక్కడ నిలబడలేదతను.

అతను వెళ్ళిపోతుంటే చూస్తూ నిలబడింది. అటు జయలక్ష్మి వచ్చినట్టయితే ఏదో పనికల్పించుకుని చటుక్కున మేడమీదికి వెళ్ళిపోయింది.

"ఉదయమే లేచి రోజూ చదువుకున్నావా నీలూ?" అని కాశీ అడిగితే - నీలూ ఉత్సాహంగా సమాధానం చెప్పాడు. "వసంత పిన్ని పొద్దుటే లేవనేలేదు. రోజూ చక్రవర్తి బాబాయి లేపేవాడు" అంటే నిర్ఘాంతపోయాడు కాశీ.

హఠాత్తుగా అతని ప్రసక్తి వచ్చేసరికి ఏదో కీడు సంభవించినట్టు భీతితో కదిలాడు.

ఒక్క క్షణ ఆగి "అమ్మని పిలువు ఓసారి" అని మేడ మీదకి వచ్చేశాడు.

అన్నపూర్ణ వచ్చేసరికి మ్లానవదనంతో మాష్టారి ఫోటో వేపు చూస్తూ నిలబడ్డ భర్తను చూసి పిలిచిన కారణం ఏమై ఉంటుందా అని ఆశ్చర్యపోయింది.

"పిలిచారా?" అని అడిగిన వెంటనే సమాధానం చెప్పలేదు - టేబులు దగ్గరకు వచ్చి కళ్ళజోడు వెదుక్కున్నాడు. కన్నీళ్ళు కారుతాయేమోనని భయమేసి - అదొక్కటే కన్నీళ్ళను దాచుకునే మార్గంగా కనిపించింది. ప్రతి చిన్నవిషయానికి ఎందుకు ఏడవాలి. అది దుఃఖం కాదు - పిరికితనం.

"పిలిచారా?" అంటోంది అన్నపూర్ణ.

"వసంత నీ అంత తెలివియైనదనుకున్నాను"

ఆమె ఉలిక్కిపడింది.

"ఏమయిందిప్పుడు?"

"చక్రవర్తి ఈ నాలుగురోజులూ ఇక్కడే ఉన్నాడట. వసంత తెలివి గురించే ఆలోచిస్తున్నాను నేను ఇక ప్రవర్తన గురించి నువ్వు ఆలోచించాలి."

అంతకంతకూ తన నిస్సహాయత కళ్ళకి కట్టినట్లయి కళ్ళ నీళ్ళు తిరిగాయి అన్నపూర్ణకు ఒక్కసారిగా వచ్చి భర్త గుండెకు తలను హత్తుకుంది. "నన్నిట్లా వేరుగా చూడకండి. ఒంటరిగా నేనేమీ ఆలోచించలేను" అంది ఆతృతతో.

స్తబ్దుడై ఉండిపోయాడు కాశీ. ఏం చెయ్యడానికీ ఆలోచన పోవడంలేదు. గదిలో గడియారం నడకలో 'లయ' తప్పుతున్నట్టుంది. కొంతసేపటికి "వసంత తప్పు చెయ్యదు" అన్నాడు.

అంతలో అన్నపూర్ణకు ఉదాసీనత కలిగింది. గుమ్మానికి ఆనుకుని తలకొట్టుకుంది. "ఆ పాపిష్టిదానికి ఈ కుటుంబంలో చోటు ఇవ్వటమే తప్పయిపోయింది" అని చరచరా క్రిందకి వెళ్ళబోయింది. ఆమె ఉద్రేకాన్ని చూసి భయపడి హఠాత్తుగా ఆమె భుజం పట్టుకుని ఆపాడు కాశీ.

స్థాయిలేని మనస్సు మరింత కెలికినట్టయి కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగాయి. అభిజాత్యంతో రక్తం ఉడికి చెక్కిళ్ళల్లోకి పాకినట్టయింది. దుఃఖం ఎరగని ముఖం కోపంతో అవమానంతో ఎర్రబడి మలినమయినట్టయింది.

ఇంకేమీ చెయ్యలేక భర్త రెండు చేతుల్లో తలదాచుకుని చిన్నపిల్లలా ఏడ్చింది.

మాష్టారిగారి నవ్వు ముఖం ఇంకా గోడమీద నిలబడి తనకేదో పాఠం చెపుతున్నట్టుంది కాశీకి. అవును, ఆ నవ్వులో ఏదో అర్థం ఉంది. మరీ చిన్నవాడయిన తన భుజం మీద చెయ్యివేసి ఆయన చెప్పిన మొదటి పాఠాలు గుర్తుకొచ్చాయి. స్థిమితాన్ని చిక్కబట్టుకున్నాడు. నిబ్బరంగా అన్నాడు భార్యతో.

"మనిద్దరమే కాదు లోకం అంటే - ఒక్కసారి జయలక్ష్మిని గుర్తు తెచ్చుకుంటే - ప్రపంచం ఎంత క్రూరమైయిందో నీకంతా అర్థమవుతుంది."

ఆలోచించే కొద్దీ అనుకంపతో, భీతితో మనస్సు గడగడ వణకడం ప్రారంభించింది. అవును, ఆమెకి ఈ విషయం అందితే ఒక్క క్షణం ఆగదు రహస్యం -

"నన్నేం చెయ్యమంటారిప్పుడు? నాకేం తోచడంలేదు. ఉన్నపాటునే వసంత చచ్చిపోతే బావుణ్ణనిపిస్తోంది."

ఆవేశాన్ని నిగ్రదొక్కుకుని మెల్లగా అన్నాడు. "ఎవరికీ ఈ విషయం తెలియనివ్వకు. నీలూని ఎట్లా మరిపించాలో తెలీదు నాకు. వాడిని ఆ విషయం మరిచిపోయేటట్టు చెయ్యి.

వసంతని నువ్వే కదుపు - నేనడిగితే భయపడి ఏడుస్తుంది. ఏమీ ప్రమాదం జరిగి ఉండదు బహుశా - ఓర్పుగా అడుగు - ఏ సందర్భంలోనూ ఆమె నీ చెల్లెలన్న విషయం మరిచిపోకు."

భర్త సహనానికి ఆమె మనస్సులో వెయ్యి నమస్కారాలు చెప్పుకుంది.

వసంత జీవితం పతనమయిందన్న ఆలోచన మనస్సును మరీ క్రుంగిపోయేటట్టు చేస్తోంది. ఎంత ప్రయత్నించినా కన్నీళ్ళు ఆగడలేదు. నీరసంగా అక్కడే కుప్పలా కూలిపోయింది అన్నపూర్ణ.

***

***జీవితం మనం అనుకున్నట్టు నడవదు. మనమే జీవితం నడిపే త్రోవలో పోవాలి. విజ్ఞుడు అట్లా ఒదిగి బ్రతుకుతాడు. మేధావి జీవితాన్ని తనకు అనుగుణంగా మర్చుకోగలుగుతాడు.***

***కానీ స్త్రీ జీవితం? చిన్న పునాదిమీద పెద్ద భవంతి నిలబడ్డట్టు కోరిక మనస్సును కదిపే చపల క్షణాలపై ఓ పెద్ద జీవితం. కోరిక 'బరి ' తప్పిందా? - ఒక్కసారి భవనమంతా కదిలి, కలలాగ మాయమై జారిపోతుంది. ఎన్ని యుగాల క్రిందటి శిల్పి నిర్మించాడో గానీ, శిల్పి ఆ భవనాన్ని చాలా బలహీనంగా నిర్మించాడు. ఎప్పుడూ కదులుతూనే ఉంటుంది. కూలిందా.. భవనం నాశనం కావడం కాకుండా, పంచను నిలబడ్డ ఏ వ్యక్తినయినా సమూలంగా నాశనం చెయ్యవచ్చు -***

సమయం దొరక్క చీకటిలో విశ్రాంతితో కూచుంది వసంత.

మనస్సు ఆరాటంతో రిచ్చపడింది. దీప్తి చెడిన కళ్ళు, హృదయపు వణుకు తనతో శ్రుతి కలుపుతున్నాయి.

ఎంత ఆలోచించినా దుఃఖం రావడంలేదు, అట్లా ఎందుకు జరిగిందా అన్న ఆశ్చర్యం తప్ప.

కలలోనే రాత్రంతా పూర్తిగా గడిచిపోయింది. హృదయం ఆలోచనల్తో బరువెక్కింది. అక్కయ్యని పిలుద్దామంటే గొంతులో దుఃఖం చెరవడింది. ఏ దిక్కూ తెలీని కళ్ళకు నీటి తెరలు అడ్డువచ్చాయి - అది దుఃఖమో, ఇలా ఎట్లా జరిగిందా అన్న ఆశ్చర్యమో తెలీదు.

అర్ధరాత్రిలో బయట ఎవరో తలుపు తట్టితే ఉలిక్కిపడింది.

"ఏ రోజూ త్వరగానే రావాలనే అనుకుంటాను వదినా - నేను కష్టపడి పనిచేస్తున్నాను. అందుకని పని ఎక్కువవుతోంది రోజు రోజు" అన్నాడు శంకరం.

జాలితో, దయతో ఆమె మనస్సు మళ్ళీ చలించింది.

"ఎందుకని పనిచేస్తారు అంత కష్టపడి - ***బ్రతకడానికి కష్టపడాలి కానీ కష్టపడడానికే బ్రతకకూడదు***" -

వసంతని పోలికపట్టి నిర్ఘాంతపోయాడు. "మీరా?" అన్నాడు. నిర్జనమై అరణ్యంలో నిశబ్దమైతే కలిగినప్పటి భయం ఆ కళ్ళలో "వదిన లేదూ?"

"అలసిపోయింది. రాత్రి నిద్రలేదు. ఉండి నేనేం చేస్తాను. పదండి భోజనం పెడతాను"

అతనింకేమీ ఎదురు చెప్పలేదు. దీపం వెలుగులోనికి వస్తే బట్టలన్నీ సైకిలు మరకలతో నిండి ఉన్నాయి. అలసటతో బరువెక్కిన ముఖాన్ని రెండు చేతుల మధ్య రాచుకుంటున్నాడు. ఆమె విచిత్రంగా చూస్తూంటే నవ్వాడు. "నాకు బ్రతకడం ఎలాగో ఇంకా తెలీదండి.

అట్లాంటి విషయాలు ఆలోచించలేదు నేను. కానీ నేను పని ప్రారంభించాక ఎంత సంతోషిస్తున్నానో చెప్పలేను. నేను బ్రతకడం కాదు. అన్నయ్యకు తోడుగా ఉన్నానన్న ఆలోచన నన్ను బ్రతకనిస్తోంది."

ఆశ్చర్యంతో, ఉద్వేగంతో కళ్ళనీళ్ళు తిరుగుతాయేమోనని తొందరగా ముఖాన్ని అటు తిప్పుతోంది. లోపలికి వెళ్ళబోతే "ముందుకొంచెం నూనె యివ్వండి. ఈ మరకలు వదిలించుకోవాలి" అన్నాడు.

అతను స్నానం చేసి తువాలు భుజం మీద వేసుకు వచ్చేసరికి పమిటెను దీపానికి అడ్డంగా ఉంచుకుని వంట ఇంట్లో కూచుంది. అతని మాటలు ఆమెకు మరీ దిగ్భ్రాంతిని కలిగించాయి. అంతగా అన్నిటినీ మరిచిపోయి బ్రతకగలగడం సాధ్యమా అన్న ఆలోచన ఆమెను మరీ విస్తుపోయేటట్టు చేస్తోంది. నిరాడంబరతలో దుఃఖం, అమాయకత్వంలో విసుగు, చేతకాని తనంలో పట్టుదల మాత్రమే ఇప్పటికి చూసిందామె -

ఇంతగా తను తాను మరిచిపోయి బ్రతికే వ్యక్తి జీవితానికి లక్ష్యం ఏమిటి? బహుశా అట్లా బ్రతకడమే లక్ష్యమే.

శంకరం జుత్తును మీదకి దువ్వుకు వచ్చి కూచున్నాడు. నుదురు మరీ విశాలంగా ముఖమంతటిలోనూ ఆ భాగమే ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

ఇంకా ఆలోచనలు ఆమె మనస్సుపై మౌనాన్ని అభిషిక్తం చేస్తోంది -

అతని నిశ్శబ్దాన్ని చూసి ఇక ఆగలేకపోయింది. "ఎప్పుడూ సుఖంగా బ్రతకడాన్ని ఆలోచించరా మీరు?" అని దీపానికి అడ్డుతొలగి ప్రశ్నించింది.

హఠాత్తుగా వచ్చిన ఈ ప్రశ్నకు నివ్వెరపోయాడతను. తలయెత్తి దీపం వెలుగులో సగమే కనిపించే ఆ ముఖాన్ని చూశాడు. ఆ వెలుగులోనే కళ్ళల్లో కనిపించిన జిజ్ఞాస, ఆతృత - ఆ ప్రశ్నకు జవాబుమీదే ఆమె జీవితమంతా ఆధారపడినట్టు -

ఆలోచించాడు. తనని తానే మళ్ళీ పునః పునః ప్రశ్నించుకున్నాడు.

సుఖంగా బ్రతకాలని ఎప్పుడూ అనిపించదా తనకు? జవాబుగా ఆలోచనా శూన్యతన, అనుభవం లేమినీ, వ్యక్తం చేసే నవ్వు జవాబువచ్చింది

తలేత్తి అమాయకంగా అదే చెప్పాడు. "సుఖంగా బ్రతకడమంటే ఇన్నాళ్ళ జీవితంలో నాకు తెలీదు. నాకు తెలీకుండా సుఖంగా బ్రతికానేమో. సుఖంగా బ్రతకకపోతేనేం? అనిపిస్తుంది. ఆలోచిస్తే నా మనస్సుకు తృప్తి కలిగేటట్టు బ్రతకడం, ఏ పరిస్థితుల్లోనూ ఇతరులు నా మీద ప్రభుత్వం చేయకుండా చూసుకోవడం ఇదే నాకు తెలుసు - నా సుఖం ఇదే ఇది నాకు చాలు -"

సంభ్రమాశ్చర్యాలతో ఆమె రెపరెపలాడింది. "ఇతరులు మీమీద ప్రభుత్వం చేయకుండా చూసుకునే స్తోమత అందరికీ ఉండదు. ఉదాహరణకు నేను ఆడదాన్ని"

అతను మరీ చకితుడయాడు.

"అంటే నా కర్థం కాలేదు"

ఆమెకు ఉదాసీనతతో, నిస్సహాయతతో ఏడుపులాంటి కోపం వచ్చింది. "మీకు అర్థంకాదు, అర్థంకాదు. అందుకే నన్నిట్లా వదిలేశారు. ఎన్నాళ్ళ క్రిందటో నన్ను మీరెందుకు మీ పాదాల దగ్గర పడేట్టు చేసుకోలేదా అని ఏడుస్తాను" అంది.

నశ్వరం, మృదులం అయిన అందం అపనయావేశ ఖేదం అంటారే? అట్లాంటి భావం ఆ ముఖంలో. అప్రతిభుడయి చూస్తూ కూర్చున్నాడు.

"మీరింత సుఖంగా బ్రతుకుతున్నారని నాకు ముందుగానే ఎందుకు చెప్పలేదు - నా మీద ఇంకొకరు ప్రభుత్వం చెయ్యకూడదన్న విషయం నా కింతవరకూ తెలీదు. ఇప్పుడు తెలిసినందువల్ల ప్రయోజనంలేదు అంతా అయిపోయింది. ఇప్పుడు నేను మళ్ళీ పాతజీవితాన్ని బ్రతకలేను" - గోడకి చేరబడి ముఖమ్మీద చీరె అడ్డం ఉంచుకుని ఏడుస్తోంది.

అతను భయపడ్డాడు. ఆ అర్ధరాత్రి ఎవరన్నా ఈ పరిస్థితిని చూస్తే దిమ్మెరపోవచ్చు.

"ఊరుకోండి. ఇప్పుడు మీకేం ఆపద వచ్చింది?" అన్నాడు వణుకుతూ.

ఆమెకు ఆ ఉద్రేకంలో మరీ వళ్ళు తెలియకుండా పోయింది.

"ఆపద - ఈ ఆపద మీకెలా అర్ధమవుతుంది? మిమ్మల్ని చూసి మేము చాలా నేర్చుకోవాలి. లోకం కోసం కాకపోతే మిమ్మల్ని నన్ను పెళ్ళి చేసుకోమని ఆరునెలల క్రిందటే పట్టుబట్టి కూర్చునేదాన్ని"

అతను ఆ చేతనుడయి - ఆమె మాటల అర్ధాన్ని పూర్తిగా అవగాహన చేసుకోలేక సందేహాలతో కొట్టుమిట్టులాడాడు.

ఆ తత్తరపాటున గమనించి ఆమె హఠాత్తుగా లేచి నిలబడింది. మేఘావృతమయిన ఆకాశం జడివానను కురిపించాక మళ్ళీ ప్రశాంతమయినట్టు ఆమె ముఖంలో విశ్రాంతి కనిపించింది.

"మీరెప్పటికీ సుఖంగా బ్రతకగలరు శంకరంగారూ - ఇప్పుడు నాకు చెప్పిన మాటలే వేదాక్షరాలు. వాటిని మరిచిపోతే చాలు. వెళ్ళేటపుడు లైటు ఆర్పేసి మేడమీదికి వెళ్ళండి" అని చెప్పేసి వెళ్ళిపోయింది.

కానీ ఎంత ప్రయత్నించిన నిద్దరపట్టలేదు. ***జీవితంలో చెడిపోయిన వ్యక్తికి ఏ పెద్ద శిక్ష అక్కరలేదు. తన మనస్సు తప్ప. మనస్సు విధించే శిక్షను తట్టుకోవడం అప్పుడిక అసాధ్యం. కోరికకి శరీరంలాగ, ఆలోచనకు బందీ అయి వర్తమానం కూడా గతానికి జమ అవుతుంది. తన జీవితపు నీడ ముందు విశాలంగా పరుచుకుని, తన మనస్సునే వణికించి ఒక్క అడుగు ముందుకు వెయ్యనివ్వదు.***

అక్క పక్కనే పడుకుంది.

ఓ రోజంతా సముదాయించి, బుజ్జగించి, ఆమె జీవితం మీద ఆమెకు హామీ ఇచ్చి - అక్కయ్య ఎంత కదిపినా తన భవిష్యత్తును ఆపోశనం పట్టిన దుష్టశక్తి పేరు చెప్పలేదు. ఇవాళ మరో మనస్సు అండ తీసుకుని బావురుమని దుఃఖించనిదే ఎట్లా విశ్రాంతి దొరుకుతుందో అర్ధంకావడం లేదు. ఇప్పుడిక అన్నీ చెప్పెయ్యాలి.

అన్నపూర్ణ నిశ్చలంగా నిద్రపోతోంది. ఆమె ఉచ్వాస నిశ్వాసాల లయను మరీ దగ్గరగా గమనిస్తూ ఏదో వింత శక్తిని చూస్తున్నట్టు దిగ్భ్రమతో కొంతసేపు చూస్తూ కూచుంది.

అంతలో తట్టిలేపింది. "నిద్రపోతున్నావా అక్కా?" అంటూ.

అన్నపూర్ణ తృళ్ళిపడిలేచి రంగులు చెరిగిన త్రివర్ణ చిత్రపటంలాగ దీప్తి చెడిన ఆమె ముఖాన్ని చూసి ఉలిక్కిపడింది -

"ఏం వసంతా?" అంది ఆశ్చర్యంతో.

ఇంకా గొంతు చెరవీడలేదు. సంశయం, అక్కయ్య మీద భక్తి విశ్వాసాల గొంతుకు అడ్డం పడుతున్నాయి. అయినా నిబ్బరంతో తనని తాను స్వాధీనపరుచుకుని "ఎప్పుడన్నా నేను పూర్తి చెడిపోయానని తెలిస్తే జాలిపడతావా అక్కా?" అంటే

భయపడి లేచి కూచుంది అన్నపూర్ణ.

"వసంతా!" అంది దిగ్భ్రమతో.

ఇప్పుడిక భయంలేదు - దుఃఖం రాలేదు. "అవునక్కా.. నాకు పూర్తిగా చెడిపోవాలనుంది. నీతో ఇక్కడ ఉండి నువ్వెంత పవిత్రంగా ఉన్నావో చూస్తూంటే నాకు భయం దుఃఖం కలుగుతోంది. ఈ క్షోభ భరించలేను. ఎప్పుడో పారిపోతాను"

భీతావహురాలై అన్నపూర్ణ చెల్లెల్ని రెండు చేతుల్తో పొదివి పట్టుకుంది. "ఎందుకే అలా మాట్లాడినన్ను కోత పెట్తావ్? మనకు అమ్మలేదు. నాన్నలేడు. ఏ కష్టం వచ్చినా ఈ నిస్సహాయితే గుర్తుకొచ్చి కడుపు చెరువవుతుంది నాకు" చిన్నపిల్లలాగ చెల్లెల్ని ఒళ్ళోకి తీసుకుని సముదాయించింది. చిన్నిపిల్లలాగ - మరీ తనని తాను మరిచిపోయి అక్కయ్య చేతుల్లో ఒదిగి ఉండిపోయిందామె -

పక్కనే ఉన్న దీపాన్ని కొద్దిగా పెద్దది చేసి కళ్ళు తుడుచుకుంటూ అడిగింది అన్నపూర్ణ -

"అయితే ఒక్కటి చెప్పవూ -"

మధ్యలో అడ్డు వచ్చింది వసంత "ఇంకేం అడక్కు‌నన్ను. ఆ చావుకీ నీకూ అట్టే దూరంలేదు. నేను చెడిపోయాను. పూర్తిగా చెడిపోయాను"

అంతవరకూ అన్నపూర్ణలో మిగిలిన ఒక్క ఆశా రాలిపోయింది. నిన్న నిబిడాంధకారంలో గాలికి రెపరెపలాడే ఆకు నిశ్చలతలాగా - తన చేతుల్లో ఆశ్రయం పొందిన చెల్లెలి జీవితం -

మనస్సుకి దగ్గరగా చెల్లెల్ని తీసుకుని ఆమెను కావలించుకుని "నీకేం భయంలేదమ్మా - ప్రపంచమంతా ఎలా పోయినా నిన్ను వదులుకోను - నా హృదయానివి నువ్వు. హృదయాన్ని వదిలి బ్రతకగలరా ఎవరన్నా?" అని మనసులో అనుకుంది.

అంతరాంతరాళాల్లో ఆర్ద్రత, దుఃఖాలనుంచి ఏదో సంశయం ఇంకా అలానే మిగిలిపోయింది. ఆ రాత్రి చీకటికి భయపడి బయట ప్రపంచం రోదిస్తున్నట్టుగా మనస్సులో చీకటికి భయపడి వాళ్ళిద్దరూ నిశ్శబ్దంగా కన్నీరు కార్చారు.

***

సంధ్య చీకటికి విడాకులిచ్చి వెలుగుని ప్రేమించింది. తూర్పు ఆకాశం నృత్యానికి సిద్ధపడుతున్న నర్తకిలాగా గజ్జెకట్టుకుంటున్నప్పటి ముఖంలో ఎరుపును ప్రదర్శిస్తోంది. ముందు ప్రదర్శించబోతున్న హొయలుకి అలరింపులాగ తూర్పు ఆకాశం ఎరుపు, వేకువ పొద్దున కన్ను విప్పిన పువ్వును గుర్తుతెస్తోంది -

దూరాన సంజె వెలుగు నీడలో కనిపించే వ్యక్తిని తన మనస్సులోని భావంతో పోల్చుకుని ఆశగా చూస్తోంది గిరిక - అతనైతే ఎంత బావుణ్ణు అనుకుంటూ, దగ్గరకు వస్తున్న కొలదీ ఆలోచనల మధ్య తొట్రుపడే అడుగులూ, పంచె జారి నేలను రాసుకుంటున్నా చూడని నిర్లక్ష్యం, దించిన తల ఎత్తకుండా నడిచే వైముఖ్యం - చిన్న గాలికయినా వంగిపోయే కొమ్మలాగ - అతనే.

తొందరగా క్రిందకి పరిగెత్తుకు వచ్చింది. గుమ్మం దగ్గరకి వచ్చాక "ఎప్పుడన్నా నువ్వు కనిపిస్తే నీ పూర్వాశ్రమంలో ఓ స్నేహితురాలుండేదని గుర్తుచేసి, ఆ కథ చెప్పాలనుకున్నాను - ఇన్నాళ్ళకయినా గిరిక గుర్తుకొచ్చిందే నీకు" అంది.

నవ్వాడు కాశీ - చాలా రోజుల క్రిందటే మరిచిపోయిన పాత నవ్వుని.

"చాలా ప్రేమించిన వస్తువుని - అతి భద్రంగా దాచుకున్నట్టు నిన్ను నేను రహస్యంగా మనస్సులో దాచుకున్నాను. మరీ కష్టాలెప్పుడన్నా కలిగితే - ఆ టానిక్ తాగడానికి"

"అక్కడే నిలబడిపోయావేం? రా లోపలికి" అని చెయ్యి పట్టుకుని "ఏమిటి నీ కష్టాలు?" అంది.

కూర్చున్నాక "ఏమిటి నీ కష్టాలు అని అడక్కు? ఎట్లాంటి కష్టాలు అని అడుగు. ఎంచేతనంటే కష్టాలెప్పుడూ ఉంటాయి. వాటి హెచ్చుతగ్గుల్లోనే తేడా."

కంటి నీడలో చారలు బడి పీలగా, ప్రతి విషయం మీదా పిరికితనంతో బలహీనంగా తయారయి కాశీని ఆశ్చర్యపోతూ చూస్తూ కూచుంది. చాలాసేపు నిశ్శబ్దంగా ఉండి "ఎంత మారిపోయావు?" అంది.

జీవితం చివరి అధ్యాయంలో ఆగి ఇద్దరు వ్యక్తులు వెదుక్కుంటున్న కుశల ప్రశ్నలలాగ - తమ ముగింపు - ఇద్దరికీ తెలిసినప్పటి ధైర్యం, తెగింపూ ఆ మాటల్లో -

"ఎట్లా బ్రతుకుతున్నావు?" అని కాశీ అడిగితే -

"అన్నీ తెలిసే అడుగుతావు నువ్వు. ఆ ప్రశ్నకు జవాబు నీకేం తెలుసు - బ్రతకడంలాగే సులువుగా ఎట్లా చచ్చిపోవడమా అని ఆలోచిస్తున్నాను"

"నీకెందుకు దిగులు - పెళ్ళి చేసుకోకూడదూ హాయిగా?"

లేని ఉత్సాహాన్ని తెచ్చిపెట్టుకుని కళ్ళు పెద్దవి చేసి నవ్వింది. ఇది వరకటి ఉత్సుకత, చిలిపితనం ఆ కళ్ళల్లో కనిపించలేదు. గాలిలో ఎగితే గాలిపడగ చిరిగిపోతే కుర్రాడి ముఖంలో హఠాత్తుగా కమ్ముకున్న విషాదం లాంటిది ఆమె ముఖంలో -

"ఇప్పుడే కాదు- మరి పదేళ్ళ తర్వాత ఆ సలహా తీసుకుంటాలే"

మాటల్లో నిర్వేదనాన్ని గమనించి మనస్సు చివుక్కుమంది కాశీకి.

"నేను బాగుపడడం ఎలాగో తెలీక పాడయాను. నువ్వు బాగుపడడం ఎలాగో తెలిసి పాడవుతున్నావు. నీకింకా బాగుపడడానికి అవకాశం ఉంది. నాకదీలేదు" అన్నాడు.

"సర్లే, అట్లాంటి మాటలు చెప్పకు. నువ్వలా చెప్తూంటే నాకు భయం వేస్తుంది. నువ్వుండేంత వరకూ పరవాలేదు. వెళ్ళాక ఇప్పుడే చచ్చిపోవాలన్నంత వైరాగ్యం కలుగుతుంది."

నవ్వాడు.

"ఎందుకొచ్చా?"

"ఇక్కడికి రావడానికి ఒక ఉద్దేశం ఉండాలా - నిన్ను చూడడానికి"

అన్యమనస్కయై కిటికీలోంచి ఎటువేపో చూస్తోంది. ఒక్కసారి ఉధ్ధుతంగా గాలి వేసి లోపల్నుంచి బోగన్ విల్లా పువ్వులు రెపరెపలాడాయి. మనస్సు గాయపడిన మరుక్షణంలో రాల్చేసిన కన్నీటి బొట్లలాగు - పువ్వులు తుళ్ళిపోయాయి.

"నేను హఠాత్తుగా చచ్చిపోతాననుకో - అప్పుడు నేను నిన్ను -"

ఇటు తిరిగి "అదేమిటి అలా దేన్ని వెదుకుతున్నావు?" అంది గిరిక అంతలో ఆగి.

"చక్రవర్తి ఏడి?"

అతని ముఖాన్ని సంశయంతో వెదికి అంతలో నవ్వేసింది. "మాట మార్చడం బాగా తెలుసు నీకు. అన్నయ్య విషయం అన్నయ్యకే తెలీదు. పదిహేనురోజుల క్రిందట ఉన్నట్టుండి ఈ ప్రపంచం మీద విరక్తి పుట్టింది. 'నువ్వు ఆశతో బ్రతికే వాళ్ళని ఎవరినీ నమ్మకు. ఏదో ప్రపంచంనుంచి నీచే గట్టి ప్రయత్నానికి నవ్వుని ఆలంబనంగా చేసుకుంటారు వాళ్ళు. ఉదాహరణకి నేను. అన్న రహస్యాల్ని నాతో చెప్పి నీలగిరికి వెళ్తానని వెళ్ళాడు కానీ వెళ్తాడా అని నా అనుమానం" అంది.

ఆమెకు తెలీకుండా నిట్టూర్చాడు

గాలి ఎక్కువగా వీస్తోందని చీర తలచుట్టూ తిప్పుకుంది గిరిక. ఉండుండి అంది. "మళ్ళీ మీ ఆవిడని చూడాలనిపిస్తోంది. నా మనస్సు కలత పడినప్పుడల్లా ఆవిడతో కాస్సేపు మాట్లాడి రావాలనిపిస్తుంది - కానీ ఎలా? నన్ను చూసి ఏమనుకుంటుందోనని భయం. పోనీ, నన్ను తీసుకువెళ్తావా అక్కడికి?"

"అన్నపూర్ణ ఇప్పుడు చాలా మారిపోయింది."

ఇప్పుడు ఆమె ముఖంలో కనిపించిన ఆశ్చర్యం, అనిర్వచనీయమైన వెలుగూ చూసి నిర్ఘాంతపోయాడు. పక్కకి వచ్చి కూచుంది. "చెప్పు, చెప్పు. మార్పు అంటే?" - అంది.

"అంటే ఎలా చెప్పడమో తెలీదు. ఇదివరకున్న ధైర్యంలేదు. నన్నెప్పుడూ వదిలిపెట్టదు. ప్రతి చిన్న విషయానికీ భయపడి ఏడుస్తుంది. జీవితంలో కష్టంలాగే సుఖమూ ఎక్కువయితే భరించలేనంత దుఃఖం వస్తుందేమో - ఆమెకేది ఎక్కువయిందో తెలీదు"

ఆమె ముఖంలో మళ్ళీ ఆశాభంగం కనిపించింది. "పో - నువ్వెప్పుడూ తిన్నగా మాట్లాడవు. అయితే ఆమెను తప్పకుండా చూడాలి."

ఇంకేం మాట్లాడాలో తెలీక మరి రెండు క్షణాలు కూర్చుని లేచివచ్చేశారు.

***

***మానవజాతి నంతటినీ ఉరితీసి, అక్కడితో చేతులు దులుపుకుని ఆ కథను అక్కడితో ముగించాలని చాలా మంది అనుకుంటారు. అందుకే వారు మానవులయారు. మానవుల్ని కాదు. చేతనయితే ఆలోచనల్ని ఉరితీసి జయించగలగాలి.***

ఉఫ్! ఈ కష్టాలు చూడడానికి పర్వతాల్లా కనిపించి, అధిరోహించబోతే సరళ రేఖల్లా విచ్చుకుంటాయి. ***కష్టాల్ని దాటిపోవడానికి ముఖ్యమయిన మార్గం వాటిని ఎదుర్కోవడమే.***

ఇట్లా కాశీ మనస్సుని సమాధాన పరచుకొనడానికి చేసే ప్రయత్నంలో మరో ఉపద్రవం సంభవించింది.

వసంత తన పొరపాటుకి ఫలితాన్ని మోస్తోందని తెలిసినప్పుడు అతను భయంతో కంపితుడయాడు. మరి అయిదు నెలల్లో తల్లి కాబోతోందన్న విషయం అన్నపూర్ణ చెప్పి మతిపోయినట్టు నిశ్శబ్దంగా ఉండిపోయింది.

జీవితం మీద కప్పుకున్న ప్రయత్నం ముసుగును తొలగించి అజ్ఞాతాంతరాళాలలో ఏదో శక్తి చిచ్చుపెడుతోంది.

"ఇప్పుడేం చెయ్యాలి?" అన్న ప్రశ్నకు ఎవ్వరూ జవాబు చెప్పలేరనిపించింది.

కానీ అన్నపూర్ణ జవాబు చెప్పింది. ఆ క్షణంలో ఆమె ముఖంలోని నిశ్చయం, ఎరుపూ, కసీ చూసి నిర్విణ్ణుడయాడు కాశీ.

"ఆ విషయాన్ని గురించి ఏమీ ఆలోచించకండి. భయం వద్దు. ఏ ప్రయత్నాలతోనో దాన్ని పోగొట్టే ఆలోచన వద్దు. ఇక్కడ అది బ్రతకడం కష్టమనుకుంటే ఎక్కడికయినా పంపించెయ్యండి."

బిడియం, భయం, సంకోచం అన్నీ కలిసి తన జీవితం చుట్టూ ఒక లయబద్ధమైన నృత్యం చేస్తున్నట్టున్నాయి.

ఏమీ జవాబు చెప్పలేదు కాశీ.

***కాలానికి మీరు ఆపలేని విసురువుంది. ఆ విసురులో అన్నీ నశ్వరమైపోక తప్పదు.*** అదొక్కడే ధైర్యం అతనికి.

***

పడమటి ఆకాశం గుండె పగిలింది.

ఆకాశమంతా ధారకట్టి చీకటి రక్తం స్రవిస్తున్నట్టుంది.

***నల్లటి మబ్బుతునకలు అంచులకి బంగారు పూత పూసినట్టు మెరుస్తున్నాయి. ఆశకి ఇట్లాగే ప్రయత్నాల అంచులను వేసుకుని జీవితమని పేరు పెట్టుకుంటారు కాబోలు పిరికి వాళ్ళంతా -***

***జీవితానికి ఆశ అంచులా లేక ప్రయత్నానికి ఆశ అంచులా.***

తాను పిరికి మనిషి కాదు - అయినా తన జీవితానికి అంచులే లేకుండా పోయి - అనుకుంది వసంత.

ఎవరో భుజమ్మీద చెయ్యివేసినట్టు సన్నజాజి కొమ్మ మెడదగ్గరకి వంగి పలుకరిస్తున్నట్టుంది.

ఇదివరకులా ఇప్పుడూ జయలక్ష్మి, నరసమ్మగారు తనతో మాట్లాడడం మానేశారు. వాళ్ళ కళ్ళతో ఎప్పటికప్పుడు విధించే శిక్ష చేతనయితే ఈ ప్రపంచానికి ఆమెతో సంబంధం లేకుండా చేద్దామన్న కసి - ఎంత చూసినా దుఃఖం రావడంలేదిప్పుడు - "ఎంత ప్రత్యేకత నాకు. మంచికయినా - చెడుకయినా ఇంత నా గురించి మాట్లాడుకునే అవకాశం కల్పించగలిగానన్న తృప్తి" - నవ్వుకుంది.

ఓ రోజు అన్నపూర్ణ నూతి దగ్గరికి వస్తే అక్కడ జయలక్ష్మి ఎదురింటి వాళ్ళతో మాట్లాడుతోంది.

ఇదివరకు లాగ ఆ విషయాలపై ఉత్సాహాన్ని ప్రకటించడం మరిచిపోయింది అన్నపూర్ణ. కంటికింద నీడలు పడి, జీవితపు వేగాన్నీ, ఉధ్ధుతాన్ని తట్టుకు నిలబడే స్థైర్యానికి చేసే ప్రయత్నం ఎప్పటికప్పుడు ఆ కళ్ళల్లో తెలిసేది.

అంత నిశ్శబ్దంగా ఊరుకొనడం ఎదురింటి లలితమ్మగారికేం నచ్చలేదు. ఎలా మాటలు ప్రారంభించాలో తెలీక పదిసార్లు మనస్సులో కూడబలుక్కుని చివరికి అన్నపూర్ణతో అంది. "అయితే నే విన్నది నిజమేనా" అని.

ఆ ప్రశ్నకు అర్థం ఏమిటో జవాబు ఎట్లాంటిది ఆశిస్తున్నారో తెలిసి నవ్వుకుంది అన్నపూర్ణ. ఇక ఆ మాటలు మనస్సు మీద సుత్తిదెబ్బలు కావడం ఎన్నాళ్ళ క్రిందటో మానేశాయి.

"అవును. నిజమే" అంటే ఆవిడ నిర్ఘాంతపోయింది. "మరి?" అంది తెల్లబోతూ.

నూతి పళ్ళానికి చేరబడి ఇదంతా తెలీనట్టు అటువేపు తిరిగి చూస్తోంది జయలక్ష్మి.

విసుగేసింది అన్నపూర్ణకు. నీళ్ళ బిందె ఎత్తుకుని సూటిగా సమాధానం చెప్పింది.

"మరి ఏం చెయ్యమంటారు? మీ మంచితనాన్ని సంపాదించుకోవడం కోసం మనుషుల్ని చంపుకొనడం తెలీదు మాకు. అంత గొప్పతనం మాకక్కరలేదు. మేం బ్రతుకుతున్నాం కానీ మీ కోసం బ్రతకడం లేదు"

మెల్లగా పెరట్లో మెట్లు దాటి లోపలికి వచ్చేవరకూ వెనక వాళ్ళంతా దిమ్మరపోయి ఉండడాన్ని గుర్తించింది అన్నపూర్ణ.

అయినా ఒక్కమాట కూడా వసంతతో అనలేదు. తీరా ఆ నిశ్శబ్దమే భరించరాని శిక్షయి మనస్సుకి స్థిమితం లేకుండా చేసింది వసంతకు.

సన్నజాజి పందిరి ఓ పక్కనుంచి ఎండిపోవడం ప్రారంభమయింది. పువ్వుల్ని కోసుకునే వారులేక చెట్టుకే ఎండి ఎర్రబారుతున్నాయి. వసంత నీడలోకి వత్తిగిలి లోపలికి రాబోతే తల రాటకి బలంగా కొట్టుకుంది.

వాకిట్లో అన్నపూర్ణ కూచుని దీపాల్ని శుభ్రం చేస్తోంది. కాశీ నీలూని తీసుకుని వీధిలోకి బయలుదేరాడు.

అతని ముఖాన్ని చూసి మనస్సుని ఊహించడానికి ప్రయత్నించింది వసంత. కానీ ఆ నుదుటి ముడతలో, కళ్ళలో ఏ భావమూ వ్యక్తం కాలేదు. గేటు దాటబోతే అంతలో దగ్గరకు వచ్చి "బీచికయితే నేను మీతో వస్తాను" అంది బావగారితో.

గుమ్మం దాటుతున్నవాడల్లా కాశీ ఆ మాటలకి చకితుడయి ఆగిపోయాడు.

వాకిట్లోంచి అన్నపూర్ణ "నువ్వెందుకూ ఇప్పుడు?" అంది.

ఇంక ఏం జవాబు చెప్పాలో తోచడం లేదతనికి. సాయంకాలపు బలహీనపు ఎండమొహం మీద పడితే కళ్ళు సగం మూసుకుని గేటుకు ఆనుకునిలబడ్డాడు. అతను మాట్లాడకపోయేసరికి అవమానంతో, ఉదాసీనతతో వసంత ముఖం ఎర్రబడింది. అక్కయ్య ప్రశ్నకు సమాధానం చెప్పదల్చుకోలేదు. "మీతో మాట్లాడాలి నేను ఏమంటారు?" అంది.

కాశీ, అన్నపూర్ణలిద్దరూ తెల్లబోయారు. "అయితే పద" అన్నాడు ఇక సంకోచించక.

***పురుషుడు జీవితాన్ని చాలా తొందరగా అర్థం చేసుకుంటాడు. స్త్రీ జీవితాన్ని చాలా ఆలస్యంగా అర్థం చేసుకుంటుంది. అందుకనే పురుషుడు త్వరగా ముసలివాడయిపోతాడు. స్త్రీ చాలాకాలం మనస్సులో యౌవనాన్ని నిలబెట్టుకుంటుంది.***

యౌవనం - ఉఫ్! యౌవనం తప్పటడుగు వయస్సు సంఘర్షణ.

ఆలోచిస్తున్నాడు కాశి.

"ఏం చెప్పాలనుకున్నావ్?"

నీలిరంగు చీర భుజం చుట్టూ తిప్పుకుని నీలూ రెండో చెయ్యి పట్టుకుంది. ఆశలన్నీ భగ్నమయినప్పటి దిగులూ, సంకోచం ఆమె ముఖంలో కనిపించడంలేదు.

"నాకేం విచారం కలగడం లేదు. జరిగిన విషయాలన్నింటికీ" అంది.

"మంచిదే విచారాన్ని మరిచిపోవడం తెలీకనే చాలామంది పతనమవుతారు."

ఆకస్మికంగా అతనివేపు తిరిగి "మరి నన్నెందుకిట్లా వెలివేస్తారు?" అంది.

నివ్వెరపోయాడు "ఎవరు?"

"మీరంతాను. మాట్లాడకుండా నిశ్శబ్ధంగానే శిక్షను విధిస్తారు మీరు. నేనేం తప్పు చెయ్యలేదు. నా పరిస్థితిలో ఉంటే మీరీపాటికి ఉరిపోసుకునేవారు."

మనస్సు చివుక్కుమంది కాశీకి. "నీతో ఏం మాట్లాడాలో తెలీక నేను ఊరుకున్నాను. ఎలా మాట్లాడాలో తెలీక అన్నపూర్ణ ఊరుకుంది. నువ్వేం తప్పు చెయ్యలేదు నిజమే. నీ వయస్సుది ఆ తప్పంతా."

ఇంకేం మాట్లాడలేదు వసంత.

"ఇదేనా చెప్పాలనుకున్నది?" అంటే -

ఇటు తిరిగి తెల్లబోయి "ఆయనతో ఈ విషయాలేం మాట్లాడకండి" -

"ఎవరితో? చక్రవర్తితోనా?" అని ఫక్కున నవ్వాడు. "ఈ పాటికి నీ విషయం మరిచిపోయి ఉంటాడు చక్రవర్తి. నేను ఈ విషయం ఒకవేళ కదిపితే నా పాత జీవితంలో అటువంటి వ్యక్తితో పరిచయమున్నట్టు గుర్తుందేమో ఆలోచిస్తానుండండి అంటాడు"

తనకూ నవ్వొచ్చింది. దారిపక్క ఏవో పిచ్చిపూల మొక్కలు గాలికి తలలొంచి దిగులుగా నిలబడ్డాయి.

"నాకు ఒంటరిగా బ్రతకాలని ఉంది" అంది వసంత. "ఆయన నా పట్ల గౌరవం కనపరచకపోయినా నాకేం బాధలేదు. మీరాయనను బ్రతిమాలవద్దు"

దీనికేం జవాబేం చెప్పలేదు. కనీసం విన్నట్టు కూడా నటించలేదు కాశీ. ఆకాశం మీద రెండు మబ్బుచారలు మెల్లగా వెలుగుని మింగుతున్నాయి.

తిరిగి వస్తూండగా ఒక్కమాట మాత్రం అన్నాడు. "నువ్వు మంచిపని చేశావో, చెడ్డపని చేశావో నిర్ణయించడం నాకు తెలీదు. కానీ ఒక్కటి మాత్రం తెలుసు. ఈ బ్రతకడం ఒక అలవాటు లాటిది. నీ మార్గం గుండానే నువ్వు నడుచుకుపోతావు. ఎందరో వ్యక్తుల్నీ, గొప్పతనాల్నీ మనస్సు తక్కువతనాన్నీ, ప్రేమలో ఔన్నత్యాన్నీ, ఆర్ధ్రతనూ, తపననూ అన్నిటినీ చూస్తావు. కానీ విచిత్రమేమిటంటే ప్రతిచోటా నువ్వు కలుసుకునే వ్యక్తి నువ్వే అన్నిటిలోనూ నిన్ను చూసుకోగల తృప్తే మిగులుతుంది. ఎప్పుడూ నీకు నువ్వే బ్రతకాలి. అంతకంటే వేరే గత్యంతరం లేదు."

అతని మాటలన్నీ పూర్తిగా అర్థం కాలేదు ఆమెకు. కానీ ఏదో అవ్యక్తమయిన నిబ్బరాన్ని ఆ మాటలు కలిగిస్తున్నట్టు అనిపించింది. అవును. నాకు నేనే బ్రతకాలి, వేరే గత్యంతరంలేదు.

ఇంటి ముందుకు వస్తే అన్నపూర్ణ వాకిట్లో దీపం వెలిగిస్తోంది.

ఆకురాలకముందే చెట్టు కుళ్ళిపోతోంది. రాలిపోవడానికి బలమైన గాలిలేని నిశ్చలమయిన, నిర్నిద్రమయిన రాత్రులు గడుస్తున్నాయి. ఆసక్తి చెడిన జీవితపు రొటీనులాగ ఎప్పుడన్నా బలమైన గాలి కుదిపితే చెట్టుతో సంబంధం విడవలేక బాధపడుతున్నట్టు అటూ ఇటూ కదిలి రెపరెపలాడేవి.

చెట్లకు కూడా మనస్సు ఉన్నది గావును ఆ వియోగాన్ని ఆకు నుంచి ఆకుకు పంచుకుని గొంతు దుఃఖంతో చెరవడి అన్నీ ఒక్కపెట్టున గాలి తాకిడికి రోదిస్తాయి. మరోసారి నిశ్చలంగా చీకటి గుండెలో వణుకుతూ కూచుంటాయి.

ఆలోచించే కొద్దీ జీవితం మీద భయం ప్రారంభమయింది అన్నపూర్ణకు. ముఖ్యంగా వసంత విషయం ఆమె ఆరోగ్యం మీద దెబ్బతీసింది.

ఆమె మంచితనాన్ని చుట్టూ ఉన్న మనుషులంతా ఖరీదులేని తియ్యదనాన్నిలాగా త్రాగి మత్తెక్కిపోయారు. ఆ సౌహార్ధం, ఆ కారుణ్యం, ఆ అమృతం మత్తులో మనస్సు వశం తప్పి ఆమె మీదే పగతీర్చుకున్నారు.

"భగవాన్! జీవితం నుంచి ఏమీ ఆశించకకపోవడమూ పాపమేనా?" అనుకుంది. ప్రపంచమంతా ఉన్నతంగా ఎదగని చిన్న మనస్సులో.

కానీ భగవంతుడికి నోరులేదు. ఉన్న చిన్న భాషతో ఆకాశం నీలిరంగు ద్వారా సంజెకాలపు ఎరుపుద్వారా, తొలిపొద్దులో పక్షుల కేరింతలద్వారా, ప్రతీ క్షణం మారే ప్రపంచంలో కొత్తదనం ద్వారా ఆశతో బ్రతకాలి నువ్వు ' అన్న భావాన్ని చెప్పాడు.

తీయదనాన్నే ప్రసంగించే - ఆ కళ్ళలో మరోభావానికే చోటు లేకుండా పోయింది. వసంత కంటే అన్నపూర్ణ మరీ దిగజారిపోయింది. ఆ కళ్ళలో భయం, వసంత ముఖంలో తెగింపుతో కూడిన నవ్వు చూసినప్పుడల్లా ఏదో అహం మనస్సులో లేచి దహిస్తున్నట్టు ప్రపంచ నిర్లక్ష్యానికి చిరునవ్వుతో సమాధానం చెప్పుకొనేది.

ఫలితం మనస్సుకు కత్తిపోట్లు.

శరీరం కంటే మనస్సు పరిమితికి మించిన అలసటతో ఒడిలిపోవడంతో ఓ రోజు మంచాన్న పడితే ఆశ్చర్యపడలేదు కాశీ. నవ్వుకున్నాడు. "నీకు రోగమన్నా వచ్చింది.. నా మీద దానికీ దయలేదు" అన్నాడు. కానీ మనస్సులో భయం, ఆ ఒక్క వ్యక్తితన జీవితానికి ఎంత ఆసరాగా ఉన్నదో ఇన్నేళ్ళ అనుభవం నేర్పింది.

ఆమె కళ్ళల్లో నీడలు చూస్తే భయం. పిరికిగా ఆమె పక్కనే నిశ్చలంగా తపస్సు చేసేవాడు. "ఎందుకండీ ఇంత రాత్రివరకూ మీరీ జాగరణ" అంటే లేచి, తుళ్ళిపడి ఆతృతగా ఆమె ముఖాన్ని వెదుక్కునేవాడు. తన అనుమానం తీరేవరకూ స్నేహపిచ్చలమైన ఆ కళ్ళు తన జీవితానికి ఎప్పుడూ ఇచ్చే నిభాని ఆధారం చేసుకునే బ్రతుకుతున్నాడనిపించేది. "నీకు తెలీదు. ఇప్పుడాలోచిస్తే నువ్వే నాకు మంచి నేస్తంగా కనిపిస్తున్నావు" అనేవాడు.

నీలూ ఎప్పుడూ వచ్చి అమ్మ పక్కనే కూచునేవాడు.

ఈ పరిస్థితుల్లో శేషాద్రిరావుగారు అల్లుడికి చాలా చక్కటి సలహా చెప్పారు. "అమ్మాయిని ఓ రెణ్ణెల్లు ఇంటికిపంపెయ్. లేకపోతే ఆ పనుల్లో నలిగిపోతుంది. ఇంట్లో ఉండి చెయ్యి సాయం చేయకపోతే బావుండదు. అందుకని కొన్నాళ్ళు నా దగ్గర ఉంటే అక్కడ పనీ తీతిపోతుంది. నీకూ కష్టం ఉండదు."

పెళ్ళాం మనస్సుతో, మామగారి విజ్ఞతతో బ్రతికే గణపతి అంతకంటే ఎక్కువ ఆలోచించలేకపోయాడు. భార్యకు ఒంట్లో బాగోలేదని మర్నాడే రైలెక్కించి హోటల్‌లో భోజనం పెట్టాడు.

ఇహ నరసమ్మగారి చుట్టుపక్కల మాట్లాడిరావలసిన కార్యక్రమానికే అంతరాయం కలుగుతున్నదనే కించ మిగిలింది. ఎంతయినా కొడుకు - చెయ్యి కాల్చుకోక తప్పలేదు.

జ్వరం అన్నపూర్ణకి ఎన్నాళ్ళకూ తగ్గకపోయేసరికి శ్రీకాకుళంలో ఉన్న ఆమె మావయ్యకు ఉత్తరం రాశాడు. వెంటనే జవాబు వచ్చింది."నేనిక్కడ నుంచి రావడం పడదు. మరీ విశ్రాంతి కావాలని నీకనిపిస్తే నా దగ్గరికి పంపు. కొన్ని రోజులు ఉండి వస్తుంది"

నవ్వుకున్నాడు ఉత్తరం చదివి. "కొన్నాళ్ళకి అర్థం మాకు తెలీదు - ఇంకా ఆమెను వదిలి బ్రతికెంత నేర్చుకోలేదు నేను"

అన్నిటికన్నా ముఖ్యం అన్నయ్య ఆతృత, పిరికితనం చికాకు కలిగించింది శంకరానికి. అలా మరికొన్నాళ్ళు ఉంటే అన్నయ్యకు పిచ్చెక్కుతుందేమోనని భయమేసింది.

ఎంతసేపూ ఆమె మంచం పక్కనే ఏదో ఆలోచనల్తో కొట్టుమిట్టులాడే అతణ్ణి చూసిన కొద్దీ వణుకు పుట్టేది. అ

బ్రతకడంకాదు - బ్రతకడానికి ప్రయత్నం చెయ్యక పోవడంలో చేసే ధైర్యం లేకపోయినప్పుడు కలిగే విసుగుదల జీవితం మీద ఎప్పుడూ కలగదు.

"వదినెను వాళ్ళ ఊరు పంపకపోతే నేను ఈ ఇంట్లో ఉండను" అని శంకరం పట్టుదలగా అన్నాడు ఓ రోజు.

మొదట ఆ మాటలకి తెల్లబోయాడు కాశీ అంతలో నవ్వాడు.

పంపకపోతే ఆమె ఏమవుతుందోనన్న భయం కంటే, పంపితే ఆమె ఏమవుతుందో నన్న భయం అతణ్ణి ఆ ప్రయత్నంనుంచి ఆపుజేసింది.

కానీ కొన్నాళ్ళకి తప్పలేదు. శరీరపు రుగ్మతకు మందులు, మనస్సులో రుగ్మతకు వాతావరణం బాగుచేయగలదని పించింది. ఇక్కడే ఉంటే ఈ ఇంటినీ, ఈ పరిస్థితుల్నీ గమనిస్తూ ఆమె ఎప్పటికీ తేరుకోలేదనిపించింది. అయినా అన్నపూర్ణ ధైర్యం చేసి చెప్పదు. ఇప్పుడు ఆమె పెదవుల మీద చిరునవ్వుకి కూడా అర్థం లేకుండా పోయింది.

***'మంచి' మరీ ఎక్కువయితే అమాయకత్వం, చేతకానితనం క్రింద మారుతుంది. 'చెడు' మరీ ఎక్కువయిఏ ఉన్మత్తత అయినట్టు -***

అన్నపూర్ణ నవ్వులో, చూపులో, వైఖరి చూశాక ఇక కాశీకి భయం వేసిద్మి.

"మీ మామయ్య నుంచి ఉత్తరం వచ్చింది. కొన్నాళ్ళు అక్కడ ఉండి వస్తావా అనూ?" అని ఓ రోజు అంటే వాడిపోయిన గులాబీరేకుల్లా వొడిలిపోయిన కళ్ళను ఎత్తి అతనివేపు కాస్సేపు చూసింది. అవును, ఈ రోగం, ఈ నీరసం తనను చేసుకున్న పాపంలా వదలడంలేదు. కొంత విశ్రాంతి ఇవ్వలేవు. అందుకని ఈసారి వెళ్ళనని అనలేకపోయింది.

ఇక ఆలశ్యం చెయ్యలేదు కాశీ, మరునాడే వసంతను తోడిచ్చి ఆమెను మామయ్య దగ్గరికి పంపివేశాడు. శంకరం వెళ్ళి దిగబెట్టాడు.

నీలూ మాత్రం చదువు పోతుందని తండ్రితో ఉండిపోయాడు.

**జీవితంలో ఒడుదుడుకులూ,** కష్టాలూ, ఆశయాలకు సంకెళ్ళూ, కోరికల పీడకలలూ, అన్నీ సామాన్యం - వీటిని చూసి ఎప్పుడూ ఆశ్చర్యపడనక్కరలేదు. ఎటొచ్చీ ఆశ్చర్య పడాల్సిన విషయం - తియ్యటి కలలూ, కోరికల నిజస్వరూపాలకే.

***ఎవరి జీవితాన్ని వాళ్ళు నడుపుకునే శక్తి ఉన్నంత వరకూ జీవితం రంగు రంగులతో ఇంద్రధనస్సులాగా కళ్ళు చెదిరిస్తుంది. కానీ జీవన నిష్వారాల ఏ అసంకల్పిత క్షణంలోనో అపశ్రుతి పలుకుతుంది. అప్పుడిక - మళ్ళీ జీవితం పాతదారే పడుతుంది.***

అదే నిశ్చితం, నిశ్చలమూను - అనిపించింది కాశీకి. కాకపోతే హఠాత్తుగా మాష్టారి భార్య మృతికి, అంత మనిషి ఉన్నపాటునే కృంగి, నైరాశ్యంలో పడడానికీ మరో అర్థం కనిపించలేదు.

***జీవితమంతా గడిపాక ఓ గొప్ప సత్యం అర్థమవుతుంది. 'నాకు తెలియనిది ' ఇంక చాలా మిగిలిపోయిందన్న అసంతృప్తి.***

"ఇక్కడెవరూ లేరు నాకు. వచ్చి కొన్నాళ్ళు గడపండి నా దగ్గర. నాలో శక్తి అంతా ఖర్చయిపోయింది. నాలో జవసత్వాల్ని పొదగలేదు మీరు" అని కాశీ ఉత్తరం రాస్తే, జావాబు రాశారు మాష్టరుగారు. "ఇన్నాళ్ళు ఓ వ్యక్తిమీద ఆధారపడి బ్రతుకుతున్నానని ఇప్పటికి అర్థమయింది. ఆ వ్యక్తి పోయాక ఇంకా నేను బ్రతకాలన్న ఆశను పెంచుకునే ప్రయత్నం చేస్తున్నాను. ఇప్పట్లో వచ్చి నేనేమీ నీకు సహాయం చెయ్యలేను"

నిజమే, ***జీవితం విదేశీ భాషలాంటిది. అందుకే దాని ఉదాహరణ ఇంకా ఎవరికీ సరిగా అర్థంకాలేదు.***

చక్రవర్తి వచ్చాడని గంగులు బజారులో కనిపించి చెపితే వెళ్ళాడు కాశీ. కనిపిస్తే ఏం ప్రశ్నించాలో తెలీదు. అన్నిటికీ నవ్వుతూ సిద్ధమయే అతని ఎదుట నిలబడి ఆ సంఘటన పర్యవసానాన్ని గుర్తుచేయడం ఎట్లా సాధ్యమా అన్న విషయం కాశీ ఆలోచించలేదు. చక్రవర్తి వచ్చాడనగానే చూడాలన్న ఆసక్తి. అందుకే బయలుదేరాడు.

ఆకాశం నీడల్లోకి చూస్తూ మెట్లమీద కూర్చుంది గిరిక. కళ్ళల్లో దిగులూ, ఏదో తీరని లోటూ, బెంగా మునుపటికన్నా స్పష్టంగా తెలుస్తున్నాయి. మెట్లపక్కకి వచ్చి నిలబడితే కాసేపటికి చూసి అంతలో నవ్వడానికి వెయ్యివిధాల ప్రయత్నం చేసింది. "ఎప్పుడొచ్చావు? నాకు భయమేసింది నువ్వు హఠాత్తుగా కనిపించేసరికి" అంటూ.

"భయమెందుకూ?"

"నువ్వు చాలా పెరిగిపోయావు - ఇప్పుడు నాలో ఇది వరకంత భయంలేదు - ధైర్యమూను. అందుకని మనస్ఫూర్తిగా నవ్వే కళ్ళని చూస్తే, భయం, పిరికితనమూను" ఆ మాటల్ని ఎప్పుడో సిద్ధం చేసుకున్నటు మాట్లాడితే ఆశ్చర్యపోయాడు. మనస్సుకి నొప్పి కలిగింది. తలకి స్నానం చేయడం వల్ల పువ్వురేకుల్లా విడిపోయి చెదిరిపోతున్న జుత్తుని కుడి చెంప అంతా జల్లుకుంది.

నిజంగా అంత దిగులూ, నిస్పృహను ఆ కళ్ళనీడల్లో కనిపిస్తాయేమోనని వెదికాడు. కానీ మనస్సు వరకూ పోని నిశ్చలత్వం, హృదయాన్ని కదపలేని బలహీనపు ఆరాటం. ఈ ఒంటరితనానికి అర్థం ఎలా చెప్పుకోవాలో తెలీనప్పటి తత్తరపాటు - ఇవి తప్పిస్తే ఆమె పాత గిరికగానే కనిపించింది.

"నీకేం బాధల్లేవు. బాధలు మిగిలాయేమోనన్న భయం తప్ప."

"నిజమే, నిన్ను చూస్తూ బాధల గురించి ఆలోచించలేను. నీ ముందు నాకెప్పుడూ బాధలు కనిపించవు."

అంతలో సిగ్గుపడింది. తెలియని మ్లానత కనిపించడంతో నవ్వుకుంది గిరిక.

"నీ దగ్గర అదే విచిత్రం - నేనేదన్నా మాట అంటే నాకు బదులు నువ్వే సిగ్గుపడతావు. నేను సిగ్గుపడాలనుకుంటాను. కానీ నాకేం మిగల్చవు నువ్వు" అని మళ్ళీ నవ్వింది.

గంగులు ఇంట్లోంచి వాడిన పువ్వుల్ని బయట పారవేయడానికి వచ్చాడు. ఇద్దరూ ఒక్కసారి ఆగిపోయారు. "చక్రవర్తి కోసం వచ్చాను" అన్నాడు.

ఆమె చకితురాలయి అతని వేపు చూసింది. అంతలో స్థిమితపడి "అంతకంటే నాకోసం వచ్చానంటావేమో ననుకున్నాను ఈ పాత గిరికను మరిచిపోయేవనుకున్నాను."

ఇంత నవ్వు వెనక, ఇన్ని మాటల మాటున తెలీని ఉద్రేకం, తెగింపు - ఆ సన్నని బలహీనపు కంఠంలో తెలుస్తోంది. తనని చూడగానే మొదట్లో కనిపించని వణుకు కూడా ఇప్పుడు మాటల్లో తెలుస్తోంది. మాటలకంటే మనస్సు తొందరగా ఏవో ఆలోచనల్ని పేర్చుతూండడం గమనించాడు. ఒక్కసారి ఆమె భ్రుకుటి ముడుతల్ని గమనించి భయపడ్డాడు.

ఇంతసేపటికి ఆకుపచ్చరంగు చీర నడుం చుట్టూ తిప్పుకు లేచి నిలబడింది. "నీకు ఆతిథ్యం ఇవ్వడం మరిచిపోయాను. నాకిప్పుడేం గుర్తుండడంలేదు. ఈ పనులన్నీ వదులుకుని ఎక్కడన్నా రహస్యంగా చీకటిలో నిద్రపోవాలనుంది"

ఆమె వెనక నిశ్శబ్దంగా నడిచి గుమ్మాన్ని పట్టుకు ఆగాడు. ఆమె మాటలన్నీ చెప్పాక వెనక్కి తిరిగి చూసేసరికి ఎదురుగ్గా డాక్టరుగారి పెద్ద చిత్రాన్ని చూస్తూ కనిపించాడు కాశీ. ఎంతోసేపటికి ఆమె వేపు తిరిగితే ఇంకా తనవేపే చూస్తోంది గిరిక.

"ఏం చూస్తున్నావు?" అంటే

పక్కున నవ్వింది "నన్ను మరిచిపోవాలని నువ్వు ఎంత ప్రయత్నిస్తున్నావా అని చూస్తున్నాను. నిజం చెప్పు ఎందుకొచ్చావిప్పుడు?" చిన్న పిల్లలా కుర్చీలో కూర్చున్న అతని ముందుకు వంగి అడిగింది.

"నన్ను సరిగ్గా ఆలోచించడానికి తీరిక ఇవ్వవు నువ్వు. ఇప్పుడింకేం చెప్పలేను - నిన్ను చూస్తూ కూర్చోవడం తప్పించి."

ఆమె ముఖంలో తృప్తి, ద్వైదీభావం స్పష్టంగా తెలిసింది. అద్దంవేపు నడిచి - ఇంకా సంగం వాడిన మల్లెలు అక్కడే ఉంటే శ్రద్ధగా తీసి తలలో ఉంచుకుంది.

ముందుకూ వెనక్కూ ఊగే రబ్బరు బొమ్మను తీసి ఆప్యాయంగా గుండెకు హత్తుకుని మంచం మీద కూచుంది. ఇప్పుడిక ముఖంలో విషాద ఛాయల్ని రానివ్వడంలేదు.

"నీ గురించి నేను ఆలోచించుకున్నపుడల్లా భయం వేస్తుంది. ఇంకెవరి గురించి ఆలోచించాలో తెలీదు నువ్వు వచ్చావు - ఇప్పుడిక పరవాలేదు."

అతనింకా మాట్లాడక పోవడం చూసి "ఏం ఆలోచిస్తున్నావు?" అతను తలెత్తితే ముఖం చూసి భయపడింది. ఆ కళ్ళల్లో ఎరుపు, పెదాల కదలక ఆలోఢితమైనప్పటి గంభీరత చూసి విస్మితురాలయింది.

"కాశీ" అని ఓపికలేని కంఠంతో అంటే నీరసంగా నవ్వాడు.

"ఏం ఆలోచిస్తున్నానో చెప్పమంటావా? - అన్నపూర్ణ ఈ క్షణంలో చచ్చిపోతే బావుణ్ణనిపిస్తోంది."

గిరిక ఉలిక్కిపడింది. ఆ మాటల్లో పదును, నిస్సహాయత, ఉద్విగ్నత ఆమెలోని చైతన్యాన్ని కలిగించాయి.

"కాశీ, కాశీ! అలాంటి మాటలు అనకు" అని ముఖం కప్పుకుంది. ఇంకా ఏదో మాట్లాడుతున్నాడతను. ఆమెకు సగం అర్థం కావడంలేదు.

"నాకు తెలీకుండానే నేను నిన్ను చాలా పాడు చేశాను గిరికా ఆ విషయం ఇవాళ అర్థమయింది. ఇప్పుడేం చెయ్యను? ఆ అడ్డంకు తొలిగిపోతే ..

మళ్ళీ ఇక దుఃఖం ఆపుకోలేక బిగ్గరగా ఏడుస్తోంది గిరిక.

ఆర్ధ్రతతో, దయతో అతని మనస్సు సంతప్తమయింది. ఆమె దుఃఖంలో, బాధలో ఇప్పటికీ మనస్సంతా తేలిక పడ్డట్టనిపించింది. లేచివెళ్ళి ఆప్యాయంగా ఆమె భుజం తాకాడు.

"నాకూ ఇట్లా ఎప్పుడన్నా మనస్సంతా తేలికయేలా ఏడవాలనిపిస్తుంది. నీ దుఃఖానికి జాలిపడగల కాశీ నా దగ్గరున్నాడు. నాకెవరూ లేరు. అంతే తేడా"

హఠాత్తుగా అతని చెయ్యిపట్టుకుని "నాకెలా మాట్లాడాలో తెలీదు. ఏదో అనేశాను. నాకు నీమీద అలాంటి ఉద్దేశమేమీలేదు" అని వెయ్యి విధాలా ఏదో చెప్పడానికి ప్రయత్నించి ఉద్వేగ ఛాయలు ఆ ఆసరా ఇవ్వకపోవడంతో మరీ గుండె పగిలేట్టు ఏడ్చింది.

అంతగా బాధపడడం అవసరం లేదని కాశీకి తెలుసు. కానీ అది ఒకనాటి దుఃఖం కాదు. అన్నాళ్ళ తన నిరాశ, నిస్పృహ, ఆశాభంగం, కసి, కోపం, ఉదాసీనత, అసహాయత, అన్నీ ఏకమయి ఆమెకు స్థిమితం లేకుండా చేసినై. ఎంత ప్రయత్నించినా తనమీద ప్రేమను చంపుకోలేదు గిరిక – ప్రేమకాదు పోనీ ప్రేమిస్తున్నానన్న కోరిక.

మాట్లాడదామంటే క్రమంగా తన కంఠమూ రుద్ధమయింది. మాట్లాడడానికి ఏ మాటలూ మిగలలేదు. కానీ తనలోనూ ఏదో అవ్యక్తమయిన ఆవేశం మనస్సును రగుల్చుతోంది. కానీ విచిత్రం ఆ వ్యక్తిమీద జాలితప్పించి కోరిక, ఆశ ఏమూలా కదలడంలేదు.

"ఛీ నేను వచ్చి ఏం పని చేశాను? నీ నిస్సహాయత ఎప్పుడూ ఇంతగా గుర్తురాలేదనుకుంటాను"

కన్నీటి తడికి ముఖం మీద నలిగిన జుత్తు బరువెక్కి తలను క్రిందికి లాగుతున్నట్టు వేలాడుతోంది. తల ఎత్తితే అప్పుడే ముఖం మీద వర్షపు జల్లు పడినప్పటి బరువు తెలిసింది. కుంకుమ ముఖమంతా పాకి చెక్కిళ్ళకి ఎరుపు పూసింది.

ఆశ్చర్యం. అంత దుఃఖంలోనూ నవ్వుతుందేం?

"ఎప్పుడూ ఇంతగా ఏడవలేదు నేను" అని ఆగి ముఖాన్ని రెండు చేతుల్లోనూ ఉంచుకుని నేలవేపు చూస్తూ "ఇంకెప్పుడూ ఏడవను" అంది నిశ్చయానికి వస్తూ –

ఆ కంఠంలో కృత్రిమత్వం – ఆ ఉద్వేగం, ఉద్రేకం ఆమె అదుపులో లేని విషయం ఒక పక్క వ్యక్తమవుతూనే ఉంది.

"ఎందుకేడ్చావ్ అంతగా?"

మళ్ళీ అంతలో కోపం "ఎందుకో తెలీదూ నీకు?" ఆగి అంది. "నీలో ధైర్యాన్ని ఊహించగలను కానీ, అన్నపూర్ణలో దుఃఖాన్ని ఊహించలేను. ఇన్నాళ్ళకు నా ఆలోచనలకు పెద్ద అభ్యంతరం ఇప్పుడు అర్థమయింది. ఇంకెప్పుడూ ఇక్కడకు రాకు. వెళ్ళిపో"

ఆమెలో స్వార్థం, ఆశ, ఇన్నాళ్ళూ ఎట్లా తాత్సరం చేశాయో అర్థమయింది. ఆ మాటల్లోనూ తను ఆమెకంత కావాలో తెలిసింది. సగం వాడిన మల్లెపువ్వులు మరీ నలిగిపోయాయి. ఇక వాటికి వాసన ఉండదు. జుత్తు వెనక్కి లాగి ముడివేస్తోంది.

లేచి నెమ్మదిగా బయటికి వచ్చేశాడు. మళ్ళీ ఏదన్నా చెప్పడానికి పిలుస్తుందేమోనని చూశాడు. కానీ గిరిక పిలవలేదు. కనీసం ఆ స్థలం నుంచి కదిలిన అలికిడి అయినా వినిపించలేదు.

నిర్విణ్ణుడై ఇక చేసేదిలేక మెల్లగా నడిచిపోయాడు.

***ఒక వ్యక్తిమీదకాక, ఒక అనుభవం చుట్టూ స్త్రీ తన ఆశల్నీ, ఆశయాల్నీ మలుచుకుంటుంది. అందువల్లనే త్వరగా నిరాశతో కృంగిపోవడం కూడా స్త్రీకే సాధ్యమవుతుంది. ఎందుకంటే వ్యక్తికి ఉండే పాటి నిశ్చలత అనుభవానికి లేదు కనుక.***

గిరికలో కనిపించిన ఆవేశం కంటే హఠాత్తుగా ఆమె ఆవేశాన్ని ఆపుకున్న తీరు, దుఃఖంలో నలిగి బయట పడిన నవ్వు – అప్పటి మాటలూ ఇవన్నీ మరీ ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి.

గిరిక ఇల్లుదాటి పది అడుగులు వెయ్యడంతోటే శేషాద్రిరావుగారు కనిపించారు.

"నాకు తెలుసునోయ్ – ఎక్కడో నువ్వు తటస్థపడతావని – ఇంటికేనా?" అన్నాడు. అతణ్ణి అక్కడ చూసేసరికి తృళ్ళిపడ్డాడు కాశీ. ఆయన ముఖంలో నువ్వు వెనక, వెయ్యి అర్థాలు కనిపించేటట్టు తల పంకించడంలో ఏమీ అశ్రద్ధ చెయ్యలేదు ఆయన.

"ఎక్కణ్ణుంచి వస్తున్నారూ?"

"నేనెక్కణ్ణుంచి వస్తాను? - నాకున్నది ఒక్క ఇల్లే"

ఆ లుబ్ధవ్యంగ్యం మనస్సుని మరీ కదిపింది. ఇంకేమీ మాట్టాడాలని పించలేదు. ఆయన పక్కనే నిశ్శబ్దంగా నడిచాడు.

"డాక్టరుగారు పోయాక ఆ ఇల్లు మరీ కూలిపోయిందోయ్. డాక్టరుగారి పరప్రీతి నాకు చిన్నప్పటినుంచీ తెలుసు. కళ్ళజోడు మరిచిపోయాను. ఆ ఇంట్లోంచేనా నువ్వు వస్తున్నది?"

రోడ్డుపక్క రెండు మూడు ఇళ్ళకు వినిపించేంత గొంతుతో ప్రముఖంగా ప్రశ్నించేసరికి సిగ్గుపడ్డాడు. "ఆ విషయాన్ని ఇంట్లో మాట్లాడదాంలెండి. చుట్టుప్రక్కల వాళ్ళ నిద్రపాడవుతుంది"

ఇందుకు శేషాద్రిరావుగారు తెల్లబోయి "ఆ జవాబు చాల్లే" అన్నట్టు మీసాల మధ్య కనిపించని చిరునవ్వు నవ్వుకుని కాశీ వెనక్కి తొందరగా నడిచాడు.

మర్నాడు నిజంగానే చక్రవర్తి కనిపించేసరికి నిర్ఘాంతపోయాడు కాశీ.

మునుపటి వ్యక్తిలా కనిపించలేదతను. పొట్టినిక్కరు, చేతులవరకూ వేలాడే తెల్లలాల్చీ, మట్టికొట్టుకుపోయిన టోపీ - అంతకు మించి ఎప్పుడూ సంతోషంగా ఉండే వ్యక్తి మీద హఠాత్తుగా విషాద ఛాయలు కమ్ముకొన్నప్పటి నీరసం, దిగులూ ఆ ముఖంలో -

కాశీ ఆశ్చర్యంగా చూస్తే నవ్వాడు.

"ఆశ్చర్యపడక్కరలేదు లెండి. నైనిటాల్ హిల్ స్టేషన్‌లో మనస్సుకి మరమ్మత్తు చేసుకుంటున్నానండి - మొన్నరాత్రి హఠాత్తుగా ఇంటివేపు మనసు మళ్ళింది. 'ఇంట్యూషన్' అంటారే, అది నాకు హెచ్చుగా ఉంది. ఇంటికి వెంటనే వచ్చేశాను. నేను పొరపాటు పడలేదని ఇంటికి వచ్చాక తెలిసింది."

అంత పొడువుపాటి సంభాషణలు వినడానికి అలవాటు పడినా - ఇప్పుడు వినాలంటే ఓర్పు నశిస్తోంది కాశీకి. ఏదో చెప్పాల్సిన విషయాన్ని వెనక వేస్తున్నట్టనిపించింది.

"విషయం చెప్పండి" అంటే నవ్వాడు చక్రవర్తి. కూచుని "ఒక పెద్ద రహస్యం చెప్పడానికి వచ్చాను సార్. నలుగురిలో చెప్పమంటారా? రహస్యంగా చెప్పమంటారా?" అన్నాడు.

అతని కంఠంలో తెచ్చిపెట్టుకున్న నిర్లక్ష్యం, కాస్త పాటి హాస్యం వెనుక కంఠం చలించడం - ఈ విషయమంతా చెప్పాక ఒక్కసారి ముఖం కప్పుకునే ప్రయత్నం -

"చెప్పండి" అని కాశీ తొందరపెట్టాడు.

"అయితే వినండి... గిరిక చచ్చిపోయింది."

కాశీ స్తంభీభూతుడయాడు.

అంతవరకూ నేలమీద పొడవుగా పడుతున్న నీడ మెల్లగా పాకి గోడమీద పడింది. ఆ రోజు చెట్టుకి గన్నేరు పువ్వులే కనిపించడంలేదు. ఒక్కసిరి కుర్చీలో వెనక్కి చేరబడి కళ్ళుమూసుకున్నాడు.

చక్రవర్తి ఓ పాత సిగరెట్టును జేబులోంచి తీసి వెలిగించడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఎంతసేపటికీ గిరిక చనిపోయిందన్న విషయాన్ని మనస్సు నమ్మలేకపోతోంది. స్త్రీ జీవితం అంతం కావడానికి అంత చిన్న కారణం చాలా? అన్న ఆశ్చర్యం - స్త్రీలో కోరికలు అంత బలమైనవా అన్న దిమ్మెరపాటు - చచ్చిపోవడం ఇంత సులువా అన్న దిగ్భ్రమ.

ఎలా? ఎలా?

అదే అడిగాడు.

"ఎలా చచ్చిపోయింది?"

సిగిరెట్టు వెలగక బాధపడుతూ చక్రవర్తి నవ్వాడు. "నయం ఎలా అన్నారే కానీ ఎందుకు అనలేదు" - అని టేబులు మీద ఆష్‌ట్రేని తెచ్చుకోబోతే అంతకుముందే విరిగిన ముక్కలు రెండూ విడిపోయాయి. పక్కున నవ్వాడు.

"గిరిక ఇది వరకే చచ్చిపోయింది. ఇవాళ ప్రపంచానికి ఒక ప్రకటన చేసింది - సరిగ్గా మీ ఆష్‌ట్రేలాగే" అన్నాడు వచ్చి కూచుని.

ఇంక చికాకు కలుగుతోంది - ఈ విషాదం మధ్య అతని హాస్యానికి.

"ఏమిటో సరిగ్గా చెప్పరు మీరు" అన్నాడు.

"చెప్పడానికి ఏమీలేదండి. ***చచ్చిపోవడం ఓ పెద్ద కష్టంకాదు. అయితే ప్రపంచం మనల్ని చంపిందా? మనకి మనమే చచ్చిపోయామా అన్నదే విషయం. ఒక్కొక్కప్పుడు మనకు తెలీకుండానే చచ్చిపోతాం. ఆ విషయం కొన్ని నెలలు, సంవత్సరాలయాక తెలుస్తుంది***" అని ఆగి కాశీ ముఖంలోకి చూశాడు. అతని ముఖంలో ఆత్రుత, వేదన గమనించి - "చాలా అమాయకంగా చచ్చిపోయింది సార్ - ఆత్మహత్య చేసుకుంది" అన్నాడు చక్రవర్తి.

కాశీ అతని ముఖం విచిత్రంగా చూస్తే - పెదాల వణుకును ఆపుకోడానికి ప్రయత్నించే చక్రవర్తి కనిపించాడు.

"దుఃఖం ఇన్నాళ్ళవరకు నన్ను జయించలేదండి - ఇవాళ దానితో ధైర్యంగా పోరాడుతున్నాను. మీరు వస్తారా నాతో - పాత స్నేహితురాలు కనక - ఆమెని చూస్తే స్వర్గంలో సంతోషిస్తుంది. నిజంగా ఆమె స్వర్గానికి వెళితేను"

ఇద్దరూ బయటికి వచ్చాక "మీకిది చాలా పెద్ద దెబ్బ" అన్నాడు కాశీ.

ఆ మాట వినడంతో గుక్కతిప్పుకోకుండా నవ్వాడు. "నేనే ఆ విషయం మీతో అనాలనుకుంటున్నాను" అన్నాడు చక్రవర్తి..

ఆ వాక్యం అన్నాక మరి నవ్వలేదు. ఇక ఆ ముఖంలో పరిహాసం కనిపించలేదు. మళ్ళీ మామూలుగా తయారయాడు.

కాశీ పక్కకి వచ్చి "ఒక్క రహస్యం చెప్పేదా?" అన్నాడు.

"ఏమిటి?"

"గిరిక మీ కోసం చచ్చిపోయింది. ఇంకా చెప్పాలంటే మీ వల్ల"

ఉలిక్కిపడ్డాడు. రక్తమంతా ఒక్కసారి కదిలి కళ్ళలోకి పాకింది. తలలోని నరాలు ఒక్కసారి పళ్ళిచ్చినట్టనిపించింది.

"నిజం!?"

"ఒక పదేళ్ళ క్రిందటినుంచీ ఆమె బతుక్కి అర్థం మీరేనని నాకెప్పుడో తెలుసు. మీరు ప్రేమించకపోయినా మీమీద ఆశతో బ్రతికింది"

ఇక ఒక్కమాటకూడా మాట్లాడలేకపోయాడు కాశీ. ఏదో తెలీని అలజడి శరీరంలో కదలడం ప్రారంభించింది.

నిన్నటి రాత్రి గిరిక నవ్వు - దుఃఖంలో స్వగతంలా పెరిగిన మాటలూ, ఆ కళ్ళల్లో గ్రంథాలూ - అతను నిర్లక్ష్యంతో వెనక్కి మళ్ళిన తీరు.

చక్రవర్తి ఏదో ముందే ఊహించి భుజం మీద చెయ్యి వేసి నడవడం ప్రారంభించాడు.

"***కొందరు బ్రతకడం వల్ల చాలామందిని సంతోషపెడతారు. కొందరు చచ్చిపోయి చాలామందిని సంతోషపెడతారు.*** గిరిక రెండో తరగతికి చెందుతుంది" అంటున్నాడు.

అప్రత్యాశితంగా తెలిసిన ఈ సత్యం మనస్సులో తీరని ఆరాటాన్ని లేవదీసింది.

ఒకనాడు జీవితాన్ని ఒక్క కోరిక చుట్టూ మలచుకోవడం ఆ లక్ష్యాన్ని సాధించలేకపోతే జీవితానికి వ్యర్థతను ఆపాదించుకొనడం –

***ఆశల్లేకుండా బ్రతకడం కష్టం. కానీ ఆశల్లేకుండా బ్రతకడంలో అర్థంలేదు.*** ముఖ్యంగా స్త్రీ జీవితానికి.

ఇదొక్కటే అర్థమయింది ఇన్నేళ్ళ బ్రతుకులో.

ఇక ఉద్వేగాన్ని ఆపుకోలేకపోయాడు. ఒక కోరికకోసం, జీవితాన్నంతా అరణంగా ఉంచి ప్రపంచం మీద సవాలు చేసిన వ్యక్తి ముఖం మీది చివరి చిరునవ్వు, శాశ్వతంగా నిలిచిపోయిన చివరి నిర్లక్ష్యపు చూపు.. చూడడానికి భయమేసింది – ఎంతప్రయత్నించినా కాలు ముందుకు సాగడం లేదు.

చటుక్కున ఆగి "ఇక నేను ముందుకు రాలేను చక్రవర్తిగారూ – ఆమెను చూస్తే భయంతో, పిరికితనంతో నన్ను నేను ఆత్మహత్య చేసుకుంటానేమోనని భయం వేస్తోంది. నేనిక వెళ్ళిపోతాను" అని వెనక్కి తిరిగాడు.

చక్రవర్తి ఆశ్చర్యపడలేదు. కానీ అక్కడే నిలబడి నీరసంగా నడుస్తూ వెళుతున్న కాశీని చూసి నవ్వుకున్నాడు.

"ఇతనిలోనూ ప్రేమ ఉంది. కానీ దాన్ని గుర్తించేలోగానే మాయమయింది" అనుకున్నాడు.

ఇలాంటి వ్యక్తికోసమా గిరిక ప్రాణాల్ని వదులుకుంది. తనకోసం చచ్చిపోయిన వ్యక్తిని, తన ప్రాణం కోసం భయపడి – చూడడానికి వెనుకంజవేసే వ్యక్తికోసమా!

***భగవాన్! స్త్రీకి గొప్ప ధైర్యాన్ని, స్థైర్యాన్ని ఇచ్చావు కానీ దానిని సరిగా ఉపయోగించుకునే హేతువును కూడా కలిపించలేదు నువ్వు. అందువల్లనే స్త్రీ బలహీనంగా ఉండిపోయింది. అందువల్లనే నీ సృష్టిలో లోటు మిగిలిపోయింది.***

"***అనుభవించేవాడికి జీవితం విషాదాంతంగా కనిపిస్తుంది. ఆలోచించేవాడికి జీవితమంతా టెన్నిస్ ఆడడమంత సులభంగా తోస్తుంది.*** నేనింకా అనుభవాన్ని గురించి ఆలోచించలేదు. ఆలోచించడం ప్రారంభించాక వసంతని పెళ్ళిచేసుకుంటాను. ఇప్పటికీ నేను ఆ సంఘటనకి విచారించడంలేదు" అని చెప్పాడు చక్రవర్తి, వసంత విషయం కదిపితే –

"అంతే జీవితం! ఒక జీవితకాలం నిన్ను నువ్వు వెదుక్కుంటూ, నీలో నువ్వు చూసుకుంటూ నడుస్తావు. దొంగలూ, మోసగాళ్ళూ, సత్పురుషులూ, నీతి బాహ్యులూ, అంతా కనిపిస్తారు. కానీ విచిత్రం ఎక్కడకు వెళ్ళినా నీకు నువ్వే ఎదురౌతావు. "

చక్రవర్తి మాటలు విన్నా ఆశ్చర్యం వెయ్యలేదు. కోపమూ రాలేదు. నవ్వి ఊరుకున్నాడు కాశీ.

"అన్నింటికీ ముఖ్యం బాధ్యత. మీరేం చిన్నపిల్లలు కాదు, నేనింతగా చెప్పడానికి" అనేసి ఊరుకున్నాడు.

కానీ ప్రతి విషయానికి ఆలోచించాలన్న సూత్రాన్ని గుర్తుంచుకోలేదు చక్రవర్తి. అందుకని ఆ మాటలకి తటస్థంగానే ఉండిపోయాడు.

మరి పదిరోజులకి చక్రవర్తి కనిపించలేదు. ఇల్లు, ఆస్తి ఏం మిగిలినా అమ్మేసే ప్రయత్నాలు చెయ్యమని గంగులుకు చెప్పిపోయాడు.

గిరిక చచ్చిపోయిందని కాశీ వ్రాస్తే విని అన్నపూర్ణ ఆశ్చర్యపోయింది. ఎలా చచ్చిపోయిందని అడగలేదు, "ఎందుకు చచ్చిపోయింది?" అని వ్రాసింది.

ఇంకా ఆలోచిస్తూనే ఉన్నాడు ఆ విషయం. ఎందుకు చచ్చిపోయింది?

తను ఎలా బ్రతకాలో చెప్పే వ్యక్తికోసం జీవితమంతా పెనుగులాడింది. సాధ్యంకాలేదు. ఆ వ్యక్తిని వెదుక్కోవడంలో జీవితాన్ని గురించి ఆలోచించడం మరిచి పోయింది. అందుకని చచ్చిపోయింది.

ఈసారి బరువైన ప్రశ్నని కదిపింది.

"గిరికను మీరెందుకు పెళ్ళిచేసుకోలేదు?"

ఆ ప్రశ్నకూ ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. నాలుగేళ్ళ క్రిందటే ఈ విషయాన్ని అన్నపూర్ణ ఎందుకు అడగలేదా అన్న సంశయం తప్పించి.

మళ్ళీ పాత విషయాలు - ఎప్పటివో - పాత గిరిక గుర్తుకొచ్చింది. అవును. గిరికలో ఏదో లోపం ఉంది, తాను 'తాను'గా బ్రతకాలన్న కోర్కె తప్ప.

భర్తను తనకు కావలసినట్టు మార్చుకోడానికి ప్రయత్నిస్తుంది గిరిక. భర్తకి తగినట్టు మారడం అన్నపూర్ణకు తెలుసు. మంచి భర్తను ఎంచుకోవాలని గిరిక తాపత్రయం. పెళ్ళిచేసుకున్న వ్యక్తిని మంచి భర్తగా చేసుకోవడం తెలుసు అన్నపూర్ణకు. తనకోసం తను బ్రతకాలంటుంది గిరిక. భర్తకోసం బ్రతకడమే తెలుసు అన్నపూర్ణకి. తన భవిష్యత్తును భర్తలో వెదుక్కొంటుంది అన్నపూర్ణ. తన భవిష్యత్తులో భర్త పాలుపంచుకోవాలని గిరిక కోరిక.

అందువల్లనే పెళ్ళయాక కూడా గిరిక 'గిరిక'గానే కనిపిస్తుంది. కానీ అన్నపూర్ణ అలాకాదు - భర్తలో 'భాగం'గా కనిపిస్తుంది.

తనేం తప్పు చెయ్యలేదు. గిరికకు తను అక్కరలేదు. తాను ఆమె 'ఆస్తి' అన్న ఆలోచన చాలు. అలా జరగలేదన్న విచారం తనకు లేదిప్పుడు - ఆ విషయమే అన్నపూర్ణకు వ్రాశాడు.

రెండురోజులతరువాత తల్లి అడిగింది.

"గిరిక చచ్చిపోయిందటగా!?"

"అవును"

"శేషాద్రిరావుగారు"

ఇంకా అతను మాట్లాడకపోవడం చూసి "ఆయన అబద్ధం ఆడరు" అంది.

చకితుడయి ఆమె వేపు చూశాడు. ఏదో విషయాన్ని దాచుకుని దానిని కదుపుతున్న ప్రయత్నం స్పష్టంగా తెలిసింది. అట్లా డొంక తిరుగుడుగా ప్రశ్నించడం, నేరస్థుడిలాగా సమాధానం చెప్పడం విసుగేసింది.

"నువ్వడిగేదేమిటో తెలుసు నాకు. అవును గిరిక నావల్లనే చచ్చిపోయింది. నాకోసమే చచ్చిపోయింది. పోలీసులు పట్టుకోవడానికి వీలులేనంత నిశ్శబ్దంగా కొన్ని సంవత్సరాలు కష్టపడి చంపేశాను" అన్నాక ఆమె నిర్ఘాంతపోయింది. ఇక ఏం అడగాలో తెలీలేదు. "నేను కారణం కాదు" అంటే ఎన్నో శాపనార్థాలు పెట్టాలని సిద్ధపడి వచ్చిందామె. తీరా ఇట్లా ప్రయత్నమంతా విఫలమయి, ఇంత సులువుగా అతను తన నేరాన్ని ఒప్పుకునే సరికి హతాశురాలయి వెళ్ళిపోయింది.

మర్నాడే చాలా రోజుల తరువాత గణపతి మొదటిసారిగా అన్నయ్య ముందుకు వచ్చాడు. అతని ముఖం చూస్తూనే ఏం చెప్పదల్చుకున్నాడో ముందుగానే గ్రహించేశాడు కాశీ. ఆ కోపం, ఆ ఉద్విగ్నత అతనిని కావని తెలుస్తూనే ఉంది.

"ఏం?" అంటే

క్షణకాలం మాట్లాడలేకపోయారు.

"ఇంతవరకు నేనీ ఇంట్లో ఉన్నాను కానీ, ఇంక ఒక్క క్షణం కూడా ఉండలేను"

"ఏమొచ్చిందిప్పుడు?"

"నాకేం తెలీదు. ఇక్కడ కూచుంటావు నువ్వు. అక్కడంత నీ గురించి, మన ఇంటి ప్రతిష్ఠ గురించి -"

"వాళ్ళు అంటే ఎవరు? శేషాద్రిరావుగారు, జయలక్ష్మి, అమ్మ, పక్కింటివాళ్ళు -"

"నీతో వాదించలేను నేను. గిరికతో నీకు సంబంధమున్నట్టు వాళ్ళకిదివరకే తెలుసు"

"చాలా ప్రయత్నంచేశారే! నన్నడిగితే నేనే చెప్పేవాణ్ణిగా"

"అయితే చాలావాటికి తెగించావన్నమాట?"

ఆశ్చర్యంగా ఒక కొయ్యబొమ్మలాగ విచిత్రంగా తమ్ముణ్ణి చూస్తూ కూర్చున్నాడు కాశీ. నవ్వి "సరే ఇప్పుడు నిన్నిక్కడేం చెప్పి రమ్మన్నారో మొదట చెప్పెయ్. లేకపోతే ఈ ఉద్రేకంలో మరిచిపోతావు"

ఆ మాటలకి మండిపడ్డాడు గణపతి.

"ఇంతవరకూ నీమీద గౌరవం ఉండేది నాకు. ఆడవాళ్ళను హత్యచెయ్యడం కూడా ప్రారంభించాక, ఇక నేనిక్కడ ఉండలేను"

నిజంగానే కోపం వచ్చింది కాశీకి. ఏదో చెప్పాలని లేచాడు. కానీ మళ్ళీ గిరికతో గడిపిన చివరి క్షణాలూ, అప్పటి చీకటి రాత్రి గుర్తుకొచ్చింది. ఎప్పుడూ రానంత కోపాన్ని భరించలేక గణపతి వణుకుతున్నాడు. మేడమీద కిటికీ తలుపు విరిగిన భాగం నుంచి వెలుగు కిరణం సన్నగా వచ్చి తండ్రి ఫోటోమీద పడుతోంది. లేచి మెల్లగా తమ్ముడి వెనక్కి వచ్చి భుజం తట్టాడు. "గిరిక గురించి పూర్తిగా ఆలోచించడం నాకే ఇంకా చాతకాలేదు. అక్కడ వాళ్ళంతా మరి పదేళ్ళు తపస్సు చేయాలి ఆమె గురించి మాట్లాడడానికి. ఇట్లాంటి విషయాల్లో కోపం తెచ్చుకోవడానికి నువ్వింకా చిన్నవాడివి. ఇల్లు వెంటనే మార్చాలని అక్కడి వాళ్ళంతా చెపితే వెంటనే మార్చు" అని మేడదిగి వచ్చేశాడు.

***డబ్బు మంచి నౌకరే మంచి యజమాని మాత్రం కాదు. అధికారాన్ని డబ్బు చేతికి ఇవ్వడం కోతి చేతికి కొరకంచు ఇవ్వడంలాంటిది.***

కానీ ఇలా ఎంత ఆలోచించీ ఏం ప్రయోజనం లేదు. బీదవాడిని డబ్బు పరిపాలించడం, ధనవంతుణ్ణి హోదా పరిపాలించడం సామాన్యమయిపోయింది ఈ స్పుత్నిక్ యుగంలో!

ఎటొచ్చీ జీవితంలో మొదటిసారిగా డబ్బువల్ల కూడా నిస్పృహ, నిరాశా సాధ్యమని తెలిశాక కాశీ నిర్ఘాంతపోయిన ఫలితాన్ని అనుభవించక తప్పలేదు.

మాష్టారుగారికి ఉత్తరం వ్రాస్తే ***"మనం డబ్బు కోసం బ్రతకడంలేదు. కానీ డబ్బు మనకోసమే బ్రతుకుతోంది. రక్తమాంసాలు లేకుండా బ్రతగ్గలవా నువ్వు. అని ఎక్కువగా లేవని విచారం అక్కరలేదు. తగినంత లేవని విచారం తప్ప"*** అని వ్రాశారు.

ఇంకా ఆలోచించాలి. పదేళ్ళముందే జీవితాన్ని ఊహించి చెప్పారు మాష్టరుగారు. ఎప్పుడో చిన్నతనంలో ఆయన చెప్పిన వాక్యాలన్నీ ఇప్పుడు ఆచరణ కొస్తున్నాయి.

***జీవితమే నిన్ను నడిపేరోజు వస్తే నీ పతనం ప్రారంభమయినట్టే లెక్క. నువ్వు జీవితాన్ని నీ ఇష్టాఇష్టాల ననుసరించి నడుపుకోగల చేవను సంపాదించాలి.***

ఇట్లా ఎన్నో చెప్పేవారు.

ఇవన్నీ వర్షతాప సమయంలో వెలుగు కిరణంలాగ, నిర్నిద్రమయిన నిశీధినీడలో బలహీనపు ఆశ చారలాగ - అప్పుడప్పుడు సత్తాను కలిగిస్తాయి.

ప్రయత్నంచేసి పొరపాట్లను మనల్ని నడిపే ఏదో అవ్యక్తమయిన శక్తికి అంకితం చెయ్యి. పశ్చాత్తాపం వద్దు. ఎంచేతనంటే పశ్చాత్తాపపడితే ఆ పొరపాటును నువ్వు తపనగా అంగీకరించినట్టే లెక్క. కానీ ఎట్లా? - జరిగిన కార్యపు ఫలితాన్ని అనుభవిస్తూ దానిని అధిగమించి పోవడం ఎట్లా? - అర్థం కాలేదు కాశీకి.

ఇంకా పెరగాలి తను - అని అనుకున్నాడు.

గణపతి పెళ్ళికి కాళ్ళూ చేతులూ ఆడక అప్పట్లో వాడిన ఆఫీసు డబ్బు - ఆ రహస్యం మురిగి, మురిగి - ఇప్పుడు బయటపడింది. ఆఫీసు మేనేజర్ మొదలు నౌకరు వరకు కాశీ నిజాయితీ మీద విశ్వాసం ఉంచిన ఫలితం ఇదా? అనిపించే స్థితి వచ్చింది. డబ్బు తీసిన వెంటనే మెల్లగా సర్దుకుని క్రమంగా భర్తీ చెయ్యవచ్చుననుకున్నాడు.

***కానీ సంసారం చిల్లులు పడ్డ జల్లెడలాంటిది. దాంట్లో మిగులుతుందేమోనని నిర్విరామంగా మానవుడు తనకు దక్కినదంతా పోస్తూనే ఉంటాడు. కానీ తీరాచూస్తే ఏమీ కనిపించదు.***

అధికారులు పరీక్షకు వచ్చారనే సరికి బెదురు పట్టుకుంది.

**డబ్బు మాట్లాడడం ప్రారంభిస్తే నిజాయితీ నిద్రపోతుందని ఓ సామెత ఉంది.** కానీ నిజాయితీని జోకొట్టడానికి అతనికి ఇష్టంలేకపోయింది.

గణపతికి ఆ విషయం చెప్పడమా వద్దా అని తటపటాయించాడు. ఒక్కసారిగా అంత డబ్బు సంపాదించడం ఎట్లా.. వద్దులే అనుకున్నాడు.

అంతవరకూ ఎప్పుడూ గణపతి దగ్గరకు వెళ్ళలేదు. తమ్ముడి నడిగి ఇల్లు తెలుసుకు వెళితే ద్వారానికి కర్టెన్లు సరైనవి వెయ్యలేదని పెళ్ళాన్ని తిడుతూ గణపతి కనిపించాడు. కాశీని చూశాక గణపతి, పెళ్ళాం - అంతకు మించి తెలుపు వెనుక చీకట్లో మిగిలిపోయిన అత్తగారూ విస్తుపోయారు.

***మనస్సు అవసరాన్ని తీర్చడానికి ఏ డబ్బూచాలదు. కానీ మనస్సు అవసరాన్ని మించి పెరిగిన విషయం ఇది.***

తమ్ముడు పలకరించలేదని కించపడలేదు. తనే పలకరించాడు.

"ఓ విషయం నీతో మాట్లాడాలి" అంటే గణపతి మాట్లాడకుండా లోపలికి నడిచాడు.

గుమ్మం దగ్గరే ఆగిపోయిన జయలక్ష్మిని "బాగున్నావా అమ్మా!?" అని పలకరిస్తే జవాబు చెప్పడం మరిచిపోయి, వీధిలో పువ్వులు అమ్మకానికి వస్తే పిలవడానికి వెళ్ళిపోయింది.

గదిలో పెద్ద ఠాగూర్ కేలండరు కనిపించింది. పక్కనే రెండు బల్లలు చవకబారు టేబులు మీద ఖరీదయిన రేడియో పక్కనే మంచం -

కూచున్నాక "ఏం?" అన్నాడు గణపతి.

"ఇట్లా రావడం, ఇలా అడగడం అన్నీ కొత్త నాకు. అసలు ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదు" అని ఆగి గుమ్మం వేపు చూశాడు. అక్కడెవరు నిలబడ్డారో తనకు అర్థమయింది. ఈసారి ఊరుకోలేదు "ఇది నువ్వూ వినవలసిన విషయమే! జయలక్ష్మీ లోపలికి వచ్చి కూర్చో" అంటే ఆమె సిగ్గుపడి అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

గణపతి ఏమీ మాట్లాలేదు.. ''పరపతితో బ్రతకడం, స్థిమితంలో బ్రతకడం నాన్న మనకి నేర్పలేదు. నీ పెళ్ళికి డబ్బు ఎలా తీసుకురావడమో నాకు తెలియలేదు. తొందరగా జరగాలని అమ్మ, మావయ్య పట్టుదల. అందుకని ఆఫీసు డబ్బును ఖర్చుచెయ్యాల్సి వచ్చింది.''

తమ్ముడు విస్తుపోయి చూస్తే ''అంతకంటే నాకు మరో గత్యంతరం కనిపించలేదు. ఇదీ విషయం'' అని ఆగాడు.

ఏదో పాతదేవుడు పఠం ముందు, ఆరిపోయిన ఊదొత్తుల్ని వెలిగించడానికి లేచాడు గణపతి.

''ఇప్పుడా విషయం అధికారులకి తెలిసిపోయే సమయం వచ్చింది. నీకు చెప్పాలని -''

బయట ఎక్కడో గిన్నెలు ఒక్కసారి దొర్లాయి. ఏమిటో చూడటానికి బయటికి వెళ్ళాడు. ఎంతోసేపటికి గానీ రాకపోయేసరికి రేడియో మీద ఉన్న ఊలు పిల్లిని చూస్తూ కూచున్నాడు.

వచ్చాక అతని ముఖంలో ఏదో నిశ్చయం కనిపించి విస్తుపోయాడు.

ఎంతోసేపు నిశ్శబ్దంగా గడిచాక, ''ఏమంటావ్?'' అనడిగితే ''నాదగ్గర డబ్బులేదు'' అన్నాడు.

''ఉండదని నాకు తెలుసు. ఎక్కడన్నా సంపాదించి సర్దుకుంటే.. ఈ గండం గడుస్తుంది. ''

''నీలాగ నా ఉద్యోగాన్ని పాడుచేసుకోమంటావా? అయినా నేను పెళ్ళికి ఏడవలేదెప్పుడు నన్నడిగే చేశావా పెళ్ళి?''

తలుపు వెనక ఎవరో బరువుగా ఊపిరి తీస్తున్నట్టనిపించింది. తన మాటల్ని వినడానికి ఇందరు ఎదురు చూస్తున్నారనేసరికి వణుకు, జుగుప్స కలిగింది. అయినా తమాయించుకున్నాడు.

***డబ్బు ప్రసక్తి చాలామంది అల్పత్వాన్ని గుర్తుతెస్తుంది. డబ్బు ప్రసక్తి చాలామందిలో ఉద్రేకాన్ని తెచ్చిపెడుతుంది. ఏవో వింతరోగాల్ని కుదర్చడానికి భగవంతుడు సిద్ధం చేసి పోయిన వింతమందు అది. విచిత్రమేమిటంటే ముందునంతా తయారు చేశాక రోగం పేరు మరచిపోయాడు.***

లేచి ఇంటికి బయలుదేరాడు.

జీవితంలో రెండు దశలు గడిచి ఇప్పుడు మూడో ప్రాంగణంలో నిలబడ్డ అతనికి చాలా విచిత్రంగా కనిపిస్తోంది ప్రపంచం. తన తర్వాత ప్రపంచంలోనికి వచ్చిన వ్యక్తులు కూడా తనని మించి, అందకుండా పెరిగిపోయారు. ఇన్నేళ్ళ వయస్సులోనే ముసలివాడయినట్టు ప్రతి సంఘటనకూ మనస్సు బలహీనంగా వణుకుతూ, భయంతో పిరికిగా - ఏం బ్రతుకు ఇది?

నవ్వుకున్నాడు.

తడి ఇసక గాలికి చెదరలేక తాత్సారం చేస్తున్నట్టు వయస్సులోని అనుభవాలు - జ్ఞాపకాలను వదులుకోలేక వయస్సులో బాధపెట్టున్నాయి. అప్పటి మాష్టరుగారూ, గిరిక అల్లరీ, చిన్న తనపు అమాయకత్వం, డాక్టరుగారి హాస్యం అంతా గుర్తే. ***పాత జీవితం మీద ప్రేమతో కళ్ళు చెమ్మగిల్లాయి.***

మంచితనం కాశీ కాళ్ళు చేతుల్ని బంధించి బాధ్యతల నూతిలో పారేసింది. సంఘం అనే నాగు కాలికి చుట్టుకుని ఆశయాలను కట్టిపడేసింది. పరిస్థితుల నీటిలో ఉక్కిరి బిక్కిరయే కాశీ నిస్సహాయంగా మిగిలాడు.

ఇంటికి వస్తే నరసమ్మగారి గొంతు వినిపిస్తోంది.

''వాడి ఆసరా ఉండిపోయింది కాని, ఇంట్లోంచి తగిలేద్దెను అడ్డమయిన వాళ్ళందర్నీ. అది ఈ ఇంట్లో అడుగు పెట్టిన దగ్గర్నుంచీ శని చుట్టుకుంది ఈ కుటుంబానికి. ఎంత చచ్చిబతికినా ఇంకో మగాళ్ళకి పిల్లల్ని కనడం మాకు తెలిసి చావలేదు''

గుమ్మంలోనే అప్రతిభుడయి ఆగిపోయాడు కానీ, సిగ్గుతో, అవమానంతో రక్తమంతా తలకు పాకింది. పదిరోజులు చల్లగా పడి ఉన్న మంచుపొరకి వేడి తాకిడిలాగా - మనస్సు ఈ మాటలకి విచ్చుకుపోయింది. ***శరీరానికి ఎదురయే కష్టాలు ఎన్నయినా ఎదుర్కోవచ్చు. మనస్సు పటిష్ఠంగా మిగిలినంత వరకూ - మనస్సు బలహీనమయాక ఏదీ మిగలదు -***

ఇంట్లో ఎక్కడో మూలన కూచుని నీలూ ఏడుస్తున్నాడు.

నరసమ్మగారు కొడుకు రాకను గమనించి క్షణం దిమ్మరపోయినా - అంతలో సర్దుకు వంట ఇంట్లోకి నడిచింది.

"కోపం తెచ్చుకోవడానికి చేసే ప్రయత్నం, డబ్బు సంపాదించడంలో ఉంటే బావుణ్ణు. మన ప్రయోజకత్వం అలా తల్లిని దండించడం, అడ్డమయిన వాళ్ళకీ సత్రం తంతుగా భోజనాలు పెట్టడం -"

ఇక ఆమెను ఎదుర్కొనే శక్తి అతనికీ నశించింది. మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ గదిలోకి వచ్చి కూచున్నాడు. టేబులు మీద భగవద్గీత కాగితాలను ఎవరో చింపివేశారు.

"యధా యధాహి ధర్మస్య -" అనే శ్లోకం గాలికి రెపరెపలాడుతుంది. చదివి నవ్వుకున్నాడు. దానిని తీసి భద్రపరచాలని తోచలేదు.

నాన్న ఫోటో ముందుకు వంగిన వెనుక పిచ్చుక గూడు కట్టుకుంది. ఇంకా నోరురాని పిల్లలు, పచ్చిగొంతులు విచ్చి ఏదో భాషలో అరుస్తున్నాయి. లేచి వాటిని సవరించబోతే, తలుపులు చప్పుడయేసరికి ఆగిపోయాడు.

శంకరం అప్పుడే పనినుంచి వచ్చినట్టున్నాడు. ఏదో కాగితం పట్టుకుని లోపలికి వచ్చాడు.

"ఇంటివాళ్ళు నోటీసు ఇచ్చారన్నయ్యా - జప్తుచేయిస్తారట. దారిలో ఈ కాగితం నాకిచ్చేసి పోయాడు పోస్టుమాన్"

నిర్ఘాంతపోయి అలాగే ఉండిపోయాడు. "మీ వదిన లేదు నాదగ్గర. అందుకే ఈ కష్టాలన్నీ ఎదురౌతున్నాయి. ఆవిడ ఉంటే నన్నెలా రక్షించడమో ఆలోచించేది"

అవును, ఇన్నాళ్ళుగా అన్నయ్య నలిగిపోవడం చూస్తూనే ఉన్నాడు శంకరం - "అయితే వెంటనే వదిన దగ్గరకి వెళ్ళు. కొన్నాళ్ళు విశ్రాంతిగా ఉంటుంది."

ఇంకేం మాట్లాడలేదు కాశీ. కాగితం తీసుకుని చదువుకున్నాడు. తలుపు దగ్గరవేసి వెళ్ళిపోయాడు శంకరం.

తల్లి వచ్చినట్టుంది. చాలా అలవాటయిన భాషలో ఏమిటో చెప్పుకుంటున్నాయి పిచ్చుక పిల్లలు - కాస్సేపటికి అరవడం మానేశాయి - కిచకిచలాడడం తప్ప -

తను కూర్చున్న చోటుకి అద్దంలో తన ముఖం తెలుస్తోంది.

శంకరం వెలిగించిపోయిన దీపపు వెలుగులో బానిస కళ్ళల్లో పిరికితనం, తడబాటు, శరీరం కష్టాలలో కొంకరపోయిన తీరు, ప్రపంచం ఖరీదు ఇవ్వకుండా కొనుక్కున్న బానిస.

భయమేసింది.

చెయ్యని నేరాలకి వరసగా శిక్షని అనుభవిస్తున్నట్టు, ఓర్పుతో అన్నిటినీ సహించుకుపోతున్నాడతను.

ఆ రాత్రి వెలుగులో తండ్రి ముఖంలో ఏదో నీడ కనిపిస్తోంది.

ఇన్నేళ్ళ జీవితానికి పునఃపరిశీలన చేసుకోబోతే -

ఆశయాలకు సంకెళ్ళు - బ్రతుకు మీద పిరికితనం, భవిష్యత్తు మీద అవిశ్వాసం కనిపించింది.

పక్కగదిలో బరువుగా ఊపిరితీస్తున్న చప్పుడు తెలుస్తోంది.

***హాయిగా నిద్రపోగలగడం భగవంతుడు ప్రత్యేకంగా కరుణించాల్సిన వరం. లేకపోతే శరీరపు తృప్తితోపాటు మనస్సుకు తృప్తిని పొందడం ఎవరికి సాధ్యమవుతుంది?***

అద్దంలో ముఖం ఇంకా తనని వెక్కిరిస్తోంది. అది అనుభవాల వెక్కిరింతలుగా తెలుస్తోంది. చాప చుట్టిన విషాదాల్ని మళ్ళీ విప్పుకు పరుచుకున్న ఉదంతులూ - ఇదీ ఇన్నాళ్ళ జీవితానికి వ్యుత్పత్తి.

సగం రాత్రి గడిచాక మరునాటి బ్రతుకుమీద భయం కలిగింది.

తనని భోజనానికెవరూ పిలవలేదు. ఆకలి కరకరలాడిస్తోంది. ఆ ఆకలి కడుపులో లేచిందికాదేమోనని పించింది. తెలీని సుఖాల కోసం మనస్సు పడే అలసటా, హృదయ తపన, నీలూ కూడా భోజనం చెయ్యలేదేమో - లేచి ఇల్లంతా వెదికాడు. బాబాయి పక్కలో పడుకున్న వాడిని చూశాక కాస్త స్థిమితం కలిగింది.

ఒక్కసారి పడుకుని లేస్తే ప్రపంచమంతా మారిపోతుంది.

రేపు తన పరపతిని బజారులో పెట్టి తూకం వేస్తుంది ప్రపంచం.

తండ్రి ముఖంలో దైన్యతకూ, తన ముఖానికీ పోల్చి చూసుకున్నాడు.

తెల్లవారితే ఇల్లు ఆఫీసు అధికారుల పృచ్ఛింపు - తన చేతకానితనంపై తల్లి విమర్శలూ - మనస్సుకి చిత్రవధ - ఏదో ఆలోచన హఠాత్తుగా తోచి లేచి నిలబడ్డాడు.

పది తర్వాత ఎప్పుడో ఆగిపోయింది గడియారం -

నిద్దట్లో నీలూ పెదాలు ఎందుకో కదులుతున్నాయి.

అతణ్ణి భుజం మీద వేసుకు మెట్టుదిగాడు. కాలికింద ఏదో పురుగు నలిగి - చివరి అరుపు అరిచింది.

వీధి తలుపు తియ్యబోతే పెద్ద శబ్దం చేసింది. అక్కడ పడుకున్న ఎవరో వ్యక్తి తృళ్ళిపడి లేచారు. వసారాలోని వెలుగులో ఆ ముఖం ఆనవాలు పట్టాడు కాశీ!!. పట్టి తెల్లబోయాడు.

"ఎక్కడికి పోతున్నావురా ఈ రాత్రిలో?" అంటోంది ఆ గొంతు - అన్నేళ్ళు పెంచిన మమతని వదులుకోలేని ముసలి గొంతు.

నవ్వుదామంటే పెదాలు కదలడంలేదు. నిజంగా నవ్వాలని ఉంది.

ఎంతో సేపటికి ఒక్కమాట అన్నాడు.

"నన్ను అందరిలాగే కన్నావమ్మా - కానీ నేను బ్రతకగల శక్తిని ఇవ్వలేదు నువ్వు - మళ్ళా ఇక్కడికి రాను"

చెప్పలేని ఆరాటంతో ఆ బలహీనపు గుండె పగిలింది. చీకటిలో తల తలుపుకు ఆనించి ఏడ్చింది. ఏదో చెప్పబోతే గొంతు చెరవిడలేదు.

ఆతృతలో బయటికి వచ్చి చూస్తే గుర్తు తెలీనంతగా చీకటిలో కలిసిపోయాడు కాశీ, నీలూతో కలిసి.

అతణ్ణి తిరిగి రమ్మని చెప్పే భాషను మరిచిపోయింది ఆ చీకటిలో - ఆ వృద్ధురాలు -

జీవితానికి ఆశల 'అంగీ' ఇట్లాగే బలంగా పరుచుకుంటుంది గావుణ్ణు - ఈ వెన్నెల, ఈ తెల్లదనం, స్వచ్ఛత, మత్తు - అంతా ఇలాగే వాటిని చూస్తూ అందాన్ని మననం చేసుకుంటూ ఎంత తియ్యగా బ్రతుకును గడుపుకోవచ్చు? తీరా అంతా గడిచాక ఈ తెరవిడ్డాక జీవితం ఎంత వృధగా గడిచిపోయిందా అనిపిస్తుంది.

అందుకే కవి అంటాడు -

బహుళ పంచమి జ్యోత్స్న

భయపెట్టునన్ను - అని.

జీవితంలోని తియ్యటి జ్ఞాపకాలు పెట్టే చివరి కోతలాగ - జీవితాన్ని చివరిసారిగా అనుభవించే వ్యక్తికి సుఖాల మీద ఇచ్చే మామీలాగా - ఒక జ్ఞాపకం, ఓ కల, ఓ అనుభవం - ఓ అనుభూతి - ఓ చిరునవ్వు. అంత బలమైన జ్యోత్స్న -

బహుళ పంచమి జ్యోత్స్న -

ఎంత ఆలోచించినా జీవితంలో తియ్యటి జ్ఞాపకాలేం కదలవు - తియ్యటి జ్ఞాపకాలే మిగలని ఆ జీవితంలో -

ఆ పల్చటి వెన్నెల మధ్య రైలు కుదుపుతూ మోసుకుపోతోంది మనుషుల్ని. "ఇలాగే జీవితం నన్ను కదుపుతూ నడిచింది" - అనుకున్నాడు కాశీ. కాశీ ఒళ్ళో తలపెట్టుకుపడుకున్నాడు నీలూ. ఏ నిద్ర మధ్యనో లేచి బాబాయి పక్కలోంచి రైల్లోకి ఎలా వచ్చానా అని విస్తుపోయాడు. నాన్న నవ్వు ముఖం ఎదురయితే స్థిమిత పడి కళ్ళు మూసుకున్నాడు. ఆ నవ్వులో వెయ్యి అర్థాల్ని బోధపరచుకోవడం చేతకాని నీలూ.

ప్రపంచాన్ని పొగలాగ చుట్టుకున్న వెన్నెల మధ్య దిగులుపడి ఆ రాత్రి నిశ్శబ్దానికి పహరా ఇస్తున్న చెట్లూ, చల్లగాలి ఏదో నిశితమయిన ప్రశ్నల్ని సిద్ధం చేస్తున్నట్టు శరీరాన్ని కదుపుతూ - ఇలాగే, ఇలాగే.

ఆ రాత్రి గుర్తుకొస్తోంది - ఈ చల్లగాలి, ఈ చెట్లూ, రైలూ అన్నీ ఇవే - అయితే ఈ వెన్నెల లేదు. ఆ బహుళ పంచమి జ్యోత్స్న అంతకన్నా లేదు. ఇది ప్రత్యేకంగా తన జీవితానికి ఇస్తున్న సందేశం ఏదో - నాన్న జీవితానికి ఈ పాటి వెన్నెలా లేదు. తను కలలు కనడానికి కొన్ని ఆశలూ, ఆ కొంత విశ్వాసమూ లేదు నాన్న జీవితంలో. తను ఈ తియ్యదనాన్ని కనీసం ఊహించగలుగుతున్నాడు. కానీ దాని గురించి కనీసం ఆలోచించలేకపోయాడు నాన్న -

ఇప్పుడు, ఇన్నాళ్ళ తర్వాత నాన్న బ్రతుక్కి అర్థం బోధపడింది. తనని చూస్తూ ఆ చీకటి రాత్రి రైల్లో నవ్విన నవ్వుకి అర్థం తెలిసివచ్చింది. చివరిసారిగా ఎవరితోనో 'నాకేం సమస్యలు లేవు' అన్న వాక్యంలోని అర్థం అర్థమయింది.

"నాకేం సమస్యలు లేవు"

వెన్నెలరాత్రిలో నిశ్శబ్దం మధ్యన అతని మాటలు కృత్రిమంగా వినిపించాయి. రైల్లో అంతా పడుకున్నారు. నీలూ మీదకి వంగి ఒక్కసారి ముద్దుపెట్టుకున్నాడు. ఇదేమిటి? ఏడుస్తున్నాడెందుకు తను?

ఇంకా పూర్తిగా రూపం సంతరించుకోని నక్షత్రాలు - మొదటిసారిగా వెన్నెల ఆకాశాన్ని చూసినట్టు వణుకుతున్నాయి - ఎక్కడో ఆ రాత్రి నిశ్శబ్దానికి 'లయ' వేస్తున్నట్టు ఏదో పిట్టకేరుమంది.

రాత్రి ఆకాశం గాలితో నేస్తం కలిపి ఆకాశంలోకి చొచ్చుకున్న చెట్లతో కాపరం చేస్తోంది.

ఇదే సమయమనుకున్నాడు -

నాన్న చెప్పిన 'సమస్యల్లేని స్థితి'కి అర్థం తెలిసింది. నాన్న ఎందుకు చచ్చిపోయాడో పూర్తిగా అవగాహనకు వచ్చింది. ఎంతసులువుగా తన సమస్యల్ని పరిష్కరించుకున్నాడు - ఏదో పెద్ద నదిమీద పాకుతోంది రైలు. ఆ శబ్దం గుండెను పగలగొడుతోంది.

ఒక్కసారి కదిలాడు నీలూ. వాడిమీద చెయ్యివేసి ఆప్యాయంగా నిమిరాడు.

వంతెన దాటింది రైలు.

మెల్లగా లేచి తలుపువరకూ నడిచాడు. రైలు పెట్టె అంతా మత్తుగా నిద్రపోతోంది. బరువుగా గాలిపీలుస్తూ -

శాశ్వతమైన విశ్రాంతి తీసుకునే ముందు ఈ వ్యవధానం పెంచడానికి ఇష్టం కావడంలేదు.

ఇంకా జీవితం, ఆశలు, ప్రేమ, అభిమానం వీటి గురించి ఆలోచించాలని లేదు. తలుపు తెరిస్తే చలిగాలి - వంటి చుట్టూ సుడులు తిరిగి అప్పుడే చేతనావస్థని చంపేస్తోంది. రైలు ఏదో గమ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోతోంది. ఇంకేం లేదు - తనకూ మృత్యువుకీ వెంట్రుకవాసి దూరం. సమస్యల్తో సందేహాల్తో బరువెక్కిన ఓ వింతశక్తి. మరో క్షణంతో తేలికవుతుంది. చీకటిలో ఏమూలనో రహస్యంగా -

శరీరంలో శక్తినంతా చివరిక్షణం గడపడానికి పూరించుకుని ఉండగా రైల్లో ఎక్కడో పసిపిల్ల కేరుమంది. ఒక్కసారి తుళ్ళిపడి ఆగాడు కాశీ. నవ్వుకున్నాడు - తన బ్రతుకు వ్యవధిని ఎవరో నిర్లక్ష్యంగా పెంచుతున్నారు.

ఈ క్షణంలో తండ్రి మాటిమాటికీ గుర్తుకొస్తున్నాడు. అతను చచ్చిపోవడానికి అప్పట్లో కారణమెవరో కానీ అర్థంకాలేదు - చివరికి ఇప్పుడు.

ఉన్నట్టుండి రైలు కదిలింది. గీ పెట్టి అరుస్తోంది ఇంజను - అడవుల్లో పిట్టలన్నీ బెదిరి చెదిరిపోతున్నాయి.

రాత్రి అంతటినీ తెల్లటి మంచునీటిలాగ వెన్నెల తడుపుతోంది.

బహుళ పంచమి జ్యోత్స్న

భయపెట్టు నన్ను -

హఠాత్తుగా ఓ ఆలోచన భయపెడుతోంది. తండ్రి ఆనాడు హఠాత్తుగా చచ్చిపోయినప్పటి ఫలితం ఇది. తన తండ్రి చనిపోయి ఈ నిరాశనూ, నిస్సహాయతనూ తనకు ఆస్తిగా ఇచ్చిపోయాడు. తన కొడుకు తన చావుగురించి ఆలోచిస్తాడు.

తనెందుకు చచ్చిపోయాడో ఎవరూ వాడికి చెప్పరు. వాడు తనలాగా బ్రతకకూడదని ఎవరూ మందలించరు. నాలా బ్రతకడం అంటే ఎలాంటిదో వాడికి తెలీదు. వాడి భవిష్యత్తును తీర్చిదిద్దడానికి ఎవరూ మిగలరు. కొన్నాళ్ళ తర్వాత ఇట్లాగే ఆశలూ ఆశయాలూ అతణ్ణి మోసం చేశాక - ఇట్లాగే కొందరి మనస్తాపానికి కారణమయాక మరొక కొడుకుతో ఇట్లాగే ఇలాంటి ఆ క్షణంలో -

చలికి మొదటిసారిగా తలుపుదగ్గర నిలబడి వణికాడు. గుండె వేగంగా కొట్టుకోవడం ప్రారంభించింది. రక్తస్పందనం నిలిచిపోయింది.

తొందరగా వెళ్తున్న బండి వేగం అతణ్ణి భయపెట్టింది. వెంటనే తలుపు మూసి "ఇట్లాంటి ఆలోచన తలపెట్టానేమిటి నేను!!" అనుకుని విస్తుపోయాడు.

తను చచ్చిపోకూడదు. తనకోసం కాకపోయినా తన కొడుకు కోసమన్నా బ్రతికి ఉండాలి. తన బ్రతుకే మళ్ళీ కొడుకు బ్రతకకూడదు.

ఉన్నట్టుండి హఠాత్తుగా రైలు ఆగిపోయింది.

వెన్నెల స్వచ్ఛతకు నల్లటి మేఘం అడ్డునిలిచింది. చల్లగాలి కదలడం ఆగిపోయింది. ఏదన్నా ఊరు వచ్చిందేమోనని అంతా కిటికీల్లోంచి చూస్తున్నారు. చెట్ల మధ్య పిట్టల అరుపులు విపరీతంగా వినిపిస్తున్నాయి.

పెట్టెలో అంతా తృళ్ళిపడి లేచారు. నీలూ ఇటునుంచి అటు తిరిగిపడుకున్నాడు. రైలు ఇంజను దగ్గర హాహాకారాలు లేచాయి. చాలామంది గొడవగా ఏదో మాట్లాడుకుంటున్నారు.

రైలు ఆగిందన్న ఆశ్చర్యం అందరిలోనూ తెలుస్తోంది. తలుపు తీయాలనిపించలేదు కాశీకి.

రాను రాను ఆ సందడి ఎక్కువయింది. పెట్టెలోంచి కొందరు ప్రయాణీకులు కళ్ళునులుపుకుంటూ కిందకి దిగారు. అందరూ ఒకే గొంతుకతో ఏదో మాట్లాడుతున్నారు. మాటలు స్పష్టంగా తెలియడంలేదు.

ఉన్నట్టుండి ఎవరో బయటినుంచి బిగ్గరగా అరిచారు - బండి కిందపడి ఓ మనిషి చచ్చిపోయాడని.

తృళ్ళిపడ్డాడు కానీ. అచేతనుడయి అలా దీపపునీడలో పెట్టె గోడకి ఆనుకుని నిలబడిపోయాడు.

గార్డు మరికొందరు మనుషుల్తో పెట్టెలన్నీ వెదుక్కుంటూ వస్తున్నాడు. చల్లగాలి మెల్లగా వీచడం ఆరంభించింది.

రైల్లో అందరి దృష్టి ఆ మూలన పడుకున్న పసివాడి మీద పడింది. అందరూ ఒకరి ముఖం ఒకరు చూసుకు తెల్లబోయారు.

గార్డు పెట్టెవరకూ వచ్చి "ఇక్కడ ఎవరైనా కనిపించడం లేదేమో చూసుకోండి" అని అరిచాడు.

ఎవరో వృద్ధుడు లేచి కళ్ళునలుపుకున్నాడు. "ఈ మూలన కూచున్నాయన కనిపించడంలేదండి. ఇందాకట్నుంచీ ఆ పసివాడు అలాగే పడుకున్నాడు"

అంతా ఒక్కసారి స్థబ్దులయారు. ఎవరో "అతనే పోయాడు - పాపం" అన్నారు.

ఇప్పటికి కాశీ చేతనావస్తలోకి వచ్చాడు. ఒక్కసారి తెలివొచ్చింది. వృద్ధుడు చెప్పున్న జవాబు చెవిని పడింది. రక్తం మెదడులోకి పాకి లేని శక్తి నారలలోకి వచ్చింది. ఒక్కసారి పడుకున్న పదిమంది మీంచి దూకి ఆత్రుతగా నీలుని గుండెకి హత్తుకున్నాడు.

"నేను చచ్చిపోలేదు. చచ్చిపోను" అని పిచ్చిగా అరిచాడు.

అక్కడున్నవాళ్ళంతా ఇతన్ని చూసి దిగ్భ్రాంతితో మాట్లాడకుండా ఉండిపోయారు.

"నేను చచ్చిపోను. నేను చచ్చిపోను" అని ఇంకా కాశీ అంటూనే ఉన్నాడు.

ఇంకా ఆతృత తీరక నీలూని మెడకి ఆనించుకుని చిన్నపిల్లాడిలాగా ఏడ్చాడు.

మళ్ళీ రైలుబండి కదలడం ప్రారంభించింది. మళ్ళీ పాతవేగం, పాత ఆశలూ, ఆశయాలతో -

ఆకాశాన్ని కమ్ముకున్న నల్లటి మబ్బు తునక విడింది.

ఇప్పుడిక బహుళ పంచమి జ్యోత్స్న భయపెట్టడం మానేసింది!!!.

*(సమాప్తం)*